
ఈనాడు

విజయవాడ 23-10-2024 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 73
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



పున్నమి ఘాట్‌లో డ్రోన్ల ప్రదర్శనలో వెలుగులీనుతున్న బుద్ధుడు

ఆకాశంలో అద్భుతం

5,500 డ్రోన్లతో కళ్లు చెదిరే విన్యాసం

అమరావతి వేదికగా తొలి అంతర్జాతీయ స్థాయి ప్రదర్శన • 5 గిన్నిస్ రికార్డులు సొంతం


ఈనాడు - అమరావతి

ఆకాశ వీధిలో అద్భుతం ఆవిష్కృతమయింది. సాంకేతిక ప్రపంచం ఔరా అని ఆశ్చర్యపోయింది. మానవ మేధస్సుకు ఎప్పటికప్పుడు హద్దులు చెరిగిపోతుంటాయని మంగళవారం రాత్రి నిరూపించింది. అవకాశాల తలుపులు తెరవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటుందని మరోసారి రుజువయింది. అమరావతి 2.0 తన ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి ఘనంగా చాటిచెప్పింది. అమరావతి అన్‌స్టాపబుల్ అంటూ విశ్వవీధిలో వేల డ్రోన్ల వెలుగుల్లో తన సత్తాను ప్రదర్శించింది. దేశంలో ముందెన్నడూ లేనట్లుగా ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఆకాశ తీరాన డ్రోన్లు సయ్యాటలాడాయి. భరతనాట్యం, కూచిపూడి, కథక్, ఒడిస్సీ.. ఇలా ఏ నృత్యరీతులను ఆ డ్రోన్లు ఔపోసన పట్టాయో తెలియదు కానీ ఆ సాంకేతిక పద విన్యాసాల్లో కళ్లుమూసి తెరిచేలోపు ఒక్కో అద్భుతం మిరుమిట్లు గొలుపుతూ వీక్షకులను కట్టిపడేశాయి. గిన్నిస్ రికార్డులన్నీ కట్టగట్టుకుని వచ్చి వాలాయి. డ్రోన్ అంటే పెళ్లి ఫొటోలు చిత్రీకరించే ఒక చిన్న పరికరం కాదు సుమా! భవిష్యత్తు ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే ఒక విప్లవం అని ఈ ప్రదర్శన ససాక్ష్యంగా నిరూపించింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ స్థాయి సదస్సు, ప్రదర్శన ఇది. దిల్లీ వెలుపల ఈ స్థాయి (మిగతా 2లో)

డ్రోన్లతో అతిపెద్ద ప్లానెట్ ఫార్మేషన్, అతి పెద్ద ల్యాండ్‌మార్క్, అతి పెద్ద విమానం రూపకల్పన, అతి పెద్ద భారత జెండా, అతిపెద్ద ఏరియల్ లోగో ఫార్మేషన్ విభాగాల్లో ఈ ప్రదర్శనకు 5 గిన్నిస్ రికార్డులు దక్కాయి. వేదిక మీదే వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు స్వీకరించారు. అనంతరం లేజర్ షో, బాణసంచా ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



పంట పొలాల్లో డ్రోన్ల వినియోగంపై ప్రదర్శన



సీకే కన్వెన్షన్ బయట డ్రోన్ల పనితీరును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు

దేశీయంగా డ్రోన్ల తయారీకి ప్రోత్సాహం

30వేల మంది మహిళలను డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దుతాం

పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు 2లో

సర్వం.. డ్రోన్ల మయం!

ఇప్పటికే పలు రంగాల్లో వాటి సేవలు

భవిష్యత్తులో మరిన్ని విభాగాలకు విస్తరణ


కళ్లకు కట్టినట్లు వివరించిన డ్రోన్ సమిట్ 12లో

డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా ఏపీ

- ఓర్వకల్లులో డ్రోన్ హబ్‌కు 300 ఎకరాలు
- తయారీ, ఆవిష్కరణలు, పరిశోధనలకు కేంద్రంగా మారుస్తాం
- 'డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియా'గా అమరావతిని నిలబెడతాం
- 35 వేల మంది డ్రోన్ పైలట్లను తీర్చిదిద్దటమే లక్ష్యం
- 15 రోజుల్లోగా ప్రత్యేక విధానం
- సరికొత్త ఆవిష్కరణలతో రండి..
- సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

ఆకాశంలో డ్రోన్ విన్యాసాలను తిలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



అనంతలో వర్ష బీభత్సం



అనంతపురం శివారు ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధి కళాకారుల కాలనీలో ఇళ్లను చుట్టుముట్టిన నీరు

- పొంగిన వాగులు, వంకలు.. భారీగా పంట నష్టం

ఈనాడు, అనంతపురం: అకాల వర్షాలతో ఉమ్మడి అనంతపురం జిల్లా అతలాకుతలమైంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షాలకు శ్రీసత్యసాయి జిల్లాలోని వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. అత్యధికంగా కనగానపల్లి మండలంలో 19 సెం.మీ. వర్షం కురిసింది. శ్రీసత్యసాయి జిల్లాలో సగటున ఆరు సెం.మీ. వర్షపాతం నమోదైంది. (మిగతా 3లో)



జగనన్న కాలనీలో జలదిగ్బంధమైన వారిని ప్రొక్లెయిన్‌లో తరలిస్తున్న రక్షణ సిబ్బంది

దూసుకొస్తున్న 'దానా'

బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం 3లో

వాట్సప్ ద్వారా ధ్రువపత్రాలు.. పౌరసేవలు

ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాతో ఏపీ ప్రభుత్వ ఒప్పందం

మంత్రి లోకేశ్ సమక్షంలో ఎంఓయూపై సంతకాలు



ఈనాడు, దిల్లీ: విద్యార్థులతోపాటు, ప్రజలకు అవసరమైన పలు ధ్రువీకరణ పత్రాలు, బిల్లులను వాట్సప్ ద్వారా అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాతో ఒప్పందం చేసుకొంది. మంగళవారం దిల్లీలో ఏపీ ముఖ్యమంత్రి అధికార నివాసం 1-జన్‌పథ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వం, మెటా ప్రతినిధులు ఈ మేరకు పరస్పర అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. లోకేశ్ గతంలో యువగళం పాదయాత్ర చేసినప్పుడు.. విద్య, ఉద్యోగాల కోసం అవసరమైన సర్టిఫికెట్లు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను విద్యార్థులు ఏకరువు పెట్టారు. వాటిని దృష్టిలో ఉంచుకొని ఎవరైనా (మిగతా 2లో)

ఇదీ సంగతి!



మద్యం కుంభకోణం మూలాలపై గురి

- రాష్ట్రంలోని 20 డిస్టిలరీల్లో ఏకకాలంలో సీఐడీ సోదాలు
- గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై కీలక ఆధారాలు లభ్యం
- డిస్టిలరీలు కబ్జా చేసి.. "జే బ్రాండ్ల" తయారీ
- లెక్కల్లో చూపించకుండా అనధికారిక వ్యవహారాలు
- రికార్డులు, హార్డ్ డిస్కులు సీజ్

ఈనాడు, అమరావతి: జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం మూలాల్ని సీఐడీ వెలికితీస్తోంది. అందులో భాగంగా మంగళవారం ఏకకాలంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న 20 డిస్టిలరీల్లో సోదాలు నిర్వహించింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ తనిఖీలు అర్ధరాత్రి వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. గత అయిదేళ్లలో జరిగిన అక్రమాలకు సంబంధించిన కీలక ఆధారాలు ఈ సోదాల్లో లభ్యమయ్యాయి. వైకాపా పాలనలో అయిదేళ్లలో ఆయా డిస్టిలరీలు ఎంత ఈఎన్‌ఏ(ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్) దిగుమతి చేసుకున్నాయి? దాంతో ఎంత (మిగతా 12లో)

డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా ఏపీ

సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



సమిట్‌కు స్వాగతం పలుకుతున్న డ్రోన్

ఈనాడు, అమరావతి: డ్రోన్ హబ్ అభివృద్ధి కోసం కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అందులో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించి తయారీ, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇదే హబ్‌లోనే డ్రోన్ల సర్టిఫికేషన్ ఏజెన్సీ పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌ను 'డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రం'గా, అమరావతిని 'డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా 15 రోజుల్లోగా ప్రత్యేక విధానాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. అవసరమైన సూచనలు, సలహాలివ్వాలని సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలు, నిపుణులను కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన డ్రోన్ సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. దేశ రాజధాని దిల్లీకి వెలుపల ఇలాంటి సదస్సు నిర్వహించటం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కనీసం 35 వేల మందికి శిక్షణనిచ్చి సర్టిఫైడ్ డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దుతామన్నారు. డ్రోన్ రంగంలో ఏపీని దేశంలోనే అతి పెద్ద మానవవనరుల హబ్‌గా మారుస్తామని చెప్పారు. దేశీయంగా తయారయ్యే డ్రోన్లలో 80 శాతం ఏపీలోనే తయారయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఏపీని టెస్టింగ్ బెడ్‌గా ఉపయోగించుకోండి

ఏయే రంగాల్లో, ఏయే సేవలు, అవసరాలకు ఎలా వినియోగించొచ్చు (యూజ్ కేసెస్) అనేదానిపై తయారీదారులు అప్లికేషన్స్ సిద్ధం చేసి తమకివ్వాలని, వారికి ఏపీ ప్రయోగాత్మక పరీక్షలకు వేదిక (టెస్టింగ్ బెడ్)గా ఉంటుందని చంద్రబాబు చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్ మీకు బ్లాంక్ చెక్ ఆఫర్ ఇస్తోంది. మీ యూజ్ కేసెస్ అప్లికేషన్స్ మాకివ్వండి. వాటిని వినియోగించి సూచనలు, సలహాలు ఇస్తాం. కచ్చితత్వం, తక్కువ ఖర్చుతో ఆ సేవలు సాధ్యమైతే వాటిని రాష్ట్రమంతటా అమల్లోకి తీసుకొస్తాం' అని పిలుపునిచ్చారు. కనీసం 100-150 యూజ్ కేసెస్‌ను తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తయారీదారులు డ్రోన్లు పరీక్షించేందుకు, వాటి పనితీరు నిర్ధారించుకునేందుకు, నిరూపించుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌ను పైలట్‌గా వాడుకోవాలని సూచించారు. ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి విస్తరించొచ్చని పిలుపునిచ్చారు. ప్రపంచంలో వివిధ దేశాలు డ్రోన్ సాంకేతికతను యుద్ధాల్లో ఉపయోగిస్తుంటే తాము అభివృద్ధి, సేవల కోసం వినియోగించుకునేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు.

డ్రోన్ ట్రాఫిక్ కంట్రోలర్ వంటివి తీసుకురావాలి

■ వృద్ధి చెందుతున్న ఈ రంగాన్ని అవసరమైతే క్రమబద్ధీకరించాలే తప్ప నియంత్రించవద్దని కేంద్ర పౌరవిమానయాన శాఖాధికారులను కోరుతున్నా. ఉదాహరణకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ తరహాలో డ్రోన్ ట్రాఫిక్ కంట్రోలర్‌ను తీసుకురావాలి. ఈ రంగం మరింత విస్తృతమవ్వాలంటే ఇలాంటి వినియోగ అనుకూల విధానాలు తేవాలి. కేంద్ర ప్రభుత్వం డ్రోన్లకు సంబంధించి ఏ విధానం తీసుకొచ్చినా దాన్ని అమలు చేసే తొలి రాష్ట్రంగా ఏపీనే ఉంటుంది.

■ ఎమర్జింగ్ టెక్నాలజీలు వినియోగించుకుని ఏపీలో విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ తేవాలనేది నా విజన్. అనుకూల వాతావరణాన్ని కల్పించేలా త్వరలో కాన్సెప్ట్ పేపర్ విడుదల చేస్తాం. పరికరాల తయారీదారులు, అప్లికేషన్స్ డెవలపర్లు, సర్వీసు ప్రొవైడర్లు, పెట్టుబడిదారుల అవసరాలు తీర్చగలిగేలా పటిష్ఠమైన ఫ్రేమ్ వర్క్ రూపొందిస్తాం.

డేటాయే సంపద..

■ ఒక వ్యక్తికి, కంపెనీకి, దేశానికి డేటాయే సంపద. దాన్ని ఆధారంగా చేసుకుని ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో అత్యుత్తమ ఫలితాలు పొందొచ్చు. భవిష్యత్తులో డ్రోన్ రంగం గేమ్ ఛేంజర్ కానుంది. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ ఆధారిత విశ్లేషణలు ప్రపంచాన్నే మార్చేయనున్నాయి. ఈ సాంకేతికతపై ఎంబీఏ కోర్సులు ప్రవేశపెడతాం.

■ థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ. విజయవాడలో కూర్చొని కంపెనీని ప్రారంభించి కూడా ప్రపంచవ్యాప్తంగా సేవలు అందించొచ్చు. విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు దేశాన్ని కేంద్రంగా మార్చటంలో డ్రోన్ల సాంకేతికత కీలక పాత్ర పోషించనుంది.



సమిట్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై పీయూష్ శ్రీవాస్తవ, ఉమ్‌లుంగ్‌మాన్ వల్నమ్, రామ్మోహన్‌నాయుడు

నేనే అత్యుత్తమ అంబాసిడర్


'డ్రోన్ రంగం మార్కెట్‌ను ప్రమోట్ చేయటానికి నేనే అత్యుత్తమ అంబాసిడర్‌ను. నేను ప్రమోట్ చేయకపోతే.. ఇంకెవరూ మిమ్మల్ని ప్రమోట్ చేయరు. ఎందరో ప్రధాన మంత్రుల్ని చూశాను. నరేంద్ర మోదీకి సాంకేతికత, దాని వినియోగం, ప్రయోజనాలపై ఉన్న అవగాహన వారెవరికీ లేదు. ఆయనతో నాకు మంచి సంబంధాలున్నాయి. డ్రోన్ల రంగాన్ని ఆయన కాకపోతే ఇంకెవరూ ప్రోత్సహించరు. ఇటీవల హరియాణాలోని చండీగఢ్‌లో ప్రధానిని కలిసి డ్రోన్ సమ్మిట్ గురించి వివరించా. ఈ సదస్సులో నుంచి వచ్చే యూజ్ కేసెస్‌ను కేంద్రానికి పంపిస్తాం. మీకు ఇంతకంటే అనువైన సమయం మళ్లీ రాదు. వెంటనే ఆవిష్కరణలు ప్రారంభించండి. స్టార్టప్ కంపెనీలుగా నిరంతరం పరిశోధన, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. సరికొత్త యూజ్ కేసెస్ రూపొందించాలి. ఆ సేవలు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేవాలి. ఏపీ నుంచి మీకు అన్ని విధాల సహకారం ఉంటుంది' అని చంద్రబాబు చెప్పారు.


బహుళ రంగాల్లో సేవలకు వినియోగం

■ వ్యవసాయం, మౌలిక వసతులు సహా అవకాశమున్న ప్రతి చోటా డ్రోన్లు వినియోగిస్తాం. కొత్త సాంకేతికత ఉపయోగించి 'విజిబుల్ పోలీసింగ్.. ఇన్ విజిబుల్ పోలీస్'గా మార్చాలనేది మా ఆలోచన. డ్రోన్లు, సీసీ కెమెరాలు వంటివి వినియోగించి రౌడీషీటర్ల కదలికలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు నిరంతరం పర్యవేక్షిస్తాం.

■ పంటలకు పట్టిన చీడలు, తెగుళ్ళి గుర్తించేందుకు, వాటిపై మాత్రమే క్రిమిసంహారక మందులు చల్లేందుకు డ్రోన్లు ఉపయోగపడతాయి. భూసార పరీక్షల నిర్వహణ, పంట దిగుబడి మదింపు, చీడపీడల నియంత్రణ, భూ సర్వే సహా వ్యవసాయంలో వివిధ అవసరాల కోసం వీటిని వినియోగించొచ్చు.

■ ఐఓటీ, డ్రోన్ సాంకేతికతలు వినియోగించి.. రోగుల్ని వారి ఇంటి వద్దే ఉంచి వైద్యులు నిరంతరం పర్యవేక్షించొచ్చు. అంబులెన్స్ పంపించి ఆసుపత్రికి తీసుకురావచ్చు. 70 శాతం మంది రోగులకు దీని వల్ల అనవసర ఖర్చులు తగ్గుతాయి. విద్యుత్తు లైన్ల సమస్యలు, రోడ్లపై గుంతలు, పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని చెత్తను గుర్తించేందుకు ఇలా అనేక సేవల్లో వీటిని వినియోగించొచ్చు. యువత, నిపుణులు భిన్నంగా ఆలోచించి.. ఇలాంటి యూజ్ కేసెస్ తయారు చేయాలి. కావాల్సిన డేటా క్లౌడ్‌లో అందుబాటులో ఉంది. దాన్ని ఉపయోగించుకుని డ్రోన్లకు ప్రోగ్రామింగ్ చేసి. ఎక్కడికైనా పంపించి సమాచారం సేకరించొచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు.





భారత విమానయాన రంగంలో 1911 ఒక కీలక ఘట్టం. ఆ సందర్భంగా పోస్టల్ శాఖ ఒక స్టాంపును విడుదల చేసింది. ఆ జ్ఞాపకాన్ని గుర్తు చేస్తూ ఈ ప్రదర్శనలో డ్రోన్లు తమ వెలుగులతో ఆ స్టాంపును ఆవిష్కరించి చూపాయి.

దేశీయంగా తయారీకి ప్రోత్సాహం

- అందుకే దిగుమతిపై నిషేధం
- 30వేల మంది మహిళలను డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దుతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



ఈనాడు, అమరావతి: దేశీయంగా డ్రోన్ల తయారీని ప్రోత్సహించాలనే.. వాటి దిగుమతిని నిషేధించామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఈ రంగంలో దేశీయంగా సరికొత్త ఆవిష్కరణలకు, అంకుర సంస్థల ప్రోత్సాహానికి ఇదెంతో దోహదపడుతుందని అన్నారు. 'డిజిటల్ స్కై' ప్లాట్‌ఫాంలో ఇప్పటివరకూ 26,500 డ్రోన్లు రిజిస్టర్ అయ్యాయని, ఆ సంఖ్యను కనీసం లక్షకు పెంచాలనేది తమ లక్ష్యమని చెప్పారు. ఇప్పటికే డ్రోన్ సాంకేతికతలో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని వివరించారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన డ్రోన్ సమ్మిట్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. డ్రోన్ దీదీ యోజనలో భాగంగా 30వేల మంది మహిళలను డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు.

ఏపీకి అన్ని విధాలా సహకారం

"ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీ ప్రభుత్వం.. డ్రోన్ రంగంలోని పారిశ్రామికవేత్తలు, నిపుణులతో చర్చించి వారి సూచనలు, సలహాలకు అనుగుణంగా డ్రోన్ విధానాన్ని తీసుకొస్తోంది. డ్రోన్ నియమావళిని సరళీకరించాం. దేశంలో 132 రిమోట్ పైలట్ శిక్షణ సంస్థలున్నాయి. 17,600 మంది డ్రోన్ ఆపరేటర్లకు సర్టిఫికెట్లు ఇచ్చాం. 81 రకాల డ్రోన్ మోడల్స్‌ను గుర్తించాం. పీఎల్ఐ పథకం కింద రూ.120 కోట్లతో నిధి ఏర్పాటుచేసి 27 కంపెనీలకు ప్రయోజనం కల్పించాం" అని కేంద్రమంత్రి చెప్పారు.

ఓర్వకల్లు డ్రోన్ హబ్‌లో సర్టిఫికేషన్ ఫెసిలిటేషన్ కేంద్రం

కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో డ్రోన్ హబ్ కోసం కేటాయించనున్న 300 ఎకరాల్లో డ్రోన్ సర్టిఫికేషన్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. పున్నమిఘాట్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "డ్రోన్ హబ్ కోసం సీఎం చంద్రబాబు 300 ఎకరాలు కేటాయించారు. అక్కడ డ్రోన్ సర్టిఫికేషన్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయడానికి పౌర విమానయాన శాఖ తరఫున సహకారం అందిస్తాం. ఆ కేంద్రంలో డ్రోన్ తయారీ, పరిశోధన-అభివృద్ధి ఇన్నోవేషన్ హబ్ తీసుకొచ్చేందుకు నిరంతరం మద్దతు అందిస్తాం. దేశంలో మొదటిసారి ఇంత పెద్ద స్థాయిలో మన అమరావతిలో డ్రోన్ సమిట్ జరుగుతోందని గర్వంగా చెబుతున్నా. అమరావతిలో అతి పెద్ద డ్రోన్ షో జరగాలని సీఎం అనడంతో దేశంలో ఉన్న వారందరినీ పిలిపించాం'' అని తెలిపారు.

ఆకాశంలో అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శన నిర్వహించడం ఇదే తొలిసారి. ఇంతవరకు అతి పెద్ద డ్రోన్ల ప్రదర్శనా ఇదే. మంగళవారం రాత్రి అమరావతి రాజధానిలో కృష్ణా నదీ తీరాన వేల మంది ప్రజలు విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అధికారులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు సమక్షంలో రాత్రి 8.30 గంటలకు ఈ గిన్నిస్ రికార్డు ప్రదర్శన ప్రారంభమయింది. కృష్ణా తీరంలో మోహరించిన 5,500 డ్రోన్లు ఒక్కసారిగా ఆకాశవీధికి పయనమయ్యాయి. మిరుమిట్లు గొలిపే వెలుగులతో.. మిణుగురుల మాదిరి మెరుపులతో క్షణకాలంలోనే గగనాన్ని కమ్ముకున్నాయి. ఆ మరుక్షణంలోనే అవి నక్షత్ర దీపకాంతుల్లా వెలుగులు జిమ్ముతూ కనువిందు చేశాయి. అంతలోనే ఒక పెద్ద పాలపుంతలా ఆకృతిని మార్చుకున్నాయి. ఈ అద్భుతాన్ని వీక్షిస్తున్న వేల మంది హర్షధ్వానాలు చేస్తుండగా.. అప్పుడే ఏమయింది ఆగండంటూ ఆ డ్రోన్లు ఒక్క క్షణం కాలరెగరేశాయి. అక్కడి నుంచి ప్రారంభమైన ఆ షో సాంకేతిక ప్రపంచపు సమున్నత స్థాయికి దిక్సూచిగా నిలిచింది. మిణుగురుల్లాంటి డ్రోన్లు వాయువేగంతో తమ ఆకృతులు మార్చుకుంటూ మైమరిచిపోయేలా ప్రదర్శన చేశాయి.

■ ఆ ముద్ర అలా కనువిందు చేసిందో లేదో.. ఇంతలో అలహాబాద్ త్రివేణి సంగమం.. ఆ కొండల్లోంచి తొలి ఎయిర్ మెయిల్ విమాన ప్రయాణించిన సన్నివేశాన్ని కళ్ల ముందు నిలిపాయి. ప్రయాణికులను తీసుకువెళ్లిన విమానాన్నీ గుర్తు చేశాయి.

అమరావతి అనగానే...

ఈ ప్రదర్శనకు చక్కని వ్యాఖ్యానం.. అంతకు మించిన సంగీత స్వరాలు సరిజోడయ్యాయి. అంతలోనే ఆ వ్యాఖ్యాత గొంతు ఒక్కసారిగా గంభీరంగా మారింది. అమరావతి అంటూ ఏదో చెప్పబోయింది. రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రతిబింబించే గౌతమబుద్ధుడి విగ్రహం డ్రోన్ల పద నర్తనలో ఆకాశ వీధిలో ప్రకాశించేసరికి అక్కడ ఉన్నవారి హృదయాలన్నీ ఉప్పొంగిపోయాయి.

■ తర్వాత గ్లోబల్ ముఖచిత్రం- అందులో భారత ఔన్నత్యం ప్రదర్శించే సన్నివేశం. అంతర్జాతీయంగా మార్కెట్ వ్యవస్థ- తూర్పు, పశ్చిమల సమ్మేళనం, భవిష్యత్తులో సౌర ఇంధనంతో మారనున్న ఏవియేషన్ ముఖచిత్రం - హరిత పౌర విమానయానాన్ని విశ్లేషించేలా ఆ సన్నివేశం సందడి చేసింది.

■ డ్రోన్ల సాయంతో ఏయే రంగాలకు ఎలాంటి సేవలు అందించవచ్చో కూడా అక్కడ ప్రదర్శించారు. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ లోగోనూ డ్రోన్లు ప్రదర్శించాయి.

మువ్వన్నెల రెపరెపలు

వేల కొద్దీ డ్రోన్లు ఒకదానితో ఒకటి కలిసి.. మువ్వన్నెల పతాకం, అశోక చక్రాన్ని కళ్ల ముందు సాక్షాత్కరింపజేసిన వైనం.. సారే జహాసే అచ్ఛా.. హిందూ సితాహమార అంటూ అక్కడున్న వేల మంది గుండెల్లో దేశభక్తిని నింపింది. జయహో భారత్! జయహో ఆంధ్రప్రదేశ్! జయహో టెక్నాలజీ!

వాట్సప్ ద్వారా ధ్రువపత్రాలు.. పౌరసేవలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటివద్ద నుంచే అవసరమైన ధ్రువపత్రాలు పొందేందుకు వీలుగా ప్రత్యేక డిజిటల్ వ్యవస్థను తీసుకురావడానికి ఇప్పుడు మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సేవలన్నింటినీ వాట్సప్ బిజినెస్ ద్వారా పౌరులకు అందించడానికి మెటా సంస్థ ముందుకొచ్చింది. ఇది ఆచరణలోకి వస్తే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యుత్తు, కొళాయి, ఇంటిపన్నులు, ఇతరత్రా బిల్లులన్నీ ప్రజలకు వాట్సప్‌లో చేరుతాయి. అక్కడే వాటిని చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుంది. నకిలీలు, ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాలు జారీ అవుతాయని మంత్రి లోకేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా మరిన్ని సేవలు: "మెటాతో కుదుర్చుకున్న ఈ అవగాహన ఒప్పందం ఒక మైలురాయి. అవసరమైన ధ్రువపత్రాలు పొందడానికి విద్యార్థులు, ఉద్యోగార్థులు పడుతున్న కష్టాలను యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రత్యక్షంగా చూశా. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మొబైల్‌లోనే అందిస్తామని హామీ ఇచ్చా. ఆ మాట నిలబెట్టుకొనే క్రమంలో ఇప్పుడు మెటాతో ఒప్పందం చేసుకున్నాం. దీనిద్వారా ధ్రువపత్రాలు, పౌర సేవలను వాట్సప్ ద్వారా అందిస్తాం. రాబోయే రోజుల్లో మరిన్ని సేవలను ఆన్‌లైన్‌లో అతి సులువుగా, పారదర్శకంగా, వేగంగా అందించేందుకు చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలను వాడుకొని వాట్సప్ ద్వారా ఏపీ ప్రజలకు పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉందని మెటా ఇండియా వైస్‌ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్ తెలిపారు. "అందరూ అవసరమైన సేవలను వాట్సప్ ద్వారా పొందేందుకు వీలుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాట్సప్ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ ఉంటుంది. మెటా డిజిటల్ టెక్నాలజీని వాడుకొని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవలు అందిస్తాం'' అని సంధ్యా దేవనాథన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వం తరఫున పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్, ఆర్‌టీజీఎస్ సీఈఓ దినేష్, మెటా తరఫున ఆ సంస్థ డైరెక్టర్ రవి గర్గ్, పబ్లిక్ పాలసీ డైరెక్టర్ నటాషా పాల్గొన్నారు. ఇది ప్రాథమిక ఒప్పందం అని, ఇకమీదట ఏపీ ప్రభుత్వం, మెటా సంస్థల అధికారులు కలిసి కూర్చొని చర్చించుకున్న అనంతరం ఈ సేవలు అందించడానికి అవసరమైన విధివిధానాలను ఖరారు చేస్తారని, వాటిని ఎప్పటి నుంచి అమల్లోకి తేవాలన్నదానిపై నిర్ణయానికి వస్తారని అధికారవర్గాలు వెల్లడించాయి.



మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న మెటా డైరెక్టర్ రవి గర్గ్, ఏపీ పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్

రైతులకు ప్లాట్ల కేటాయింపునకు సీఆర్డీఏ ఈ-లాటరీ నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు ఈ నెల 23, 24వ తేదీల్లో సీఆర్డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానం ద్వారా ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించనున్నారు. 20 గ్రామాలకు చెందిన 129 రైతులకు గాను 319 ప్లాట్లకు ఈ-లాటరీ తీయనున్నారు. 23న కురగల్లు, అబ్బరాజుపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, శాఖమూరు, తుళ్లూరు, మందడం గ్రామలకు, 24న నవులూరు, నిడమర్రు, బోరుపాలెం, రాయపూడి, నెక్కల్లు, నేలపాడు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం రైతులకు ప్లాట్లు కేటాయించనున్నారు.

వరద బాధితులకు చేయూత

ఈనాడు, అమరావతి: వరద బాధితుల సహాయార్థం ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌కు పలువురు విరాళాలు అందించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు ఆధ్వర్యంలో రూ.7,40,116 విరాళాన్ని అందజేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయాల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు రఘుబాబు ఆధ్వర్యంలో రూ.1,10,000 విరాళం ఇచ్చారు.

గ్రహం అనుగ్రహం — 23-10-2024 బుధవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం
షష్ఠి: ఉ. 6-27 సప్తమి తె. 5-52 తదుపరి అష్టమి; ఆర్ద్ర: ఉ. 11-15 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 11-20 నుంచి 12-56 వరకు
అమృత ఘడియలు: లేవు; దుర్ముహూర్తం: ఉ. 11-21 నుంచి 12-08 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5.58, సూర్యాస్తమయం: సా.5.32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.0	25.0
విశాఖపట్నం	35.0	26.0
కర్నూలు	34.5	24.3
తిరుపతి	34.2	25.2
నెల్లూరు	34.1	26.9
గుంటూరు	34.0	26.0
నరసాపురం	33.9	24.6
విజయవాడ	33.4	25.4
ఒంగోలు	33.2	26.1
శ్రీకాకుళం	33.0	24.0
తాడేపల్లిగూడెం	32.7	25.0

అనంతలో వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

కనగానపల్లి చెరువు కట్ట తెగిపోవడంతో ఆ నీరు పండమేరు వంకలోకి చేరి వరద పెరిగింది. ఫలితంగా అనంతపురం శివార్లలోని కళాకారుల కాలనీ, ఉప్పరపల్లిలోని జగనన్న కాలనీ, పంగల్ రోడ్డులోని ఇళ్లు నీట మునిగాయి. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో కాలనీల్లోకి వరద చేరడంతో స్థానికులు కట్టుబట్టలతో బయటకు రావాల్సి వచ్చింది. 200 కుటుంబాలవారు నిరాశ్రయులయ్యారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు మునిగాయి. నిత్యావసర వస్తువులు కొట్టుకుపోయాయి. ఇళ్లలోకి వరద చేరడంతో చాలామంది మిద్దెలపైకి ఎక్కి సాయానికి నిరీక్షించారు. చెరువుల కింద సాగు చేసిన వరి పొలాలు వర్షాలకు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. శ్రీసత్యసాయి జిల్లాలో పెనుకొండ, పుట్టపర్తి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాలు, అనంతపురం జిల్లాలో రాప్తాడు, అనంతపురం గ్రామీణ మండలాల్లో పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 1,110 ఎకరాల్లో సాధారణ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు.

జాతీయ రహదారి దిగ్బంధం

పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, కనగానపల్లి, రామగిరి మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో చెరువులు ఉప్పొంగాయి. వెంకటగిరి పాళ్యం చెరువు మరువ ఉద్ధృతంగా ప్రవహించడంతో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలనుంచి వాహనాల రాకపోకలు నిలిచాయి. వరదలో చిక్కుకుపోయిన రెండు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, ఓ లారీ, కారును కియా ఇండస్ట్రియల్ ఏరియా పోలీసులు క్రేన్ల సాయంతో పక్కనపెట్టి రాకపోకలను పునరుద్ధరించారు. కనగానపల్లి మండలం ముక్తాపురం చెరువు మరువ పారడంతో జాతీయ రహదారిపై వరద ప్రవహించింది. ఫలితంగా నాలుగు గంటలపాటు ట్రాఫిక్ నిలిచింది.



శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో కోతకు గురైన పోలేపల్లి-అక్కంపల్లి రహదారి

వంకను ఆక్రమించి అమ్మేసిన వైకాపా నాయకుడు

అనంతపురం శివారు ఉప్పరపల్లి పంచాయతీలో జగనన్న కాలనీ ఏర్పాటుచేసి గత ప్రభుత్వంలో 400 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. ఈ కాలనీ పండమేరు వంక ప్రవాహ మార్గానికి ఆనుకుని ఉంది. అప్పట్లో రక్షణ గోడ కట్టకుండానే జగనన్న కాలనీ నిర్మించారు. ఈ అనాలోచిత నిర్ణయం కారణంగా వందల మంది లబ్ధిదారులు వరదల్లో చిక్కుకుపోయారు. దీనికి తోడు కాలనీకి ఆనుకుని ఉన్న పండమేరు వంకను స్థానిక వైకాపా ప్రజాప్రతినిధి ఆక్రమించుకున్నారు. సెంటున్నర చొప్పున ప్లాట్లు వేసి రూ.లక్షన్నరకు అమ్మేసుకున్నారు. పదుల సంఖ్యలో అమాయకులు స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకున్నారు. పండమేరును వరద ముంచెత్తడంతో ఆ ఇళ్లన్నీ మునిగిపోయాయి.



అనంతపురం శివారు ఉప్పరపల్లె కాలనీలో నీట మునిగిన గుడిసెలు

వర్షాలతో బెంగళూరు అతలాకుతలం



బెంగళూరు శివారు కేంద్రీయ విహార్ నివాస ప్రాంతం వద్ద పడవలతో ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయ చర్యలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: బెంగళూరులోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకు అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వరద తాకి యలహంక కేంద్రీయ విహార్ ఆవరణలో అలారం వ్యవస్థ ఉన్న కార్లన్నీ ఒక్కసారిగా మోగడం ప్రారంభించాయి. సెల్లార్ లేని భవంతుల్లో దిగువ అంతస్తుల్లో ఉన్నవారు అప్రమత్తమయ్యేలోగానే వరద చుట్టుముట్టింది. ఇక్కడ ఉంటున్న వారిని మంగళవారం ఉదయంనుంచి యుద్ధ ప్రాతిపదికన బయటకు తీసుకువచ్చారు. బెంగళూరులో కీలక ప్రాంతమైన బాబూసాపాళ్యలో నిర్మాణంలో ఉన్న భవంతి మంగళవారం సాయంత్రం వర్షాల వల్ల ఒక్కసారిగా కూలిపోయింది. అవశేషాల కింద కార్మికులు ఉంటారనే ఆందోళన వ్యక్తమవుతోంది. అగ్నిమాపక దళం, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది శిథిలాలను తొలగిస్తున్నారు.

మానవత్వంతో స్పందిద్దాం..
విరాళాలు అందిద్దాం..

RAMOJI GROUP

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఎంతో మంది ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు, వారి పేర్లను నిత్యం పత్రికలో ప్రచురిస్తున్నాం. ఈనాడు పిలుపు అందుకుని స్పందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు. అయితే కొందరు విరాళాలను బ్యాంకు ఖాతాకు జమ చేసి కూడా తమ పాన్ నంబరు, చిరునామా వివరాలను మాకు పంపలేదు. ఇటువంటి వారందరూ సత్వరమే తమ 1. పేరు, 2. పాన్ నంబరు, 3. చిరునామా వివరాలను 9154990933 వాట్సప్ నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ-మెయిల్ ఐడీకి పంపిస్తే వారి పేర్లను ప్రచురించగలము. కొత్తగా విరాళాలు పంపే దాతలు కూడా తప్పనిసరిగా ఈ వివరాలను పై నంబరుకు లేదా ఈ-మెయిల్‌కు పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

దూసుకొస్తున్న 'దానా'

- బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో తీవ్ర తుపాను 'దానా' ముప్పు పొంచి ఉండటంతో ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్, తమిళనాడు ప్రభుత్వాలను భారత వాతావరణశాఖ అప్రమత్తం చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం ఉదయానికి వాయుగుండంగా, సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలపడింది. బుధవారం ఉదయానికి తుపానుగా, గురువారం తెల్లవారుజామున తీవ్ర తుపానుగా రూపాంతరం చెందొచ్చని ఐఎండీ పేర్కొంది. గురువారం అర్ధరాత్రినుంచి శుక్రవారం ఉదయంలోగా పూరీ (ఒడిశా), సాగర్ ద్వీపం (పశ్చిమబెంగాల్) మధ్యలో తీరం దాటొచ్చని భావిస్తోంది.

ఉత్తరాంధ్రకు వర్ష సూచన: 'తుపాను ప్రభావం రాష్ట్రంపై ఉండకపోవచ్చు. ప్రస్తుత అంచనా ప్రకారం ఒడిశా, పశ్చిమబెంగాల్, స్థానిక పరిస్థితుల వల్ల గమనం మార్చుకుంటే బంగ్లాదేశ్ వైపు వెళ్లొచ్చు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. దీనిపై బుధవారంనాటికి స్పష్టత వస్తుంది' అని ఐఎండీ మాజీ డీజీ డా.కేజే రమేష్ తెలిపారు. బంగాళాఖాతంలో వాయుగుండం నుంచి తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. తమిళనాడులో ఈశాన్య రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. వీటి ప్రభావంతో రాయలసీమలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజులు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఏపీ రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

పలు రైళ్ల రద్దు: 'దానా' తుపాను హెచ్చరికల నేపథ్యంలో 23, 24, 25వ తేదీల్లో తూర్పు కోస్తా రైల్వే పరిధిలో పలు రైళ్లను రద్దు చేశారు. వాటిలో దూర ప్రాంత సర్వీసులు సహా దగ్గర సర్వీసులూ ఉన్నాయి. గురువారం అత్యధికంగా 37 సర్వీసులు రద్దయ్యాయి. రద్దయిన రైళ్లలో ఎక్కువగా హావ్‌డా, భువనేశ్వర్, ఖరగ్‌పూర్, పూరీ తదితర ప్రాంతాలనుంచి రాకపోకలు సాగించేవి ఉన్నాయి. విశాఖ-భువనేశ్వర్ మధ్య రాకపోకలు సాగించే వందే భారత్ రైలును 24న రద్దు చేశారు.

శాంతిస్థాపనకు పూర్తి సహకారం

- పుతిన్‌తో భేటీలో వెల్లడించిన భారత ప్రధాని మోదీ
- నేడు జిన్‌పింగ్‌తో సమావేశం
- బ్రిక్స్ సదస్సు ప్రారంభం



భారత ప్రధాని మోదీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ★ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌తో మోదీ

కజన్ (రష్యా): శాంతియుత మార్గంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని పరిష్కరించుకోవాల్సి ఉందని భారత ప్రధాని నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఈ దిశగా ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు తాము సిద్ధమని చెప్పారు. రెండ్రోజుల పాటు జరిగే బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యాలోని కజన్‌కు మంగళవారం చేరుకున్న మోదీ.. కాసేపటి తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రాంతీయంగా శాంతి-సుస్థిరత సత్వరం నెలకొనేందుకు తాము పూర్తి మద్దతు ఇస్తామని, మానవత్వానికే తొలి ప్రాధాన్యమని చెప్పారు. మూడు నెలల్లోనే రెండోసారి తాను రష్యాకు రావడం ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సమన్వయం, దృఢమైన విశ్వాసాలను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. గత సంవత్సరం కొత్త సభ్యుల చేరికతో కూటమి బలోపేతమైందని చెప్పారు.

కీలకాంశాలపై చర్చావేదిక బ్రిక్స్

ప్రపంచానికి సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చలకు బ్రిక్స్ ముఖ్యమైన వేదికగా అవతరించిందని మోదీ పేర్కొన్నారు. రష్యాకు వచ్చేముందు దిల్లీలో ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. బ్రిక్స్‌లో సన్నిహిత సహకారానికి భారత్ విలువ ఇస్తుందని తెలిపారు. ప్రపంచ అభివృద్ధి ఎజెండా, వాతావరణ మార్పులు, సాంస్కృతిక అనుసంధానతను ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. భూగోళ భవితను మెరుగుపరిచేందుకు దోహదపడే చర్చలు ఈ సదస్సులో జరుగుతాయని రష్యాకు చేరుకున్నాక 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఘన స్వాగతం

మోదీకి రష్యాలో ఘన స్వాగతం లభించింది. తాను బసచేస్తున్న హోటల్‌కు చేరుకున్న ఆయనకు ప్రవాస భారతీయులు సాదర స్వాగతం పలికారు. ఇరాన్‌కు ఇటీవల అధ్యక్షుడిగా ఎన్నికైన మసౌద్ పెజెష్కియాన్‌తో మోదీ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఛాబహార్ ఓడరేవు, అంతర్జాతీయ రవాణా కారిడార్ వంటి కీలకాంశాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవడం గురించి చర్చించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, మోదీ బుధవారం ద్వైపాక్షికంగా భేటీ కానున్నారు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ విలేకరులకు ధ్రువీకరించారు. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ కీలక గస్తీ ఒప్పందం అమలుకు భారత్‌తో కలిసి పనిచేస్తామని చైనా విదేశాంగ మంత్రి లిన్ జియాన్ పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు మోదీ, జిన్‌పింగ్‌లతో పాటు సభ్యదేశాల నేతలు రష్యాకు వచ్చారు. పాశ్చాత్య దేశాల ఆధిపత్యానికి గండి కొట్టే రీతిలో సదస్సులో సమాలోచనలు జరగనున్నాయి. 36 దేశాలు దీనిలో పాల్గొంటున్నాయి.

ఈనాడు

హర్షణీయమే కానీ...

విశ్వ మానవాళిలో అత్యధిక భాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మూడోవంతు వాటా కలిగిన 'బ్రిక్స్' కూటమి పదహారో శిఖరాగ్ర సదస్సుకు రష్యా సారథ్యం వహిస్తోంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో ఈజిప్ట్, ఇరాన్, ఇథియోపియా, యూఏఈ చేతులు కలపడంతో 'బ్రిక్స్' బలం ఇనుమడించింది. బహుళ ధ్రువ ప్రపంచాన్ని ఆకాంక్షిస్తూ కూటమి దేశాధినేతలు సమావేశమవుతున్న సమయంలో ఇండియా, చైనా సంబంధాల్లో సానుకూల పరిణామం చోటుచేసుకుంది. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంట నాలుగేళ్లుగా రగులుతున్న ఉద్రిక్తతలను ఉపశమింపజేసే గస్తీ ఒప్పందమొకటి ఇరుపక్షాల నడుమ తాజాగా ముడివడింది. తూర్పు లద్దాఖ్‌లోని డెప్సాంగ్, డెమ్‌చోక్‌లలో నెలకొన్న సైనిక ప్రతిష్టంభనను ఇది తొలగించగలదు. వ్యూహాత్మకంగా అత్యంత సున్నితమైన డెప్సాంగ్ ప్రాంతంలోని 10, 11, 11ఏ, 12, 13 పెట్రోలింగ్ పాయింట్ల దగ్గర 2020కి మునుపు భారతీయ సైన్యం పహారా కాసేది. గతంలో మాదిరిగా మన బలగాలు మళ్ళీ అక్కడ గస్తీ తిరుగుతాయా అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. అయినప్పటికీ ఎల్‌ఏసీ వెంబడి పూర్వ పరిస్థితుల పునరుద్ధరణ దిశగా తాజా ఒప్పందం ఒక కీలక ముందడుగు!

చరిత్రలో 99.9శాతం కాలమంతా ఇండియా, చైనాల మధ్య మైత్రి వర్ధిల్లిందన్నది డ్రాగన్ దేశ పూర్వ ప్రధాని వెన్ జియబావో వ్యాఖ్య! ఆ సౌహార్ద సంబంధాలను దెబ్బతీసిన 1962 యుద్ధానికి తెగబడింది చైనాయే. విభేదాలు వివాదాలుగా, వివాదాలు యుద్ధాలుగా మారకుండా చూసుకోవాలన్న ఇండియా హితోక్తిని బీజింగ్ ఖాతరు చేయలేదు. సరిహద్దు సమస్యలకు అంతిమ పరిష్కారం లభించేంత వరకు వాస్తవాధీన రేఖను ఇరుపక్షాలూ శిరసా వహించాలన్న గత ఒడంబడికను చైనా లక్ష్యపెట్టలేదు. 2017లో డోక్లాంలోకి చొరబడి వారాల తరబడి ఉద్రిక్తతలను రాజేసిన చైనా- 2020లో గల్వాన్‌లో తీవ్రఘర్షణలకు దిగింది. తదనంతరం గల్వాన్ లోయ, ప్యాంగ్యాంగ్ త్సో, గోగ్రా పోస్ట్, హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణకు అది అంగీకరించినా- డెప్సాంగ్, డెమ్‌చోక్‌లలోంచి వెనక్కి తగ్గడానికి ఇంతవరకు మొండికేసింది. విస్తృత స్థాయి సంప్రతింపుల ద్వారా ఉభయ దేశాల మధ్య గస్తీ ఒప్పందం సాకారమైనప్పటికీ విస్తరణవాదంతో బుసలుకొడుతున్న చైనాను పూర్తిగా నమ్మడానికి వీల్లేదు. కాబట్టి సరిహద్దుల్లో ఇండియా సదా అప్రమత్తంగా వ్యవహరించక తప్పదు!

తన ఆధీనంలోని టిబెట్‌ను అరచేయిగా... భూటాన్, లద్దాఖ్, నేపాల్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లను అయిదు వేళ్లుగా భావించడం డ్రాగన్ దేశ దుర్నీతి! అందుకే 3,488 కిలోమీటర్ల పొడవైన ఎల్‌ఏసీ వెంట అది నిత్యం ఏదో ఒక పేచీకి దిగుతూ ఉంటుంది. లద్దాఖ్‌లో 38వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిన చైనా- అరుణాచల్‌లో 90వేల చ.కి.మీ.ల ప్రాంతం తనదేనంటూ అవాకులూ చెవాకులూ పేలుతుంటుంది. అరుణాచల్‌లోని పలు ప్రదేశాలకు చైనీస్ పేర్లు పెట్టడం మొదలు సరిహద్దుల వెంట 'జియాకాంగ్' పేరిట ప్రత్యేక గ్రామాల ఏర్పాటు వరకు బీజింగ్ దుందుడుకుతనం అంతాఇంతా కాదు. 2019 ఆగస్టు తరవాత ఎప్పుడో అరుణాచల్‌లోనే 4.5 కిలోమీటర్ల మేర భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చి 101 ఇళ్లతో అదో గ్రామాన్ని నిర్మించినట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా బయటపడింది. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలను విస్తరిస్తూ, చైనా బలగాల కదలికలను ఇండియా అనునిత్యం గమనిస్తుండాలి. దేశ వ్యూహాత్మక ప్రయోజనాల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ప్రాంతీయ భాగస్వామ్యాలు, అంతర్జాతీయ కూటముల్లో పాలుపంచుకోవాలి!



ఇండియాలో చాలామందిలాగే నేనూ అవినీతి గురించి తెగ ఫిర్యాదు చేస్తుంటా. కానీ అవినీతిపరులతో కలిసి బతకగలుగుతాను. నిజాయతీపరుల గురించి లోలోపలే మథనపడుతుంటాను.

– అరవింద్ అడిగ, ప్రముఖ రచయిత

అంతర్గత శత్రువులు

అహంకారం, అంతా నా ఘనతే అనుకోవడం, మమకారం... వ్యక్తి వినాశనానికి తొలి అడుగులు. వాటిని కలిగి ఉండటం జారుడు మెట్లపై నాట్యం చేయడమే. సామాన్య దృష్టితో భౌతిక శరీరం కనిపిస్తుంది. ఆత్మ అలౌకిక దృష్టికి మాత్రమే గోచరిస్తుంది. అలాగే అరిషడ్వర్గాలు వ్యవహార దృష్టికి తోచవు. అహంకారంతో విర్రవీగిపోతున్నా, నా వల్లే అన్నీ సాధ్యమవుతున్నాయనే గర్వంతో అంధులైనా, మమకారంలో మునిగి తేలుతున్నా... మనిషి గ్రహించకపోవడం భగవంతుడి మాయ. ఆ మాయని అర్థం చేసుకోవడం, నారదుడి లాంటి మహర్షులకే సాధ్యం కాలేదు. ఆ విషయాన్ని భాగవతం స్పష్టంచేస్తోంది. అయితే తాను స్వచ్ఛమైన భక్తికి దాసోహమైపోతానని స్వయంగా భగవంతుడే అనేక సందర్భాలలో చెప్పాడు.



అంతర్యామి

రాగద్వేషాలకు అతీతులు కానివారుండరు! భారత యుద్ధ ముగింపు సమయంలో, రథసారథి అయిన కృష్ణుణ్ని తన సేవకుడిగా భావించి, ముందుగా రథం దిగమన్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు 'కాదు నువ్వే ముందు దిగ'మన్నాడు. అర్జునుడు అయిష్టంగానే, గర్వాన్ని అణచుకుని దిగాడు. ఆ తరవాత శ్రీకృష్ణుడు దిగగానే రథం కాలిపోయింది. ఆ రథానికి తగిలిన అస్త్రశస్త్రాలు తాను ఉన్నంతవరకు పని చేయవని, తాను రథం దిగగానే అవి దాన్ని ధ్వంసం చేశాయని శ్రీకృష్ణుడు చెప్పాడు. తన అహంకారం ఫలితం ఎలా ఉండేదో తలచుకుని సిగ్గుపడ్డాడు అర్జునుడు.

ఒక గురువు శిష్యులతో దేవాలయ సందర్శనకు వెళ్లాడు. దారిలో సెలయేరు దాటాల్సి వచ్చింది. కొందరు భయపడటంతో వాళ్లకి తన పేరు ఉచ్చరిస్తూ సెలయేరు దాటమని చెప్పాడు గురువు. వాళ్లు అలాగే చేశారు. తన నామమహిమ గురించి శిష్యుల ముందు గర్వపడ్డాడు గురువు. అందరూ దైవదర్శనానికి వెళ్లారు. పురుషులు నడుం పైభాగంలో ఎటువంటి వస్త్రం ధరించకూడదన్న నియమాన్ని అనుసరించారు. ముందుగా శిష్యులను పంపించి ఆఖరున గురువు లోపలికి వెళ్లబోయాడు. పూజారి అతణ్ని ఆపి నడుం పైభాగాన వస్త్రం తీయలేదేంటి.. అని అడిగాడు. గురువు నివ్వెరబోయి, ఛాతీమీద వస్త్రం ఏమీ లేదన్నాడు. అప్పుడు పూజారి నవ్వుతూ అతని హృదయాన్ని అహంకారం అనే వస్త్రం కప్పివేసిందన్నాడు. శిష్యులు చేసింది భగవన్నామ స్మరణ అనీ దానికి గురువు గర్వించాల్సిన అవసరం లేదనీ చెప్పాడు. 'కాదు, వాళ్లు స్మరించింది నా పేరే...' అని వాదించాడు గురువు.

అప్పుడు పూజారి చిరునవ్వుతో 'అన్నీ భగవన్నామాలు కావా? నీ పేరు కూడా భగవంతుడి పేరే కదా!?' అన్నాడు. అప్పుడా గురువు పూజారి కాళ్లమీద పడి 'నా కంటికి ఏర్పడిన పొరలు తొలగిపోయాయి, నాలోని అహంకారం ఈ క్షణమే నశించిపోయింది' అన్నాడు.

భగవంతుణ్ని ఆశ్రయించడంలో అడ్డుపడే, ఆయనని పొందకుండా ఆపే, అంతర్గత శత్రువులను గుర్తించాలి. వాటిని వదిలించుకోవడానికి మనం నిరంతరం కృషి చేయాలి.

– ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

మానవాళి మెడపై నీటి కరవు కత్తి

ఏ దేశంలోనైనా జలవనరులను సమర్థంగా నిర్వహించడం కీలకం. ముందుచూపు లేని అస్తవ్యస్త జల వనరుల వినియోగం చివరికి ఆర్థిక వ్యవస్థల పతనానికి దారితీస్తుంది. భవిష్యత్తులో ఎదురయ్యే సంక్షోభానికి దాన్నో ప్రమాద సూచికగా భావించాలి. అంతర్జాతీయ నిపుణుల బృందం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ మేరకు కీలకాంశాలు వెల్లడయ్యాయి.



నీటి వనరులను విచక్షణారహితంగా వినియోగించడం, నీళ్లు ఎక్కువగా అవసరమయ్యే పంటలనే బాగా సాగు చేయడం, పారిశ్రామిక, విద్యుత్ ఉత్పాదన రంగాల్లో నీటిని ఎక్కువెక్కువగా వాడుతుండటం వంటివి జలసంక్షోభానికి దారి తీస్తున్నాయి. 'జల సంక్షోభం- ఆర్థిక పరిస్థితిపై ప్రభావం' అనే అంశంపై గ్లోబల్ కమిషన్ ఆన్ వాటర్ ఎకనామిక్స్ సంస్థ సారథ్యంలో అంతర్జాతీయ ఆర్థిక, పర్యావరణ నిపుణుల కమిటీ అధ్యయనం చేసింది. జలసంక్షోభానికి గల కారణాలు, వాటి పరిణామాలు ఆర్థిక సంక్షోభానికి కారణమవుతున్న తీరును అది తేటతెల్లం చేసింది. ప్రస్తుతం వివిధ దేశాల్లో అనుసరిస్తున్న అసంబద్ధమైన నీటి యాజమాన్య నిర్వహణ విధానాలే పెను సంక్షోభానికి కారణమవుతున్నాయని నిపుణుల అధ్యయన నివేదిక తేల్చిచెప్పింది.

ఆహార భద్రత నుంచి ఆర్థికం దాకా...

దశాబ్దాల కాలం నుంచీ అనుసరిస్తున్న లోపభూయిష్టమైన విధ్వంసకర భూ వినియోగ పద్ధతులు, నీటి వనరుల నిర్వహణ విధానాలకు మానవ కారక వాతావరణ వైపరీత్యాల సంక్షోభం కూడా తోడవుతోంది. ఇవి ప్రపంచవ్యాప్తంగా నీటి కొరతకు దారితీస్తాయని తాజా అధ్యయన నివేదిక కుండ బద్దలుకొట్టింది. ముఖ్యంగా ప్రపంచ దేశాల్లో నానాటికీ జటిలమవుతున్న నీటి సంక్షోభం తక్షణం ప్రభావం చూపేది వ్యవసాయ రంగం మీదేనన్న సంగతి గుర్తించాలి. అంతర్జాతీయంగా దీని ప్రభావం గణనీయంగా ఉండనున్నట్లు నిపుణుల నివేదిక పేర్కొనడం ఆందోళన కలిగించే అంశం. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా సుమారు 300 కోట్ల మంది ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడే ముప్పుంది. ప్రపంచ ఆహారోత్పత్తిలో 50శాతంపై ఈ ప్రభావం ఉంటుందని నిపుణుల బృందం అంచనా వేయడం గమనార్హం. ఇప్పటికే భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి. నీటి వనరుల విస్తీర్ణం పోనుపోను తగ్గిపోతోంది. దీంతో జల వనరుల లభ్యత భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారబోతుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నివేదిక అంచనాల ప్రకారం- ప్రజలు గౌరవప్రద జీవనం గడపడానికి సగటున రోజుకు కనీసం 4000 లీటర్ల నీరు అవసరం. నీటి సంక్షోభం కారణంగా 2050 నాటికి ప్రపంచ దేశాల స్థూల దేశీయోత్పత్తిలో సగటున ఎనిమిది శాతం నష్టం వాటిల్లుతుందని, తక్కువ ఆదాయం గల దేశాల జీడీపీలో ఈ నష్టం సగటున 15శాతం వరకు ఉంటుందని ఈ అధ్యయనం లెక్క గట్టింది. జలసంక్షోభం తాలూకు ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందనేందుకు ఇదే నిదర్శనం. మానవ జాతి చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ప్రపంచ జలచక్రం అదుపు తప్పుతోందంటూ నిపుణుల కమిటీలో ఒకరైన జోహాన్ రాక్‌స్ట్రామ్ వ్యాఖ్యానించడం- సంక్షోభం తీవ్రతకు నిదర్శనంగా గుర్తించాలి. అంతర్జాతీయంగా నీటి సంక్షోభం తలెత్తడమనేది అత్యంత విషాదకరం, ఆందోళనకరమైనప్పటికీ, అది కొన్ని మార్పులకు దోహదపడే అవకాశం కూడా ఉందంటూ ఈ నివేదిక విశ్లేషించింది. జల వనరులను మరింత సమర్థంగా వినియోగించుకునేందుకు వీలుగా తగిన రుసుమును నిర్ణయించడం ద్వారా అందరికీ సమానంగా నీటివనరుల లభ్యతను కల్పించేలా చూడాలంటూ నివేదిక సూచించింది. దానివల్ల వినియోగంలో అనేక మార్పులు వస్తాయని నిపుణుల బృందంలో ఒకరైన డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ గోజీ ఒకాంజో ఐవీ అభిప్రాయపడ్డారు. నీటి వినియోగంపై ధరలు నిర్ణయించడం ద్వారా విచక్షణారహిత వాడకంపై అడ్డుకట్ట వేయవచ్చు. భారత్‌లో ఈ దిశగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ విభాగం చర్యలు ప్రారంభించింది. దేశంలో భూగర్భ జలాల వినియోగ పరిమాణాన్ని బట్టి నీటి రుసుమును నిర్ధారించింది. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల సంబంధిత మంత్రిత్వ శాఖలకు ఉత్తర్వులు, మార్గదర్శకాలను సైతం జారీ చేసింది. క్షేత్రస్థాయిలో కార్యాచరణను సాధించాల్సి ఉంది.

సంరక్షణ తక్షణావసరం

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సురక్షిత మంచినీటికి కూడా నోచుకోలేని పరిస్థితుల్లో రోజుకు సుమారు వెయ్యిమంది పిల్లలు మృత్యువాత పడుతున్నట్లు అంచనా. మంచినీటి కొరత కారణంగా ఒక్క శిశువు కూడా మరణించకూడదనే లక్ష్యాన్ని ప్రపంచ దేశాలు నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. అడుగంటిపోతున్న జల వనరులను సంరక్షించుకోవాలంటే వ్యవసాయంలో సూక్ష్మ సేద్యాన్ని అనుసరించాలి. తక్కువ నీటిని వినియోగించే పంటలనే పండించాలి. తక్కువ నీటితోనే పంటల ఉత్పాదకతను పెంచాలి. నత్రజని సంబంధిత ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి. ప్రజల ఆహారపు అలవాట్లను ధాన్యపు గింజల నుంచి మొక్కల సంబంధిత ఆహారం వైపు మళ్లించాలి. ప్రకృతి-పర్యావరణ వ్యవస్థల సమతుల్యతకు అవసరమైన అడవులను పునరుద్ధరించాలి. 2030 నాటికి నష్టపోయిన పర్యావరణ వ్యవస్థలో కనీసం 30శాతాన్ని యథాస్థితికి తీసుకురావడం తప్పనిసరి. తద్వారా నీటి లభ్యతలోనూ మార్పు తీసుకురావాలి. జల వనరుల ఆధారంగా ఆదాయ వనరులను సృష్టించుకోవాలి. వృథాగా పోయే ప్రతి నీటి బొట్టును తిరిగి వినియోగంలోకి తేవాలి. మంచినీటి సరఫరా వ్యవస్థల్లోని లోపాలను సరిదిద్దాలి. మెరుగైన, సమర్థమైన నీటి వనరుల నిర్వహణ విధానాన్ని అమలు పర్చాలి. సంప్రదాయేతర, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై దృష్టి సారించాలి. అప్పుడే జల వనరుల సంక్షోభానికి అడ్డుకట్ట వేసి ఆర్థిక వ్యవస్థను సుస్థిర పరచుకోవడం సాధ్యమవుతుంది. తద్వారా జలవనరులే జాతి జీవన వనరులుగా అలరారుతాయి.



డాక్టర్ జీవీఎల్ విజయ్‌కుమార్
భూ విజ్ఞానశాస్త్ర నిపుణులు



గెలుపు పిలుపు

'ఈసారి వార్షికోత్సవంలో గెస్టులను వేదిక మీదికి ఆహ్వానించే బాధ్యత నీదే' అని ఆఫీసులో చెప్పారనుకోండి... నూటికి తొంభై తొమ్మిది మంది నుంచి వెంటనే వచ్చే సమాధానం 'అమ్మో... నేనా...' అని. 'నా కాళ్లు వణుకుతాయి, అంతమంది చూస్తే నాకసలు గొంతే పెగలదు...' అంటూ సమర్థించుకుంటారు. లోపల చేయాలనే ఉంటుంది. బాగా చేసి ప్రశంసలందుకోవాలనీ ఉంటుంది. ఇదే కాదు, ఐఏఎస్సో ఐపీఎస్సో సాధించాలనో, కంపెనీ పెట్టి వందలాది మందికి ఉపాధి కల్పించాలనో, రాజకీయ నేతగా రాణించాలనో... చాలామంది కోరుకుంటారు, కలలు కంటారు. కానీ తమ వల్ల కాదేమోనన్న సంశయంతో, స్వీయ సామర్థ్యం మీద అపనమ్మకంతో ప్రయత్నమే చెయ్యరు. అనవసర భయాలను పక్కన పెట్టి, 'ప్రయత్నిస్తే పోయేదేమీ లేదు, గెలిస్తే విజయపతాకాన్ని ఎగరేయవచ్చు, ఓడితే అనుభవ పాఠాలు మిగులుతాయ'ని ముందడుగేసేవారు కొందరే ఉంటారు. నిజానికి విజేతలకు కావాల్సింది అలాంటి దూకుడు స్వభావమే. రిస్క్ తీసుకోనిదే ఏదీ లభించదు. రోడ్డుమీదికి వెళ్తే ప్రమాదం జరుగుతుందేమోనని భయపడి ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోం కదా!

ముందుగా పిరికితనాన్ని వదిలి ధైర్యంగా ముందడుగేయాలి. ప్రతిభకి పదును పెట్టి, కొత్త కోణంలో ఆలోచిస్తే తప్పక విజయం సాధించవచ్చు. స్టార్‌బక్స్ ఎంత పెద్ద సంస్థో తెలిసిందే కదా. దానికి సీయీవో కాగలనని ఒక ట్రక్కు డ్రైవరు కొడుకు కలనైనా ఊహించగలడా? స్టార్‌బక్స్‌కి సుదీర్ఘకాలం పాటు సీయీవోగా సేవలందించిన హోవర్డ్ షుల్ట్జ్ ట్రక్కుడ్రైవరు కొడుకు. పేదల కోసం ప్రభుత్వం కట్టించిన ఇంట్లో అతని బాల్యం గడిచింది. కష్టపడి చదివి సేల్స్‌మన్‌గా ఉద్యోగం ప్రారంభించారు. 1982లో రీటెయిల్ ఆపరేషన్స్ అండ్ మార్కెటింగ్ విభాగానికి డైరెక్టరుగా స్టార్‌బక్స్‌లో అడుగుపెట్టిన హోవర్డ్, ఆ తరవాత సీయీవో అయ్యి ఇంతింతై... అన్నట్లుగా కంపెనీని విస్తరించారు. పదేళ్లలోనే ప్రపంచంలో అతిపెద్ద కాఫీ హౌస్‌చైన్‌గా తీర్చిదిద్దారు. రెండు దఫాలుగా పాతికేళ్లు కంపెనీకి సారథ్యం వహించి బయటకు వచ్చినా మళ్లీ సంక్షోభం తలెత్తినప్పుడు ఆయననే పిలిచి తాత్కాలిక సీయీవోగా బాధ్యతలు అప్పజెప్పారంటే- హోవర్డ్ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

'అందరూ చేసినట్లే చేయొద్దు, మూసలో ఇమడటానికి ప్రయత్నించొద్దు. ఒకరు చెప్పింది మాత్రమే చేస్తే నీ సత్తా ఏంటో ఎప్పటికీ తెలియదు. మిగతావాళ్లు అసాధ్యం అనుకున్నదాన్నే ప్రయత్నించాలి...' అంటారాయన తన పుస్తకం 'పోర్ యువర్ హార్ట్ ఇంటూ ఇట్'లో.

రిస్క్ అంటే భయపడేవాళ్లు, అసలు ప్రయత్నమే చేయనివాళ్లు దేన్నీ సాధించలేరు. రాత్రి పడుకుంటే తెల్లారి లేస్తారన్న గ్యారంటీ లేదు. అయినా నమ్మకంగా పడుకుంటారు. రేపు ఏమవుతుందో తెలీదు. కానీ భవిష్యత్తు కోసం రకరకాల పథకాల్లో డబ్బు మదుపుచేస్తారు. అచ్చం అలాగే గెలుపు మీద కూడా నమ్మకం పెంచుకోవాలి. కలలు కనాలి. గెలుపునే శ్వాసించాలి. అప్పుడే గెలిచి తీరుతారు.

– ఎన్.యు.ఎం.రావు




వాణిజ్య లోటు పైపైకి!

దిగుమతులు ఎక్కువ కావడంతో చైనాతో భారత వాణిజ్య లోటు బాగా పెరుగుతోంది. ఆ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న వాటిలో క్యాపిటల్ గూడ్స్, ఇంటర్మీడియట్ గూడ్స్, ముడి పదార్థాలు అధికంగా ఉంటున్నాయి. ఎలక్ట్రానిక్స్, టెలికం, పవర్ వంటి రంగాల్లో పెరుగుతున్న డిమాండును అందుకోవడానికి చైనా దిగుమతులపై ఆధారపడక తప్పడంలేదని ప్రభుత్వం అంటోంది. గత అయిదేళ్లలో చైనాతో భారత వాణిజ్య లోటు ఎంతమేర ఉందంటే (రూ.లక్షల కోట్లలో)...

ఆర్థిక సంవత్సరం	వాణిజ్య లోటు
2018–19	3.74
2019–20	3.43
2020–21	3.25
2021–22	5.46
2022–23	6.67

(ఆధారం: కేంద్ర ప్రభుత్వ గణాంకాలు)

వందేళ్ల ఆత్మగౌరవ పోరాటం!



సామాజిక ఆధిపత్య ధోరణులు, దురాచారాల నిర్మూలనకు ఆత్మగౌరవ ఉద్యమ రణభేరి మోగించారు పెరియార్. దక్షిణ భారతంలో అదెన్నో మార్పులకు కారణమైంది. వందేళ్ల ఆ ఉద్యమ ప్రస్థానాన్ని సింహావలోకనం చేసుకోవాల్సిన సమయమిది!

ఆధునిక భారత దేశంలోనూ సంస్థాగతంగా కులపరమైన వివక్ష కొనసాగుతూనే ఉంది. పట్టణాల్లో మురుగు కాల్వలను, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే పనివారిలో 92శాతం షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర వెనకబడిన కులాలకు చెందిన వారేనని ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. బడుగు, వెనకబడిన కులాలపై ఈ తరహా దురన్యాయాన్ని నిర్మూలించడానికే తమిళనాడులో 1925లో 'సుయ మరియాదై ఇయక్కం'(ఆత్మగౌరవ ఉద్యమం) ప్రారంభమైంది. దానికి ఈవీ రామస్వామి(పెరియార్) నాయకత్వం వహించారు. వచ్చే ఏడాది ఈ ఉద్యమానికి నూరేళ్లు నిండుతాయి. ఈ సందర్భంగా ఉద్యమ మూలాలు, అది సాధించిన ఫలాలు, చూపిన విస్తృత ప్రభావం గురించి సమీక్షించుకోవడం సముచితం. పెరియార్ ఆత్మగౌరవ ఉద్యమం దక్షిణ భారతదేశంలో రాజకీయంగా, సామాజికంగా విస్తృత మార్పులు తీసుకొచ్చింది. కులవ్యవస్థను రూపుమాపాలనీ, లింగ, సామాజిక సమానత్వాలను సాధించాలనీ, అన్ని రకాల అణచివేతలను నిర్మూలించాలని ఈ ఉద్యమం పిలుపిచ్చింది. తమిళనాటే కాకుండా ఆంధ్ర రాష్ట్రంలోనూ ఆత్మగౌరవ పోరు గణనీయ ప్రభావం చూపింది.

సమాజంలో మార్పులకు కృషి

స్వాతంత్ర్యానికి పూర్వం వరకు దేశంలో, ముఖ్యంగా దక్షిణాదిలో సామాజికంగా, మతపరంగా, ఆర్థికంగా కొందరి ఆధిక్యతే కొనసాగేది. పెరియార్ ఆత్మగౌరవ ఉద్యమం దీన్ని సవాలు చేసింది. మూఢనమ్మకాలను నిర్మూలించి హేతువాదాన్ని ప్రతిష్ఠించడానికి పోరాడింది. జ్యోతిరావ్ పూలే, బీఆర్ అంబేడ్కర్ ప్రబోధించిన సమానత్వం, సామాజిక రూపాంతరీకరణ భావనలు పెరియార్‌నూ గాఢంగా ప్రభావితం చేశాయి. ఆర్య ఆధిక్యాన్ని ఎదిరించి విలక్షణ ద్రావిడ వ్యక్తిత్వాన్ని చాటడమే లక్ష్యంగా ఆత్మగౌరవ ఉద్యమం పనిచేసింది. సాంస్కృతికంగా, రాజకీయంగా దక్షిణాదిపై ఉత్తరాది పెత్తనాన్ని ప్రశ్నించింది. కుల వివక్షను పెంచిపోషించే ఆచారాలను వదిలేయాలని ప్రజలకు ప్రబోధించింది. కులాంతర వివాహాలను ప్రోత్సహించింది. మహిళా హక్కుల కోసం పోరాడింది. సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి విశేష కృషి జరిపింది. పెరియార్ ఉద్యమం తమిళనాడులో సమూల మార్పులకు దారితీసి ద్రావిడ రాజకీయాలకు బీజం వేసింది. స్వాతంత్ర్యానంతరం తమిళనాడు రాజకీయాలను ద్రావిడ మున్నేట్ర కళగం (డీఎంకే), అన్నాడీఎంకేలే శాసిస్తూ వచ్చాయి. ఆంధ్ర రాష్ట్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మహిళా హక్కుల కోసం పోరాడారు. కుల వివక్షను అంతం చేయడానికి కృషి చేశారు. 1920, 1930 దశకాల్లో పెరియార్ భావాలు ఆంధ్ర ప్రాంత మేధావులకు, సంఘ సంస్కర్తలకు స్ఫూర్తి ఉత్సాహాలను ఇచ్చాయి. వారిలో ఒకరైన గోపరాజు రామచంద్రరావు (గోరా)- హేతువాద, నాస్తిక ఉద్యమ వ్యాప్తికి నాంది పలికారు. అయితే, అంతకు మునుపే హైదరాబాద్ సంస్థానంలో ఆత్మగౌరవ పతాకాన్ని ఎగరేశారు భాగ్యరెడ్డి వర్మ. కులవివక్ష నిర్మూలనకు, దళితుల అభ్యున్నతికి, విద్యావ్యాప్తికి, సామాజిక దురాచారాలను అరికట్టడానికి ఆయన విశేష కృషి చేశారు.

చాలాకాలంపాటు దక్షిణాది రాజకీయాల్లో ఒక వర్గం నాయకత్వమే కొనసాగింది. పెరియార్ ఉద్యమం స్ఫూర్తితో ఇతర వర్గాలు రాజకీయాల్లో ప్రధాన పాత్ర వహించసాగాయి. అలా, దక్షిణాదిలో సామాజికంగా, రాజకీయంగా ఎన్నో మార్పులు వచ్చినా పెరియార్ ఆశించినట్లు కుల వివక్ష పూర్తిగా తొలగిపోలేదనేది వాస్తవం. నేడు దేశంలో కుల, మతపరమైన అస్తిత్వ రాజకీయాలు మళ్లీ తలెత్తిన సందర్భంలో పెరియార్ ఉద్యమం ప్రబోధించిన హేతువాదం, కుల వివక్ష నిర్మూలన తిరిగి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మూఢనమ్మకాలు, పిడివాదాలను పక్కనపెట్టి ప్రజాతంత్ర, లౌకిక సూత్రాలను పునరుత్తేజితం చేయాలి. మహిళా హక్కుల సాధనలో పెరియార్ ఉద్యమం ఎంతో పురోగతి సాధించినా, ఇప్పటికీ దేశ రాజకీయాల్లో మహిళా ప్రాతినిధ్యం తక్కువగానే ఉంది. కులపరమైన హింస, అణచివేతలు ఏదోరూపంలో కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని ఎదుర్కొనే మార్గాన్ని ఆత్మగౌరవ ఉద్యమం ఎన్నడో చూపింది. ఆ పంథాలో ముందుకుసాగి ఫలితాలు సాధించడమే తరువాయి.

నిరంతర కార్యాచరణ

ఆత్మగౌరవ ఉద్యమ శతజయంతి సంవత్సరంలో ఆ పోరాట లక్ష్యాల సాధనకు దక్షిణాది రెట్టించిన ఉత్సాహంతో పునరంకితం కావాలి. దేశంలో నేడు అధికార కేంద్రీకరణ, మెజారిటీ వర్గ ఆధిక్య రాజకీయాలు బలపడుతున్నాయి. దీనికి ప్రతిగా దక్షిణాది రాష్ట్రాలు సామాజిక న్యాయం, ప్రాంతీయ అస్తిత్వం, హేతువాదాలకు కొత్త ఊపు తీసుకురావాలి. రిజర్వేషన్లు, బలహీన వర్గాలకు విద్యా ఉపకార వేతనాలు, లింగ సమానత్వ సాధనకు పటిష్ఠ విధానాలు చేపట్టాలి. దక్షిణాది రాష్ట్రాలు సంక్షేమ పథకాల అమలులో, సమ్మిళిత అభివృద్ధి సాధనలో ఎంతో ముందున్నాయి. యావత్ దేశానికి ఈ నమూనా ఆదర్శనీయం. దీనితోపాటు డిజిటల్ సాక్షరత, పర్యావరణ రక్షణ, కార్మిక హక్కుల రక్షణకూ ఉద్యమ ప్రాతిపదికపై కృషి చేపట్టాలి. ఆత్మగౌరవ ఉద్యమానికి వందేళ్ల క్రితం ఉన్న ప్రాధాన్యమే ఇప్పటికీ కొనసాగుతోంది. న్యాయమైన, స్వేచ్ఛాయుతమైన సమాజం కోసం నిరంతర కార్యాచరణ అత్యావశ్యకం.

–పూల దేవేంద్ర, పరిశోధకులు, 'సెస్'

హాయ్! బుజ్జీ!!

గుణమే ప్రధానం!




మాధవ, రాఘవ అని ఇద్దరు విద్యార్థులు ఉండేవారు. దేవాపురంలో ఉండే విశ్వానంద అనే గురువు దగ్గర వాళ్లిద్దరూ విద్య నేర్చుకునేవారు. మాధవ.. ఆ ఊరి జమీందారు కుమారుడు. రాఘవ.. ఓ వ్యాపారి కుమారుడు. ఇద్దరూ చాలా చురుకైన విద్యార్థులే. కానీ మాధవ జమీందారు కొడుకుననే గర్వం చూపించేవాడు. అందరూ తన మాటే వినాలని, తన చుట్టే ఉండాలని అనుకునేవాడు. అలాగే.. మాధవుడి దర్జా చూసి మొదట్లో స్నేహితులంతా అతని చుట్టే ఉండేవారు. కానీ, తన తీరు వల్ల నెమ్మదిగా స్నేహం మానేశారు మిగతా పిల్లలు. రాఘవ ధనికుడి కుమారుడైనా.. అందరితో సరదాగా ఉండేవాడు. చక్కగా మాట్లాడేవాడు. ఇదంతా గమనించిన మాధవ.. తనతో ఎవరూ మాట్లాడటం లేదని బాధపడిపోసాగాడు. దాంతో ఒకరోజు విశ్వానంద.. మాధవను తీసుకొని పువ్వుల తోటకు వెళ్లాడు. అక్కడకు వెళ్లగానే.. 'గురువు గారూ! పువ్వులు చాలా అందంగా ఉన్నాయి కదా!' అన్నాడు. 'అవన్నీ చూడటానికి ఎంత బాగున్నా.. అన్నింటినీ మన అవసరాలకు వాడుకోలేం. సువాసన వెదజల్లే వాటిని మాత్రమే ఉపయోగించడానికి ఆసక్తి చూపుతాం. అలాగే.. మన దగ్గర అధికారం ఉందనో, లేక డబ్బులు ఉన్నాయనో ఎదుటివాళ్లు మనల్ని ఇష్టపడరు. మన ప్రవర్తన, గుణాన్ని చూసి మాత్రమే మనతో కలిసుంటారు.. అర్థమైందా మాధవా!' అన్నారు గురువు. అప్పుడు తన పొరపాటు తెలుసుకున్న మాధవ అందరితో స్నేహంగా మెలగసాగాడు. తనలో వచ్చిన మార్పునకు స్నేహితులంతా సంతోషించారు.

– బల్ల రమేష్

కనిపెట్టండి

ఈ ఆధారాల సాయంతో వచ్చే పదాలను కనిపెట్టండి.




జవాబు: 1.SHOE 2.SLEEP 3.RAIN

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్



అన్నుల మిన్నుల.. అదిరే కన్నుల..







శంభో..
శివ శంభో


పున్నమిఘాట్‌లో నారీలోకం


మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జ్యోతి వెలిగించి డ్రోన్ సమ్మిట్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు


డ్రోన్ పనితీరు గురించి తెలుసుకుంటున్న సీఎం

కృష్ణా తీరంలో డ్రోన్ల విహంగ విహారంతో.. అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. ఆకాశంలో అపురూప దృశ్యాలు కనువిందు చేశాయి. గతంలో ఎన్నడూ చూడని అద్భుతమైన డ్రోన్ల ప్రదర్శనను చూసి.. వేల మంది ఆహూతులు కేరింతలు కొట్టారు. కృష్ణా నదీ తీరంలో పున్నమిఘాట్‌లో.. దేశంలోనే ఎన్నడూ లేనన్ని రికార్డుల మోత మోగింది. దేశంలోనే అతిపెద్ద డ్రోన్ల ప్రదర్శనకు వేదికగా నిలిచి.. ఏకంగా ఐదు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వేల మంది అతిథులు తరలివచ్చి ఈ డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ, మంగళగిరి కేంద్రాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో తొలిరోజు.. ఊహకే అందని అద్భుతాలు ఆకాశంలో ఆవిష్కృతమయ్యాయి. మంగళవారం ఉదయం మంగళగిరి వేదికగా సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టగా.. కేంద్ర మంత్రి రామ్మోహన్, మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, సవిత తదితర ప్రజాప్రతినిధులు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ హాజరయ్యారు.


చంద్ర
కాంతులు..


మంగళగిరి: ప్రదర్శన తిలకించేందుకు..


కనుల నిండుగ..
కళల పండగ


కృష్ణా తీరాన యువోత్సాహం

కళా
వైభవం


మంగళగిరికి తరలివచ్చిన యువతీ యువకులు


అద్భుతాలు
సృష్టిస్తాం

మిన్నంటిన
జోష్

అపూర్వం

అమోఘం


యాలీ డ్రోన్
మనుషులు చేరుకోలేని ప్రాంతాలకు దీని ద్వారా వైద్య సామగ్రిని ఇట్టే పంపవచ్చు.




సర్వేలెన్స్ డ్రోన్
భూ కొలతలు, సర్వేను పారదర్శకంగా చేపట్టే అధునాతన పరికరం



రెడ్ వింగ్
గమ్యం చేరలేని గ్రామీణ ప్రాంతాలకు మందులను చేరవేసే డ్రోన్ పనితీరు తెలుసుకుంటున్న యువత


భద్రతకు భరోసా
రక్షణకు దోహదం చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు


అన్నదాతకు అండగా..
పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న సందర్శకులు

ఈనాడు, డిజిటల్ – అమరావతి,
న్యూస్‌టుడే– భవానీపురం, విద్యాధరపురం



చంద్రహాసం...

ఆకాశంలో 5,500 డ్రోన్లు కలిసి చేసిన విన్యాసాలను చూస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు బీ.సి.జనార్దన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి డ్రోన్ల ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ముంబయికి చెందిన వికాస్ అన్‌బీటబుల్ డ్రీమ్ టీం చేసిన నృత్య ప్రదర్శనను సైతం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా సైకిల్‌తో ఈ బృందం చేసిన విన్యాసాలు చూసి.. ముఖ్యమంత్రి నవ్వులు కురిపించారు. డ్రోన్ల ప్రదర్శన, లేజర్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య, సంగీత ప్రదర్శనలు అలరించాయి.

అభినవ డ్రోనాచార్య!

- అన్ని రంగాలనూ నడిపించేది.. డ్రోన్లే
- సాంకేతికతకు.. అభివృద్ధికి బాసట
- నూతన ఆవిష్కరణలపై నయా ఆసక్తి
- అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు తరలివచ్చిన యువత

యువ


డ్రోన్ల విశిష్టతను వివరిస్తూ..


డ్రోన్ షోలో యువత సందడి..

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి

ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతోంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. తప్పిపోయిన వ్యక్తులను కనిపెట్టడం.. ప్రకృతి వైపరీత్యాల వేళ బాధితులకు ఆహారం, మందులు అందించడం.. నష్టాలను అంచనా వేయడం.. జన సమూహాలపై నిఘా.. వ్యవసాయంలో సస్యరక్షణ.. వంటి విభాగాల్లో ఎంతో ఉపకరిస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విభిన్న అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతోపాటు భవిష్యత్తు మార్గసూచీపై గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దీనికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన పలువురు ఇది తమకు ఎంతో ఉపయోగపడిందనీ, భవిష్యత్తులో తమ ప్రాజెక్టుల రూపకల్పనకు అక్కరకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సొంతంగా ఎదగాలనే స్టార్టప్ ఏర్పాటు



నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ ఏర్పాటు చేశాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివిన తర్వాత హైదరాబాద్ ఐఐటీలో ఇటీవలే ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాను. ఐఐటీ ప్రాంగణంలో ఉన్న టింకర్స్ ల్యాబ్‌లో నేను ఎక్కువ సమయం గడిపా. అక్కడ సొంతంగా రోబోటిక్ చెయ్యిని తయారు చేసేందుకు చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ల ప్రాజెక్టుకు 'ఆమని ఆటోమేషన్', కృత్రిమ మేధస్సు కోసం 'ఎక్స్ న్యూరోపిల్' అనే స్టార్టప్స్ ఏర్పాటు చేశాను. డ్రోన్ల వేగాన్ని నియంత్రించేందుకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఈఎస్‌సీ) పరికరాలను సొంతంగా తయారు చేసి ఆర్డర్లపై సరఫరా చేస్తున్నా. నా వద్ద ఉన్న నిపుణుల బృందం తోడ్పాటుతో.. వచ్చే ఆర్డర్లను తీసుకుని తయారు చేయించి ఇస్తున్నా. వచ్చిన లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపైనా దృష్టి సారిస్తా. సాంకేతిక పరిజ్ఞానంతో బయోడీజిల్ తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

- ఎ.పురంధర్, ఎం.టెక్, ఐఐటీ హైదరాబాద్

నిఘా మరింత మెరుగుపరిచేలా...



మేం ఇంజినీరింగ్‌లో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ విభాగాన్ని ఎంచుకున్నాం. వివిధ వస్తువులను సరఫరా చేసే డ్రోన్లను తయారు చేస్తున్నాం. భవిష్యత్తులో రాత్రి సమయాల్లో పోలీసులకు అక్కరకొచ్చేలా గస్తీకి ఉపయోగపడేలా తయారు చేయాలని భావిస్తున్నాం. అసాంఘిక శక్తుల జాడ పసిగట్టగానే అలారం మోగేలా తయారు చేస్తాం. దీనిని వీలైనంత త్వరగా రూపొందించి వినియోగంలోకి తీసుకురావాలన్న పట్టుదలతో ఉన్నాం. పరిశ్రమల్లో డ్రోన్ల తయారీలో విభాగంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు తెలుసుకునేందుకు సదస్సుకు వచ్చాం. డ్రోన్లు మరింతగా అభివృద్ధి చేసేలా సమ్మిట్‌కు వచ్చిన వారితో చర్చించి సూచనలు, సలహాలు తీసుకున్నాం.

- సీహెచ్.జ్యోతిక, ఎస్.భార్గవి, ఎం.ప్రత్యూష, విజ్ఞాన్ యూనివర్సిటీ, వడ్లమూడి

మార్గం నిర్దేశిస్తే.. గమ్యస్థానం చేరేలా..



మేం ఈసీఈ రెండో ఏడాది చదువుతున్నాం. విమానయాన రంగమంటే చాలా ఇష్టం. ఆ ఆసక్తితో డ్రోన్లపై పరిశోధనలను ప్రారంభించాం. కనీస సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో వీటిని వివిధ వినియోగాలకు వినియోగించేలా పలు మారుమూల ప్రాంతాలకూ చేరతాయి. డ్రోన్లకు జీపీఎస్ పరికరాన్ని అమర్చి, మార్గాన్ని నిర్దేశించి గమ్యస్థానం చేరేలా తయారు చేశాం. తప్పిపోయిన వ్యక్తిని ఫేషియల్ రికగ్నేషన్ ద్వారా గుర్తించే సాంకేతికతను జోడించాం. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వస్తువులను సరఫరా చేసే మరో రెండు డ్రోన్లను కూడా రూపొందించాం. మరింత సామర్థ్యం గల డ్రోన్ల తయారీకి నలుగురం కలిసి బృందంగా ఏర్పడి ప్రయోగం చేస్తున్నాం. ఈ సమ్మిట్ ద్వారా కొత్త ఆవిష్కరణలు తెలుసుకున్నాం.

- పుష్పక్, ఆకాశ్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, అమరావతి

అవయవాలను తరలించే డ్రోన్ల తయారీపై దృష్టి

మేము మెకానికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాం. మా కళాశాలలో ఇదివరకే పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్, తప్పిపోయిన వారిని అన్వేషించేందుకు ఉపయోగపడే వాటిని రూపొందించాం. వివిధ అవసరాలకు ఉపయోగపడేలా డ్రోన్ల అభివృద్ధికి ఉపకరిస్తుందని ఈ సదస్సుకు వచ్చాం. అవయవ దానం తర్వాత వాటిని తరలించేందుకు ఇప్పుడు అంబులెన్సులకు గ్రీన్ ఛానల్ ఇచ్చే దాకా సకాలంలో తీసుకెళ్లలేని పరిస్థితి. కాలహరణాన్ని అధిగమించేందుకు డ్రోన్ల ద్వారా అవయవాలను రవాణా చేసే అంశంపై దృష్టి సారించాం. గత ఏడాది ఐఐటీ మద్రాస్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో మేం తయారు చేసిన పలు డ్రోన్లను ప్రదర్శించి, వాటి గురించి వివరించాం. మా ఆవిష్కరణ ఆకట్టుకుంది.

- పి.శరధర్, పి.తిరుమలేష్, కె.వి.సాయితేజ, డి.ధీరజ్, ఎస్.డి. నవాజ్.. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు




లేజర్ షో వీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


డ్రోన్ల తళుకులు


ఆకట్టుకున్న కళాకారిణుల నృత్య ప్రదర్శన


ఆలపిస్తున్న గాయకులు


ప్రజలతో కరచాలనం చేస్తూ..


వీఐపీ గ్యాలరీలో ప్రముఖులు

సకళాభివందనం!

భవానీపురం, విద్యాధరపురం: కృష్ణా తీరాన ఆహ్లాద వాతావరణంలో పున్నమి, భవానీ ఘాట్‌ల వేదికగా నిర్వహించిన డ్రోన్ షో ఆద్యంతం అలరించింది. సభా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యకళాకారుడు అజయ్‌కుమార్ బృందం చేసిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. శంభో...శివ శంభో, ఘల్లు...ఘల్లు... జోడెడ్లు బండ్లు అంటూ సాగిన నృత్యాలు అలరించాయి. గణపతి బప్పా మోరియా, నాటు...నాటు, నాకముక... నాకముక నృత్యాలు ఆహుతులను రంజింపజేశాయి. వికాస్ డ్రీమ్ టీమ్ విన్యాసాలతో కూడిన నృత్యం ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మ్యూజిక్ బ్యాండ్ అలరించింది. వందేమాతరం..., కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు, కరిగిపోయాను...కర్పూర వీణలా అని సాగిన గీతాలు రంజింపజేశాయి. లేజర్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. వీవీఐపీలకు రాత్రి భోజనం ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు డిన్నర్ చేసి వెళ్లారు.

వరద బాధితుల ఖాతాల్లో

రూ.235.72 కోట్ల జమ

- ★ 1,44,672 మందికి లబ్ధి
- ★ పరిశీలనలో మరో 2,478 దరఖాస్తులు


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనా. పక్కనే డీఆర్వో శ్రీనివాసరావు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వరదలో నష్టపోయిన ప్రతి బాధిత కుటుంబానికీ పరిహారం అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, ఏ ఒక్కరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా తెలిపారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో సెప్టెంబరులో సంభవించిన అధిక వర్షాలు, బుడమేరు వరద ప్రభావంతో గృహాలు, వాహనాలు తదితరాలకు సంబంధించి 1,44,672 మంది వరద బాధితుల ఖాతాల్లో పరిహారం కింద రూ.235.72 కోట్లు జమ చేసినట్టు వెల్లడించారు. బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కాని 476 కుటుంబాలకు సంబంధించి అనుసంధానం చేసి, చెల్లింపుల ప్రక్రియ జరిపేలా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఇంకా పరిశీలనలో 2,478 దరఖాస్తులు ఉన్నట్టు చెప్పారు. ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులను పరిష్కరించి, అర్హులైన వారికి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. 179 గ్రామ/వార్డు సచివాలయాల్లో వరద గణన జాబితాలతో పాటు, అదనంగా వచ్చిన దరఖాస్తులను పీజీఆర్ఎస్ ఫ్లడ్ మాడ్యూల్‌లో నమోదు చేసినట్టు వివరించారు. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాలకు నేరుగా పరిహారం జమ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పారదర్శకమైన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంగవీటి రాధాకు మంత్రి లోకేశ్ పరామర్శ



తాడేపల్లి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుంటున్న నేపథ్యంలో విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం పరామర్శించారు. తాడేపల్లి పరిధిలోని ప్రాతూరులోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దిల్లీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న లోకేశ్ అనంతరం రాధా ఇంటికి చేరుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తిరువూరులో 20.6 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు నమోదైన వివరాల ప్రకారం.. తిరువూరు 20.6 మి.మీ., వత్సవాయి 19.2, ఎ.కొండూరు 12.2, విస్సన్నపేట, ఇబ్రహీంపట్నం 3.4, రెడ్డిగూడెం 2.6, నందిగామలో 1.2 మి.మీ. మేర వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 3.13 మి.మీ.గా ఉంది.

ఎన్టీఆర్ జిల్లా జాబ్ క్యాలెండర్ విడుదల


జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే తాతయ్య, శ్రీనివాస్ తదితరులు

పటమట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా జాబ్ క్యాలెండర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విడుదల చేశారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎం.ఎస్.ఎం.ఈ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ, కేంద్ర పథకాల వివరాలు తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ... సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం (ఎం.ఎస్.ఎం.ఈ) ద్వారా అందించే పథకాలు, రాయితీలపై, వాటిని వినియోగించి విజయం సాధించిన పారిశ్రామికవేత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. యూనిట్లను ఎలా ప్రారంభించాలి.. బ్యాంకు రుణం తీసుకునే విధానం, మార్కెటింగ్ తీరు తదితర అంశాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే నెలలో నియోజకవర్గాల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, విజయవాడ కె.వై.ఐ.సి. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రీప్, ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, 147, 158 చికెన్ విత్ స్కిన్ - 266 చికెన్ స్కిన్‌లెస్ - 276.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

హత్యకు దారితీసిన స్వల్ప వివాదం

మిత్రులే.. అంతలోనే శత్రువులై..!

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే

వారిద్దరూ స్నేహితులు. చిన్నపాటి వివాదంతో ఘర్షణపడ్డారు. ఒకరిమీదకు మరొకరు దూసుకెళ్లారు. శత్రువుల్లా కొట్టుకునే క్రమంలో.. ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన వెంకట నరసింహరాజు ఫార్మసీ మందుల దుకాణాలు నిర్వహిస్తుంటారు. ఈయనకు విజయవాడ, అయోధ్యనగర్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ ఉంది. యనమలకుదురుకు చెందిన మహ్మద్ రఫీ (54), నరసింహరాజులు స్నేహితులు. వీరిద్దరూ సోమవారం అర్ధరాత్రి ఫ్లాట్‌కు వచ్చారు. కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చిన్న విషయమై గొడవ జరిగింది.

మాటామాటా పెరగడంతో..

రఫీ కత్తెర తీసుకుని పొడవబోయాడు. నరసింహరాజు తప్పించుకుని.. రఫీ మెడకు టవల్ వేసి నులమడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన అనంతరం నరసింహరాజు.. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు వచ్చి విచారించారు. రఫీ తనను రూ.3 లక్షలు అప్పు అడిగాడని, ఈ విషయంలో డబ్బులు ఎందుకు పాడు చేస్తావంటూ మందలించానని నరసింహరాజు చెబుతున్నారు. రఫీ.. మద్యం మత్తులో కత్తెర తీసుకుని మీదకు వస్తే మెడకు టవల్ వేసి అడ్డుకున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అతడు మరణించి ఉంటాడని పోలీసులు తెలిపారు. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

• పట్టణంలోని 6వ వార్డు సచివాలయం పరిధిలో 11వ వార్డులో మదిర రోడ్డులో రహదారుల వెంట పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.



• 7వ వార్డు సచివాలయం పరిధిలో 13వ వార్డులో మదిర రోడ్డులో ఆర్పీఎం చర్చి దగ్గర డ్రెయినేజీలో సిమెంట్ పైపులు పూడుకుపోయాయన్న స్థానికుల ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో పైపులను బటయకు తీయించారు.

• 4వ వార్డు సచివాలయం పరిధిలో 9వ వార్డు పరిధిలోని వీధుల్లో పిచ్చి చెట్లు దట్టంగా పెరిగాయన్న సమస్యను ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందిని పంపి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

• 10వ వార్డు సచివాలయం పరిధిలో 19వ వార్డులో రజక బజార్‌లో రహదారి వెంట పిచ్చి మొక్కలు ఉన్నాయని స్థానికులు తెలిపిన విషయాన్ని ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందిని పంపి మొక్కలు తొలగించే చర్యలు చేపట్టారు.

• 1వ వార్డు సచివాలయం పరిధిలో 1వ వార్డులో వీధుల్లో చెత్త కుప్పలు ఉన్నాయని, కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగు నీరు పారుదల లేదని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలుపగా ఆయన సిబ్బందిని పంపి ఆ ప్రాంతంలోని చెత్తను తొలగించి కాల్వను బాగుజేయించారు.

\- న్యూస్‌టుడే, తిరువూరు

ఆధార్ సేవలు వాయిదా

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సేవలను వాయిదా వేశామని కమిషనర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయ, మండల కార్యాలయ టెక్నీషియన్లు బదిలీపై ఉన్నారని వారిని అందుబాటులోకి తీసుకున్న తర్వాత సేవలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించారు. పట్టభద్రులంతా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, పి.సాంబశివరావు, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న తెదేపా, కార్మిక సంఘ నాయకులు

అన్నీ సమస్యలే.. అధికారులు రావాల్సిందే!

రెవెన్యూ గ్రామసభను బహిష్కరించిన రైతులు | సర్వే తీరుపై తీవ్ర ఆగ్రహం

మైలవరం, న్యూస్‌టుడే

'అమ్మిన పొలం సర్వే సంఖ్యను పుస్తకం నుంచి తొలగించలేదు.. అన్నదమ్ములం పంచుకున్న భూములను ఉమ్మడి వ్యవసాయదారులుగా చూపారు. రైతుల్ని పిలవకుండా రాళ్లు పాతారు, అడ్డదిడ్డంగా సర్వే చేసి, తీరా వచ్చి అర్జీలు ఇమ్మంటారా. మీరు చేసిన నిర్వాకానికి కొత్త పుస్తకాల్లో నమోదులతో ఈ క్రాప్ కూడా చేయడంలేదు..కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలతో పాటు కొత్త తలనొప్పులు తెచ్చి పెట్టారు' అని మండలంలోని పుల్లూరు శివారు దాసుళ్లపాలెం రైతులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. వివరాల్లోకి వెళితే.. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే చేసిన గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల్లో భాగంగా మంగళవారం దాసుళ్లపాలెం పాఠశాల ఆవరణలో సభ ఏర్పాటు చేశారు. విజయవాడ డివిజన్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ బేగ్‌తో పాటు



చెట్టు కింద కూర్చున్న రైతులు

మండల, గ్రామ సర్వేయరు, ఇతర రెవెన్యూ సిబ్బంది, సర్పంచి నాగమల్లేశ్వరి హాజరయ్యారు. తహసీల్దార్, డీటీ, ఆర్ఐలకు విజయవాడలో అధికారిక విధులు ఇవ్వడంతో రాలేదు. అయితే గ్రామంలో అత్యధికులకు గత ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకాల్లో ఉన్న తప్పులను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని భావించి పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు చేరుకున్నారు. అయితే తహసీల్దార్ రాలేదని తెలుసుకున్న రైతులు వచ్చిన సిబ్బందితో తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు. తప్పులు సరిదిద్దడానికి ఉన్నతాధికారులు రావాల్సిందేనని పట్టుబట్టి సిబ్బందిని వెళ్లిపోవాలని కోరారు. తహసీల్దార్ వచ్చే రోజు వరకు సభను వాయిదా వేసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అయితే అర్జీలు తీసుకుంటామని వచ్చిన అధికారులు చెప్పినా అంగీకరించక సభా ప్రాంగణం నుంచి బయటకు వచ్చి చెట్టు కింద కూర్చుండిపోయారు.

తప్పులు చేసిన వారికి అర్జీలు ఇవ్వం


ఈ సందర్భంగా అక్కడకు వెళ్లిన విలేకరులతో రైతులు మాట్లాడుతూ..భాగస్వామ్య వాటాలుగా ఎప్పుడో విడిపోయి, వేర్వేరు పాస్ పుస్తకాలను పొందిన తమ పుస్తకాల్లో ఉమ్మడి వ్యవసాయదారుల పేరిట ఇతరుల పేర్లను నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది చేసిన తప్పులతో ఉమ్మడి భాగస్వామ్య వాటాలను ఈ క్రాప్ నమోదులోనూ తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పంటల నష్టంతో పాటు, రుణాలు పొందలేకపోతున్నామని వాపోయారు. కొంతమంది చేలల్లో చెప్పకుండానే రాళ్లు పాతారని, దాని వల్ల సరిహద్దు తగాదాలు జరుగుతున్నాయన్నారు. ఒకరి పొలాన్ని మరొకరి ఖాతాలో వేశారని, ఇన్ని పొరపాట్లను చేసిన వ్యక్తులే సభలో ఉంటే ఎలా అర్జీలు ఇస్తామని గ్రామ సర్వేయరు తీరుపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అర్జీలు ఇస్తే పరిష్కారమవుతామని సర్వే అధికారి బేగ్ సూచించారు.

అనాదీనంలో ఉంటే ఎలా: ఎ.కోటిరెడ్డి, రైతు



కొనుగోలు చేసిన భూమికి గతంలోనే నాలుగు రిజిస్ట్రేషన్లు జరగ్గా, నేటికీ అనాదీనం అని ఆర్ఎస్ఆర్‌లో కన్పిస్తోంది. దాని వల్ల బ్యాంకు రుణం తీసుకోవడానికి కుదరడంలేదు. మార్పులని కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదు. రీసర్వే అంతా అస్తవ్యస్తంగా జరిగింది.

ఇబ్బందులకు గురిచేస్తున్నారు: భాస్కరరెడ్డి, రైతు



భాగస్వామ్య వాటాలుగా విడిపోయినా ఉమ్మడి వ్యవసాయదారులుగా నమోదు చేయడం విడ్డూరంగా ఉంది. నాతో పాటు చాలా మంది కుటుంబ సభ్యుల పొలాలను విభజించుకుని గతంలోనే చక్కగా పాస్ పుస్తకాలు తీసుకుంటే తీరా ఇప్పుడు మాకిచ్చిన పుస్తకాల్లో వేరే వారి పేర్లు ఎక్కించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ప్రతిభకు మెరుగులు

మైలవరం, న్యూస్‌టుడే: పోటీల్లో ప్రతిభ చాటడం ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని స్థానిక నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ రత్నకుమారి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఆ పాఠశాలలో ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో బి.గౌతమ్, ఎస్కే నజ్రత్, సీహెచ్ జ్యోతి మొదటి మూడు స్థానాలు సాధించి బహుమతులు అందుకున్నారు. ఏజీఎం హరీష్, ఆర్ఐ గురుప్రసాద్, డీన్ శ్యాంసన్, ఏఓ దివ్య అభినందించారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రత్నకుమారి

వరద సాయం ఇవ్వకపోవడం దారుణం

కొండపల్లి, న్యూస్‌టుడే: వరద సాయం అందించడంలో అర్హులైన బాధితులను మినహాయించడం దుర్మార్గమని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. వరద పరిహారం కోరుతూ కొండపల్లి శ్రామికనగర్ వాసులు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా సీపీఎం, ఎంసీపీఐ, ఎంఐఎం, వైకాపా నాయకులు పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో కురిసిన వర్షాలకు కొండపల్లి పురపాలిక మొత్తం నీటమునిగిందని.. అందరూ తీవ్రంగా నష్టపోయారన్నారు. అంతటి విపత్తు సంభవిస్తే అర్హులైన బాధితులకు పరిహారం అందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులైన బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రామికనగర్, వడ్డే నగర్, చైతన్యనగర్, ఖిల్లారోడ్డులకు చెందిన నివాసితులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ పార్టీ నేతలు, వరద బాధితుల ధర్నా

ఉపాధ్యాయులకు తరగతులు

తిరువూరు, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బోధించే సబ్జెక్టు ఉపాధ్యాయులకు మారిన పాఠ్య పుస్తకాలపై బుధవారం నుంచి తిరువూరు బాలికోన్నత పాఠశాలలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారని హెచ్ఎం పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. 23న తెలుగు, 24న హిందీ, 25న ఆంగ్లం, 26న గణితం, 28న భౌతికశాస్త్రం, 29న జీవశాస్త్రం, 30న సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఆర్పీలను నియమించారు.



బూజు పట్టిన మినుప మొక్కలను వ్యవసాయాధికారికి చూపిస్తున్న కర్షకులు

ప్రభుత్వం ఆదుకోవాలి: మినుము రైతుల విజ్ఞప్తి

చంద్రగూడెం(మైలవరం), న్యూస్‌టుడే: వర్షాలకు మినుము పంట పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని చంద్రగూడెం రైతులు కోరారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వచ్చిన రైతులు దెబ్బతిన్న మినుము మొక్కలను తెచ్చి మండల వ్యవసాయాధికారి సంధ్యారాణికి చూపించారు. రెండు నెలలుగా పూర్తిగా వర్షాల్లో ఉండడంతో గింజలు బూజు పట్టిందని, గతంలో పంటలు నష్టపోయిన సమయంలో పట్టించుకోలేదని వాపోయారు. అయితే గత ఆగస్టు వర్షాల సమయంలో పైరు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నందున నష్టం అంచనా కిందకు రాలేదని, ప్రస్తుతం పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తామని ఏవో రైతులకు హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని డీఏవో దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం దృష్టిలో ఉంచుతామని చెప్పారు.

వినియోగదారులకు బిల్లుల భారం ఉండదు

తిరువూరు, న్యూస్‌టుడే: పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను గృహ విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు డివిజన్ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకువచ్చిన పథకం ప్రయోజనాలను వివరించారు. పథకం ద్వారా ఏర్పాటు చేసే సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ ద్వారా నెలకు 125 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి చేస్తుందన్నారు. వినియోగదారులకు బిల్లుల భారం ఉండదన్నారు. అనంతరం పథకం గోడపత్రికలను ఆవిష్కరించారు. తిరువూరు డీఈఈ పి.రామకృష్ణ, ఏఈలు పి.నాగరాజు, వి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలు

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే: రీ సర్వే జరిగిన గ్రామాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. తిరువూరు మండలంలోని చిట్టేల, గంపలగూడెం మండలం అనుముల్లంక, విస్సన్నపేట మండలం కొర్లమండ, ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరంలో భూ సమస్యలపై రైతులు అర్జీలు అందించవచ్చన్నారు.

ఏడు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నేడు

విస్సన్నపేట, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో చంద్రుపట్ల, లంబాడీతండా, తెల్లదేవరపల్లి, పుట్రేల గ్రామస్థులకు, తిరువూరు మండలంలోని ముష్టికుంట్ల, ఆంజనేయపురం గ్రామ సచివాలయాల్లో, తిరువూరు నగర పంచాయతీలోని రాజుపేట 1వ వార్డు సచివాలయంలో బుధవారం ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని ఆ మండలాల అధికారులు తెలిపారు.

ప్రజల నుంచి స్పందన

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన ఆధార్ శిబిరాలకు ప్రజల నుంచి స్పందన లభించింది. ఆధార్‌లో సవరణలకు కేంద్రాలకు చేరుకుని బయోమెట్రిక్, ఐరిష్ ద్వారా సచివాలయాల ఉద్యోగులకు దరఖాస్తులు అందజేశారు.

పాఠశాలకు రూ.40వేలు వితరణ

నరసాపురం(విస్సన్నపేట), న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రవాసాంధ్రుడు కనకపూడి రామారావు రూ.40వేలు వితరణగా అందించారు. ఆ విరాళంతో పాఠశాలకు అవసరమైన మైక్‌సెట్ కొనుగోలు చేసినట్లు ప్రధానోపాధ్యాయిని ఎస్.శోభాలత తెలిపారు. కార్యక్రమంలో దాత సోదరుడు ఇజ్రాయిల్, తెదేపా నాయకులు జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీడీ మేరుగు రమేష్, గ్రామస్థులు శ్రీనివాసరెడ్డి, పాపారావు, రామకృష్ణ, ఉపాధ్యాయులు అనిల్, శ్రీధర్ పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

బాలుర ఉన్నత పాఠశాలకు రూ.10వేలు..

తిరువూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు స్థానికుడైన నాగుబండి శ్యామ్ సుందరరావు మంగళవారం రూ.10వేలు విరాళం అందజేశారని ఇన్‌ఛార్జి హెచ్ఎం కె.శంకరరావు తెలిపారు. దాత తన విరాళంతో బడిలో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎన్‌సీసీతో ఉత్తమ పౌరులుగా ఎదగొచ్చు

మైలవరం: ఎన్‌సీసీ ద్వారా యువత ఉత్తమ పౌరులుగా ఎదగొచ్చని 17వ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంజూరైన ఎన్‌సీసీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిక నిమిత్తం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించగా ప్రతిభ చూపిన 84 బాలికలు, 13 మంది బాలురు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ ఇళ్లా రవి, పీడీ మన్నేస్వామి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో పతకాలు

మైలవరం, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లాలోని కేసరపల్లిలో అమరావతి పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడిజిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. ఈఈఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.రామ్‌కుమార్ పతకాలు, కేకే సిద్ధార్థ బంగారు, టి.గోపిచంద్ వెండి, పతకాలను సాధించినట్లు పేర్కొన్నారు. వారిని పీడీ రాజ్‌కుమార్, శిక్షకుడు నటరాజ్‌లను కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రాతపుస్తకాల అందజేత

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటీవల సంభవించిన వరదల్లో స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థుల రాత పుస్తకాలు, దుస్తులు, నిత్యావసరాలు కొట్టుకుపోయాయి. విషయం తెలుసుకున్న జి.కొండూరు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు ఒరుగంటి నరసింహారావు రూ.10 వేల ఆర్థికసాయం అందించగా ఆయన మిత్రుడు పీ రమేష్ విద్యార్థులకు రాతపుస్తకాలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎం.చంద్రమోహన్, సిబ్బంది సుధీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అర్జీల అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పాత నాగులూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రీసర్వేకు సంబంధించి జరిగిన గ్రామ సభలో రైతులు 28 మంది అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ జె.సుశీలదేవి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వరరావు(చిన్ని). ఆర్.ఐ జి.పుల్లయ్య, వీఆర్వో శ్రీను, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం గ్రామీణం: రైతులకు సూచనలు ఇస్తున్న డీఐవోఎస్ సుబ్బారావు

కొటికలపూడిలో 15 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం కొటికలపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో గతంలో నిర్వహించిన భూ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలని కోరుతూ 15 మంది రైతులు వినతిపత్రాలు అందించారు. డీఐవోఎస్ కె.సుబ్బారావు మాట్లాడుతూ..వినతులు ఇచ్చిన రైతులకు రశీదులిచ్చి భూమిని పరిశీలించి ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి నాగరాజు, ఉప తహసీల్దారు సుజాత, గ్రామ కార్యదర్శి బాషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నవరంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 37 మంది రైతులు వినతిపత్రాలు అందజేశారని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాదాసు వీరభద్రరావు తెలిపారు. సభలో మండల సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వోలు ఏవీఆర్.మూర్తి, కనకదుర్గారావు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆంజనేయపురం(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని ఆంజనేయపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబరు, ఎల్‌పీఎం, ఖాతా నంబర్ల సరిజేయుట, మ్యుటేషన్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 35 మంది రైతులు అర్జీలు అందజేశారని ఆర్ఐ బి.మోహన్‌రావు, మండల సర్వేయరు నల్లిబోయిన గోపాలకృష్ణ తెలిపారు. సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి కోటేశ్వరి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సామూహిక నివారణ చర్యలు మేలు

చంద్రగూడెం(మైలవరం), న్యూస్‌టుడే: పంటలను నాశనం చేసే ఎలుకలను నిర్మూలించాలంటే సామూహిక నివారణ చర్యలు చేపడితేనే మేలని జిల్లా వ్యవసాయాధికారిణి నాగమణెమ్మ పేర్కొన్నారు. మండలంలోని చంద్రగూడెం రైతుసేవాకేంద్రం వద్ద మంగళవారం ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రోమోడయోలిన్ అనే మందును ఉపయోగించి పొలాల్లో ఎలుకలు ప్రవేశించే రంధ్రాల్లో ఉంచాలని సూచించారు. రైతులకు కావాల్సిన ఎరువులు రైతుసేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టరేట్ డీడీఏ ఎ.శారదతో కలిసి పొలాల్లో నివారణా విధానాన్ని ప్రదర్శించారు. వ్యవసాయ అధికారులు సంధ్యారాణి, అనితాభాను, ఊర్మిళ,



మూలపాడులో రైతులతో విషపు ఎరలు తయారుచేయిస్తున్న వ్యవసాయాధికారులు



మైలవరం: ఎలుకల నివారణ మందు అందజేస్తున్న డీఏఓ నాగమణెమ్మ, అధికారులు

నాయకులు రోశాలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలిశెట్టిపాడు(ఎ.కొండూరు): వరిలో ఎలుకల ద్వారా పంట నష్టం అధికంగా ఉంటుందని, సామూహిక ఎలుకల నిర్మూలన ప్రక్రియ ద్వారా రైతుల పంటనష్టం నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీటీ టి.మాధవీలత సూచించారు. సర్పంచి బి.చిట్టిబాబు, ఏడీఏ జి.కెనడి, ఏవో ఎస్‌కే.టిప్పుసుల్తాన్, హెచ్‌వో బి.నరేంద్ర, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గానుగపాడు(తిరువూరు): సమగ్ర ఎలుకల యాజమాన్యం, యాంత్రిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీ టి.మాధవీలత రైతులకు సూచించారు.

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ..విషపు ఎరలను తయారు చేయడానికి రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందును ఉపయోగించాలన్నారు. వ్యవసాయాధికారులు శారద, అనితా భాను, ఊర్మిల, వాసుదేవనాయక్, శ్రీనివాస్, రజనిలతోపాటు వ్యవసాయ సహాయకులు పుష్ప, సాయి రైతులు పాల్గొన్నారు.



ఎ.కొండూరు : డీటీ మాధవీలత ఆధ్వర్యంలో...

ఇరుక్కుపోయిన కంకర లారీ



భారీ వర్షానికి కట్లేరుకు చేరిన వరద నీరు మంగళవారం వినగడప సమీప వంతెన వద్ద మళ్లింపు రోడ్డుపై ప్రవహించింది. అదే సమయంలో సామర్థ్యానికి మించి కంకర లోడుతో వచ్చిన టిప్పర్ మళ్లింపు రోడ్డు మధ్యలో ఒక పక్కకు ఒరిగి ఆగిపోయింది. దీంతో అటుగా పయనించే వాళ్లకు ఆటంకమైంది. మధ్యాహ్నం రెండు భారీ పొక్లెయిన్ల సాయంతో లారీని బయటకు తీసుకువచ్చారు. మళ్లింపు రోడ్డుపైకి వరద నీరు చేరగానే అటుగా భారీ వాహనాలు రాకుండా నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. దీంతో సమస్య ఉత్పన్నమైందని ప్రజలు తెలుపుతున్నారు. సాయంత్రం వరకు వాహనదారులు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడ్డారు. - న్యూస్‌టుడే, వినగడప(గంపలగూడెం)

ఇసుక కోసం ట్రాక్టర్ల బారులు



రేవుల్లో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ లేదా ఎడ్ల బండి ఏర్పాటు చేసుకోవచ్చు. వినియోగదారుడు కూలీలు లేదా తానే స్వయంగా ట్రాక్టర్‌లో ఇసుక లోడు చేసుకోవచ్చు. కానీ ఇందుకు విరుద్ధంగా తిరువూరు మండలం గానుగపాడు సమీప కట్లేరు రేవుకు మంగళవారం వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఒక్కసారిగా చేరుకున్నాయి. చింతలపాడు-గానుగపాడు దారిలో ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లు పదుల సంఖ్యలో బారులు దీరాయి. దీంతో ఆ రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. - న్యూస్‌టుడే, తిరువూరు

అంబులెన్స్, లారీ ఢీకొని ఆరుగురికి గాయాలు

తల్లాడ, న్యూస్‌టుడే: ప్రైవేట్ అంబులెన్స్, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తిరువూరు మండలం మునుకుళ్లకు చెందిన సీహెచ్ కనకమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో తిరువూరు నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తున్నారు. తల్లాడ బస్టాండ్ సమీపంలో రహదారి పక్కన నిలిపి ఉంచిన ఓ లారీని తప్పించే క్రమంలో డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో లారీని అంబులెన్స్ ఢీకొంది. ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తల్లాడ, ఏన్కూరు 108 వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాగులో మునిగి కూలీ మృతి

మైలవరం, న్యూస్‌టుడే: చేపలు పడుతూ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి ఒకరు మృతి చెందారు. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కూలి పనులు చేసుకునే మైలవరానికి చెందిన బొంక రాజు (55) సోమవారం కుమారుడు, మేనల్లుడితో కలిసి వెల్వాడంలోని బుడమేరులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఒక ఒడ్డు నుంచి వల వేసుకుంటూ మరో ఒడ్డుకు వస్తున్న సమయంలో లోతుగా ఉన్న గుంతలో రాజు మునిగిపోయాడు. అతడి మేనల్లుడు పట్టుకునే ప్రయత్నం చేసినా..వాగులో ప్రవాహానికి కొట్టుకుపోయాడు. మునిగిన ప్రాంతానికి దాదాపు అర కిలోమీటరు దూరంలో మంగళవారం మృతదేహం ఒడ్డుకు రావడంతో పోలీసులు పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కుండలకు భలే గిరాకీ

ఇబ్రహీంపట్నంగ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే

వివాహాల్లో వీటికి ప్రాధాన్యం ఎక్కువ

అవిరేణి కుండలు, గరిక ముంతలు, పోలు ముంత, కూరాడు, అఖండ దీపం వంటి మట్టి కుండలకు హిందూ వివాహ వ్యవస్థలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వీటిని తీర్చిదిద్దడంలో కొండపల్లి శాలివాహన గృహిణులు చేయితిరిగిన వారు. ఈ నెల 12వ తేదీ నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కాగా ఈ ఏడాది చివరి వరకు కొనసాగనున్నాయి. దీంతో కొండపల్లి శాలివాహనులు మట్టికుండలను తీర్చిదిద్దుతూ, రంగులతో అలంకరించి మెరుగులు పెట్టి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు.



గరిక ముంతకు రంగులు అద్దుతున్న గృహిణి

రూ.100 నుంచి రూ.500 వరకు

వివాహ ముహూర్తాల సమయంలో వీటికి విజయవాడ నగరంతోపాటు పరిసర శివారు గ్రామాల్లో మంచి డిమాండ్ ఉంది. సీజన్‌కు ముందే మగవారు వీటిని తయారు చేసి బట్టీల్లో కాల్చిన తరువాత వాటిని గృహిణులకు అందజేస్తారు. వారు తీరిక సమయాల్లో వాటికి రంగులు అద్ది తీర్చిదిద్దుతారు. విజయవాడ నగరంలో కృష్ణలంక తదితర ప్రాంతాల్లో వీటి విక్రయాలు చేసే వ్యాపారులు ముందస్తుగా వీళ్లతో ఒప్పందాలు కుదుర్చుకుని టోకుగా కొనుగోలు చేస్తుంటారు. కొండపల్లి శాలివాహన బజారులో ఇళ్ల వద్ద కూడా విక్రయిస్తుంటారు. పెళ్లి ముహూర్తాల సమయంలోనే గిరాకీ ఉంటుందని రూ.100 నుంచి రూ.500 వరకు అమ్ముతామని తయారీదారులు చెబుతున్నారు.

తనను తాను
మనువాడిన బ్రిట్నీ!



మిసిసిపీ: అమెరికన్ పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ (42) గత ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఓ పోస్టు అందరినీ కలవరపాటుకు గురిచేసింది. 30 ఏళ్ల శాం అస్గరీతో 14 నెలలు కొనసాగిన బ్రిట్నీ వివాహబంధం ఇటీవలే ముగిసింది. గత మే నెలలో ఈ జంట విడాకుల ఒప్పందానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పెళ్లిగౌను ధరించి బ్రిట్నీ ఇన్‌స్టాలో చేసిన పోస్టు అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. "నన్ను నేను పెళ్లి చేసుకున్నా. ఇది తెలివితక్కువ పనిగా మీకు అనిపించవచ్చు. కానీ, నా జీవితంలో నేను చేసిన అద్భుతమైన పనిగా దీన్ని భావిస్తున్నా" అంటూ ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టుతోపాటు పంచుకున్న వీడియోలో నవవధువులా నిలబడిన బ్రిట్నీ పక్కన వరుడు ఎవరూ లేరు. ఎటువంటి విచారం లేకుండా బాలీగా ఉన్న చర్చి ఫొటో షేర్ చేసింది. ఒంటరిగా హనీమూన్‌కు బయలుదేరుతున్నట్లు విమానం పక్కన నిలబడి ఉన్న మరో పోస్టులో "టర్క్స్ అండ్ కేకస్, ఇదిగో నేను వచ్చేశా" అని బ్రిట్నీ వ్యాఖ్య జోడించింది. టర్క్స్ అండ్ కేకస్ దీవులు అట్లాంటిక్ సముద్రంలో ఉన్నాయి.

మరో 80 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: విమానయాన సంస్థలకు గత కొద్దిరోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులు ఆగడంలేదు. సోమవారం నుంచి మంగళవారం మధ్య 24 గంటల్లో దాదాపు 80 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు హెచ్చరికలు వచ్చాయని 'బాంబు బెదిరింపుల మూల్యాంకన కమిటీ' ప్రకటించింది. దీంతో 24 గంటల్లో బెదిరింపులు అందుకున్న విమానాల సంఖ్య 80కి చేరుకుంది. గత తొమ్మిది రోజుల్లో 170 విమానాలకు కలిగిన అంతరాయం వల్ల రూ.600 కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు తెలిపారు.



వైఫల్యాల తర్వాత బలంగా పుంజుకోండి

జీవితం అంటే వైఫల్యాలను తప్పించుకోవడం కాదు! ఎన్ని వైఫల్యాలు ఎదురైనా తిరిగి బలంగా పుంజుకోవడం!! గెలుపు, ఓటమి అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివి. ఓటమికి వెరవకుండా, ప్రతిరోజూ మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటూ ముందుకెళ్లండి.

– డేవిడ్ లెవ్‌జాయ్, పాడ్‌కాస్టర్

పెన్సిల్వేనియా గెలవాల్సిందే!



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా మారిన రాష్ట్రం

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పెన్సిల్వేనియా ప్రస్తుతం జరుగుతున్న అధ్యక్ష ఎన్నికల్లోనూ అత్యంత కీలకంగా మారింది. అధ్యక్షులుగా ఎన్నిక కావాలంటే ఈ రాష్ట్రంలో తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య ఈ రాష్ట్రంలో ఉత్కంఠ భరిత పోరు సాగుతోంది. పెన్సిల్వేనియాలో 19 ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లున్నాయి. అత్యధికంగా కాలిఫోర్నియాలో 54 ఓట్లున్నాయి. ఇది డెమొక్రాట్లకు కంచుకోట. రిపబ్లికన్ల బలంగా ఉన్న టెక్సాస్‌లో 40 ఓట్లున్నాయి.



- దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో గతంలో అధ్యక్ష అభ్యర్థులకు వచ్చిన ఓట్ల ఆధారంగా ట్రంప్, హారిస్‌లకు వచ్చే ఓట్లను రాజకీయ నిపుణులు అంచనా వేశారు.
- ఏడు కీలక రాష్ట్రాల్లోని ఓట్లపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఐందులో ఆరిజోనా (11), విస్కాన్సిన్ (10), మిషిగన్ (15), పెన్సిల్వేనియా (19), జార్జియా (16), నార్త్ కరోలినా (16) ఉన్నాయి.
- వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులు పెన్సిల్వేనియాపై దృష్టి సారించారు. ఇక్కడ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఓటర్లను ఆకట్టుకునేందుకు ట్రంప్, హారిస్‌కు సంబంధించిన వేల మంది వాలంటీర్లు పెన్సిల్వేనియాలో మకాం వేశారు.
- పెన్సిల్వేనియాలో గెలవడానికి 270 ఎలక్టోరల్ ఓట్లు సాధించడం అసాధ్యమని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.
- 270టువిన్.కామ్ వెబ్‌సైట్ అంచనా ప్రకారం.. హారిస్‌కు 226 ఓట్లు, ట్రంప్‌నకు 219 ఓట్లు రావొచ్చని అంచనా.



1 శాతం అటూఇటూ..

2016 ఎన్నికల్లో ట్రంప్ కేవలం 1శాతం ఓట్లతో పెన్సిల్వేనియాలో విజయం సాధించారు. అదే 1 శాతం ఓట్ల తేడాతో 2020లో ఈ రాష్ట్రాన్ని కోల్పోయారు.

- 2024 ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్టు ఈ రాష్ట్రం ఉంది. దాదాపుగా టాస్ వేసి నట్టుగానే ఫలితం ఉండవచ్చని అంటున్నారు.
- కీలక రాష్ట్రం కావడంతో ట్రంప్, హారిస్‌లు.. డబ్బు, సమయం, శక్తినంతా ఇక్కడే ధారపోస్తున్నారు. వాణిజ్య ప్రకటనలు ఇక్కడే ఎక్కువగా ఇస్తున్నారు.
- పెన్సిల్వేనియా ఓటర్లను ఆకట్టుకోవడానికి సోమవారం నుంచి 21 మంది ప్రముఖులతో రిపబ్లికన్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభించింది. ఇందులో భారతీయ అమెరికన్ కాష్ పటేల్ ఉన్నారు.
- రెండు పార్టీలకు చెందిన దాదాపు 50 సభలు గత 3 నెలల్లో పెన్సిల్వేనియాలో జరిగాయి. ఇక్కడ పోటీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- ప్రతి 4 డాలర్లలో 1 డాలరును ఈ రాష్ట్రంలోనే ప్రకటనల కోసం రెండు పార్టీలు ఖర్చు చేశాయి.
- ట్రంప్ ఇటీవల మెక్ డొనాల్డ్‌లో అక్కడి సిబ్బందిలా దుస్తులు వేసుకుని పని చేసింది ఈ రాష్ట్రంలోనే కావడం విశేషం.

హెజ్‌బొల్లా రాకెట్ల వర్షం

కూల్చేసిన ఇజ్రాయెల్ ● నెతన్యాహు సేనల దాడిలో 13 మంది మృతి



బీరుట్‌లో ధ్వంసమైన భవనాల వద్ద సహాయక చర్యలు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ మధ్య ప్రాంతంపైకి హెజ్‌బొల్లా మంగళవారం రాకెట్లతో విరుచుకుపడింది. వాటిని ఇజ్రాయెల్ అడ్డుకుంది. ఒక రాకెట్ నిర్మానుష్య ప్రాంతంలో పడింది. ఈ దాడుల్లో ఒక రిజర్విస్టు సైనికుడు మృతి చెందాడు. దాదాపు నేపథ్యంలో 10 లక్షల మంది ఇజ్రాయెలీలు సురక్షిత బంకర్లలో తలదాచుకున్నారు. విమాన సేవలకు కొంత అంతరాయం కలిగింది. మరోవైపు సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 13 మంది లెబనాన్ వాసులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఇటు పశ్చిమాసియాలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్.. కాల్పుల విరమణకు అవకాశాలు స్వల్పమేనని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా మంగళవారం ఇజ్రాయెల్‌లోని జనసమ్మర్ద ప్రాంతాలపై రాకెట్ దాడులు చేసింది. అయితే ఎటువంటి నష్టం జరగలేదని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు రావడానికి కొద్ది గంటల ముందు ఈ దాడులు జరిగాయి. 5 ప్రొజెక్టైల్స్‌ను లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిందని, వాటిలో ఒక్కటి మినహా అన్నింటినీ క్షిపణి రక్షణ వ్యవస్థ అడ్డుకుందని ఇజ్రాయెల్ తెలిపింది. ఒకటి నిర్మానుష్య ప్రాంతంలో పడిందని వెల్లడించింది. దాడుల కారణంగా బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. బీరుట్‌లోని ప్రధాన ఆసుపత్రి ప్రాంతంలో సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 13 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్యశాఖ ప్రకటించింది. 57 మంది గాయపడ్డారని తెలిపింది.

రద్దీ ప్రాంతంపై ఇజ్రాయెల్ దాడి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌కు దక్షిణాన ఉన్న రద్దీ ప్రాంతంపై మంగళవారం ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ ప్రాంతంలోనే శరణార్థి శిబిరం కూడా ఉంది. హెజ్‌బొల్లా స్థావరాలుగా పేర్కొంటూ పలు భవనాలపై ఇజ్రాయెల్ బాంబులతో దాడి చేసింది. ఈ దాడుల్లో మరణాలపై వివరాలు తెలియలేదు. ఫ్రాన్స్ రాయబారి ఇంటికి దగ్గరలోనే ఈ దాడి జరిగింది.

★ లెబనాన్, సిరియా సరిహద్దులోని జాతీయ రహదారిపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సిరియాలోని ప్రాంతంపైనా మంగళవారం ఈ దాడి జరిగినట్టు జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది.

వక్ఫ్ బిల్లుపై జేపీసీ భేటీ రసాభాస

- గాజుసీసా పగలగొట్టి ఛైర్మన్ వైపు విసిరిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ
- ఎంపీ చేతికి గాయం..



చేతికి కట్టుతో కల్యాణ్ బెనర్జీ

దిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. ప్రారంభమైన కొద్దిసేపటికే ఎంపీల వాగ్వాదానికి దిగారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తనకు ఎదురుగా నీళ్ల కోసం పెట్టిన గాజుసీసాను టేబుల్‌కేసి కొట్టగా ఆయన చేతికి గాయమైంది. అనంతరం పగిలిన బాటిల్‌ను ఛైర్మన్ వైపు కల్యాణ్ విసిరారు. ఫలితంగా సమావేశం వాయిదా పడింది. బెనర్జీకి పార్లమెంటు ఆవరణలోని డిస్పెన్సరీలో ప్రథమచికిత్స చేసి కట్టు వేశారు. ఈ వ్యవహారాన్ని పార్లమెంటరీ కమిటీ తీవ్రంగా పరిగణించింది. బాజపా సభ్యుడు నిశికాంత్ దుబే తీర్మానం ప్రవేశపెట్టగా, 10-8 ఓటింగుతో ఆమోదించిన కమిటీ కల్యాణ్ బెనర్జీని సమావేశాల నుంచి ఒకరోజు సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బాజపా ఎంపీ జగదాంబికా పాల్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశం ఒడిశాకు చెందిన రిటైర్డ్ జడ్జీలు, న్యాయవాదుల అభిప్రాయాలు వింటుండగా ఈ వివాదం తలెత్తింది.

వదిలేస్తే.. రేపు తుపాకీతో వస్తారు: పాల్

జేపీసీ సమావేశంలో జరిగిన దాడి నుంచి తాను త్రుటిలో తప్పించుకున్నట్లు ఛైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు. సభ్యులను ఇలా వదిలేస్తే రేపటి సమావేశానికి మరొకరు రివాల్వరుతో వస్తారని మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. బాటిల్‌ను ఛైర్మన్ వైపు విసరడం తన ఉద్దేశం కాదని కల్యాణ్ బెనర్జీ వివరణ వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

గుజరాత్‌లో అయిదేళ్లుగా నకిలీ కోర్టు!

- భూవివాదాలు లక్ష్యంగా తీర్పులు
- మోసగాడైన 'జడ్జి' అరెస్టు



అహ్మదాబాద్: ఉత్తుత్తి బ్యాంకులు.. పోలీసులు.. ఇప్పుడు ఏకంగా కోర్టులు కూడా ఈ జాబితాలో చేరాయి. గుజరాత్ రాజధాని నగరంలో గత అయిదేళ్లుగా "తీర్పులు" ఇస్తున్న నకిలీ కోర్టు గుట్టు రట్టయింది. నకిలీ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి, న్యాయమూర్తిగా తీర్పులు ఇచ్చిన మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శామ్యూల్ అనువదించిన కోర్టు సిబ్బందిగా, న్యాయవాదులుగా నటించేవారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో నిజమైన కోర్టు వాతావరణాన్ని శామ్యూల్ సృష్టించాడని పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్ సిటీ సివిల్‌కోర్టు రిజిస్ట్రారు నగరంలోని కరంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు శామ్యూల్ ప్రభుత్వ భూమికి సంబంధించి 2019లోనే తన క్లయింట్‌కు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చాడు. తర్వాత ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో తన క్లయింట్ పేరును చేర్చాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ ఉత్తర్వులను అమలుచేయాలని కోరుతూ శామ్యూల్ మరొక న్యాయవాది ద్వారా సిటీ సివిల్‌కోర్టులో అప్పీల్ చేశాడు. తాను జారీ చేసిన నకిలీ ఉత్తర్వులను కూడా ఈ పిటిషనుకు జత చేశాడు. ఆ ఉత్తర్వులు నకిలీవని కోర్టు రిజిస్ట్రారు గుర్తించడంతో శామ్యూల్ బండారం బయటపడింది.

● గత అయిదేళ్లుగా శామ్యూల్ నకిలీ కోర్టు నడుపుతున్నాడు. సిటీ సివిల్‌కోర్టుల్లో భూవివాదాల కేసులు పెండింగులో ఉన్న కక్షిదారులను గుర్తించి నిందితుడు వల విసిరేవాడు. ప్రభుత్వ నియమించిన అధికారిక మధ్యవర్తిగా పరిచయం చేసుకునేవాడు. తర్వాత పిటిషన్లను తన 'కోర్టు'కు పిలిపించుకునేవాడు. అక్కడ ట్రైబ్యునల్ ప్రిసైడింగ్ అధికారిగా నటిస్తూ తన క్లయింట్లకు అనుకూలమైన తీర్పులు ఇచ్చి, ఉత్తర్వులను జారీ చేస్తాడు. వారి నుంచి సొమ్ము వసూలు చేసేవాడు.

గుర్తింపుపై చిగురించిన ఆశలు..

నేడు కృష్ణా విశ్వవిద్యాలయానికి న్యాక్ బృందం

న్యూస్‌టుడే, కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం)



మచిలీపట్నంలో కృష్ణా విశ్వవిద్యాలయం ప్రారంభమై 16 ఏళ్లు అవుతోంది. ఇంతవరకు న్యాక్ గుర్తింపు రాలేదు. పాలన ప్రభుత్వ బోరవతో ప్రస్తుతం అన్ని వసతుల ఆందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ ఆర్ట్స్ అండ్ సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో అత్యాధునిక వసతులతో పాటు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. న్యాక్ గుర్తింపు సాధనలో భాగంగా ఇప్పటికే విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఆవసరమైన కార్యాచరణ చేపట్టింది. బోధనతో పాటు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం ఇలా మొత్తం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మొత్తం ఏడు అంశాలపై నివేదిక అందించింది. బుధవారం నుంచి (23, 24, 25 తేదీలు) ఉత్తరాన వరకు వర్సిటీని న్యాక్ బృందం సభ్యులు సందర్శించనున్నారు. ఆయా అంశాలు పరిశీలించి సంతృప్తి చెందితే గుర్తింపు అందిస్తారు.

ప్రయోజనాలెన్నో..

విశ్వవిద్యాలయాలకు గ్రేడ్ వచ్చేక ఓసారి న్యాక్ గుర్తింపు ఇస్తారు. ఈ హోదా ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ ప్రాజెక్టులు, పరిశోధనలకు నిధులు మంజూరు అవుతాయి. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. గతంలో వర్సిటీకి ఐఎస్‌వో సర్టిఫికేషన్ రాగా.. 2021లో యూజీసీ 12బి గుర్తింపు సాధించింది.

అన్ని ఏర్పాట్లు చేశాం..



న్యాక్ బృందం తొలిసారి విశ్వవిద్యాలయంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ గుర్తింపు సాధనలో భాగంగా ఎప్పటి నుంచో వరుసగా చేశాం. గుర్తింపు ఐదేళ్లపాటు ఆవసరమైన అన్ని వసతులు ప్రస్తుతం వర్సిటీలో ఉన్నాయి. బోధనతో పాటు ఇతర అంశాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నాం. న్యాక్ గుర్తింపు వస్తే విశ్వవిద్యాలయంలో పరిశోధన అవకాశాలు విస్తృతం అవడంతో పాటు వర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా దోహదపడుతుంది. కచ్చితంగా గుర్తింపు సాధిస్తామన్న నమ్మకం ఉంది.

–రాయన శ్రీనివాసరావు, ఉపకులపతి

ఇంకా వెంటాడుతున్న సమస్యలు..

గతంతో పోల్చుకుంటే పలు వసతులు సమకూరినా ఇంకా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిలో ప్రధానమైన సమస్య వసతిగృహాలు లేకపోవడమే. ఈ కారణంగా ఇక్కడ చేరేందుకు దూర ప్రాంతాల విద్యార్థులు వెనుకడుగు వేస్తున్నారు. గతేడాది డిసెంబరు నాటికే భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉన్నా వివిధ కారణాలతో జాప్యం జరిగింది. వీటితో పాటు రూ.6కోట్లతో ఫార్మసీ కళాశాల, రూ.8 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించారు. దీని నిమిత్తం ప్రాంగణంలోనే ఐదు ఎకరాల చొప్పున స్థలం కేటాయించారు. ఫుడ్ కోర్టు నిర్మాణానికి రూ.1.5కోట్లు, క్రీడలతో పాటు ముఖద్వారం నిర్మాణానికి రూ.3.5కోట్లు నిధులతో చేపట్టిన ఈ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇవే కాకుండా ఎయిర్‌పోర్టులో పాటు ఆక్వా పాండ్ తదితరాలు కూడా వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాట్లు చేసేలా వర్గాలు తీసుకున్నారు. ఎంతవరకు ఫలితమిస్తాయో వేచి చూడాల్సి ఉంది.

మద్యం తయారీ కేంద్రాల్లో సీఐడీ తనిఖీలు



ఆటోనగర్‌లోని కాంటినెంటల్ వైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తనిఖీ చేస్తున్న సీఐడీ అధికారులు

ఆటోనగర్, కంచికచర్ల, న్యూస్‌టుడే: విజయవాడ ఆటోనగర్‌లోని కాంటినెంటల్ వైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీపై మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సీఐడీ అధికారులు తనిఖీలు చేయడం ప్రారంభించారు. రాత్రి 10:30 గంటల వరకు కొనసాగాయి. గత ప్రభుత్వంలో ఈ కేంద్రంలో ఎంత మొత్తంలో మద్యం తయారు చేశారు, ఎంత ఎగుమతి చేశారు తదితర అంశాలపై అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. ఈ కేంద్రంలో వివిధ బ్రాండ్ మద్యాన్ని తయారు చేస్తారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో 13 మంది సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో బయటి వ్యక్తులు లోపలికి రాకుండా లోపల వ్యక్తులు బయటకు వెళ్లకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోజుల్లో ఉదయాన్నే కంపెనీ వద్దకు చేరుకున్నట్లు సమాచారం. కంపెనీలో ఉన్న తయారీ రకాలు, దస్త్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక హైదరాబాదుకు చెందిన సి.చంద్రారెడ్డి తదితరులు 2017లో ఇక్కడ మద్యం తయారీ కర్మాగారం ప్రారంభించారు. ప్రస్తుతం రాడికో కంపెనీకి చెందిన పార్టనర్ మద్యం తయారు చేస్తున్నట్లు సమాచారం. గత వైకాపా పాలనలో ఇక్కడి కంపెనీలో తయారైన బ్రాండ్లు ఎక్కువగా అమ్మారని సీఐడీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

సెంట్రీలోనూ..

కంచికచర్ల మండలం గండేపల్లి శివారు సెంట్రీ బయో ప్రొడక్ట్స్ కర్మాగారంలో కూడా సీఐడీ అధికారులు రాత్రి 10 గంటల వరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివరాలు వెల్లడించేందుకు అధికారులు ఇష్టపడటం లేదు. 2019-24 మధ్య కాలంలో మద్యం తయారీ రికార్డులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

శర్వాని కంపెనీలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను పంచాయతీ పరిధిలో 8 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన శర్వాని మద్యం తయారీ కర్మాగారంలో మంగళవారం రాత్రి రాత్రి 10 గంటల వరకు వరకు సీఐడీ అధికారులు తనిఖీ చేస్తున్నారు. సోదాలు పూర్తయ్యేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిసింది. సీఐడీ అదనపు ఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు జరుగుతున్నాయి.

గోదావరి, దావులూరులోనూ..

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: సీఐడీ అధికారులు స్థానిక పోలీసు, ప్రత్యేక అధికారులతో కలిసి గోదావరిలోని బీవీఎస్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, దావులూరులోని బీఆర్‌కే స్పిరిట్స్ సంస్థల్లో సోదాలు నిర్వహించారు. ప్రధానంగా 2019- 24 సంవత్సరాల్లో పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేసినట్లు తెలిసింది. రికార్డు పరిశీలన, గోదాములోని నిల్వ సరకు, తయారీ, నాణ్యత తదితర అంశాలను పరిశీలిస్తున్నారు.

బకాయి బిల్లుల చెల్లింపు ఆనందదాయకం



సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి మూడేళ్ల నుంచి రూ.3 వేల కోట్ల బకాయి ఉండగా... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రూ.748 కోట్లు విడుదల చేసి గుత్తేదారుల్లో ఆనందాన్ని నింపిందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్‌రెడ్డి అన్నారు. గుత్తేదారులకు బకాయి బిల్లులు విడుదల చేసిన నేపథ్యంలో విజయవాడ సిటీ రోడ్డులోని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ కార్యాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అప్పులు తీసుకొచ్చి పనులు చేశామని, బిల్లుల చెల్లింపు జాప్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. మిగిలిన నిధుల కూడా విడతల వారీగా చెల్లించాలని కోరారు. సీఆర్ఐఎఫ్ నిధుల కింద రూ.350 కోట్లు కేటాయించామని, కాబట్టి అదనంగా రూ.150 కోట్లు విడుదల చేయడానికి అంగీకరించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి అభినందనలు తెలియజేశారు. చిన్న గుత్తేదారులు రావాల్సిన పాత బకాయిలు రూ.200 కోట్లు కూడా నిధులు విడుదల చేయాలని కోరారు. జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు గద్దె రామకోటయ్య మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారని తెలిపారు. బీఏఐ రాష్ట్ర ఛైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యే గుత్తేదారులకు ప్రభుత్వం సహకారం అందిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటనాగిరెడ్డి, ఎస్.నాగేశ్వరరావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి పి.శేషగిరిరావు, బి.రామమోహన్, పల్లపోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బుడమేరు గండి పూడ్చడంలో కీలకంగా వ్యవహరించిన జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వల్లభనేని వెంకటేశ్వరరావును అభినందించారు.

అత్యాధునిక వసతులతో సొంతింటి కల సాకారం



జ్యోతి వెలిగించి వారి కొత్తవాన్ని ప్రారంభిస్తున్న శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ఛైర్మన్ గల్లా రామచంద్రరావు

పట్టాభిపురం: అత్యాధునిక వసతులతో ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తున్నామని శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీభ్రమర హౌసింగ్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,000 మందికి పైగా సొంతింటి కల సాకారం చేశామన్నారు. నిర్మాణ రంగంలో కొత్త దనం సృష్టించాలన్న ఆశయంతో 2015లో శ్రీభ్రమర టౌన్‌షిప్స్‌ను ప్రారంభించామని తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులను రూపకల్పన చేసి అభివృద్ధి చేసిన స్థిరాస్తి రంగంలో ప్రత్యేక ముద్ర వేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక సౌకర్యాలతో ప్రాజెక్టులు చేపట్టి నగర జీవనశైలిని పరిచయం చేసేందుకు శ్రీభ్రమర కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రాజు, లక్ష్మీపతిరాజు, శ్రీనాథ్ రెడ్డి, యశ్వంత్ శ్రీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కాళ్ల సతీష్, కమ్మ రవి పాల్గొన్నారు.

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద మంగళవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఉదయం 8 గంటలకు ఎగువ నుంచి 2,05,179 క్యూసెక్కుల మేర వచ్చింది. 20 గేట్లను 5 అడుగులు, మిగతా 50 గేట్లను 4 అడుగులు ఎత్తారు. సముద్రంలోకి 1,96,750 క్యూసెక్కులు, పంట కాల్వలకు 8,429 క్యూసెక్కులు విడుదల చేశారు. క్రమేపీ వరద తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 1,38,718 క్యూసెక్కులు రాగా, 40 గేట్లను 4 అడుగులు, మిగతా 30 గేట్లను 3 అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,69,250 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ నుంచి పులిచింతల (జలాశయం) ద్వారా 1,32,062, మున్నేరు (కీసర) నుంచి 6,271, పాలేరు నుంచి 385 క్యూసెక్కులు మేర వస్తోంది.

కాల్వలకు 9,824 క్యూసెక్కులు

ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు 9,824 క్యూసెక్కులు ఇస్తున్నారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 6,318, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 3,506 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 3105, ఏలూరు కాల్వకు 1204, కేఈబీ కాల్వకు 1104, బందరు కాల్వకు 905 క్యూసెక్కులను విడుదల చేశారు.

బీఎస్సీ నర్సింగ్ సీట్ల భర్తీకి చర్యలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల, రెండేళ్ల కోర్సుల్లో ప్రవేశానికి ఐచ్ఛికాలు పెట్టుకోవాలని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ రోజు (మంగళవారం) రాత్రి 9 గంటల నుంచి 25వ తేదీ రాత్రి 9 గంటల్లోగా ఐచ్ఛికాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 90007-80707, 80082-50842 నెంబర్లలో సంప్రదించవచ్చని విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఎండీఎస్ ప్రత్యేక స్ట్రే కౌన్సెలింగ్‌కు... రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో కౌన్సెలింగ్‌లో భర్తీ కాని పీజీ దంత వైద్యం (ఎండీఎస్) సీట్లకు ఈరోజు రాత్రి 9 గంటల నుంచి బుధవారం (23వ తేదీ) మధ్యాహ్నం 12 గంటల్లోగా ఆప్షన్లు పెట్టుకోవాలని, సీట్ల వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని అధికారులు తెలిపారు.

28, 30 తేదీల్లో ఐటీఐ ఐదో విడత కౌన్సెలింగ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నాలుగో విడత కౌన్సెలింగ్ అనంతరం ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్లకు ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ ఎ.కె.కనకారావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ రాత్రిలోగా 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరూ ఏ కళాశాలకు తమ ఐచ్ఛికాలు పెట్టుకుంటారో అక్కడికి 27వ తేదీ సాయంత్రం 3 గంటల్లోగా వెళ్లి తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ఆ తర్వాత 28వ తేదీన ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ప్రైవేటు ఐటీఐలకు 30న కౌన్సెలింగ్ ఉంటుందని సూచించారు. ఈనెల 28న ప్రభుత్వ, 30న ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ ఉంటుందని, అన్ని పత్రాలతో రావాలని తెలిపారు. ఇతర వివరాలకు 94906-39639, 77804-29468 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఆ భారం కూడా నాపైనే...

నేను ఓ కంపెనీలో పనిచేస్తున్నా. మా మేనేజర్ కొత్త ప్రాజెక్టులోకి నన్ను కూడా తీసుకున్నారు. అయితే, రానురానూ పనిభారమంతా నా మీదనే పడుతోంది. మేనేజర్ పని కూడా నేనే చేస్తున్నా. నేర్చుకునే అవకాశం వచ్చినందుకు ఆనందంగానే ఉన్నా, ఒత్తిడిని తీసుకోలేకపోతున్నా. ఆమెకు ఎలా ఈ విషయాన్ని తెలియజేయాలి?

– ఓ సోదరి

బాధ్యత పెరిగేకొద్దీ ఇలా ఒత్తిడిగా ఫీలవడం సహజమే. అయితే, మీ టీమ్‌లో మీరొక్కరే ఉన్నారా? తెలియాల్సి ఉంది. వేరే ఎవరైనా ఉంటే వారికీ కొంత బాధ్యత అప్పగించొచ్చు. ఆ అవకాశం లేకపోతే మేనేజర్‌తోనే నేరుగా మాట్లాడండి. ఫలానా పనికి మరికొంత సమయం పడుతుందని వివరించండి. అలా డెడ్‌లైన్ పొడిగించుకునే అవకాశం ఉందేమో చూడండి. ఇష్టమైన పని చేయాలంటే, అందులో ఉండే సవాళ్లనూ ఎదుర్కోగలగాలి. మీ పరిస్థితిని ఆమెకు వివరించి పరిష్కారం కోసం అడగండి. అందులో తప్పేమీ లేదు. వీటన్నింటితోపాటు మీరు కూడా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారో లేదో పరిశీలించుకోండి. ప్రతి పనికీ నిర్ణీత షెడ్యూల్‌ను ఏర్పాటు చేసుకుని పూర్తయ్యేలా నియమం పెట్టుకోండి. అలా మీ వైపు నుంచీ అన్ని విధాలా ప్రయత్నించండి. దానికి మీ మేనేజర్ ఇచ్చే సాయమూ తోడైతే... మీకూ ఒత్తిడిగా అనిపించదు.

డియర్... వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్



బెండకాయ నీళ్లతో అందం, ఆరోగ్యం!

విటమిన్లు, ఖనిజలవణాలు, యాంటీఆక్సిడెంట్లు తదితర ఆరోగ్యకరమైన పోషకాలెన్నో బెండకాయ నీళ్లలో పుష్కలంగా ఉన్నాయి. చర్మ ఆరోగ్యాన్ని సంరక్షించే, మెనోపాజ్ తర్వాత వచ్చే ఎముకల బలహీనతను తగ్గించే, హృద్రోగాన్ని దరికిరానివ్వని ఈ నీళ్ల గురించి తెలుసుకుందాం.

ఎ, సి, కె విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం తదితర ఖనిజలవణాలు బెండకాయలో పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలెన్నో పొందొచ్చు. అయితే దీన్ని ఆహారంలో తీసుకోవడానికి ఇష్టపడనివారు ఈ ప్రయోజనాలకు దూరమైనట్లే. అలాకాకుండా ఉండాలంటే ఈ వంటకానికి ప్రత్యామ్నాయంగా కప్పునీటిలో గుప్పెడు బెండకాయ ముక్కలను రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే వడకట్టి ఆ నీటిని తీసుకుంటే చాలు. అందం, ఆరోగ్యం మన సొంతమవుతుందంటున్నారు నిపుణులు.



ఆరోగ్యపరిరక్షణలో...

బెండకాయ ముక్కల నీటిలోని సి విటమిన్, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖంలో వృద్ధాప్యఛాయలను త్వరగా దరికిరానివ్వవు. చర్మాన్ని మృదువుగా, తేమగా ఉంచుతాయి. ఈ నీటిలోని ఫ్లేవనాయిడ్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడతాయి. ఇందులోని పీచు త్వరగా ఆకలి వేయకుండా చేస్తుంది. అలాగే ఎక్కువగా ఆహారాన్ని తీసుకోకుండా పొట్ట నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. ఈ నీళ్ల జీర్ణక్రియ మెరుగ్గా జరిగేలా చేసి మలబద్ధకాన్ని నివారిస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయులు తగ్గించడంలోనూ ఈ నీళ్లు సహాయపడతాయి. దీనివల్ల అధికబరువు సమస్య రాదు. అంతేకాదు, ఇందులోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. దీంతో హృద్రోగ సమస్యలకు గురికారు. ఈ నీటిలోని ఖనిజలవణాలు కండరాల పనితీరును మెరుగుపరుస్తాయి. మెనోపాజ్ తర్వాత వచ్చే ఎముకల బలహీనతను తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే ఇందులోని విటమిన్లు రోగనిరోధక వ్యవస్థను పెంచడంలో సహాయపడతాయి. విటమిన్ సి తరచూ జలుబు, జ్వరం సహా ఇతర ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడేందుకు అవసరమైన రక్షణ కల్పిస్తుంది. దీంతోపాటు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించడంలో సహాయపడుతుంది. క్యాన్సర్‌ను నిరోధించే లక్షణాలూ ఇందులో మెండుగా ఉన్నాయి.

'కళలంటే కాలక్షేపానికి అనుకుంటారు చాలామంది. కానీ, అవి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకునే సాధనాలు' అంటారు వీణ పుప్పాల. 'మల్టీ ఆర్ట్స్' పేరుతో ఆర్ట్ టెక్ కంపెనీ ప్రారంభించి, ప్రపంచవ్యాప్తంగా అనేక మందిని బహుముఖ ప్రజ్ఞావంతులుగా తయారుచేస్తున్నారు. అందుకోసం తన ఐటీ కెరియర్‌నూ వదులుకున్నారు. ఆ ప్రయాణాన్ని మనతో పంచుకున్నారిలా...

చేతిరాత చూసి మీరేంటో చెప్పేస్తా!

ఒకప్పుడు కళలు నేర్చుకోవడమన్నది కోరిక. కానీ, ఇప్పుడది తప్పనిసరి అని భావిస్తాను. రోజులో కనీసం గంట అయినా మొబైల్ చూడకుండా మనతో మనం గడపాలి. అలా చేయాలంటే ఏదో ఒక ఆర్ట్ వచ్చి ఉండాలి. పైగా ఇప్పుడు పిల్లలూ మొబైళ్లకు బాగా అలవాటుపడ్డారు. ఒక గంట ఫోన్ చూడ్డానికీ, ఒక గంట ఏదైనా నేర్చుకోవడానికీ బ్రెయిన్‌లో చాలా తేడా ఉంటుంది. కళలవల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. భావోద్వేగాలు అదుపులో ఉంటాయి. పిల్లలనే కాదు, నన్నడిగితే అన్ని వయసుల వాళ్లూ ఏదో ఒక కళ తప్పక నేర్చుకోవాలంటా. నేనూ అమ్మ ప్రోత్సాహంతో తొమ్మిదో తరగతిలోనే గ్రాఫాలజీ (చేతిరాతను అధ్యయనం చేయడం) నేర్చుకున్నా. ఇప్పుడదే నా వృత్తి అయ్యింది. మాది కదిరి. నాన్న ప్రభుత్వోద్యోగి. అమ్మ గృహిణి. విజయవాడలో బీటెక్ చేశా. మొదట్లో స్టేజి మీద మాట్లాడాలంటే చాలా భయం. ఎప్పుడన్నా మాట్లాడాల్సి వస్తే ఆరోజు కాలేజీ కూడా మానేసేదాన్ని. అలాంటి నాలో గ్రాఫాలజీ ఆత్మవిశ్వాసం పెంచింది. ఇది కూడా ఒక సైకాలజీనే. చేతిరాతను చూసి వారికి కోపం ఎందుకు వస్తుంది? ఇరిటేషన్ స్థాయులు ఎంత ఉన్నాయి? పుడీనా కాదా? వీళ్ల మహిళలను చూసే కోణం ఎలా ఉంటుంది? అమ్మానాన్నల్లో ఎవరికి దగ్గరగా ఉంటారు... ఇలా అన్నీ తెలుసుకోవచ్చు.

చదువుకుంటూనే స్నేహితులతో కలిసి స్కూళ్లు, కాలేజీల్లో ఈ గ్రాఫాలజీ తరగతులు చెప్పేదాన్ని. చివరకు క్యాంపస్ ఇంటర్వ్యూలో కూడా ఈ సబ్జెక్టు గురించే ఎక్కువగా చెప్పాను. ఆ నైపుణ్యాలకు మెచ్చి, టెక్నికల్‌గా యావరేజ్‌గా ఉన్నా కూడా ఓ బహుళజాతి సంస్థలో నాకు ఉద్యోగం ఇచ్చారు.

నిద్రలేని రాత్రుళ్లతో...

చదువు పూర్తయిన వెంటనే పెళ్లి, తరవాత ఏడాదికి బాబు. అయితే, ఏడో నెలలోనే డెలివరీ కావడంతో చాలా సీరియస్ అయ్యింది. మూడు రోజులు స్పృహలో లేను. అదృష్టం కొద్దీ ఇద్దరం బతికి బయటపడ్డాం. అప్పుడు బాబు బరువు కేజీ మాత్రమే. సరిగ్గా నా చేతిలో పట్టేంత. రోజూ డాక్టర్ రావడం, ఈ రోజు పది గ్రాములు పెరిగాడని చెప్పడం... మర్నాడు ఎలా ఉంటుందో అన్న ఆందోళన. ఇలా ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. అయినా అలానే ఐదేళ్లు ఉద్యోగం చేశా. ఆ తరవాత బాబు బాధ్యత అమ్మకు అప్పగించి, 2019లో 'మల్టీ ఆర్ట్స్'ను ప్రారంభించా. సంగీతం, డ్రాయింగ్, బేకింగ్, యోగా, కాలిగ్రఫీ... వంటి 60 రకాల కళల్ని నేర్పిస్తున్నాం. ఆ ఒక్క ఏడాదే ఆఫ్‌లైన్లో పదివేల మందికి తరగతులు చెప్పా. 'ట్రైన్ ది ట్రైనర్' పేరుతో శిక్షకులకూ శిక్షణ ఇస్తున్నాం. పిల్లలకు క్యాంపులూ, వర్క్‌షాపులూ నిర్వహిస్తున్నాం. వ్యాపారం బాగా జరుగుతోంది అన్న సమయంలోనే కొవిడ్ వచ్చింది. దాంతో 2020లో ముగ్గురు టీచర్లు, పన్నెండు మంది విద్యార్థులతో ఆన్‌లైన్ తరగతులకి మారా. అంతా బాగుంది అనుకుంటుండగానే బాబుకి మరో సమస్య. మాటలు రావడం ఆలస్యమైంది. దాంతో ఎక్కువ సమయం బాబుతో గడిపేదాన్ని. మూడు నాలుగు గంటలు మాత్రమే సంస్థ కోసం పనిచేసేదాన్ని. అయితే, స్పీచ్ థెరపీ ద్వారా బాబు ఇప్పుడు చక్కగా మాట్లాడగలుగుతున్నాడు. శ్లోకాలు చెబుతున్నాడు. అలా అన్నింటినీ మేనేజ్ చేసుకుంటూ 100కుపైగా శిక్షకులు, డీపీఐటీ(డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్) సర్టిఫికెట్ తెచ్చుకునే స్థాయికి ఎదిగాం. ప్రపంచవ్యాప్తంగా 5వేలమందికి శిక్షణ ఇచ్చాం. మరో మూడు నెలల్లో పూర్తిగా వెబ్‌సైట్‌లోకి మారబోతున్నాం. మా సంస్థలో తొంభైశాతం మంది మహిళలే. అది కూడా ఇంటి నుంచే పని. బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ ఇలా అన్ని చోట్లా శిక్షకులు ఉన్నారు. వాళ్లు కూడా రకరకాల బాధ్యతలతో బయటకువెళ్లి పనిచేయలేనివాళ్లే. ఇలా మా అందరి కృషి కారణంగా సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), మైటీ వంటి సంస్థల నుంచి రూ.4.8లక్షల ఫండింగ్ కూడా అందుకున్నాం. ఇవి నాకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి. వాటితోపాటు ఈ ఏడాది అందుకున్న 'షి ఇన్‌స్పైర్', 'హాల్ ఆఫ్ ఫేమ్' వంటి అవార్డులూ నాలో ధైర్యాన్ని నింపాయి. మాట్లాడాలంటే కాలేజీ బంక్ కొట్టే స్థాయి నుంచి ఇంపాక్ట్, ఐఫోకస్‌లకు స్పీకర్‌గానూ వెళ్లే స్థాయికి ఎదిగానంటే నేనే నమ్మలేకపోతున్నా. భవిష్యత్తులో మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించాలన్నదే నా లక్ష్యం.



వీణ





మీకు తెలుసా?



ఆమెను వ్యతిరేకించినా...

ప్రపంచంలోనే మొట్టమొదటి మహిళా స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్ హెచ్‌వై మనీ. బ్రిటన్‌లో అత్యంత ఆదరణ ఉన్న క్రీడల్లో ఒకటైన ఫుట్‌బాల్ మ్యాచ్ కవరేజీ కోసం 1971లో మొదటిసారి అక్కడి హై క్రిస్టల్ ప్యాలెస్‌లోకి అడుగుపెట్టారు. దాన్ని తన బాక్స్‌బ్రౌనీ కెమెరాతో ఫొటోలు తీశారు. అయితే, ఆమె రాక అక్కడ చాలామంది మగవాళ్లకు రుచించలేదు. అందుకే, ప్రెస్‌పాస్‌కోసం ఆమె చేస్తున్న ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ 40 మంది మగవాళ్లు సంతకం చేసి అక్కడి మేనేజర్‌కి ఇచ్చారట. అలాగని మనీ వెనుదిరగలేదు. క్రమంగా ఆటగాళ్లు, అభిమానుల మద్దతు కూడగట్టుకుని ఫొటోగ్రాఫర్‌గా స్థిరపడ్డారు. మనీ బ్రిటిష్ పౌరురాలు అయినా... పుట్టిపెరిగింది మాత్రం మన బెంగళూరులోనే. నీలగిరి పర్వత ప్రాంతంలో ఉన్న లారెన్స్ మెమోరియల్ రాయల్ మిలిటరీ స్కూల్‌లో చదివారామె.

టీవీ చూస్తూ చూస్తూ నిద్రపోవడం... చిన్నప్పుడు చాలా సహజ ప్రక్రియ కదూ! పొద్దున మంచమ్మీద లేచాక... ఇదెలా జరిగిందబ్బా అని ఆశ్చర్యపోయేవాళ్లం కూడా. ఇప్పటికీ టీవీ, ఫోన్ చూస్తూనో, ఏదైనా చదువుతూనో, పిల్లల కోసం ఎదురుచూస్తూనో తరచూ కునుకులోకి జారుతుంటాం. ఇంత పెద్దయ్యాక మనల్ని లోపలికి తీసుకెళ్లి పడుకోబెట్టేవాళ్లు ఎవరు ఉంటారు? అందుకే పక్క కుదరకో, ఏదైనా శబ్దానికో చటుక్కున లేస్తాం. ఇంకా సమయం ఉంది కదా అని లోపలికి వెళ్లి పడుకుంటామా... అంత గాఢనిద్ర ఏమవుతుందో తెలియదు. మంచమ్మీదకు చేరాక ఎంత ప్రయత్నించినా రాదు... ఎందుకలా?

అప్పుడు నిద్ర రాదేం?

ఏదైనా పనిలో ఉన్నప్పుడు సహజంగానే మన శరీరం అలర్ట్‌గా ఉంటుంది. అదే సోఫాలో అయితే... చక్కగా జారగిలపడి విశ్రాంతిగా కూర్చుంటాం. దీంతో మెదడు రిలాక్స్ అయ్యి కునుకు పట్టేస్తుంది. టీవీ నుంచి ఒకలాంటి రిథమ్‌లో వచ్చే శబ్దాలు, ఇల్లంతా ప్రశాంతంగా ఉండటం లాంటివీ కొన్నిసార్లు సహకరిస్తాయట. కాస్త వేడిగా ఉండి... చెమట పట్టేయగానే ఫ్యాను వేసుకుని, అలా వెనక్కి వాలి కూర్చుంటే 'అబ్బా ఎంత హాయిగా ఉంది' అనిపించడం ఖాయమే కదూ! ఏదైనా పనిచేసొచ్చి అలా విశ్రాంతి తీసుకున్నా... కాస్త ఒత్తిడి పక్కన పెట్టినా కునుకు సహజంగానే వచ్చేస్తుంది. పైగా అప్రయత్నంగా జరిగిపోతుంది కదా... మనసులో ఎలాంటి ఆలోచనల భారమూ ఉండదు. ఫ్యాను గాలికి చల్లగానూ తోస్తుంది కదా... అందుకే గాఢనిద్ర పట్టేస్తుంది. రాత్రిపూట సరిగా నిద్ర పోకపోయినా ఆ అలసట ఇలా భర్తీ అవుతుంది.

మరి మంచమ్మీద ఇంతకంటే హాయిగా పడుకోవచ్చు కదా! అక్కడికెళ్లాక నిద్ర మాయం అవుతుందేం అంటే... లేచి గదిలోపలకి వెళ్లి, ఫ్యాను వేసుకుని, దుప్పటి కప్పుకొని అనువైన భంగిమ కోసం చూసుకునే సరికి మెదడు అలర్ట్ అయిపోతుంది. మళ్లీ విశ్రాంతి పొందమంటే ఎలా సాధ్యం? పైగా నిద్ర పోవాలి... నిద్ర పోవాలి అని బలవంతంగా ప్రయత్నిస్తామట. అలా తెలియని ఒత్తిడి బారినపడీ నిద్రకు దూరమవుతాం. అందుకే నిద్రకు ముందు మనసును వీలైనంత ప్రశాంతంగా ఉంచుకోండి. గదిలోకి శబ్దాలేవీ రాకుండా... చల్లగా, చీకటిగా ఉండేలా చూసుకోండి. నిద్రను దూరం చేసే ఏ పనులూ చేయొద్దు. అవసరమైతే శవాసనంలో శ్వాస వ్యాయామాలు, ధ్యానం వగైరా చేసినా మంచిదే. ఇక రాత్రుళ్లు టీవీ వేళలను తగ్గించుకోండి. నిర్ణీత సమయాన్ని పెట్టుకుని ఆ వేళల్లోనే నిద్రకు ఉపక్రమించండి. ఇలా చేస్తే... మీ మంచం కూడా హాయిగా నిద్ర పుచ్చగలదు.





బంగారం-వెండి

22న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,300	7,300
వెండి (గ్రా)	110.00	109.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	80,780	80,340	78,000	78,015	80,800	80,450	80,900	80,640	79,350	79,350
ఆర్నమెంట్	73,800	73,800	73,100	73,100	74,820	74,500	74,430	74,200	73,000	73,000
వెండి (కిలో)	101,423	99,399	100,600	100,400	98,000	98,000	99,800	99,000	107,000	100,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.



అప్పలమ్మ

మాటలు... ఫైట్లు... చప్పట్లు!

ఏడు పదుల వయసులో నడవడానికీ ఇబ్బంది పడుతుంటారు. అప్పలమ్మ మాత్రం చిరంజీవి, మహేష్‌బాబు, ప్రభాస్... ఇలా తెలుగు సినిమా హీరోలందరి డైలాగులు చెప్పేస్తుంది. వారిలానే ఫైటింగ్ చేసి విలన్లను చితక్కొట్టేస్తూ.. యూట్యూబ్ స్టార్‌గా గుర్తింపు తెచ్చుకుంది. శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం పెద్ద కర్రివాని పాలెం... అప్పలమ్మ సొంతూరు. వీరిది మత్స్యకార కుటుంబం. కూలి పనులు చేస్తూ, భర్త తెచ్చే చేపలను ఊరూరా తిరిగి అమ్ముకుని జీవనం సాగించేది. వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. అందరికీ పెళ్లిళ్లు చేసేసి, బాధ్యతలు పూర్తయ్యాక.. కొన్నేళ్లుగా వయోభారంతో ఇంటికి పరిమితమయ్యింది. అసలు కథ ఆ తర్వాతే మొదలైంది. మూడేళ్ల క్రితం ఆమె మనవడు శివ... అప్పలమ్మతో సరదాగా వీడియోలు తీసి సోషల్‌మీడియాలో షేర్ చేయగా వాటికి మంచి ఆదరణ వచ్చింది. తర్వాత నుంచి కాస్త పెద్ద వీడియోలు, సినిమా ఫైట్ల అనుకరణ సీన్లు తీయడం మొదలెట్టారు. 'అప్పుబాలు అఫీషియల్' యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి అందులో వీటిని పెడుతున్నారు. శివ దర్శకత్వంలో అప్పలమ్మ, వీరి పక్కింటబ్బాయి బాలు, అవసరం మేరకు ఊళ్లో పిల్లలు, యువకులు నటిస్తారు. అప్పలమ్మ వీడియోలు చూసి.. 'ఇలాగే నటించు ఈ రంగంలో ఎదుగుతావ'ంటూ ఫోన్లు చేసి చెబుతుంటారు కొందరు. 'అవకాశాలు వస్తే సినిమాల్లో నటిస్తా. కానీ నాకంటే నా మనవడికి మంచి అవకాశాలు రావాలని కోరుకుంటున్నా. ఈ వయసులో ఇవన్నీ అవసరమా... నటిస్తుంటే సిగ్గేయదా.. అని నా తోటోళ్లు అడిగితే.. 'సిగ్గు చిన్నప్పుడే పోయింద'ని సరదాగా బదులిస్తా' అని చెప్పే అప్పలమ్మకు నటన హుషారు తెస్తుందట. రోజూ ముఖానికి రంగులు వేసుకోవడం, టీషర్టులూ, షర్టులూ వేసుకోవడం, ఆయుధాలు పట్టుకోవడం.. ఇసుకలో, ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా నడవడమూ అప్పలమ్మకు కష్టమే. కొన్నిసార్లు కాళ్లు, చేతులు నొప్పి పుడతాయి. అయినా, మందులు వేసుకొనైనా నటిస్తుంటుంది. డైలాగుల్లో కొన్ని ఇంగ్లిషు పదాలు వస్తాయి. అవి చెప్పడానికీ ప్రయత్నిస్తుంది. వీరి ఛానల్ ఈమధ్యే లక్ష సబ్‌స్క్రైబర్లను దాటేసింది. 'పిల్లలతో సరదాగా వీడియోలు చేస్తుంటే... తెలియకుండానే రోజు గడిచిపోతుంది. నీవల్లే మన ఊరి పేరు చాలా మందికి తెలిసిందని చాలామంది అంటుంటారు. అలాంటప్పుడు నా కష్టమంతా మర్చిపోతా' అని సంతోషంగా చెబుతుంది అప్పలమ్మ. ఆరోగ్యం సహకరించినన్ని రోజులు నటిస్తూనే ఉంటానంటోన్న ఈ బామ్మ ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదా!

– రాగళ్ల హరీష్, అమరావతి

కుళాయి దగ్గరికొచ్చేసింది!

ఒక చిన్న ఆలోచన జీవితాన్నే మార్చేస్తుంది అంటారు కదా! అలానే ఒక చిన్న వస్తువు వంట చేసే విధానాన్నే మార్చేస్తుంది. అలాంటి వాటిలో ఇవి కొన్ని... చూసేయండి!

మడతపెట్టే కుళాయి...

వంట చేసేటప్పుడు చాలాసార్లు నీళ్లు అవసరం అవుతుంటాయి. అలాంటప్పుడు ప్రతిసారీ సింక్ దగ్గరికి వెళ్తుంటాం. అలాకాకుండా ట్యాపే మన దగ్గరికొస్తే... బావుంటుంది కదా! ఆ ఆలోచనలోంచి వచ్చిందే ఈ 'ఫోల్డింగ్ సింక్ ఫాసెట్'. రెండు మూడు భాగాలుగా ఉండే ఈ పైపును మడతపెట్టేయొచ్చు. కావాలంటే పొడిగించుకోవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్, బ్రాస్ మెటీరియల్‌తో తయారుచేసే ఈ కుళాయిలు అన్ని కోణాల్లోనూ తిరుగుతాయి. త్వరగా తుప్పు కూడా పట్టవు. వంటపని వేగంగా పూర్తి చేసుకోవడానికి అనువుగానూ ఉంటుంది.





ఎలక్ట్రిక్ లైటర్ చూశారా?

సాధారణంగా మనం స్టవ్ వెలిగించడానికి స్టీల్ గ్యాస్ లైటర్‌ను వాడుతుంటాం. కానీ, ఇప్పుడు కొత్తగా ఎలక్ట్రిక్ లైటర్ వచ్చేసింది. ఎల్ఈడీ బ్యాటరీ డిస్‌ప్లేతో పనిచేస్తుంది ఇది. దీన్లో ఉన్న 5 లైట్లు వెలిగితే బ్యాటరీ ఫుల్ ఛార్జ్ అయినట్లు. దీని మెడభాగం ఎటైనా తిప్పగలిగేలా అనువుగా ఉంటుంది. దీన్ని కొవ్వొత్తులు, పటాసులు లాంటివి వెలిగించుకోవడం సహా అనేక విధాలుగా వాడుకోవచ్చు.



స్మార్ట్ కిచెన్

చీజ్‌కీ ఓ బోర్డు...

పిల్లల నుంచి పెద్దల దాకా చీజ్ అంటే ఇష్టపడని వారుండరేమో! అందుకే, దానికోసం ప్రత్యేకించి బోర్డులూ ఉన్నాయి. చీజ్ కోయడం కోసం వాడే ప్రత్యేక చాకులు, అవి పెట్టేందుకూ ఏర్పాట్లు ఉండేలా బోర్డులు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. బిస్కెట్లు, పండ్లు... వంటివన్నీ పెట్టుకుని సరదాగా ఇంట్లోనే ఓ చిన్న స్నాక్ పార్టీలానూ చేసుకోవచ్చు. దీన్ని శుభ్రపరచడమూ తేలికే. పుట్టినరోజులు, పెళ్లిరోజులకు బహుమతిగానూ ఇవ్వొచ్చు.





భారత గడ్డ స్పిన్ పిచ్‌లకు కేంద్రం. పర్యటక జట్లను స్పిన్ ఆయుధంతోనే దెబ్బ కొడుతుంది టీమ్‌ఇండియా. కానీ విదేశీ పర్యటనల్లో రాణించేలా.. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో బోర్డర్-గావస్కర్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని ఇటీవల ఇక్కడ పిచ్‌లనూ పేస్‌కు అనుకూలంగా తీర్చిదిద్దుకుంది టీమ్‌ఇండియా. కానీ న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఈ ప్రయోగం బెడిసికొట్టింది. ఈ నేపథ్యంలో మళ్లీ సంప్రదాయ స్పిన్ పిచ్‌ల వైపే భారత్ మొగ్గుతున్నట్లు సమాచారం. రెండో టెస్టు జరిగే పుణెలో కివీస్‌ను స్పిన్‌తో చుట్టేయడానికి రంగం సిద్ధమవుతోంది.

మలుపు తిరిగిన పిచ్ కథ!


పుణెలో పిచ్‌ను పరిశీలిస్తున్న భారత బృందం

పుణె: భారత పర్యటనకు ఏ జట్టు వచ్చినా టెస్టు మ్యాచ్‌ల్లో స్పిన్ పిచ్‌లే స్వాగతం పలుకుతాయి. సాధారణంగా పరిస్థితులు పేస్‌కు అనుకూలించేలా ఉండే మైదానాల్లో కూడా పిచ్‌లను స్పిన్‌కు సహకరించేలా సిద్ధం చేస్తుంటారు. దీనిపై పర్యటక జట్లు పలు అభ్యంతరాలు వ్యక్తమైనా పట్టించుకోరు. దీన్ని ఎవరైనా తప్పుబట్టినా.. మనం విదేశాలకు వెళ్లినప్పుడు పేస్ పిచ్‌లు ఎదురవుతున్నప్పుడు ఆతిథ్య జట్టు బలానికి తగ్గట్లు స్పిన్ వికెట్లను సిద్ధం చేస్తే తప్పేంటి అనే వాదనతో తిప్పికొడతారు! అయితే ఇటీవల గౌతమ్ గంభీర్ కోచ్ అయ్యాక టీమ్‌ఇండియా దృక్పథం మారింది. విదేశీ పర్యటనల్లో రాణించేలా, అక్కడి పరిస్థితులకు అలవాటు పడేలా భారత్‌లోనూ పేస్‌కు అనుకూలించేలా పిచ్‌లు ఉండాలన్నది గంభీర్ ఉద్దేశం. ఇందుకు అనుగుణంగానే బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల్లోనూ పేస్ పిచ్‌లను సిద్ధం చేశారు. తమకు సవాలు విసిరేలా ఉన్న ఆ పరిస్థితుల్లో భారత ఆటగాళ్లు రాణించారు. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేశారు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులోనూ భారత్ ఇదే వ్యూహాన్ని అనుసరించింది. స్పిన్‌కు పెట్టింది పేరైన చిన్నస్వామి స్టేడియం (బెంగళూరు) పిచ్ పేస్‌కు సహకరించింది. వర్షం పడి పరిస్థితులు మరింతగా పేస్‌కు సహకరించడంతో కివీస్ పేస్‌బౌలర్లు చెలరేగిపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో విజృంభించి టీమ్‌ఇండియాను 46 పరుగులకే ఆలౌట్ చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో పటిష్ఠ స్థితిలో ఉన్న జట్టు ఉన్నట్లుండి కుప్పకూలిపోవడానికి కారణం పేసర్లే. దీంతో టీమ్‌ఇండియా వ్యూహ బృందం పునరాలోచనలో పడ్డట్లు సమాచారం. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ప్రతి మ్యాచ్ కీలకం కాబట్టి సిరీస్‌లో ఇంకా ప్రయోగాలు చేసే స్థితిలో భారత్ లేదు. అందుకే తమ బలమైన స్పిన్‌ను నమ్ముకోవాలని భావిస్తోందట. గురువారం పుణెలో మొదలయ్యే రెండో టెస్టులో పిచ్ ఎప్పట్లాగే స్పిన్‌కు సహకరిస్తుందని సమాచారం. వికెట్ పేస్‌కు సహకరించేలా క్యురేటర్‌కు ప్రత్యేకమైన ఆదేశాలేమీ ఇవ్వలేదని.. కాబట్టి ఇక్కడ బంతి బాగా తిరుగుతుందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ మ్యాచ్‌లో ఇద్దరు పేసర్లే ఆడతారని.. అశ్విన్, జడేజాలకు తోడుగా కుల్‌దీప్ స్పిన్ బాధ్యతలు పంచుకుంటారని సమాచారం. బంతి కొంచెం తిరిగినా భారత స్పిన్ త్రయాన్ని ఎదుర్కోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు సవాలే. ముఖ్యంగా అశ్విన్ అత్యంత ప్రమాదకరంగా మారతాడు. కుల్‌దీప్ సైతం బంతిని బాగా తిప్పగలడు, బౌలింగ్‌లో వైవిధ్యం ఉంటుంది. జడేజా కూడా ఫామ్‌లో ఉన్నాడు. కాబట్టి కివీస్ బ్యాటర్లకు కష్టాలు తప్పకపోవచ్చు. అయితే పుణె వికెట్ మరీ బంతి గింగిరాలు తిరిగే స్థాయిలో ఉండదని.. సంప్రదాయ భారత వికెట్‌లా స్పందిస్తుందని సమాచారం. పరిస్థితులు బ్యాటింగ్‌కు కూడా అనుకూలంగా ఉంటాయని.. తొలి రెండు రోజులు ఉదయం పూట పేసర్లు ప్రభావం చూపుతారని.. క్రమంగా స్పిన్నర్ల ఆధిపత్యం మొదలవుతుందని తెలుస్తోంది.

"మేం సర్దుబాటు చేసుకోవాలి: పుణె పిచ్ స్పిన్నర్లకు అనుకూలించేలా ఉంటుందని తమకు తెలుసని, అందుకు తగ్గట్లు తాము సర్దుబాటు చేసుకోవాలని న్యూజిలాండ్ సీనియర్ ఆల్‌రౌండర్ డరిల్ మిచెల్ తెలిపాడు. "మేం పిచ్‌ను మార్చలేం. పరిస్థితులకు మేమెలా స్పందిస్తాం, సర్దుబాటు చేసుకుంటాం అన్నది ముఖ్యం. 20 వికెట్లు తీయడానికి, పరుగులు చేయడానికి అవసరమైన ప్రణాళికలతో రంగంలోకి దిగాలి. తొలి టెస్టులో గెలవడం గొప్ప అనుభూతి. కానీ మేమెప్పుడూ వర్తమానంలో ఉంటాం. ఇంతకుముందు ఏం జరిగిందన్నది అప్రస్తుతం. రెండో టెస్టును వేరే మ్యాచ్‌లా చూస్తాం" అని మిచెల్ అన్నాడు.

భారత్‌కు గట్టి దెబ్బ

● కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీ, షూటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ ఔట్



లండన్: కామన్వెల్త్ క్రీడల్లో మెరుగైన ఫలితాలను ఆశిస్తున్న భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మనకు పతకావకాశాలు ఎక్కువగా ఉన్న హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, క్రికెట్, షూటింగ్ వంటి క్రీడలను 2026 గ్లాస్గో గేమ్స్ రోస్టర్ నుంచి తప్పించారు. ఖర్చును తగ్గించుకోవడం కోసం పది ఆటల్లో మాత్రమే పోటీలు నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. టేబుల్ టెన్నిస్, స్క్వాష్, ట్రయథ్లాన్‌లు కూడా రోస్టర్‌లో చోటు కోల్పోయాయి. క్రీడలు మొత్తం నాలుగు వేదికల్లో మాత్రమే జరగనున్నాయి. 2022 బర్మింగ్‌హామ్ సీడబ్ల్యూజీలో 19 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. "10 క్రీడల్లో పోటీలుంటాయి. బహుళ క్రీడల భావన కలగాలి, అదే సమయంలో నిర్వహణ వ్యయం అదుపులో ఉండాలన్నది మా ఉద్దేశం. గ్లాస్గో క్రీడల్లో అథ్లెటిక్స్, పారా అథ్లెటిక్స్, స్విమ్మింగ్, పారా స్విమ్మింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, ట్రాక్ సైక్లింగ్, పారా ట్రాక్ సైక్లింగ్, నెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్, పారా పవర్‌లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో, బౌల్స్ పారా బౌల్స్, 3×3 బాస్కెట్‌బాల్, 3×3 వీల్‌చైర్ బాస్కెట్‌బాల్‌లో పోటీలు ఉంటాయి" అని కామన్వెల్త్ క్రీడల సమాఖ్య ఓ ప్రకటనలో తెలిపింది. "నాలుగు వేదికలు.. స్కాట్‌స్టాన్ స్టేడియం, టాల్‌క్రాస్ ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ సెంటర్, ఎమిరేట్స్ ఎరీనా, స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో క్రీడలకు ఆతిథ్యమిస్తాయి" అని పేర్కొంది. 2026 కామన్వెల్త్ క్రీడలు (సీడబ్ల్యూజీ) జులై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరుగుతాయి.

ఎన్నో పతకాలు

ఈ మార్పు భారత్‌కు శరాఘాతమే. భారత్ ఈ క్రీడల్లో గతంలో సాధించిన పతకాల్లో చాలా వరకు ఈసారి తప్పించిన ఈవెంట్ల నుంచి వచ్చినవే. బ్యాడ్మింటన్‌లో 10 స్వర్ణాలు సహా 31 పతకాలు గెలిచింది. పురుషులు, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్‌లో భారత్.. గ్లాస్గోలో డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా దిగాల్సింది. ఇక రెజ్లింగ్‌లో ఇప్పటి వరకు 49 స్వర్ణాలు సహా ఏకంగా 114 పతకాలు సొంతం చేసుకుంది. షూటింగ్‌లో ఇంకా అదరగొట్టింది. 63 స్వర్ణాలు సహా 135 పతకాలు కొల్లగొట్టింది. అయితే కిందటిసారి తప్పించిన షూటింగ్ ఈసారి ఉంటుందని ఎవరూ అనుకోలేదు. షూటింగ్ వేదిక గ్లాస్గోకు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. మరోవైపు ఆర్చరీ విస్మరణకు గురవుతూనే ఉంది. ఈ క్రీడకు చివరిసారి 2010 క్రీడల్లో అవకాశం దక్కింది. నిర్వహణ వ్యయం తగ్గించుకోవడం కోసమే ఆటలను, వేదికలను తగ్గించినట్లు నిర్వాహకులు చెప్పారు. అయితే హాకీని తప్పించడానికి మాత్రం.. సీడబ్ల్యూజీ ముగిశాక రెండు వారాల్లోనే ప్రపంచకప్ (2026 ఆగస్టు 15-30) ఉండడం కూడా ఓ కారణమే. సీడబ్ల్యూజీ హాకీలో ఇప్పటివరకు భారత పురుషుల జట్టు మూడు రజతాలు, రెండు కాంస్యాలు.. మహిళల జట్టు ఓ స్వర్ణం సహా మూడు పతకాలు గెలిచాయి. వాస్తవంగా ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం 2026 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యమివ్వాల్సింది. కానీ నిర్వహణ వ్యయం పెరగడంతో తాము బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు నిరుడు ప్రకటించింది. దీంతో గ్లాస్గో ముందుకొచ్చింది.

భారత క్రీడావర్గాల ఆశ్చర్యం

దిల్లీ: భారత్‌కు పతక అవకాశాలు ఎక్కువగా ఉన్న క్రీడలను 2026 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల నుంచి తొలగించడంపై అగ్రశ్రేణి క్రీడాకారులు, క్రీడాపాలకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ''ఇది దిగ్భ్రాంతికర వార్త. చాలా నిరాశగా ఉంది. కానీ మన చేతుల్లో ఏమీ లేదు" అని భారత హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. "దురదృష్టవశాత్తు గ్లాస్గో క్రీడల్లో టీటీ లేదు. చోటు కోల్పోయిన అన్ని క్రీడలకూ ఇది దెబ్బే. ముఖ్యంగా టేబుల్ టెన్నిస్‌కు ఇది పెద్ద దెబ్బ. మేం గతంలో స్వర్ణాలు గెలిచాం" అని భారత టీటీ స్టార్ శరత్ కమల్ అన్నాడు. స్క్వాష్‌ను తప్పించడం పట్ల దీపిక పల్లికల్ నిరాశ వ్యక్తం చేసింది. 2022 బర్మింగ్‌హామ్ క్రీడలకు భారత్ 210 మంది అథ్లెట్లను పంపగా.. 61 పతకాలు వచ్చాయి. అందులో 30 పతకాలను అందించిన ఈవెంట్లు గ్లాస్గో క్రీడల్లో లేవు. భారత హాకీ సమాఖ్య కార్యదర్శి బోళానాథ్, డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్, బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి సంజయ్ మిశ్రా కూడా ఆటలను తప్పించడంపై నిరాశ వ్యక్తం చేశారు.

పురోగతిని అడ్డుకోవడానికే..


గోపీచంద్

కామన్వెల్త్ క్రీడల నుంచి బ్యాడ్మింటన్ వంటి క్రీడలను తప్పించాలన్న నిర్ణయాన్ని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్, విమల్ కుమార్ తప్పుపట్టారు. క్రీడల్లో భారత దేశ ప్రగతిని అడ్డుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లనిపిస్తోందని గోపీచంద్ అన్నాడు. "కామన్వెల్త్ క్రీడల నుంచి బ్యాడ్మింటన్‌ను తప్పించడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది. భారత్ లాంటి దేశాల పురోగతిని అడ్డుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని అనిపిస్తోంది" అని చెప్పాడు. మన క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటారని అన్నాడు. బ్యాడింటన్‌ను తప్పించడంపై భారత్ గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేసిందని గోపీచంద్ అభిప్రాయపడ్డాడు. సీబ్ల్యూజీకి భారత్.. జట్టును పంపొద్దని విమల్ చెప్పాడు. "కామన్వెల్త్ క్రీడల అవసరమే లేదు. సీడబ్ల్యూజీ కన్నా ఒలింపిక్స్, ఆసియా గేమ్స్ నిర్వహిస్తే మంచిది. భారత్‌కు మంచి అవకాశాలున్న క్రీడలను సీడబ్ల్యూజీ నుంచి తొలగించడం ఘోరం. చాలా నిరాశగా ఉంది. సీడబ్ల్యూజీ ఆకర్షణ కోల్పోతోంది. ఈ నేపథ్యంలో కామన్వెల్త్ క్రీడలకు మన జట్టును పంపకూడదన్నది నా ఉద్దేశం. పంపాల్సిన అవసరమే లేదు. సీడబ్ల్యూజీలో ఫిజికల్ స్పోర్ట్స్ ఉండాలి. వాటిని తీసేస్తే క్రీడలకు అర్థమే లేదు" అని విమల్ అన్నాడు.

వీరెన్ శతకం


కైల్ వెరీన్

దక్షిణాఫ్రికాకు భారీ ఆధిక్యం

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో దక్షిణాఫ్రికా విజయంపై కన్నేసింది. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కైల్ వెరీన్ (114; 144 బంతుల్లో 8×4, 2×6) సెంచరీ సాధించడంతో తొలి ఇన్నింగ్స్‌లో సఫారీ జట్టు 202 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 140/6తో రెండో రోజు, మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 308 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు వెరీన్, ముల్డర్ (54) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. ఈ జోడీ ఏడో వికెట్‌కు 119 పరుగులు జత చేయడంతో దక్షిణాఫ్రికా మెరుగైన స్థితిలో నిలిచింది. ముల్డర్ వెనుదిరిగినా.. డేన్ పీట్ (32) తోడుగా వెరీన్ స్కోరును 300 దాటించాడు. ఈ క్రమంలోనే శతకం అందుకున్న అతడు.. ఆఖరి వికెట్ రూపంలో నిష్క్రమించాడు. బంగ్లాదేశ్‌కు రెండో ఇన్నింగ్స్‌లోనూ శుభారంభం దక్కలేదు. రబాడ (2/10) విజృంభించడంతో ఆ జట్టు ఒక దశలో 4 పరుగులకే 2 వికెట్లు చేజార్చుకుంది. ఈ స్థితిలో హసన్ జాయ్ (38 బ్యాటింగ్), కెప్టెన్ నజ్ముల్ శాంటో (23) కాసేపు నిలిచారు. శాంటో వెనుదిరిగినా.. హసన్-ముష్ఫికర్ రహీమ్ (31 బ్యాటింగ్) జంట మరో వికెట్ పడనీయలేదు. ఆట చివరికి బంగ్లా 101/3తో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 106కే కుప్పకూలిన సంగతి తెలిసిందే.


రాహుల్ × సర్ఫరాజ్


రాహుల్

● దాచడానికేమీ లేదన్న టీమ్‌ఇండియా సహాయ కోచ్

పుణె: న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో తుది జట్టులో స్థానం కోసం సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, యువ ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్‌ల మధ్య గట్టి పోటీ నెలకొన్న విషయం వాస్తవమేనని, అందులో దాచడానికి ఏమీ లేదని టీమ్‌ఇండియా సహాయ కోచ్ టెన్ డస్కాటె తెలిపాడు. "అవును. జట్టులో స్థానం కోసం పోటీ నెలకొంది. దాన్ని దాచిపెట్టాల్సిన అవసరం లేదు. గత మ్యాచ్‌లో సర్ఫరాజ్ అద్భుత ప్రదర్శన చేశాడు. రాహుల్ విషయంలో మాకు ఆందోళనేమీ లేదు. అతను చక్కగా బ్యాటింగ్ చేస్తున్నాడు. తన మానసిక స్థితి కూడా బాగుంది. కానీ తర్వాతి మ్యాచ్‌కు ఉన్న ఆరు బ్యాటింగ్ స్థానాల్లో ఏడుగురి నుంచి ఎలా సర్దుబాటు చేయాలో చూడాలి. జట్టుకు ఉపకరించే నిర్ణయం తీసుకోవాలి" అని డస్కాటె అన్నాడు. మెడ నొప్పి కారణంగా న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకు శుభ్‌మన్ గిల్ దూరం కావడంతో జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్.. రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగుల మేటి ఇన్నింగ్స్ ఆడాడు. కానీ రాహుల్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ (0, 12) విఫలమయ్యాడు. ఆ మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలవడంతో రాహుల్ మీద తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రెండో టెస్టుకు గిల్ అందుబాటులోకి వస్తే రాహుల్‌పై వేటు వేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

విలియమ్సన్ రెండో టెస్టుకూ దూరం


విలియమ్సన్

పుణె: న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ భారత్‌తో రెండో టెస్టుకూ దూరమయ్యాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్ సందర్భంగా గజ్జల్లో గాయం కావడంతో కేన్.. భారత్‌తో తొలి టెస్టులో ఆడని సంగతి తెలిసిందే. గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో పుణెలో గురువారం మొదలయ్యే రెండో టెస్టుకూ అతను అందుబాటులో లేకుండా పోయాడు. నవంబరు 1న ముంబయిలో ఆరంభమయ్యే మూడో టెస్టు సమయానికి విలియమ్సన్ కోలుకుంటాడని భావిస్తున్నారు. బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో కివీస్ 8 వికెట్ల తేడాతో నెగ్గిన సంగతి తెలిసిందే.

ఫిట్‌నెస్ లేని పృథ్వీపై వేటు


పృథ్వీ షా

ముంబయి: టాప్ ఆర్డర్ బ్యాటర్ పృథ్వీ షాకు ముంబయి రంజీ జట్టులో చోటు దక్కలేదు. ఫిట్‌నెస్, క్రమశిక్షణ ఉల్లంఘన కారణాలతో పృథ్వీని జట్టుకు ఎంపిక చేయలేదు. ఈ నెల 26 నుంచి 29 వరకు త్రిపురతో జరిగే రంజీ ట్రోఫీ మ్యాచ్ కోసం మంగళవారం ముంబయి జట్టును ప్రకటించారు. కెప్టెన్ అజింక్య రహానె, శ్రేయస్ అయ్యర్, శార్దూల్ ఠాకూర్ సహా 16 మంది జట్టుకు ఎంపికయ్యారు. భారత్ తరఫున 5 టెస్టులు, 6 వన్డేలు, ఒక టీ20 ఆడిన పృథ్వీ.. ఈ సీజన్‌లో రాణించలేకపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో వరుసగా 7, 12, 1, 39 (నాటౌట్) పరుగులే చేశాడు. 24 ఏళ్ల పృథ్వీ ప్రాక్టీస్ సెషన్లకు అప్పుడప్పుడు డుమ్మా కొడుతుండటం, అధిక బరువు ఉన్నాడన్న కారణాలతో జట్టు నుంచి తప్పించినట్లు తెలుస్తోంది. "పృథ్వీ మైదానంలో ఉన్నప్పుడు అతని ఫిట్‌నెస్, పరుగును గమనిస్తే అతడి పరిస్థితి అర్థమవుతుంది. ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ)కు గొప్ప చరిత్ర ఉంది. ఏ ఒక్క ఆటగాడికి మినహాయింపులు ఉండకూడదు' ఎంసీఏ అధికారి తెలిపాడు.

నా అవసరం ఉందంటే వస్తా


డేవిడ్ వార్నర్

సిడ్నీ: ఆస్ట్రేలియా సరైన ఓపెనర్ లేని లోటుని ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారత్‌తో సిరీస్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ చెప్పాడు. తన అవసరం ఉందని జట్టు భావిస్తే రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకుంటానని తెలిపాడు. స్టార్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ గాయంతో దూరం కావడం.. ప్రస్తుత ఓపెనర్ స్టీవ్ స్మిత్ పెద్దగా రాణించకపోవడంతో ఆసీస్ ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వార్నర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "సెలక్షన్‌కు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటా. ఎప్పుడు ఫోన్ రింగ్ అవుతుందా అని ఎదురు చూస్తున్నా. ఫిబ్రవరి తర్వాత ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఒక్క టెస్టే ఆడారు. వాళ్లు ఎంత సన్నద్ధతతో ఉన్నారో నేనూ అంతే ఉన్నా" అని వార్నర్ తెలిపాడు. భారత్-ఆసీస్ మధ్య అయిదు టెస్టుల సిరీస్ నవంబర్ 22న ఆరంభం కాబోతుండడంతో షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో ఆడి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాలని కంగారూ ప్లేయర్లు భావిస్తున్నారు. అవకాశం వస్తే రిటైర్‌మెంట్ వెనక్కి తీసుకుని తాను కూడా ఈ టోర్నీలో బరిలో దిగాలని వార్నర్ చూస్తున్నాడు. "భారత్‌తో సిరీస్‌లో నా అవసరం ఉందని జట్టు భావిస్తే ప్రాక్టీస్ కోసం షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో బరిలో దిగుతా. కెరీర్‌ను ఘనంగా ముగించాలని కోరుకుంటున్నా" అని 37 ఏళ్ల వార్నర్ తెలిపాడు. 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత వార్నర్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ ఏడాది జనవరిలో పాకిస్థాన్‌పై ఆఖరి టెస్టు ఆడాడు.

అప్పుడు బ్రిజ్‌భూషణ్ అలా..

లైంగిక వేధింపులపై ఆత్మకథలో వివరించిన సాక్షి


సాక్షి మలిక్

దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ తనను లైంగికంగా వేధించాడని రియో ఒలింపిక్ పతక విజేత సాక్షి మలిక్ ఆరోపించింది. 2012లో కజకిస్థాన్‌లో జరిగిన ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తన ఆత్మకథ 'విట్‌నెస్' పుస్తకంలో సాక్షి పేర్కొంది. తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడించే నెపంతో బ్రిజ్‌భూషణ్ హోటల్ గదిలోకి తనను పిలిచినట్లు సాక్షి ఆరోపించింది. "తల్లిదండ్రులకు ఫోన్ కలిపినప్పుడు బ్రిజ్‌భూషణ్ ప్రమాదకరంగా కనిపించలేదు. మ్యాచ్, పతకం గురించి వాళ్లతో మాట్లాడుతున్నప్పుడు అవాంఛనీయ ఘటన జరగలేదు. కానీ ఫోన్ పెట్టేయగానే వేధించడానికి ప్రయత్నించాడు. అప్పుడు అతని మంచం మీదే కూర్చున్నా. అతడిని తోసేసి ఏడవటం మొదలుపెట్టా. వెంటనే బ్రిజ్‌భూషణ్ వెనక్కి తగ్గాడు. అతను కోరుకున్నట్లుగా నేను చేయనని అర్థమైనట్లుంది. తండ్రిలా భావించి నా చుట్టూ చేతులు వేసినట్లు చెప్పాడు. కానీ ఆ ప్రవర్తన అలాంటిది కాదని నాకు తెలుసు. ఏడుస్తూనే నా గదికి పరుగెత్తుకుంటూ వెళ్లిపోయా" అని సాక్షి పేర్కొంది.

జర్మనీతో భారత్ ఢీ

● రెండు టెస్టుల హాకీ సిరీస్

మధ్యాహ్నం 3 నుంచి



ఫుల్టన్, హర్మన్‌ప్రీత్

దిల్లీ: భారత హాకీ జట్టుకు సవాల్! రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా బుధవారం జర్మనీని ఢీకొనబోతోంది. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్లో జర్మనీ చేతిలో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని హర్మన్‌ప్రీత్ సేన పట్టుదలగా ఉంది. ఈ సిరీస్‌కు దిల్లీ వేదికగా నిలవనుంది. దిల్లీలో దశాబ్దం తర్వాత అంతర్జాతీయ హాకీ మ్యాచ్ జరగబోతుండడం విశేషం. పారిస్ ఒలింపిక్స్‌లో కంచు నెగ్గిన తర్వాత ఈ సెప్టెంబర్‌లో ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ టైటిల్ కైవసం చేసుకుంది. జర్మనీతో సిరీస్‌లో సీనియర్లు, జూనియర్లతో మేళవించిన జట్టును బరిలో దింపుతోంది. యువ క్రీడాకారులు రాజేందర్‌సింగ్, ఆదిత్య అర్జున్‌లకు కూడా అవకాశం దక్కింది. పారిస్ ఒలింపిక్స్ సెమీస్‌లో భారత్ 2-3తో జర్మనీ చేతిలో ఓడింది. కానీ ఇటీవల ఆసియా ఛాంపియన్స్ టైటిల్ గెలిచిన ఉత్సాహంతో ఉన్న హర్మన్‌ప్రీత్ బృందం.. ప్రపంచ ఛాంపియన్ జర్మనీని ఎలా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం. ఈ జట్టుతో గత అయిదు మ్యాచ్‌ల్లో భారత్ మూడింట్లో గెలిచింది.

ప్రపంచకప్, ఒలింపిక్స్ లక్ష్యంగా కొత్త జట్టు

దిల్లీ: 2026 ప్రపంచకప్, 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ లక్ష్యంగా కొత్త ఆటగాళ్ల బృందాన్ని రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు భారత హాకీ జట్టు కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ అన్నాడు. బుధవారం జర్మనీతో ప్రారంభమయ్యే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కొత్త జట్టు తయారీలో భాగమేనని తెలిపాడు. "ఇప్పట్నుంచే ప్రపంచకప్, ఒలింపిక్స్ లక్ష్యంగా చూడాలి. రెండు టోర్నీల కోసం కొత్త బృందాన్ని ఎంపిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. వ్యవస్థ ఎప్పుడూ ఆ కోణంలోనే పనిచేస్తుంది. అందుకే కుర్రాళ్లకు అవకాశాలు ఇస్తున్నాం. టెస్టు మ్యాచ్‌లు ఆడటం ఎల్లప్పుడూ కీలకం. మనం ఎక్కడున్నామో తెలుసుకునే పరీక్ష అది. జట్టుకు మంచిది కూడా. రాజిందర్ సింగ్, ఆదిత్య అరుణ్‌లు అరంగేట్రం చేయనున్నారు. వరుణ్‌కుమార్, మన్‌దీప్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్ పునరాగమనం చేస్తున్నారు. ఆటగాళ్లను పరీక్షించడానికి ప్రపంచ రెండో ర్యాంకర్‌తో పోరు మంచి అవకాశం" అని ఫుల్టన్ వివరించాడు.

టైటాన్స్‌కు రెండో ఓటమి


తెలుగు టైటాన్స్, జైపూర్ మ్యాచ్‌లో హోరాహోరీ

ఈనాడు, హైదరాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. మంగళవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 22-52తో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో చిత్తయింది. అర్జున్ దేశ్‌వాల్ విజృంభించడంతో ఆరంభం నుంచి జైపూర్ పైచేయి సాధించింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి 18-13తో నిలిచింది. విరామం తర్వాత టైటాన్స్ కాస్త పుంజుకుంది. కానీ కీలక సమయంలో టైటాన్స్‌ను ఆలౌట్ చేసిన జైపూర్ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. అదే జోరుతో విజయాన్ని సొంతం చేసుకుంది. అర్జున్ దేశ్‌వాల్ (19) విజయంలో కీలకపాత్ర పోషించాడు. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ (7), ఆశిష్ నర్వాల్ (5) మాత్రమే రాణించారు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 57-36తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. విరామ సమయానికి 33-15తో ఆధిక్యంలో నిలిచిన యూపీ.. బ్రేక్ తర్వాతా జోరు కొనసాగించింది. బెంగళూరు కూడా కాస్త పుంజుకున్నా యూపీ మాత్రం పట్టు వదల్లేదు. కెప్టెన్ సురేందర్ గిల్ (17), భరత్ (14) యూపీ విజయంలో కీలకమయ్యారు.

ప్రొ కబడ్డీలో ఈనాడు

తమిళ్ తలైవాస్ × పుణెరి పల్టాన్, రా.8 నుంచి

గుజరాత్ జెయింట్స్ × యు ముంబా, రా.9 నుంచి

'హండ్రెడ్' జట్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీల బిడ్

దిల్లీ: ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్వహిస్తున్న 'ది హండ్రెడ్' టీ20 లీగ్ జట్లలో భాగస్వామ్యం కోసం అయిదు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయి. ఎనిమిది జట్ల లీగ్‌లో ఒక్కోదాంట్లో 49 శాతం వాటా అమ్మేందుకు ఈసీబీ బిడ్డర్లను ఆహ్వానించింది. హండ్రెడ్ జట్లలో వాటా కోసం ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బిడ్‌లు సమర్పించినట్లు లీగ్ వర్గాలు తెలిపాయి. ఇటీవలే హాంప్‌షైర్ జట్టు యజమానిగా మారిన జీఎంఆర్ గ్రూపు, మాంచెస్టర్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ భాగస్వామి అవ్రమ్ గ్లేజర్ కూడా బిడ్‌లు దాఖలు చేశాయి. 2025 ప్రారంభంలో కొత్త భాగస్వాములను ఈసీబీ ఎంపిక చేయనుంది.

రౌడీలను గుర్తించే సాంకేతికత ఉందా?

- రహదారుల్లో గుంతలు, కాలువల్లో పూడికనూ డ్రోన్‌తో లెక్కించగలమా?
- ఇలాంటి వినూత్న ఆలోచనలకు ప్రభుత్వ రాయితీలు
- డ్రోన్ టెక్నాలజీ తయారీదారులతో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి



పున్నమి ఘాట్‌లో డ్రోన్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



ఆకాశంలో త్రివర్ణమై మెరిసిన లోహ విహంగాలు

- జనసమూహంలో కలిసిపోయి అరాచకాలు సృష్టించేందుకు ప్రయత్నించే రౌడీషీటర్లను గుర్తించే డ్రోన్ సాంకేతికత ఉందా?
- డంపింగ్ యార్డులు, చెత్తకుండీల్లో ఎంత వ్యర్థాలున్నాయో డ్రోన్‌తో అంచనా వేయగలమా?
- రోడ్ల మీద గుంతల లోతును, పంట కాలువల్లో పూడికను డ్రోన్‌తో లెక్కగట్టగలమా?

అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు వచ్చిన డ్రోన్ తయారీదారు సంస్థల ప్రతినిధులకు చంద్రబాబు వేసిన ప్రశ్నలివి. అలాంటి సాంకేతికతలు ఇప్పుడు అత్యవసరమని, ఆ దిశగా వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగంపై చేసే వినూత్న ఆలోచనలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మార్కెటింగ్ కల్పించడంతోపాటు రాయితీలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పంటలకు డ్రోన్ల ద్వారా ఎరువుల వినియోగంతోపాటు ఇంకా వినూత్నంగా ఏం చేయొచ్చో ఆలోచించాలని నిర్వాహకులకు సూచించారు. ఖర్చు తగ్గింపుతోపాటు ప్రభావవంతంగా పని చేసేలా చూడాలన్నారు. భూమిలో సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించే సాంకేతికతను రూపొందించాలని సూచించారు. సాధారణ రైతులు కూడా ఉపయోగించి, అధిక ప్రయోజనాలు పొందే విధంగా ప్రయోగాలు ఉండాలని సీఎం నిర్దేశించారు. అమరావతి డ్రోన్ సమ్మిట్-2024లో భాగంగా ఏర్పాటు చేసిన డ్రోన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన చంద్రబాబు స్టాళ్లను సందర్శించి నిపుణులతో ముఖాముఖీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేసేందుకు డ్రోన్ సాంకేతికత అనుసంధానం గురించి వారితో చర్చించారు.

డ్రోన్ సమాచార విశ్లేషణకు భవిష్యత్తు

పట్టణాల్లో భవన నిర్మాణ ప్రాంతాలకు డ్రోన్లు పంపడంతోపాటు సేకరించిన సమాచారాన్ని విశ్లేషించే విధానానికి భవిష్యత్తు ఉందని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మైనింగ్, ఇసుక తవ్వకాలు, గనుల్లో ఖనిజాల లభ్యత వంటి గణాంకాల సహితంగా తెలిపే డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి తేవాలన్నారు. పంట కాలువల్లో ఎంతమేర పూడిక తొలగించారో కూడా డ్రోన్ల ద్వారా తెలుసుకునే వ్యవస్థ అత్యావశ్యకమని అభిప్రాయపడ్డారు. ఓర్వకల్లులో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలో డ్రోన్ల తయారీకి ముందుకు రావాలని పలు సంస్థలకు సీఎం సూచించారు.

- గుంపులుగా చేరిన జనాలను డ్రోన్ల ద్వారా చిత్రీకరించడంతోపాటు ప్రజలతో కలిసి ఉన్న రౌడీలను గుర్తించడం కూడా అంతే అవసరమన్నారు. అలాంటి టెక్నాలజీ ఉంటే వినియోగించుకోవడంతోపాటు ప్రమోట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు.
- పంటల్లో తెగుళ్ల గుర్తింపు, వాటి నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే ఇంటిగ్రేటెడ్ డ్రోన్ టెక్నాలజీని రాష్ట్రంలో వినియోగించుకునేలా చూస్తామన్నారు.
- రహదారుల్లో గుంతలు, వాటి పరిమాణం కూడా గుర్తించే డ్రోన్ టెక్నాలజీ రూపొందిస్తే పనులకు సులువుగా అంచనాలు వేయొచ్చని సీఎం అభిప్రాయపడ్డారు.
- గుంటూరు జిల్లాలో కృష్ణా నది మధ్యలో కొల్లిపర మండలంలో ఉన్న ఇళ్లకు డ్రోన్ల ద్వారా ఇటీవల ఔషధాలు పంపిణీ చేసిన విషయం ప్రస్తావనకు వచ్చింది.
- కాలువల్లో గుర్రపుడెక్కను తొలగించేందుకు రూపొందించిన టెక్నాలజీని రాష్ట్రంలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. చెరువులు, మురుగుకాలువల్లో దోమలు, వాటి లార్వాలను గుర్తించే డ్రోన్ సాంకేతికతను ఉపయోగించుకోవాలన్నారు.

భవిష్యత్తును మార్చబోతున్న డ్రోన్లు

'రాబోయే రోజుల్లో విప్లవాత్మక మార్పులు చూడబోతున్నాం. 25 ఏళ్ల క్రితం నేను ఐటీని ప్రమోట్ చేసినపుడు చాలా మందికి అర్థం కాలేదు. దాన్ని ఉపయోగించుకున్నవారు వృత్తిపరంగా, ఆర్థికంగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. భవిష్యత్తు అభివృద్ధికి డేటా ఇంధనంగా ఉపయోగపడుతుంది. డ్రోన్ ద్వారా ఆసుపత్రులకు మందుల పంపిణీ నుంచి భూ సర్వే, ఎరువులు, విత్తనాలు వేసే వరకు ఉపయోగిస్తున్నాం. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలు పొందగలుగుతున్నాం. భవిష్యత్తును డ్రోన్లు మార్చబోతున్నాయి. నాలెడ్జ్ ఎకానమీపై భవిష్యత్తు ముడిపడి ఉంది. వీటిని అనుసంధానించుకోగలిగితే ప్రపంచానికే భారత్ నాలెడ్జ్ హబ్‌గా తయారవుతుంది'

– ఎగ్జిబిషన్‌లో స్టాళ్ల పరిశీలన అనంతరం మీడియాతో సీఎం చంద్రబాబు

డ్రోన్లతో ఫుట్‌బాల్ ఆడొచ్చు!





ఫుట్‌బాల్ ఆడే బుల్లి.. సమ్మిట్‌లో ఆకట్టుకుంది. దీని సాంకేతికతను కొరియా అభివృద్ధి చేసింది. కొరియాలో వాటికోసం ప్రత్యేక స్టేడియాలూ తీర్చిదిద్దారు. క్రీడాకారులు రిమోట్లు పట్టుకొని కోర్టు బయట ఉంటే.. వారి డ్రోన్లు లక్ష్యాన్ని గోల్ పోస్టులోకి నెడుతూ వెళ్తుంటాయి. అధునాతన సెన్సర్లు, అల్గారిథమ్‌లతో కూడిన డ్రోన్‌లు ఫీల్డ్‌ను నావిగేట్ చేస్తాయి.

వరదల్లో డ్రోన్ సేవలు ఏపీ నుంచే ప్రారంభం

- ప్రజాభద్రతలోనూ సమర్థ వినియోగం
- 'విపత్తు నిర్వహణకు డ్రోన్లు'పై చర్చలో వక్తలు


ఈనాడు, అమరావతి: విజయవాడ వరదల సమయంలో డ్రోన్ సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థంగా వినియోగించుకుందని, ఇది అన్ని రాష్ట్రాలకూ ఆదర్శమని వక్తలు కొనియాడారు. హెలికాప్టర్లు, పడవల ద్వారా వెళ్లలేని మారుమూల ప్రాంతానికీ డ్రోన్ ద్వారా ఆహారం, తాగునీరు, మందులు సరఫరా చేశారని పేర్కొన్నారు. డ్రోన్ సమిట్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం 'మెరుగైన ప్రజాభద్రత, సమర్థంగా విపత్తు నిర్వహణకు డ్రోన్లు' అనే అంశంపై నిర్వహించిన చర్చలో పలువురు నిపుణులు పాల్గొన్నారు. విజయవాడలో వరదలు వచ్చినప్పుడు డ్రోన్ల ద్వారా సేవలందించామని మారుత్ డ్రోన్స్ సీఈఓ ప్రేమ్‌కుమార్ వివరించారు. విపత్తు సమయాల్లో డ్రోన్‌లను విస్తృతంగా ఉపయోగించడం ఆంధ్రప్రదేశ్ నుంచే మొదలైందని పేర్కొన్నారు. విపత్తులు వచ్చినప్పుడు మొబైల్ సిగ్నల్ లేని ప్రాంతాల్లోనూ డ్రోన్ ద్వారా సేవలు అందించే వీలుంటుందని సమన్వయకర్తగా వ్యవహరించిన సుధీర్ వర్మ వివరించారు. వరదల సమయంలో మునిగిన పొలాల ఫొటోలు తీసి.. వాటి ఆధారంగా పరిహారం అంచనా వేయడంలో డ్రోన్లు ఉపయోగపడుతున్నాయని మనోజ్ పేర్కొన్నారు.

అలర్ట్ మెకానిజం రావాలి

ప్రజాభద్రతలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో క్రౌడ్ మానిటరింగ్, నిఘా కోసం డ్రోన్లను ఎప్పటి నుంచో వినియోగిస్తున్నామని శాంతిభద్రతల విభాగం ఐజీ శ్రీకాంత్ వివరించారు. డ్రోన్ల ద్వారా గంజాయి ఎక్కడ పండిస్తున్నారో గుర్తించి అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సముద్ర తీరానికి వెళ్లి ఏటా వందమందికి పైగా చనిపోతున్నారని.. బీచ్ మోనిటరింగ్ కోసం డ్రోన్లను వాడుతున్నామని వివరించారు. ఇలాంటి సందర్భాల్లో హెచ్చరించే అలర్ట్ మెకానిజం అందుబాటులోకి రావాల్సి ఉందని.. కంపెనీలు దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజాభద్రతలో భాగంగా ఏదైనా సమస్యపై కాల్‌సెంటర్‌కు ఫోన్ వచ్చిన వెంటనే డ్రోన్ పంపి అక్కడి పరిస్థితికి అనుగుణంగా చర్యలు చేపట్టవచ్చని ఐడియా ఫోర్జ్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ విశాల్ సక్సేనా పేర్కొన్నారు.



డ్రోన్‌లతో వేసిన డ్రోన్ ఆకృతి



సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలతో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఏడీ విభాగం) డైరెక్టర్ డా.మనీష్‌పాండే, ఐఅండ్‌ఐ శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్. ఉమ్‌లుంగ్‌మాన్ వల్నమ్, రామ్మోహన్‌నాయుడు, బి.సి.జనార్దన్‌రెడ్డి, మనోజ్ కె.అరోరా, దినేష్‌కుమార్, నీరబ్ కుమార్ ప్రసాద్



డ్రోన్ ప్రదర్శనకు వచ్చిన గిన్నిస్ వరల్డ్ రికార్డులు చూపుతున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇతర ప్రముఖులు

2030 నాటికి ప్రపంచ డ్రోన్ మార్కెట్‌లో భారత్‌వాటా 12.2%

ఈనాడు, అమరావతి: ప్రపంచ డ్రోన్ మార్కెట్లో ప్రస్తుతం 1.5% ఉన్న భారత్ వాటా 2030 నాటికి 12.2 శాతానికి చేరుతుందని పౌర విమానయానశాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు పీయూష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. విలువ ఆధారిత సేవల్లో 35%, ఉత్పత్తి రంగంలో 32%, కాంపొనెంట్స్ 16%, సాఫ్ట్‌వేర్ 12%, నైపుణ్య రంగంలో 5% వృద్ధి ఉంటుందని వివరించారు. డ్రోన్ మార్కెట్ విస్తరణ, పీఎల్ఐ పథకం తదితర వివరాలపై ఆయన మంగళవారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డోన్ టెక్నాలజీలో భారతదేశం ఎదగాలంటే ఆర్అండ్‌డీని బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

దేశంలో నమోదైన డ్రోన్లు	27,000
ధ్రువీకరణ పొందిన పైలట్లు	16,000
సర్టిఫైడ్ డ్రోన్ మోడల్స్	81
శిక్షణ కేంద్రాలు	132
ప్రస్తుతం డ్రోన్ మార్కెట్ విలువ	268 మిలియన్ డాలర్లు
2030 నాటికి అంచనా	11.06 బిలియన్ డాలర్లు

ఐఐటీ తిరుపతి.. క్యూసీఐతో అవగాహన ఒప్పందాలు

ఈనాడు, అమరావతి: డ్రోన్ సదస్సులో భాగంగా కేంద్రప్రభుత్వ సంస్థ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ), తిరుపతి ఐఐటీల ద్వారా డ్రోన్ల రంగంలో సహకారానికి రెండు అవగాహన ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. ఓర్వకల్లులో డ్రోన్ హబ్ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో.. రెండు ఎంఓయూలు కీలకంగా మారతాయని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పాటుచేసే స్టార్టప్‌లకు సర్టిఫికేషన్, పైలట్ శిక్షణ అందించేందుకు వీలుగా క్యూసీఐతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జాతీయస్థాయిలో డ్రోన్ పైలట్ శిక్షణ సర్టిఫికెట్‌ను క్యూసీఐ అందిస్తుంది. ఈ ఒప్పందం వల్ల సర్టిఫికేషన్ ఏజెన్సీగా రాష్ట్రానికి అవకాశం కలుగుతుంది. డ్రోన్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు ద్వారా స్టార్టప్‌లు, నైపుణ్య శిక్షణ అందించేందుకు ఐఐటీ తిరుపతితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.



మీ చుట్టూ ఎలాంటి వ్యక్తులు ఉండాలంటే..

జీవితంలో ఏం సాధించాలని మీరు కలలు కంటున్నారో.. దాన్ని ఇప్పటికే సొంతం చేసుకున్న వ్యక్తులు మీ చుట్టూ ఉండేలా చూసుకోండి. మీరు మీ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడంలో వారి అనుభవాలు, జ్ఞానం దోహదపడతాయి. వారి విజయాలు మీలో స్ఫూర్తిని నింపుతాయి. పట్టుదలను పెంచుతాయి.

– రస్సెల్ బ్రన్సన్, మైండ్ కోచ్

డ్రోన్ హబ్.. ఓర్వకల్లులోనే ఎందుకంటే?

- అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం
- హైదరాబాద్, బెంగళూరు నగరాలతో అనుసంధానం
- డ్రోన్ రంగంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు.. 12,500 మందికి ఉపాధి
- అమరావతి డ్రోన్ సదస్సులో కీలకపత్రం

ఈనాడు, అమరావతి: ఓర్వకల్లులో డ్రోన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడం వెనుక అనేక కారణాలు ఉన్నాయని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేక హబ్ ఏర్పాటుతో తయారీ పరిశ్రమలు, డ్రోన్ టెస్టింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అమరావతి డ్రోన్ సదస్సులో 'స్ట్రాటజిక్ ఫ్రేమ్ వర్క్ ఫర్ బిల్డింగ్ ఏపీ డ్రోన్ ఎకో సిస్టం'పై కీలక పత్రాన్ని ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. 'శిక్షణ, సర్టిఫికేషన్, అసెంబ్లింగ్ యూనిట్లు, రిపేర్లు, నిర్వహణ సేవలు, డాస్ (డ్రోన్స్ యాజ్ ఎ సర్వీస్) ఎకో సిస్టం అభివృద్ధి చెందుతుంది. ఈ సదుపాయాలతో అంకుర పరిశ్రమలు పెరుగుతాయి. రాష్ట్రంలో డ్రోన్ సంబంధిత వ్యాపారాలకు అవసరమైన అన్ని అనుమతులను సింగిల్ విండో విధానంలో ప్రభుత్వం అందిస్తుంది' అని వెల్లడించారు.

ఓర్వకల్లులో ఏర్పాటుతో ప్రయోజనాలివీ..

- దగ్గరలో ఉన్న కర్నూలు విమానాశ్రయంలోని రన్‌వేను డ్రోన్ల పరిశీలనకు వినియోగించుకోవచ్చు.
- డ్రోన్ తయారీ పరిశ్రమలకు అవసరమైన అనుబంధ కంపెనీల ఏర్పాటుకు 10 వేల ఎకరాల వరకు అందుబాటులో ఉంటుంది.
- హైదరాబాద్- బెంగళూరు నగరాలకు దగ్గరగానూ ఉంటుంది. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు అనుమతులన్నీ ప్రభుత్వమే సమకూర్చుతుంది. ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించడం వల్ల డీజీసీఏ అనుమతులు అక్కర్లేదు.
- రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లోనూ డ్రోన్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిస్తాం. అయితే అవసరమైన డీజీసీఏ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతులు, ఇతర లైసెన్సులు వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

అవకాశాలను అందిపుచ్చుకోవడానికే..

'డ్రోన్ల రంగంలో మన దేశ వాటా కేవలం 3 శాతమే. దీన్ని కనీసం 20 శాతానికి పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో రానున్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం విధానాలు రూపొందిస్తోంది. డ్రోన్ల వినియోగానికి విస్తృత అవకాశాలున్న మ్యాపింగ్, సర్వే, వ్యవసాయం, ఫొటోగ్రఫీ, తనిఖీలు, నిఘా రంగాలను కీలకంగా భావిస్తోంది. విభిన్న రంగాలు, ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగం, ప్రోత్సాహకాలు, కృత్రిమ మేధతో అనుసంధానం, తయారీ రంగాన్ని ప్రోత్సహించే వాణిజ్య విధానం వంటివి అందుబాటులోకి తేవడం ద్వారా డ్రోన్ అనుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో కల్పించాలని యోచిస్తోంది. రాష్ట్రంలో డ్రోన్ల రంగం ద్వారా ఐదేళ్లలో రూ.6 వేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ రంగంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు.. 12,500 మందికి ఉపాధి కల్పించేలా ముసాయిదా డ్రోన్ పాలసీని ప్రకటించింది. దీనిపై భాగస్వామ్య పక్షాలు, నిపుణుల సూచనల ఆధారంగా మార్పులు చేసి నవంబరు నాటికి తుది పాలసీని తీసుకొస్తాం' అని వివరించారు.



కోటి కాంతులు

పున్నమి ఘాట్‌లో డ్రోన్ ప్రదర్శనకు ముందు అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

దేశీయంగానే డ్రోన్ల విడిభాగాల తయారీ

'2030 నాటికి దేశాన్ని ప్రపంచ డ్రోన్ హబ్‌గా మార్చేందుకు మలిదశ నియంత్రణ రూపకల్పన'పై చర్చలో పరిశ్రమల ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: డ్రోన్ల విడిభాగాల్లో ఇప్పటికీ 60-70 శాతం అమెరికా, చైనాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దేశీయంగానే వీటి తయారీని ప్రోత్సహించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. తీసుకెళ్లే వస్తువు బరువుతో కలిపి 500 కిలోలు దాటిన డ్రోన్లకు ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ నిబంధనలు వర్తిస్తున్నాయని, వీటిని సరళీకృతం చేసేలా సమగ్ర పాలసీని తీసుకురావాలని కోరారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో, నవకల్పనలో డ్రోన్ పరిశ్రమ వేగంగా ముందడుగు వేస్తోందని, కానీ అందుకు అనుగుణంగా నియంత్రణ రూపకల్పనలో డీజీసీఏ వెనకబడి ఉందన్నారు. దీనికి డీజీసీఏ డైరెక్టర్ రవీంద్రకుమార్ స్పందిస్తూ తాము వెనకబడలేదని, ఒక్కో అడుగు వేస్తున్నామని తెలిపారు. ఆ అడుగులే పరిశ్రమ వేగానికి అనుగుణంగా వేయాలని పరిశ్రమ ప్రతినిధులు కోరారు. అమరావతి డ్రోన్ సదస్సులో భాగంగా మంగళవారం '2030 నాటికి దేశాన్ని ప్రపంచ డ్రోన్‌హబ్‌గా మార్చేందుకు మలిదశ నియంత్రణ రూపకల్పన'పై చర్చ జరిగింది. ఇందులో డీజీసీఏ డైరెక్టర్ రవీంద్రకుమార్, ఏస్టెరియా ఏరోస్పేస్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు నీల్ మెహతా, చీఫ్ ఆఫ్ ఎయిర్‌వర్తీనెస్ (ఈప్లెయిన్), క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పీఏడీ డివిజన్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ మనీష్‌పాండే, ఇన్‌డ్రోన్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు విపుల్ సింగ్ పాల్గొన్నారు. డ్రోన్ ఫెడరేషన్ ఇండియా అధ్యక్షుడు స్మిత్‌షా సమన్వయకర్తగా వ్యవహరించారు.

సుదూరం ప్రయాణించే డ్రోన్ల విషయంలో నిబంధనల రూపకల్పన: డీజీసీఏ

దృష్టిపరిధి దాటి సుదూరం ప్రయాణించే డ్రోన్లకు నిబంధనలు రూపొందిస్తున్నాం. అలాంటి డ్రోన్లకు సమాచారాన్ని స్వీకరించే వ్యవస్థలు, బెటర్ ల్యాండింగ్ సదుపాయం ఉండాలి. నావిగేషన్ సామర్థ్యం మెరుగ్గా ఉండాలి. ఈ అంశాలన్నింటినీ నిబంధనల రూపకల్పనలో పరిశీలిస్తున్నాం.

డ్రోన్ సేవలు సాగులో పెరగాలి

ఈనాడు, అమరావతి: వ్యవసాయంలో డ్రోన్ల సేవలు మరింత పెరగాల్సిన అవసరం ఉందని.. డేటా ఆటోమేషన్, ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ అందిపుచ్చుకోవాలని నిపుణులు సూచించారు. డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం 'వ్యవసాయ యాంత్రీకరణ పెంపు, మహిళా సాధికారత' అనే అంశంపై నిర్వహించిన చర్చకు భారత డ్రోన్ ఫెడరేషన్ ఛైర్మన్ స్మిత్‌షా సమన్వయకర్తగా వ్యవహరించారు. నమో డ్రోన్ దీదీ పథకం ద్వారా పొదుపు సంఘాల మహిళల ఆదాయం పెరిగిందని, ఎస్సీ, ఎస్టీ వర్గాల మహిళల కుటుంబాలు అభివృద్ధి చెందాయని ఐఓ టెక్ వరల్డ్ ఏవియేషన్ కో ఫౌండర్ దీపక్ భరద్వాజ్ పేర్కొన్నారు. ఈ రంగంలో ఏఐ ఆధారిత డ్రోన్లు అందుబాటులోకి రావాలన్నారు. డ్రోన్ల రవాణా కష్టంగా మారిందని.. పొలాలకు తీసుకెళ్లేందుకు వీలుగా వాహనాలను అందుబాటులోకి తేవాలని సూచించారు. వ్యవసాయంలో డ్రోన్ సేవలు పెంచేందుకు సులభతర వాణిజ్యంతోపాటు శిక్షణ అందించాలని జనరల్ ఏరోనాటిక్స్ హెడ్ ఆఫ్ మార్కెటింగ్ అమిత్ తోకాల్ అన్నారు. దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలన్నీ అగ్రికల్చర్ డ్రోన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త ఎ.సాంబయ్య కోరారు.

డ్రోన్ సదస్సు హ్యాకథాన్ విజేతలకు బహుమతులు

ఈనాడు, అమరావతి: అమరావతి డ్రోన్ సదస్సులో భాగంగా నిర్వహించిన హ్యాకథాన్‌లో విజేతలకు సీఎం చంద్రబాబు పురస్కారాలను అందించారు. తొలుత మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పురస్కారాలు అందించనున్నట్లు ప్రకటించినా.. ఎక్కువ మందిని ప్రోత్సహించే లక్ష్యంతో తృతీయ బహుమతి మొత్తాన్ని రెండుగా విభజించి.. మరో నలుగురు విజేతలకు నగదు పురస్కారాలను అందించారు.

మరిన్ని వివరాలు 22 లో

అత్యవసర సమయాల్లో నేస్తం!



అత్యవసర సమయాల్లో డ్రోన్ సాయం అందిస్తోంది. మనం వెళ్లలేని ప్రాంతాలకూ సరకులు, మందులు తీసుకెళ్తుంది. బుడమేరు వరదల్లో అది చేసిన సాయం చూశాం. అలాంటి డ్రోన్‌ను సమ్మిట్‌లో ప్రదర్శించారు. చేరవేయాల్సిన వస్తువును దానికి కట్టి.. లక్ష్యం చేరుకోగానే భద్రంగా అక్కడ జారవిడుస్తుంది.

డ్రోన్ సాంకేతికత అభివృద్ధికి మౌలిక వసతులు కల్పిస్తాం

ఐఅండ్ఐ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో డ్రోన్ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందడానికి మౌలిక వసతులు కల్పిస్తాం. ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ నగరాన్ని ఏర్పాటు చేయాలన్నదే మా ప్రణాళిక. డ్రోన్ తయారీ, ఆవిష్కరణ, పరిశోధన కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. ఈ రంగంలో పెట్టుబడిదారులకు ఇన్సెంటివ్స్, మూలధన రాయితీలను అందిస్తాం.

దేశంలో 90 శాతం ఎయిర్‌స్పేస్‌ను గ్రీన్ జోన్‌గా చేశాం

– ఉమ్‌లుంగ్‌మాన్ వల్నమ్, కేంద్ర పౌరవిమానయానశాఖ కార్యదర్శి



దేశంలో 90 శాతం ఎయిర్‌స్పేస్‌ను గ్రీన్ జోన్‌గా చేశాం. ఇక్కడ డ్రోన్‌లు ఎగరేయడానికి ఎలాంటి అనుమతులూ అవసరం లేదు. డ్రోన్ల రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకొచ్చిన పీఎల్ఐ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. డ్రోన్ల విడి భాగాల తయారీ అభివృద్ధి చెందాలి. స్టార్టప్‌లు, ఎమ్ఎస్ఎమ్ఈలు, ఇంజినీరింగ్ కంపెనీలు దీనిపై మరింతగా దృష్టిపెట్టాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. వీరి సహకారం లేకపోతే ఇంత పెద్ద సదస్సు వీలు కాదు.

డ్రోన్ వినియోగంలో యువతకు శిక్షణ


– సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్



స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా ప్రభుత్వ నినాదం. మెరుగైన పౌరసేవలను అందించడానికి డ్రోన్లను ఉపయోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిని ఉపయోగించుకోవాలని యువ పారిశ్రామికవేత్తలందరినీ కోరుతున్నాం. ఈ రంగంలో యువతకు వేగంగా శిక్షణ అందిస్తాం. ప్రైవేటు సెక్టార్ సహకారంతో నిర్దేశిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యా సంస్థల్లో శిక్షణ ఇస్తాం. తక్కువ ఖర్చుతో వినియోగం, రియల్‌టైం గవర్నెన్స్ కోసం కొత్త విధానాలను అభివృద్ధి చేయాలి. ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తాం.

ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి డ్రోన్ క్యాపిటల్‌గా చేయడమే లక్ష్యం

– సురేష్‌కుమార్, ఐఅండ్ఐ శాఖ కార్యదర్శి



ఏపీని దేశానికి డ్రోన్ క్యాపిటల్‌గా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. త్వరలో ప్రకటించబోయే నూతన డ్రోన్ పాలసీ పెట్టుబడిదారులకు అపార అవకాశాలను కల్పించనుంది. సర్వీసులు, వ్యవసాయ, విపత్తుల నిర్వహణలో డ్రోన్‌ల వినియోగం ఉత్తమ ఫలితాలను అందించనుంది. ఈ సదస్సు భవిష్యత్తు తరాలు డ్రోన్ సాంకేతికతను వినియోగించుకునే వేదిక.

సర్వం.. డ్రోన్ల మయం!



- ఇప్పటికే పలు రంగాల్లో వాటి సేవలు
- భవిష్యత్తులో మరిన్ని విభాగాలకు విస్తరణ
- కళ్లకు కట్టినట్లు వివరించిన డ్రోన్ సమిట్

ఈనాడు, అమరావతి

హైదరాబాద్ నుంచి విజయవాడకు 45 నిమిషాల్లో రావచ్చు. అదీ విమానంలో కాదు.. డ్రోన్‌లో! భారీ జన సమీకరణతో కూడిన బహిరంగసభల్లో తొక్కిసలాటలు జరగకుండా పర్యవేక్షించి అక్కడున్న ప్రజలను డ్రోన్‌ల సాయంతో సురక్షిత మార్గంలో పంపొచ్చు. వ్యవసాయం, వైద్యం, రక్షణ వంటి పలు రంగాల్లో డ్రోన్ల సేవలు ఇప్పటికే అందుతుండగా.. సమీప భవిష్యత్తులో వాటి వినియోగం మరికొన్ని రంగాలకూ విస్తరించనుంది. మానవ వనరుల కొరత ఉన్న రంగాలకు డ్రోన్లు ఎలాంటి సేవలు అందిస్తాయి.. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఎంతమేర ఉంటాయి.. ఇన్నాళ్లూ వివిధ రంగాల్లో ఉన్న అడ్డంకులను ఇవి ఎలా అధిగమిస్తాయి.. సహాయచర్యలకు ఎలా ఉపయుక్తంగా ఉంటాయి.. ఇలాంటి అనేక ఆసక్తికర అంశాలు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన డ్రోన్ సమిట్‌లో కళ్లకు కట్టినట్లు కనిపించాయి. బహుముఖ ప్రయోజనాలు అందించే ఈ డ్రోన్లు.. సందర్శకులతో పాటు ఈ రంగంలోకి అడుగిడాలనుకునే ఔత్సాహికులను ఉర్రూతలూగించాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న డ్రోన్లు అందించే సేవలు దేనికదే పూర్తిగా ప్రత్యేకం. దేశం నలుమూలల నుంచి డ్రోన్ తయారీదారులు పెద్దఎత్తున ఈ సమిట్‌కు తరలివచ్చారు. వారంతా తాము రూపొందించిన, అభివృద్ధి చేసిన, దిగుమతి చేసుకున్న డ్రోన్లను ప్రాంగణం పరిధిలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ప్రదర్శించారు. వీటిలో కొన్ని ప్రయోగాత్మక దశలో, మరికొన్ని పరీక్ష స్థాయిలో ఉన్నాయి. మిగిలిన చాలావరకు డ్రోన్లు ఇప్పటికే ఉపయోగంలో ఉన్నాయి. ఆయా డ్రోన్ల ప్రత్యేకతలు, వాటి పనితీరు వంటి వివరాలను సందర్శకులంతా నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఔత్సాహిక వ్యాపారులు ఆయా కంపెనీల డీలర్‌షిప్‌లు తీసుకునేందుకూ ఆసక్తి కనబరిచారు.

అసెంబుల్డ్ డ్రోన్‌లూ..

డ్రోన్‌లు స్వయంగా తయారు చేసుకునేందుకు అవసరమైన స్మార్ట్ చిప్, మదర్ బోర్డు, వింగ్స్ తదితర పరికరాలను ఇక్కడ ఒకటి రెండు స్టాళ్లలో అందుబాటులో ఉంచారు. ఇప్పటికే వినియోగిస్తున్న డ్రోన్‌లు ఉంటే వాటికి ఏవైనా పరికరాలు పాడైనా, విరిగినా.. అలాంటివాటిని ఇక్కడ తీసుకునే వెసులుబాటు కల్పించారు.

మత్స్య రంగం



చేపలకు మేత వేసేందుకు 'ఏజీ365హెచ్' పేరుతో మారుత్ డ్రోన్స్ రూపొందించిన డ్రోన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రోన్ సమిట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో ఆవిష్కరించారు. 10లీటర్ల ట్యాంక్ సామర్థ్యం, 25,200 ఎంఏహెచ్ బ్యాటరీ, లైవ్ వీడియో స్ట్రీమింగ్-రికార్డింగ్, 4జీ కనెక్టివిటీ, డ్యూయల్ ఫ్లైట్ మోడ్ వంటి సౌకర్యాలతో పగలు, రాత్రి కూడా నడిచే ఈ డ్రోన్ రోజుకు 30 ఎకరాలను కవర్ చేస్తుంది. దీనికున్న కృత్రిమమేధ (ఏఐ) సాయంతో పంట ఆరోగ్యాన్ని అంచనా వేస్తుంది. దానిద్వారా ఎక్కడ ఎంతమేర పురుగుమందు పిచికారీ చేయాలో అంచనా వేసుకుని, అంతే పిచికారీ చేస్తుంది.

టెథర్డ్ డ్రోన్



నిఘారంగం

ఈ డ్రోన్లను నిఘా (సర్వైలెన్స్) కోసం వినియోగిస్తారు. ఇప్పటికే గుజరాత్ పోలీసులు దీన్ని ఉపయోగిస్తున్నారు. బహిరంగసభలు, భారీ జనసమీకరణ ఉండే సభల్లో రక్షణ పర్యవేక్షణకు ఉపయోగపడుతుంది. రహదారులపై ట్రాఫిక్ పర్యవేక్షణకు, తుపానులు, వరదల సమయంలో రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో వీటి సేవలను వినియోగించుకోవచ్చు. సైబర్ సెక్యూరిటీ ముప్పు ఎదుర్కొనేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేయడం, పగలు రాత్రిళ్లు పనిచేసేలా కెమెరా సెన్సర్లు ఉండడం, సెల్యులార్ కమ్యూనికేషన్ వ్యవస్థ ఇందులో ప్రత్యేకం. దీన్ని ఒక ప్రాంతం నుంచి రిమోట్‌తో ఆపరేట్ చేయొచ్చు. 12 నుంచి 24 గంటల పాటు ఏకధాటిగా గాలిలో ఎగరగలదు. నేలపైన, కొండప్రాంతాల్లో అయితే ఒక వాహనంపై నుంచి, నీటిలో ఓడపై నుంచి వీటిని దీన్ని నిర్వహించే వీలుంటుంది.

మానవ రహిత హెలికాప్టర్



పేరు: హైడ్రోజన్ ఎలక్ట్రిక్ పవర్డ్ వీటీఓఎల్ ఎయిర్‌క్రాఫ్ట్
వినియోగం: సరకు రవాణా (ప్రస్తుతం)
ప్రత్యేకత: 100 కిలోల బరువున్న సరకును సుమారు 300 కి.మీ. తీసుకెళ్తుంది

- హెలికాప్టర్‌లా కనిపించే ఈ డ్రోన్‌ను ప్రస్తుతం సరకు రవాణాకు ఉపయోగిస్తున్నారు. 100 కిలోల బరువు గల సరకును 300 కిలోమీటర్ల వరకు తీసుకెళ్తుంది. దీనికి రన్‌వే అవసరం లేదు. ఉన్న చోటు నుంచే నేరుగా పైకి లేచి.. వెళ్తుంది. పైలట్ కూడా అనవసరం. గమ్యస్థానాన్ని నిర్ణయిస్తే నేరుగా అక్కడికి సరకును చేరుస్తుంది. హైదరాబాద్-విజయవాడ 45 నిమిషాలు, ముంబయి నుంచి పుణెకి 30 నిమిషాల్లోపే చేరుకుంటుంది.
- ప్రస్తుతం మనుషులు ప్రయాణించే ఎయిర్ టాక్సీలకు అనుమతుల్లేని కారణంగా వీటిలో సరకులనే రవాణా చేస్తున్నారు. 2025 నాటికి మానవసహిత డ్రోన్లలో టన్ను పేలోడ్‌తో 800 కి.మీ.ల సామర్థ్యంతో ఉండేవాటిని అందుబాటులోకి తెస్తామని తయారీదారులు చెబుతున్నారు.

వజ్ర డ్రోన్

వినియోగం: బహుళ రంగాల్లో

ఏరో 360కి చెందిన వజ్ర డ్రోన్ అత్యధికంగా 75 నిమిషాల పాటు గాల్లో ఉండగలదు. ఇది అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లో 10 కి.మీ. వరకు ప్రయాణిస్తుంది. పంట పర్యవేక్షణ, ఏరియల్ సర్వే, అటవీ పర్యవేక్షణ, ఖనిజాన్వేషణ, పైప్‌లైన్ పర్యవేక్షణ, ట్రాఫిక్ మేనేజిమెంట్, సెర్చ్-రెస్క్యూ, ఏరియల్ పెట్రోలింగ్, సరిహద్దు భద్రత, వన్యప్రాణ సంరక్షణ లాంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. వీటికోసం థర్మల్ కెమెరా లాంటి అధునాతన పరికరాల్ని వాడతారు. అత్యంత నాణ్యతతో మ్యాపింగ్ చేయడం దీని ప్రత్యేకత.

వైద్యరంగం

ఈ డ్రోన్‌ను రెడ్‌వింగ్ అనే కంపెనీ పేరుతోనే ప్రమోట్ చేస్తున్నారు. దీన్ని మందులు, ఇతర ఆసుపత్రుల అవసరాల కోసం ఉపయోగించేలా రూపొందించారు. రక్త నమూనాలు, మందులు, టీకాలను తీసుకువెళ్లేందుకు వినియోగిస్తున్నారు. 3కేజీల బరువును, 50కి.మీ. మేర తీసుకెళ్లగలదు. మందులను భద్రపరిచేందుకు కోల్డ్‌స్టోరేజీ కూడా ఏర్పాటుచేశారు. 'యాలి ఏరోస్పేస్' అనే సంస్థ కూడా వీటిని ప్రమోట్ చేస్తోంది. అత్యవసర మందులను ఏజెన్సీ ప్రాంతాలకూ ఈ డ్రోన్‌లతో సరఫరా చేస్తున్నారు. ప్రత్యేకంగా ఛార్జింగ్ స్టేషన్లు, స్మార్ట్ మెడిసిన్ బాక్స్, క్లౌడ్ వీడియోలను పర్యవేక్షించడం వంటి సదుపాయాలు ఇందులో పొందుపరిచారు. ఈ డ్రోన్లను మొబైల్ యాప్ ఆధారంగా రిమోట్‌తో ఆపరేట్ చేస్తున్నారు. ల్యాండింగ్, డెలివరీ తర్వాత అవే తిరిగొస్తాయని నిర్వాహకులు తెలిపారు. 'డ్రోన్ హబ్' సంస్థ అయితే మారుమూల ప్రాంతాలకు డ్రోన్‌తో సరఫరా చేసే మందులను అక్కడ కొద్దికాలం పాటు నిల్వ చేసేందుకు స్టోరేజీని కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్టోరేజీకి డ్రోన్‌ను లింక్ చేసి అక్కడకు మందులను పంపుతారు. రెండు మూడు రకాల లోడ్లను పంపితే డెలివరీ పాయింట్లలో దేనికదే వేర్వేరుగా డెలివరీ చేసే డ్రోన్‌ను కూడా వీరు అభివృద్ధి చేశారు. వీటిని యూరప్ నుంచి తీసుకొచ్చారు. భారత్‌లో అనుమతుల ప్రక్రియ పూర్తికావాల్సి ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.



రక్షణ రంగం



రక్షణరంగ అవసరాల కోసం 'కామికాజీ' డ్రోన్‌ను వీయూ డైనమిక్స్ సంస్థ అభివృద్ధి చేసింది. రియల్ వరల్డ్ ఫ్లై స్టిములేషన్, అడ్వాన్స్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ డైనమిక్స్ మోడలింగ్ వంటి ప్రధాన ఫీచర్లను వినియోగించి కంట్రోల్‌రూం నుంచి ఈ డ్రోన్‌ను పర్యవేక్షిస్తారు. కంట్రోల్‌రూంలో ఇంటర్‌ఫేస్ మాన్యువల్ కంట్రోల్, గాలుల తీవ్రతను గుర్తించే ప్యానల్, మూడు ఎల్ఈడీలతో కూడిన స్క్రీన్ ఉంటుంది. డ్రోన్‌తో తీసే విజువల్స్‌తో హైబ్రిడ్ మ్యాప్, ఓపెన్ స్ట్రీట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తారు. 150కి.మీ. రేంజ్‌లో ఈ డ్రోన్ పయనించగలదు.

మ్యాపింగ్‌కి..

'స్కైకాప్టర్ ఎ6' పేరుతో సెన్స్ ఇమేజెస్ టెక్నాలజీస్ సంస్థ తీసుకొచ్చిన ఈ డ్రోన్‌ను సర్వైలెన్స్, మ్యాపింగ్ కోసం వినియోగిస్తున్నారు. వీటిని మైనింగ్, రియల్‌ఎస్టేట్, సోలార్ ప్లాంట్లు, వ్యవసాయం, వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి వాటికీ వినియోగిస్తున్నారు. ఈ డ్రోన్‌లో ఆబ్లిక్ కెమెరా, థర్మల్ కెమెరా, జూమ్ కెమెరా, లైడర్, మ్యాప్01 లాంటివాటిని అవసరానికి తగినట్లుగా ఏర్పాటుచేస్తారు. దీనికి మెగాఫోన్ కూడా అమర్చుతారు. భారీ బహిరంగసభల సమయంలో ఏదైనా అలజడి జరిగితే ఈ డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తూ తొక్కిసలాటకు తావులేకుండా ప్రజలు ఏ మార్గం నుంచి సురక్షితంగా బయటకు వెళ్లాలనే విషయాన్ని మెగాఫోన్ ద్వారా ప్రకటించే వీలుంటుంది. గ్రామాల్లో ఆవాసాలు, రహదారులనూ మ్యాపింగ్ చేసేందుకు ఈ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. ఏఐ ఆధారిత రూట్‌ప్లాన్‌తో ఇది సెకనుకు 4 మీటర్ల వేగంతో, 8 కి.మీ. రేంజ్‌లో వెళ్లగలదు. 45 నిమిషాలు గాల్లోనే ఉండగలదు. డ్యూయల్ కెమెరా, 22వేల ఎంఏహెచ్ బ్యాటరీ వంటివి ఉంటాయి. దీనికి అడ్వాన్స్‌డ్‌గా 'స్కైహంటర్ విటాల్'ను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో యాంటీకలర్ లైట్స్‌ను ఏర్పాటుచేశారు. మల్టీస్పెక్ట్రల్ కెమెరాలను అమర్చే అవకాశం ఉంది. లేజర్ స్కానింగ్, సర్వేలకు, పారిశ్రామిక అవసరాలకు, పెద్దయెత్తున స్థలాల మ్యాపింగుకు వినియోగిస్తారు. దీంతోపాటు ఏరియల్ గ్యాస్ పైప్‌లైన్ మానిటరింగ్/డిటెక్షన్ కూడా చేస్తుంది. ఎక్కడైనా గ్యాస్ లీకైతే సులువుగా కనిపెట్టి, ప్రమాదాలను నివారించవచ్చు.



వ్యవసాయ రంగం



ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, ప్రొఫెసర్లు కలిసి ఈ డ్రోన్ తయారుచేశారు. క్రిమిసంహారక మందుల పిచికారీతో పాటు.. విత్తనాలు వెదజల్లడం దీని ప్రత్యేకత. ఇందులో ఉన్న డబ్బాలో విత్తనాలను నింపి జల్లవచ్చు. దీంతో రైతులకు విత్తన బస్తాలు మోసుకెళ్లాల్సిన అవసరం లేదు. ఇందులో ఉండే కంటెయినర్ 10 లీటర్లు/కిలోల బరువు మోస్తుంది. 2 కి.మీ. వరకు ప్రయాణిస్తుంది. సుమారు 165 అడుగుల ఎత్తు ఎగురుతుంది. ఎకరా భూమికి సరిపడా విత్తనాల్ని 8 నిమిషాల్లోపే జల్లుతుంది.

మద్యం కుంభకోణం మూలాలపై గురి



తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం సమీప బీడీహెచ్ ఆగ్రోలో రాత్రివేళలో సీఐడీ అధికారుల సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

పరిమాణం మద్యం ఉత్పత్తి చేశాయి? అనే వివరాలు సేకరించాయి. పలు డిస్టిలరీల్లో ఈ రెండింటి మధ్య భారీగా వ్యత్యాసం ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించాయి. జగన్ అండ్ కో రాష్ట్రంలోని కొన్ని డిస్టిలరీలను అనధికారికంగా కబ్జా చేసి అక్కడ భారీ ఎత్తున "జే బ్రాండ్లు" ఉత్పత్తి చేసినట్లు ఈ బృందాలు ఆధారాలు సేకరించాయి. లెక్కల్లో, రికార్డుల్లో చూపించకుండా అనధికారికంగా మద్యం ఉత్పత్తి చేసి తరలించినట్లు ప్రాథమికంగా గుర్తించాయి. ఆయా డిస్టిలరీల వాస్తవ ఉత్పత్తి సామర్థ్యం ఎంత? ఎంత మేర ఉత్పత్తి చేశాయి? అనే లెక్కల్ని పరిశీలించాయి. విద్యుత్తు వినియోగం ఆధారంగా దీన్ని అంచనా వేశాయి. డిస్టిలరీల్లోని గత అయిదేళ్ల రికార్డులు, హార్డ్‌డిస్క్‌లను సీజ్ చేశాయి. ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించి ఇప్పటికే సీజ్ చేసిన దస్త్రాలతో వీటిని సీఐడీ అధికారులు సరిపోల్చనున్నారు. దాని ఆధారంగా అక్రమాల నిగ్గు తేల్చనున్నారు.

మిథున్‌రెడ్డి ఆధీనంలోని డిస్టిలరీల్లో కీలక ఆధారాలు

గత అయిదేళ్లు అనధికారికంగా వైకాపా నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధీనంలోకి వెళ్లిపోయాయనే ఫిర్యాదులున్న నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, ఎన్టీఆర్ జిల్లా గండేపల్లిలోని సెంటినీ బయోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి జిల్లా రేణిగుంటలోని ఎస్వీఆర్ డిస్టిలరీస్ లిమిటెడ్, చిత్తూరు జిల్లా తిమ్మసముద్రంలోని శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్‌ల్లో సీఐడీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ డిస్టిలరీల్లో తయారు చేయించిన "జే బ్రాండ్ల"కే గత అయిదేళ్లలో దాదాపు రూ.8 వేల కోట్ల విలువైన మద్యం సరఫరా ఆర్డర్లను ఏపీఎస్‌బీసీఎల్ ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇది కాకుండా అనధికారికంగా ఇక్కడ మద్యం తయారు చేశారా? అనేది పరిశీలించారు. దీనికి సంబంధించిన కొన్ని రికార్డులు పట్టుబడ్డాయి.

సోదాలు నిర్వహించింది ఈ డిస్టిలరీల్లోనే..

1. కాంటినెంటల్ వైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ ఆటోనగర్, ఎన్టీఆర్ జిల్లా
2. ఎస్వీఆర్ డిస్టిలరీస్ లిమిటెడ్, రేణిగుంట, తిరుపతి జిల్లా
3. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్, నంద్యాల జిల్లా
4. పెరల్ డిస్టిలరీస్ లిమిటెడ్, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా
5. బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కొప్పవరం, తూర్పుగోదావరి జిల్లా
6. ప్రాగ్ డిస్టిలరీస్, నల్లమిల్లి, తూర్పుగోదావరి జిల్లా
7. పీఎంకే డిస్టిలేషన్ ప్రైవేట్ లిమిటెడ్, కోటపాడు, తూర్పుగోదావరి జిల్లా
8. శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్, తిమ్మసముద్రం, చిత్తూరు జిల్లా
9. మోహన్ బ్రూవరీస్ అండ్ డిస్టిలరీస్, పానాటూరు, చిత్తూరు జిల్లా
10. ఖోడూస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కుప్పం, చిత్తూరు జిల్లా
11. ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, వెంకటాచలం, నెల్లూరు జిల్లా
12. బీఆర్‌కే స్పిరిట్స్, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా
13. బీవీఎస్ డిస్టిలరీస్, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా
14. శర్వాణి ఆల్కో బ్రూ ప్రైవేట్ లిమిటెడ్, గంపలగూడెం, ఎన్టీఆర్ జిల్లా
15. ఈగల్ డిస్టిలరీస్, వైఎస్ఆర్ జిల్లా
16. సెంటినీ బయోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, గండేపల్లి, ఎన్టీఆర్ జిల్లా
17. సోరింగ్ స్పిరిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, చేబ్రోలు, ఏలూరు జిల్లా
18. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వంగూరు, ఏలూరు జిల్లా
19. విశాఖ డిస్టిలరీస్, కశింకోట, అనకాపల్లి జిల్లా
20. జీఎస్‌బీ అండ్ కో, కశింకోట, అనకాపల్లి జిల్లా



నంద్యాల ఉడుమాల్పురం పారిశ్రామికవాడలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేసేందుకు వచ్చిన సీఐడీ అధికారుల బృందం

విజయసాయిరెడ్డి అల్లుడి బినామీ సంస్థ పరమైన డిస్టిలరీల్లో

వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడైన పెనక రోహిత్‌రెడ్డికి సంబంధించిన బినామీ కంపెనీగా ఫిర్యాదులున్న "అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్".. విశాఖ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, పీఎంకే డిస్టిలేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సబ్‌లీజు పేరిట అనధికారికంగా ఆధీనంలోకి తీసుకుని 'జే బ్రాండ్లు' తయారు చేసినట్లు సీఐడీ గుర్తించింది. ఆయా డిస్టిలరీల్లో సోదాలు చేసి.. దీనికి సంబంధించిన కీలక ఆధారాలు, రికార్డుల్ని స్వాధీనం చేసుకుంది.

రైల్వే ప్రాజెక్టుల పూర్తికి మూడు శాఖలతో టాస్క్‌ఫోర్స్

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న రైల్వేప్రాజెక్టుల కోసం భూసేకరణ సమస్యలను కొలిక్కితెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, ఆయా ప్రాజెక్టులన్నీ నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అన్ని కొత్త ప్రాజెక్టులూ మూడేళ్లలో, డబ్లింగ్ పనులు నాలుగేళ్లలో పూర్తిచేయాలని కోరారు. ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చూసేందుకు, భూసేకరణ సమస్యల పరిష్కారానికి రైల్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో కలిపి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మంగళవారం సచివాలయంలో రైల్వే ప్రాజెక్టులు, తదితరాలపై రైల్వే అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం రూ.72 వేల కోట్ల మేర రైల్వే ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర రైల్వే మంత్రి ఇటీవల తెలిపారని, దీనికి అనుగుణంగా వేగంగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వేలైన్‌కు రూ. 2,239 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేసినట్లు రైల్వే అధికారులు సీఎంకు వివరించారు. ఆయా ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఏమన్నారంటే..

కోటిపల్లి-నరసాపురం లైన్ భూసేకరణకు 4 నెలలే గడువు

- నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో 11 ఎకరాల సేకరణకు రూ.20 కోట్లు వెంటనే మంజూరు చేస్తున్నాం.
- కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు భూసేకరణ 4నెలల్లో పూర్తి చేయాలి.
- సత్తుపల్లి-కొవ్వూరు లైన్ భూసేకరణ పూర్తిచేసి పనులు ఆరంభించాలి.
- కడప-బెంగళూరు లైన్ ఎలైన్‌మెంట్‌లో మార్పులు జరిగినందున, దీనిపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- రేణిగుంట-గూడూరు మధ్య 83 కి.మీ.మేర రూ.884 కోట్లతో చేపట్టే మూడో లైన్ పనులను మూడేళ్లలో పనులు పూర్తిచేయాలి.
- గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్‌లో పెండింగ్ పనులు 12 నెలల్లో పూర్తయ్యేలా చూడాలి.
- అమృత్ ప్రాజెక్టు కింద రూ.3,170 కోట్లతో రాష్ట్రంలో చేపట్టిన 72 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులన్నీ రెండేళ్లలో పూర్తికావాలి.
- రూ.6.98 కోట్లతో చేపట్టిన కుప్పం రైల్వేస్టేషన్ డిజైన్ మరింత మెరుగుపరచాలి.
- రూ.433 కోట్లతో విశాఖపట్నం స్టేషన్, రూ.24 కోట్లతో విజయవాడలోని గుణదల స్టేషన్ పనులు చేస్తున్నట్లు రైల్వే అధికారులు వివరించగా.. గుణదల స్టేషన్ పనులు మార్చినాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

శ్రీకాకుళం వైద్య కళాశాలకు అదనంగా 50 సీట్లు

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలకు అదనంగా మరో 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యాయి. ఈ కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రస్తుతం 150 సీట్లు ఉండగా.. వీటికి అదనంగా మరో 50 సీట్ల భర్తీకి జాతీయ వైద్య మండలి మంగళవారం అనుమతి ఇచ్చిందని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికా రెడ్డి వెల్లడించారు. ఈ 50 సీట్లలో 8 సీట్లు జాతీయ కోటా కిందికి వెళ్తాయి. వీటికి కూడా ఏపీ విద్యార్థులు పోటీపడొచ్చు. మిగిలిన వాటిని మూడో రౌండులో చేర్చి గురువారం లోగా సీట్ల కేటాయింపు చేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. వన్‌టైం విధానంలో విద్యార్థుల నుంచి ఇప్పటికే విశ్వవిద్యాలయం ఐచ్ఛికాలు తీసుకుంది.

గాలి బుడగ ఎక్కేద్దాం.. అరకు అందాలు చూసేద్దాం!

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రకృతి అందాలను ఆకాశం నుంచి వీక్షించే సౌలభ్యం పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది. పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ చొరవతో ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పద్మాపురం ఉద్యానంలో నిర్వహించిన 'హాట్ ఎయిర్ బెలూన్' ట్రయల్‌రన్ విజయవంతమైంది. మంగళవారం నుంచి పద్మాపురం ఉద్యానంలో ఈ బెలూన్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు బెలూన్ రైడ్‌కు అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు గట్ల సంతోష్ తెలిపారు. 300 అడుగుల ఎత్తువరకు విహంగ వీక్షణానికి వీలు కల్పిస్తుండగా ఒక్కో వ్యక్తికి రూ.1500 రుసుం వసూలు చేయనున్నట్లు చెప్పారు.



ఆద్వాణీకి పార్టీ సభ్యత్వం అందజేసిన పురందేశ్వరి

ఈనాడు డిజిటల్, అమరావతి: భాజపా వ్యవస్థాపక సభ్యుడు, పార్టీ పూర్వ జాతీయ అధ్యక్షుడు లాల్ కృష్ణ ఆద్వాణీకి ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పార్టీ క్రియాశీల సభ్యత్వం అందజేశారు. మంగళవారం దిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆద్వాణీకి సభ్యత్వం అందజేసిన భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు


సత్యా
అంటే సంతోషం
దీపావళి వేడుక
Gold Coin FREE
for purchases ₹50000 & above
Assured GIFT
SATHYA
SPREADING HAPPINESS
Bank Offers
upto ₹5000* Instant Cash Back
FEDERAL BANK Debit / Credit Card
HDFC BANK Debit / Credit Card
IDFC FIRST Bank Credit Card
YES BANK
HSBC
RBL BANK
BAJAJ FINSERV
Scan this QR CODE to check Pre-approved offer
₹10000 Cash Back
2 EMI FREE*
15000 Reward Points
HDB FINANCIAL SERVICES
₹21000 Cash Back
SBI Rewards 5X Points
iPhone16 (128)
EMI ₹3329
EMI Per Day ₹107
0 Down Payment
₹5000 Cash Back
Flat 30%* off on
iPhone16 Plus (128)
EMI ₹3746
EMI Per Day ₹121
0 Down Payment
₹5000 Cash Back
Flat 30%* off on
₹7490 worth 10000 mAh MagSafe Power Bank
FREE
iPhone13 (128)
₹47999 only
EMI ₹1999
EMI Per Day ₹65
Additional ₹2000 Cash Back
oppo
F27 Proplus 5G
(8 + 128 GB)
EMI ₹1867
24% OFF
₹2799 Cash Back
₹5990 worth Bluetooth Speaker
₹499 only
When you buy Smart Phone
Calling Smartwatch
₹7990 worth
₹299 only
₹1940 worth Bluetooth Nechband
₹199 only
Authorised Reseller
SAMSUNG
vivo
oppo
xiaomi
realme
DAIKIN 1.5 TON 5 STAR AC
EMI ₹3707 34% OFF
LLOYD 1.5 TON 5 STAR AC
EMI ₹3417 50% OFF
BLUE STAR 1.5 TON 5 STAR AC
EMI ₹3707 41% OFF
Haier 1.6 TON 5 STAR AC
EMI ₹3374 44% OFF
VOLTAS LG BLUE STAR DAIKIN Haier Carrier GENERAL SAMSUNG Godrej Panasonic HITACHI LLOYD IFB ONIDA
India ka Celebration
Buy LG Products
WIN 6 Lakhs worth LG APPLIANCES
Free in Daily Lucky Draw
₹12500 Instant Cash Back on Credit Card
1 EMI OFF on Paper Finance
Buy SAMSUNG Products
Our AI-powered home appliances now come with advanced features and great offers.
Samsung Care+
1 Year extended warranty* at just ₹ 449/-
Up to ₹ 20000 cashback*
0 Down payment
20 year warranty
Buy Haier Products
Get 22.5% cashback up to ₹21000
EMI Tenure: 3, 6, 9, and 12 months
SONY
BRAVIA 3
X1 4K HDR TV
THIS FESTIVE SEASON
Range starts from Rs.83,990/-
Available Sizes: • 215cm (85) • 189cm (75) • 164cm (65) • 139cm (55) • 126cm (50)
Google TV
SPECIAL OFFERS!
3 YEARS WARRANTY
INSTANT CASHBACK Rs.15,000/-
BUY NOW AT Rs.2,995/-
1 EMI FREE
SOUNDBAR COMBO OFFER
SAVE UPTO Rs. 54,990/-
Buy LLOYD Products
upto ₹8000 Instant Cash Back
credit card and on paper finance
Buy Whirlpool Products
TAKE HOME A WHIRLPOOL APPLIANCE @ EMI'S AS LOW AS ₹911
0 DOWN PAYMENT
15 CASH BACK
LOW COST EMI
BPL LED TV
impex LED TV
upto ₹8000 Instant Cash Back
credit card and on paper finance
Buy Water Purifier
1.8 Ltr Kettle FREE
Buy Microwave Oven
Dosa Tawa FREE
Buy Dishwasher
Bath Set FREE
Buy Deep Freezer
₹1799 worth 5 Ltr Cooker FREE
Buy Water Dispenser
₹1249 worth 3 Ltr Cooker FREE
Morphy Richards
5L AIR FRYER
worth ₹11199
₹5490 only
Scan to find our Showroom Locations
Scan to know Prices, Offer details & to Shop Online
www.sathya.store
Whatsapp: 99166 98985 or Call: 88805 98985
For corporate bookings or bulk orders mail us: corporatesales@sathya.email
Naidupeta 8754469985 | Sulurpeta 91501 75985 | Chittoor 9003179985 | Tirupathi 7845229985 | 78453 63985 | Venkatagiri 7338740985 | Pileru 78453 45985 | Tadipatri 95001 21985 | Chilkulurpeta 73583 80985 | Palamnar 73387 96985 | Bapatla 9043916985 | Koduru 9789778985 | Tenali 9866865813 | Nellore 9043976985 | Rajampeta 98402 66985 | Vijayawada 73860 34465 | 81060 84659 | Guntur 9092038985 | 92878 79985 | Ongole 97439 00659 | Nandyala 98408 57985 | Kurnool 99403 54985 | 9092608985 | Machilipatnam 90259 15985 | Badvel 9087774985 | Narasaraopet 90879 65985 | Srikalahasti 9952352985 | Ananthapur 9789959985 | Puttur 89255 93985 | Punganur 98403 78985 | Kadapa 97897 78985 | Rayachoti 9092444985 | Tadepalli 90921 44985 | Kakkinada 78455 93985 | Adoni 63038 15540 | Eluru 89255 70985 | Bhimavaram 78455 71985 | Madanapalle 78455 59985 | Tadepalligudem 78454 49985
Now 39 Showrooms

వైకాపా రీ-సర్వే ఘోరాలపై 41 వేల ఫిర్యాదులు

నవంబరు 25 వరకు గ్రామ సభలు


ఈనాడు, అమరావతి: నాటి వైకాపా పాలనలో భూముల రీ-సర్వే ద్వారా జరిగిన అక్రమాలు, తప్పులపై బాధితుల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 15 నుంచి జరుగుతోన్న గ్రామ సభల ద్వారా మంగళవారం నాటికి అందిన 41,112 ఫిర్యాదులను చూస్తే వైకాపా పాలనలో భూముల రీ-సర్వే ఎంత ఘోరంగా జరిగిందో స్పష్టమవుతోంది. మంగళవారం నాటికి 1,615 గ్రామసభలు జరిగాయి. నాటి రీసర్వేలో అన్యాయంగా భూ విస్తీర్ణాలు తగ్గించారని, రికార్డులు చూడలేదని, భూ హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని పలువురు గ్రామ సభల్లో ఆరోపించారు. చనిపోయిన వారి పేర్లను అలాగే ముద్రించారని, తమ సమక్షంలో కొలతలు వేయలేదని, అన్యాయం జరిగినట్లు అందజేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోలేదంటూ బాధిత రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. నాటి వైకాపా పాలనలో రీ-సర్వే జరిగిన గ్రామాల్లో 21 లక్షల భూ హక్కు పత్రాలను పంపిణీచేశారు. వీటిల్లో కనీసం 25 నుంచి 30 శాతం మేర తప్పులు దొర్లినట్లు ఫిర్యాదులను చూసిన అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 16,816 గ్రామాలు ఉంటే ఇందులో 6,860 గ్రామాల్లో రీ-సర్వే పూర్తయింది. రీసర్వే జరిగిన అన్ని గ్రామాల్లోనూ.. గ్రామ సభలు నిర్వహించాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. నవంబరు 25వ తేదీ వరకు గ్రామ సభలు జరగనున్నాయి. ఇప్పటివరకు అందిన 41,112 ఫిర్యాదుల్లో 208 పరిష్కరించారు.

పరిశీలించి చర్యలు: రెవెన్యూ మంత్రి

'నాటి వైకాపా ప్రభుత్వం భూముల రీ-సర్వేను భ్రష్టు పట్టించింది. గ్రామ సభల ద్వారా బాధితుల నుంచి వస్తున్న ఫిర్యాదులే అందుకు నిదర్శనం. బాధితుల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటాం. భూ హక్కు పత్రాల్లో దొర్లిన తప్పులు సరిదిద్దేందుకు ఎక్కువ సమయం పడుతుంది' అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పథకం మెనూలో త్వరలో మార్పు

ఈనాడు, అమరావతి: మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూలో కొన్ని వంటకాలను విద్యార్థులు ఇష్టపడి తినడం లేదని, మార్పు చేయాలని కలెక్టర్ల నుంచి వచ్చిన సమాచారం మేరకు మెనూ మార్పు చేపట్టింది. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు మెనూను జిల్లాలవారీగా అమలుచేయాలా? లేదా ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి మెనూ తీసుకురావాలా? అనే దానిపై దృష్టి పెట్టింది. పాఠశాలల్లో వంటలు చేసే ఏజెన్సీలతో మంగళగిరిలో వచ్చేనెల 4న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.



మీ శరీరాన్ని గౌరవించండి

మీ శరీరాన్ని మీరు ఎల్లప్పుడూ గౌరవించండి. దాన్ని మంచి ఆకృతిలో, ఆరోగ్యంగా ఉంచుకోండి. మీరు కలిగి ఉన్న అత్యంత ముఖ్యమైన భౌతిక సాధనం మీ దేహమేనన్న సంగతి మరవొద్దు. వ్యాయామం అనేది శరీరానికి యోగా వంటిది. జీవితాన్ని మెరుగ్గా అనుభూతి చెందడంలో అది దోహదపడుతుంది.

– నీల్ డొనాల్డ్ వాల్ష్, రచయిత

వైకాపా మూకల దాడి.. తెదేపా కార్యకర్త హత్య



హత్యకు గురైన హరిప్రసాద్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు, పోలీసు అధికారులు

చిల్లకూరు, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లాలో వైకాపా మూకలు దాడి చేసి దళితుడైన మల్లారపు హరిప్రసాద్ (20)ను కిరాతకంగా హతమార్చాయి. మంగళవారం తెల్లవారుజామున వైకాపాకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు మూకుమ్మడిగా ఓ ఇంటిపై పెట్రోలు చల్లి నిప్పు పెట్టారు. పొగ తట్టుకోలేక బయటకు వచ్చిన ఇద్దరిపై దాడి చేశారు. ఒకరు తప్పించుకోగా పట్టుబడిన హరిప్రసాద్‌ను వైకాపా కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు చిల్లకూరు మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన నారపరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, వంశీ దాయాదులు. సోమవారం సాయంత్రం వారి కుటుంబాల్లో నెలకొన్న పాత గొడవల కారణంగా మహిళల మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో స్థానిక తెదేపా నేత నారపరెడ్డి శ్రీధర్‌రెడ్డి సర్దుబాటుకు యత్నించినా వైకాపా నేత వెంకటకృష్ణారెడ్డి గొడవకు దిగారు. ఈ క్రమంలో తమపై దాడి చేశారంటూ వెంకట కృష్ణారెడ్డి.. వైకాపా నేతలు కట్టా రామిరెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. వారు నాంచారంపేట ఎస్సీ కాలనీకి చెందిన కొందరిని పోగేసి మారణాయుధాలతో శ్రీధర్‌రెడ్డి, గెద్దెల చిరంజీవి, నాగసాల సురేంద్రలపై దాడి చేశారు. ఈ క్రమంలో సురేంద్ర స్నేహితుడు కాటయ్య, స్థానికుల సాయంతో వారిని అడ్డుకున్నారు. గాయపడ్డ శ్రీధర్‌రెడ్డి, చిరంజీవి, సురేంద్రలను గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం తెదేపా నేత శ్రీధర్‌రెడ్డి, చిరంజీవి అర్ధరాత్రి ఇంటికి చేరుకున్నారు.

నిద్రిస్తున్న సమయంలో..

వైకాపా హయాంలో నాగసాల సురేంద్ర, కాటయ్య వాలంటీర్లు. ఎన్నికలకు ముందు రాజీనామా చేసి తెదేపాకు మద్దతుగా నిలిచారు. దీంతో వైకాపా నేతలు కక్ష పెంచుకున్నారు. కాటయ్యను హతమార్చేందుకు వైకాపా నేతలు యత్నిస్తున్నారని అతని చిన్నాన్న కుమారుడు మల్లారపు హరిప్రసాద్ ఆయన ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో వైకాపా కార్యకర్తలు దుంపల మధు, భాను, సాయి, డేనియల్, మన్నెం హర్ష, మోజెస్ మరికొందరితో కలిసి మంగళవారం తెల్లవారుజామున కాటయ్య ఇంటి కిటికీ పగలగొట్టి పెట్రోలు చల్లి నిప్పు అంటించారు. పొగకు తట్టుకోలేక బయటకు వచ్చిన కాటయ్య, హరిప్రసాద్‌లపై 15 మంది దాడి చేశారు. ఇందులో కాటయ్య తప్పించుకోగా హరిప్రసాద్ మృతి చెందారు. ఆ తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

జైలు గోడల మధ్య ఏం జరిగింది?

- తెలుగు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసిన పవన్‌కల్యాణ్ సమావేశం
- గీత దాటని మనిషి మీరు..
- అన్‌స్టాపబుల్-4 సీజన్‌లో బాలకృష్ణ ప్రశ్నలకు సీఎం చంద్రబాబు సమయస్ఫూర్తి సమాధానాలు

ఈనాడు, అమరావతి: అన్‌స్టాపబుల్-4 సీజన్‌లో హోస్టుగా వ్యవహరించిన బాలకృష్ణ ప్రశ్నలు.. అతిథి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడి సమయస్ఫూర్తి సమాధానాలతో ప్రోమో విడుదలైంది. 'ఆహా'లో ఈనెల 25న పూర్తి నిడివి ప్రసారం కానుంది. బాలకృష్ణ అడిగిన ప్రశ్నలకు ఏపీ సీఎం చంద్రబాబు ఇచ్చిన సమాధానాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. రాజమహేంద్రవరం జైలులో ఉన్నప్పుడు చంద్రబాబుతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమావేశం, జైలుగోడల మధ్య ఏం జరిగిందనేది ప్రజలకు తెలియాలంటూ నటుడు బాలకృష్ణ అడగగా.. సీఎం చంద్రబాబు గద్గద స్వరంతో ఇచ్చిన సమాధానం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తోంది. 'రెండు నిమిషాలు పవన్ కల్యాణ్, నేను మాట్లాడుకున్నాం. ఒక నూతన చరిత్ర రాయడానికి చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నాం' అని ఆనాటి సమావేశాన్ని చంద్రబాబు ప్రస్తావించారు. అరెస్టు, జైల్లో గడిపిన క్షణాలపై బాలయ్య అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు స్పందించారు. ఆనాటి పరిస్థితులను వివరించారు. 'గీత దాటని మనిషి మీరు.. మీ కోసం వారు గీత దాటారు బావ. ఆ సమయంలో మీకు ముందే సమాచారం ఉందా?' అంటూ బాలకృష్ణ ప్రశ్నించగా.. 'నేను బస్సులో ఉన్నాను.. మిమ్మల్ని అరెస్టు చేశాం. రాత్రంతా తలుపు కొడితే తలుపు తీయలేదు' అని పోలీసులు అన్నట్లు సమాధానం చెబుతూ చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. చంద్రబాబును ఆన్‌లైన్‌లో మనవడు దేవాన్ష్ సైతం ప్రశ్నించారు. 'నేను మాస్ హీరో అయితే.. మీరు మాస్ లీడర్' అని బాలకృష్ణ వ్యాఖ్యానించగా.. 'బోత్ ఆర్ నాట్ సేమ్' అంటూ చంద్రబాబు విజయకేతనం చూపించారు. తన నినాదం ఇప్పుడు మారినట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. 'ఒకప్పుడు థింక్ గ్లోబల్.. యాక్ట్ లోకల్.. ఇప్పుడు థింక్ గ్లోబల్.. యాక్ట్ గ్లోబల్. ఎప్పటికైనా ప్రపంచంలో తెలుగుజాతి నంబర్‌వన్‌గా ఉండాలన్నదే నా ఆకాంక్ష' అని ప్రకటించారు.



ఊడిన పెచ్చులు

తరగతి గది పైకప్పు పెచ్చులు పడి విద్యార్థులకు గాయాలు

నాణ్యత లేని 'నాడు-నేడు' పనులే కారణం



గాయపడిన విద్యార్థిని శ్వేత

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ తరగతి గది పైకప్పు పెచ్చులూడిపడి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. మంగళవారం తరగతులు జరుగుతుండగా పైనున్న బీమ్ సిమెంట్ పెచ్చులు ఒక్కసారిగా ఊడి విద్యార్థులు శ్వేత, చెన్నకేశవలపై పడ్డాయి. శ్వేత తీవ్రంగా గాయపడగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కళాశాలకు వైకాపా హయాంలో రెండో విడత 'నాడు-నేడు' కింద రూ.77 లక్షలు మంజూరయ్యాయి. దూలాలకు ఉన్న పాత ప్లాస్టరింగ్ పైనే మరోసారి సిమెంటు పూయడంతో ఇప్పుడు అదే పెచ్చులుగా పడింది.

పేకాట ఆడకపోతే ఏమీ కాదులే: హైకోర్టు

ఈనాడు, అమరావతి: రెండు వారాలు పేకాట ఆడకపోతే ఆకాశమేమీ ఊడిపడదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి వ్యాజ్యాల్లో వాస్తవాలను తెలుసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులిస్తే పేకాటను కోర్టులు ప్రోత్సహిస్తున్నాయని ప్రజలు భావించే ప్రమాదం ఉందని తెలిపింది. 13 కార్డుల రమ్మీ ఆట నిర్వహణ విషయంలో పోలీసుల జోక్యాన్ని నిలువరించాలని కోరుతూ ఏలూరులోని కాస్మోపాలిటన్ క్లబ్, గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్ యాజమాన్యాలు వేసిన వ్యాజ్యాలపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

అక్రమార్జనకు మారుపేరు ఎంవీవీ

- 500 శాతం పెరిగిన మాజీ ఎంపీ ఆస్తులు
- జనసేన నేత పీతల మూర్తి యాదవ్ ధ్వజం



ఈడీ విడుదల చేసిన జాబితాను చూపుతున్న పీతల మూర్తి యాదవ్

విశాఖపట్నం (సీతంపేట), న్యూస్‌టుడే: 'గత ఐదేళ్లలో విశాఖ మహానగరాన్ని ఏలుకోమన్నట్లుగా నాటి వైకాపా ప్రభుత్వం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను జనం మీదకు వదిలేసింది. ఆయన నగరంలో ఖాళీ, ఎన్నారైల స్థలాలు ఎక్కడ కనిపించినా బెదిరించి సొంతం చేసుకున్నారు. 2019-2024 మధ్య ఆయన ఆస్తులు 500 శాతానికి మించి పెరిగాయంటే ఏ స్థాయి దోపిడీ జరిగిందో అర్థమవుతుంది' అని జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. 'ఎంవీవీ వ్యాపారాలతో పాటు ఆడిటర్ జీవీ వ్యాపారాలను బ్లాక్ లిస్టులో పెట్టాలి. ఆయన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదు. బెదిరింపులకు పాల్పడిన ఎంవీవీపై నగర పోలీస్ కమిషనర్ రౌడీషీట్ ఓపెన్ చేయాలి' విశాఖ పౌర గ్రంథాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పలుమార్లు మాజీ ఎంపీ దోపిడీపై గతంలో తాను చెప్పిన విషయాలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో తేలిందని అన్నారు. ఆయన ఇంట్లో స్టాంపు పేపర్లు ముద్రించే యంత్రం ఉందంటే ఏ స్థాయి నేరాలకు పాల్పడ్డారో అర్థమవుతోందని పేర్కొన్నారు. గత ఏడాది ఎంవీవీ కుటుంబం కిడ్నాప్ అయిన వ్యవహారం కట్టుకథ అని, దీనిపై పునఃవిచారణ జరిపిస్తే వాస్తవాలు బయటపడతాయని తెలిపారు. దీని వెనుక రూ.వందల కోట్ల వ్యవహారం నడిచిందని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరులో రూ. 3,000 కోట్లతో వ్యాపారాలు మొదలు పెట్టారు. అక్కడ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎంవీవీ, జీవీల వ్యాపారాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దర్యాప్తు చేయించాలని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఎంవీవీ నుంచే నిధులు వెళ్లాయని ఆయన ఆరోపించారు.



రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇరిగేషన్ ఈఎన్‌సీ రత్నకుమార్. చిత్రంలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్

జాతీయ జల పురస్కారాలు అందుకున్న విజేతలు

ఏపీ నుంచి 5 సంస్థలకు దక్కిన గౌరవం

ఈనాడు, దిల్లీ: కేంద్ర జల్‌శక్తిశాఖ 2023 సంవత్సరానికిగాను ప్రకటించిన 5వ జాతీయ జల అవార్డులను రాష్ట్రానికి చెందిన పలు సంస్థల ప్రతినిధులు అందుకున్నారు. మంగళవారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో.. విశాఖపట్నం దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్తమ జిల్లాగా ప్రథమ బహుమతి అందుకుంది. ఉత్తమ గ్రామపంచాయతీల కేటగిరీలో అనంతపురం జిల్లాలోని హంపాపురం మూడో బహుమతి, సంస్థల కేటగిరీలో గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 2వ, విశాఖపట్నానికి చెందిన శ్రీతిరుమలనగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ 3వ బహుమతి కైవసం చేసుకున్నాయి. తిరుపతి ఐఐటీ ప్రత్యేక అవార్డు గెలుచుకొంది. విశాఖపట్నం జిల్లా తరఫున కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇరిగేషన్ ఈఎన్‌సీ టీవీఎస్‌ఏ రత్నకుమార్ సంయుక్తంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా అవార్డు స్వీకరించారు. మొత్తం 9 కేటగిరీల్లో 38 మందిని విజేతలుగా ఎంపికచేయగా, అందులో ప్రథమ బహుమతి గెలుచుకున్నవారికి రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, మిగిలిన వారికి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అవార్డులు ప్రదానం చేశారు. జలసంరక్షణ అంశంలో ఆయా సంస్థలు చూపిన పనితీరుకు గుర్తింపుగా ఈ అవార్డులు అందజేసి సత్కరించారు.

మెట్రో రైల్ ప్రాజెక్టులకు కేంద్రమే పూర్తి నిధులివ్వాలి

- విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానించాలి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు మంత్రి నారాయణ విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. కోల్‌కతాలోని తూర్పు-పశ్చిమ మెట్రో కారిడార్లకు కేంద్రమే మొత్తం నిధులు సమకూర్చిన 2017 మోడల్‌ను పరిశీలించాలని కోరింది. రెండు రోజుల పర్యటనకు దిల్లీ వెళ్లిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో మంగళవారం సమావేశమయ్యారు. ప్రతిపాదిత మెట్రో రైల్ ప్రాజెక్టులతోపాటు అమృత్ పథకం పనులు తదితర అంశాలపై చర్చించారు. విజయవాడ మెట్రోను రాజధాని అమరావతికి అనుసంధానించే ప్రతిపాదనలు కూడా కేంద్రానికి ఇప్పటికే పంపినట్లు నారాయణ కేంద్ర మంత్రికి వివరించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన రెండు మెట్రో రైల్ ప్రాజెక్టులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అమృత్-2 పథకం గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలుకు నోచుకోలేదని నారాయణ తెలిపారు. పథకం అమలుకు ఉన్న మార్గాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. తమ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని నారాయణ తెలిపారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

ఈనాడు, అమరావతి: వైఎస్సార్ జిల్లాలో పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో చనిపోయిన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. వెంటనే బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అదితి సింగ్‌ను ఆదేశించినట్లు మంగళవారం ఆమె ఒక ప్రకటనలో వెల్లడించారు. ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అరెస్ట్ చేశామని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

EENADU Vol: 51, Iss: 73 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

హమాస్‌కు కొత్త చీఫ్ లేనట్లేనా!

ఇంటర్నెట్ డెస్క్: హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ మృతి అనంతరం ఆ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇస్మాయిల్ హనియే మరణించిన తర్వాత ఏర్పాటైన కమిటీనే తాజాగా పొలిటికల్ చీఫ్ బాధ్యతలను తీసుకోనున్నట్లు సమాచారం. సిన్వర్‌కు వారసుడిగా ఒక వ్యక్తికి బాధ్యతలు అప్పగించడం కంటే దోహా కేంద్రంగా కమిటీతోనే కార్యకలాపాలు సాగించాలని నిర్ణయించినట్లు హమాస్ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఎన్నికల వరకూ నూతన అధ్యక్షుడిని నియమించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇస్మాయిల్ హనియే చనిపోయిన తర్వాత ఏర్పడిన ఐదుగురు సభ్యుల కమిటీ అప్పటి వరకూ నాయకత్వం వహించనున్నట్లు సమాచారం. గతంలో గాజాకే పరిమితమైన సిన్వర్‌తో కమ్యూనికేషన్లలో ఏర్పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు హమాస్ వర్గాలు వెల్లడించాయి.

టెహ్రాన్‌లో జరిగిన దాడిలో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియే మృతి తర్వాత ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పడింది. దీనిలో గాజాకు ఖలీల్ అల్- హయ్యి, వెస్ట్‌బ్యాంక్‌కు జహెర్ జబరిన్, విదేశాల్లో సంస్థ కార్యకలాపాలకు ఖాలెద్ మషాల్ నాయకత్వం వహిస్తున్నారు. మరోవైపు సంస్థ షూరా సలహా మండలి అధిపతిగా మహ్మద్ దర్వీష్, రాజకీయ బ్యూరో చీఫ్‌గా మరో వ్యక్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆయన పేరును వెల్లడించలేదు. ప్రస్తుతం కమిటీలోని సభ్యులందరూ ఖతార్‌లో ఉన్నారు. యుద్ధం, అసాధారణ పరిస్థితుల్లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడం, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడం వంటి బాధ్యతలు ఈ కమిటీనే నిర్వహిస్తోంది.



ఇజ్రాయెల్ వైమానిక దాడులతో దక్షిణ లెబనాన్‌లోని టైర్ సిటీలో భవనాల మధ్య అలముకున్న పొగ

బయటపడిన నిధుల బంకర్

లెబనాన్‌లో హెజ్‌బొల్లా రహస్య బంకర్‌ను తాజాగా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. ఓ ఆసుపత్రి కింద ఉన్న ఈ సొరంగంలో భారీగా నోట్ల గుట్టలు, బంగారం ఉన్నట్లు సమాచారం ఉందని పేర్కొంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) అధికార ప్రతినిధి డేనియల్ హగారీ ఓ టీవీ ఛానల్‌లో మాట్లాడుతూ.. 'హెజ్‌బొల్లా ఆర్థిక మూలాలపై వరుసగా దాడులు చేస్తున్నాం. ఆదివారం నాటి దాడుల్లో ఓ బంకర్‌ను ధ్వంసం చేశాం. అందులో లక్షల డాలర్ల నగదు, బంగారాన్ని గుర్తించాం. ఇజ్రాయెల్‌పై దాడికి ఈ నగదును వినియోగిస్తున్నారు. బీరుట్ నడిబొడ్డున మరో రహస్య బంకర్ ఉంది. అల్-సాహెల్ ఆసుపత్రి కింద ఉన్న ఆ బంకర్‌లో మిలియన్ల కొద్దీ డాలర్లు, బంగారం గుట్టలు ఉన్నట్లు తెలిసింది. దానిపై మేం ఇంకా దాడి చేయలేదు' అని వెల్లడించారు. తమకు ఉన్న సమాచారం ప్రకారం.. ఆ బంకర్‌లో 500 మిలియన్ డాలర్ల నగదు (భారత కరెన్సీలో దాదాపు రూ.4,200 కోట్లకు పైమాటే), బంగారం గుట్టలు ఉన్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ బంకర్‌ను హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా ఎమర్జెన్సీ సమయాల్లో ఉపయోగించేవాడని అనుమానిస్తున్నట్లు తెలిపారు.

బ్లింకెన్ రాక

అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మంగళవారం ఇజ్రాయెల్ వచ్చారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఇది ఆయనకు 11వ పర్యటన. గాజాలో కాల్పుల విరమణ కోసం చర్చలు జరిపేందుకు ఆయన వచ్చారు. అయితే కాల్పుల విరమణకు అవకాశాలు చాలా స్వల్పమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

పాలస్తీనాకు మద్దతుగా వర్సిటీ పాలక భవనం ఆక్రమణ

మినియాపొలిస్: పాలస్తీనాకు మద్దతుగా అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా పాలక భవనాన్ని ఆక్రమించిన కొందరు విద్యార్థులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మధ్యాహ్నం సమయంలో కొందరు మోరిల్ హాల్‌లోకి దూసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆస్తులకు నష్టం కలిగించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను మూసివేశారు. ఆ తరువాత పోలీసులు వచ్చి ఆందోళనకారులను అరెస్టు చేశారు. 30 మంది లోపలికి వెళ్లగా భారీ సంఖ్యలో ఆందోళనకారులు బయట ఉన్నారు.

ఇజ్రాయెల్ ప్రతీకార దాడి చేస్తే బాధ్యత అమెరికాదే: ఇరాన్

నెతన్యాహు సర్కారు తమపై ప్రతీకార దాడులకు పాల్పడితే దానికి అమెరికానే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్, భద్రతా మండలి స్విస్ ప్రెసిడెన్సీలకు లేఖ రాశారు. ఇరాన్ క్షిపణి దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ దాడుల ప్రణాళికపై తనకు అవగాహన ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇటీవల ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ వ్యాఖ్యలపై అమీర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'తమపై ఇజ్రాయెల్ చేసే చట్టవిరుద్ధమైన సైనిక దురాక్రమణపై అమెరికా మౌనంగా ఉంటుందంటే ఆ దేశానికి మద్దతివ్వడమే అవుతుంది. బైడెన్ తాజా ప్రకటన తీవ్ర ఆందోళనకరమైనది. రెచ్చగొట్టే విధంగా ఉంది. అంతర్జాతీయ చట్టాలు, ఐరాస ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘిస్తూ ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేసే దురాక్రమణ చర్యలకు అమెరికా పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని ఇరావని ఆ లేఖలో పేర్కొన్నారు.

జల సంరక్షణ చర్యలు లేకపోతే సమాజ మనుగడ ఉండదు

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము


జాతీయ నీటి అవార్డుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రపతి

దిల్లీ: దేశంలో నీటి పరిరక్షణ చర్యలు చేపట్టకపోతే సమాజ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. భూగర్భ జలాల క్షీణత, పెరుగుతున్న కాలుష్యంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జలశక్తి మంత్రిత్వశాఖ నిర్వహించిన ఐదో జాతీయ నీటి అవార్డు కార్యక్రమంలో ముర్ము ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నీటి వనరులను కాపాడుకోవడం సమష్టి బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛమైన నీటిని పొందడం ప్రాథమిక మానవ హక్కు అని చెప్పారు. నీటి కొరత ఉన్నప్పటికీ జల సంరక్షణను నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. వ్యక్తిగత అవసరాలకు నీటి వనరులను ఆక్రమిస్తూ.. పురాతన గుర్తులను తుడిచేస్తున్నారని, ఫలితంగా కరవు సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె వాపోయారు.

దివ్యాంగుల హక్కులపై నూతన సవరణలు అమల్లోకి

దిల్లీ: దివ్యాంగుల హక్కుల నిబంధనలకు చేసిన నూతన సవరణలను కేంద్రప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. దివ్యాంగులకు మరింత సమర్థ సేవలను అందించేందుకు దివ్యాంగ ధ్రువపత్రాల, విశిష్ట దివ్యాంగ గుర్తింపు (యూడీఐడీ) కార్డుల దరఖాస్తు ప్రక్రియను క్రమబద్ధీకరించడం దీని లక్ష్యం. తాజా నిబంధనల ప్రకారం నిర్దిష్ట వైకల్యాలు గల వ్యక్తులు దివ్యాంగ ధ్రువపత్రాలు, యూడీఐడీ కార్డుల కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను వారివారి జిల్లా వైద్యాధికారులకు లేదా చికిత్స పొందే వైద్య కేంద్రాలకు సమర్పించొచ్చు. దీంతోపాటు వైకల్య స్థాయిలను గుర్తించేలా రంగుల చిహ్నాలు గల యూడీఐడీ కార్డులను తీసుకొస్తున్నారు. ఆ ప్రకారం 40 శాతం కంటే తక్కువ వైకల్యం గలవారికి తెలుపు, 40-79 గలవారికి పసుపుపచ్చ, 80 శాతం మించిన వారికి నీలం రంగు కార్డులను అందిస్తారు. అంతేకాకుండా వ్యక్తుల వైకల్యం నిర్ధారణ అయిన మూడు నెలలులోగా వైద్యాధికారులు సంబంధితులకు దివ్యాంగ ధ్రువపత్రాలు, యూడీఐడీ కార్డులను తప్పక జారీ చేయాలి.

నెతన్యాహు ఇంటిపై మేమే దాడి చేశాం: హెజ్‌బొల్లా

బీరుట్: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇంటిపై దాడి చేసింది తామేనని హెజ్‌బొల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ అఫీఫ్ తెలిపాడు. ఈ ఘటనలో నెతన్యాహు గాయపడకుంటే మరిన్ని అటువంటి దాడులు చేస్తామని వెల్లడించాడు. మంగళవారం అతడు బీరుట్‌లో మీడియాతో మాట్లాడాడు. నెతన్యాహు ఇంటిపై దాడికి తమదే పూర్తి బాధ్యతని తెలిపాడు. హెజ్‌బొల్లా సొంతంగానే ఈ దాడి చేసిందని వివరించాడు.

ఇరాక్‌లో ఇస్లామిక్ స్టేట్ కమాండర్ హతం

మరో 8 మంది సీనియర్లూ..

బాగ్దాద్: ఇరాక్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ నేతతోపాటు (కమాండర్) 8 మంది సీనియర్లను భద్రతా దళాలు హతమార్చాయి. సలాహుద్దీన్ ప్రావిన్సులోని హమ్రిన్ కొండల్లో మంగళవారం ఉగ్రవాద నిరోధక దళంతోపాటు జాతీయ భద్రత సర్వీస్ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఉగ్ర నేతలు హతమయ్యారు. ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్-సుదానీ ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. భద్రతా దళాల దాడుల్లో ఇస్లామిక్ స్టేట్ నేత జాసిం అల్-మజ్రోయీ అబు అబ్దుల్ ఖాదర్ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. దేశంలో ఉగ్రవాదానికి చోటు లేదని, ఎక్కడ దాక్కున్నా వెంటాడి తుదముట్టిస్తామని స్పష్టం చేశారు.

అమెరికాలో కాల్పులు.. ఒకే ఇంట్లో ఐదుగురి మృతి

ఫాల్‌సిటీ: అమెరికాలోని ఓ ఇంట్లో చోటుచేసుకున్న కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. వాషింగ్టన్‌లోని ఫాల్‌సిటీలో సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. కాల్పులు జరిగిన సమాచారాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఐదుగురు చనిపోయినట్లు గుర్తించారు. ఓ యువకుడిని అదుపులోకి తీసుకోగా, గాయపడిన మరో యువకుడిని ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఇద్దరు పెద్దవాళ్లు, ముగ్గురు టీనేజర్లు ఉన్నారని వారు తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్యే ఈ కాల్పులు చోటు చేసుకుని ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

మధ్యప్రదేశ్ ఆర్డినెన్స్ కర్మాగారంలో పేలుడు

ఒకరి మృతి.. 12 మందికి గాయాలు

జబల్పుర్: మధ్యప్రదేశ్‌లోని జబల్పుర్ జిల్లాలోని ఖమారియా ఆర్డినెన్స్ కర్మాగారంలో మంగళవారం సంభవించిన శక్తిమంతమైన పేలుడులో ఒకరు మృతి చెందగా 12 మందికి పైగా గాయపడ్డారు. మరొకరి ఆచూకీ గల్లంతైంది. బాంబుల్లో పేలుడు పదార్థాలను నింపుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కొన్ని కిలోమీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించింది. ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. ప్రమాద కారణాలు తెలుసుకునేందుకు విచారణ మొదలైంది.

బిష్ణోయ్‌ని ఎన్‌కౌంటర్ చేస్తే రూ.కోటి నజరానా: కర్ణిసేన

ముంబయి: మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దీఖీ హత్య కేసులో నిందితుడిగా జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ని ఎన్‌కౌంటర్ చేసే పోలీసులకు రూ.కోటికి పైగా నజరానా ఇస్తామని క్షత్రియ కర్ణిసేన జాతీయ అధ్యక్షుడు రాజ్ షెకావత్ ప్రకటించారు. ''బిష్ణోయ్ ముఠా ఎన్ని హత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. అందుకే అతడిని ఎన్‌కౌంటర్ చేసిన ఏ పోలీసు అధికారికైనా వారి భద్రత, కుటుంబ భవిష్యత్తు కోసం రూ.కోటికి పైగా ఇస్తాం. మా అధినేత సుఖ్‌దేవ్ సింగ్‌ని చంపినవారిని వదిలేది లేదు'' అని పేర్కొంటూ విడుదల చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. 2023 డిసెంబరులో సుఖ్‌దేవ్ సింగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఈ హత్యను తామే చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ ముఠా ఆ తర్వాత ప్రకటించింది. తాజాగా బాబా సిద్దీఖీని హత్య చేసింది కూడా తామేనని ఈ ముఠా వెల్లడించింది.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ ప్రాంతంలో ఉన్న బాబీనా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో 'స్వావలంబన్ శక్తి' పేరుతో సైన్యం మంగళవారం నిర్వహించిన విన్యాసాల్లో ఆకట్టుకున్న సరకులను మోసుకెళ్లే రోబోటిక్ కంచర గాడిద, డ్రోన్

తైవాన్ సమీపంలో చైనా యుద్ధవిన్యాసాలు

తైపీ: తైవాన్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. చైనా మరోసారి యుద్ధవిన్యాసాలకు దిగింది. తైవాన్‌తో సరిహద్దు కలిగిన దక్షిణ ఫుజియాన్ ప్రావిన్స్‌లోని పింగ్టాన్ దీవులకు సమీపంలోని ప్రాంతం ఇందుకు వేదికైంది. ఈ విన్యాసాల్లో భారీగా మందుగుండు సామగ్రిని కూడా పరీక్షించారు. తైవాన్ చుట్టూ చైనాకు చెందిన 153 యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టిన వారం రోజుల్లోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. తాజా విన్యాసాలపై చైనాకు చెందిన సముద్ర భద్రతా విభాగం.. అంతర్జాతీయ వాణిజ్యనౌకలను అప్రమత్తం చేసింది. ''పింగ్టాన్ దీవుల సమీపంలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు లైవ్ ఫైర్ విన్యాసాలు జరుగుతాయి. నౌకలు ఆ ప్రాంతానికి దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం'' అని పేర్కొంది. ఇవి చైనా వార్షిక యుద్ధ విన్యాసాల్లో భాగమని, వాటిని జాగ్రత్తగా గమనిస్తున్నామని తైవాన్ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ చర్యలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగే అవకాశాలను తోసిపుచ్చలేమని స్పష్టంచేసింది.

రష్యాలోని ఉత్తర కొరియా సైన్యాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

- దక్షిణ కొరియా డిమాండ్

సియోల్: రష్యాలో మోహరించిన ఉత్తర కొరియా దళాలను వెంటనే ఉపసంహరించుకోవాలని దక్షిణ కొరియా డిమాండ్ చేసింది. లేదంటే ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని తామూ పరిగణించవచ్చని దక్షిణ కొరియా అధికారి ఒకరు తెలిపారు. ఉత్తర కొరియా తన అణు క్షిపణుల కోసం అధునాతన రష్యా సాంకేతికతను పొందేందుకు యత్నిస్తోందని ఆయన ఆరోపించారు. రష్యాకు ఉత్తర కొరియా చేసే సాయం తమ దేశానికి భద్రతపరంగా తీవ్రముప్పును కలిగిస్తుందన్నారు. ఉక్రెయిన్‌పై పోరాడేందుకు ఉత్తర కొరియా ఈ నెలలో రష్యాకు 1,500 మందిని ప్రత్యేక దళంగా పంపినట్లు దక్షిణ కొరియా గూఢచార సంస్థ ధ్రువీకరించింది. 2023 ఆగస్టు నుంచి రష్యాకు 13 వేల ఆయుధాలను పంపిందని తెలిపింది. రష్యా రాయబారి జార్జి జినోవిచ్‌తో సమావేశమైన దక్షిణ కొరియా విదేశాంగ ఉపమంత్రి కిమ్ హాంగ్ క్యూన్.. ఉత్తర కొరియా చర్యను తీవ్రంగా ఖండించారు. ఉత్తర కొరియాతో తమ సహకారం దక్షిణ కొరియా భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకం కాదని జినోవిచ్ స్పష్టంచేశారు.

వయనాడ్‌కు ప్రియాంక కంటే మంచి ప్రతినిధిని ఊహించలేం: రాహుల్

దిల్లీ: కేరళలోని వయనాడ్‌కు తన సోదరి ప్రియాంకా గాంధీ కంటే మంచి ప్రతినిధిని ఊహించలేమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వయనాడ్ ఉప ఎన్నికల్లో తన సోదరి పోటీ చేయడంపై మంగళవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'వయనాడ్ ప్రజలకు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది. వారికి నా సోదరి ప్రియాంక కంటే మెరుగైన ప్రతినిధిని ఊహించలేను. ఆమె వయనాడ్ సమస్యలను పార్లమెంటులో వినిపించే శక్తిమంతమైన గొంతుక అవుతుందని నేను ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ప్రియాంకా గాంధీ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

రాజకీయానుభవం నాకే ఎక్కువ: నవ్య హరిదాస్



వయనాడ్: ప్రియాంకా గాంధీ కంటే తనకే రాజకీయానుభవం ఎక్కువని కేరళలోని వయనాడ్ భాజపా అభ్యర్థి నవ్య హరిదాస్ స్పష్టం చేశారు. పదేళ్లుగా కౌన్సిలర్‌గా సేవలందిస్తున్నానని, అంతకుముందు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా సింగపూర్, నెదర్లాండ్స్‌లలో పనిచేశానని తెలిపారు. ప్రియాంకా గాంధీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నా ఆమెకు ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం లేదని పేర్కొన్నారు. మంగళవారం ఓ వార్తాసంస్థకు నవ్య ఇంటర్వ్యూ ఇచ్చారు. 'నెహ్రూ కుటుంబ వారసత్వం కారణంగా ప్రియాంక జాతీయ నేతగా ఉన్నారు. కానీ ఆమెకది తొలి ప్రత్యక్ష ఎన్నిక. మరోవైపు నేను రెండు దఫాలుగా కోజికోడ్‌లో కౌన్సిలర్‌గా ఉన్నా. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశా. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. అందువల్ల ప్రియాంకా గాంధీపై పోటీ చేయడంలో నాకు పెద్దగా తేడా కనిపించడం లేదు' అని నవ్య హరిదాస్ పేర్కొన్నారు.


రష్యాలోని కజన్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మంగళవారం నిర్వహించిన విందులో పాల్గొన్న దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, చైనా, రష్యా అధ్యక్షులు జిన్‌పింగ్, పుతిన్, భారత ప్రధాని మోదీ, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా ఎల్‌సిసి

ప్రత్యేక దివ్యాంగులకు నెలకు రూ.5 వేల సాయం

దిల్లీ ప్రభుత్వ నిర్ణయం

దిల్లీ: గరిష్ఠస్థాయి ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు నెలకు రూ.5000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని దిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మంగళవారం వెల్లడించారు. ఈ సాయం పొందడానికి 60 శాతం శారీరక వైకల్యం గల వ్యక్తులు అర్హులు. నెలరోజుల్లో నూతన సహాయపథకాన్ని అమల్లోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు. దీనికి లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం అవసరం లేదని భావిస్తున్నట్లు చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దిల్లీలో 2.34 లక్షల మంది దివ్యాంగులు ఉండగా వారిలో 9,500 నుంచి 10 వేల మంది గరిష్ఠస్థాయి అవసరాలు కలిగినవారు ఉన్నారని అంచనా.

ఝార్ఖండ్‌లో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

రాంచీ: ఝార్ఖండ్‌లో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. 38 నియోజకవర్గాల్లో రెండో విడతలో భాగంగా నవంబరు 20వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ నెల 29 వరకూ నామినేషన్లను స్వీకరిస్తారు. 30వ తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. ఉపసంహరణకు నవంబరు 1 వరకూ గడువుంటుంది. రెండో విడతలో 27 జనరల్, 8 ఎస్టీ, 3 ఎస్సీ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

మలయాళ నటుడు సిద్దీఖీకి సుప్రీంకోర్టులో మళ్లీ ఊరట

దిల్లీ: మలయాళ సినీనటుడు సిద్దీఖీని అరెస్టు చేయకుండా సెప్టెంబరు 30న కల్పించిన తాత్కాలిక రక్షణను సుప్రీంకోర్టు మంగళవారం పొడిగించింది. తాను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఈ రక్షణ కొనసాగుతుందని తెలిపింది. 350 సినిమాల్లో నటించిన సిద్దీఖీ లైంగిక వేధింపుల ఆరోపణల కేసును ఎదుర్కొంటున్నాడు. కేసు దర్యాప్తునకు ఆయన సహకరించడం లేదని కేరళ పోలీసులు కోర్టుకు తెలిపారు. సిద్దీఖీకి అరెస్టు నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వడంతో అతడు బాధితురాలిని, చిత్ర పరిశ్రమలో మరికొందరిని బెదిరిస్తున్నాడని వెల్లడించారు. హేమ కమిటీ నివేదిక బయటకు వచ్చాక తమకు జరిగిన అన్యాయాలను తెలపడానికి బాధితులు ధైర్యంగా ముందుకొస్తున్నారని, సిద్దీఖీకి తాత్కాలిక రక్షణ లభించడంతో వారంతా ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారని పోలీసుల తరఫు న్యాయవాది రంజిత్ కుమార్ కోర్టుకు విన్నవించారు. పోలీసులు దాఖలు చేసిన నివేదికకు రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని సిద్దీఖీని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది.

'ముస్లిం పర్సనల్ లా' ప్రకారం.. పురుషుడు నాలుగు పెళ్లిళ్లు చేసుకోవచ్చు

బాంబే హైకోర్టు తీర్పు

ముంబయి: ముస్లిం పర్సనల్ లా ప్రకారం ఆ మతానికి చెందిన పురుషులు ఒకటి కంటే ఎక్కువ వివాహాలు చేసుకోవచ్చునని బాంబే హైకోర్టు తెలిపింది. మూడో పెళ్లి చేసుకున్న వ్యక్తికి వివాహ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఠాణే మునిసిపల్ కార్పొరేషన్ వివాహ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఆదేశిస్తూ ఈ విషయం స్పష్టం చేసింది. అల్జీరియా మహిళను తాను మూడో భార్యగా స్వీకరిస్తున్నాననీ, తమ వివాహాన్ని రిజిస్టర్ చేసి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఓ ముస్లిం పురుషుడు ఠాణేలోని వివాహ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి గత ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ మహారాష్ట్ర వివాహాల చట్టం ఒక్క పెళ్లిని మాత్రమే గుర్తిస్తుందనీ, ఇది మూడో వివాహం కాబట్టి సాధికారంగా నమోదు చేసేది లేదని అధికారులు స్పష్టంచేశారు. దీంతో ముస్లిం దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. ముస్లిం పురుషులు నలుగురు భార్యలను కలిగి ఉండవచ్చని ముస్లిం వైయక్తిక చట్టం అనుమతిస్తున్నదని న్యాయస్థానం పేర్కొంది. దంపతుల నుంచి కావలసిన పత్రాలన్నీ స్వీకరించి, వారి వివాహాన్ని అనుమతిస్తున్నట్లు కానీ లేదా నిరాకరిస్తున్నట్లు కానీ 10 రోజుల్లో తెలపాలనీ, తమ నిర్ణయానికి కారణాలను వివరించాలని హైకోర్టు ఆదేశించింది.

నేరాన్ని అంగీకరించిన కనిష్క నిందితుడి హంతకులు

- 31న ఖరారు కానున్న శిక్ష

అట్టావా: ఎయిరిండియా కనిష్క విమానంలో పేలుడుకు కారకుడనే ఆరోపణ నుంచి విముక్తుడైన సిక్కు వ్యక్తి రిపు దమన్ సింగ్ మాలిక్‌ను హత్య చేశామని ఇద్దరు వ్యక్తులు సోమవారంనాడు కెనడాలోని బ్రిటిష్ కొలంబియా సుప్రీంకోర్టులో ఒప్పుకొన్నారు. 1985లో కనిష్క విమానంలో సూట్‌కేసు బాంబు పేలి అందులో ప్రయాణిస్తున్నవారంతా చనిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మాలిక్ (75)ను 2022 జులై 14న అతడి దుకాణం ఎదుటే ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్చి చంపారు. ఆ హత్య చేసింది తామేనని ట్యానర్ ఫాక్స్, హోసే లోపెజ్‌లు ఒప్పుకున్నారు. వాళ్లకు 20 ఏళ్ల వరకు పెరోల్ లభించదు. ఈ నెల 31న జరిగే తదుపరి విచారణలో వారిద్దరికీ శిక్ష ఖరారు చేస్తారు. మాలిక్‌ను హతమార్చినందుకు వారిద్దరికీ డబ్బు ముట్టిందనే సంగతి తప్ప మిగతా వివరాలేమీ తెలియడం లేదని లోపెజ్ తరఫు న్యాయవాది గ్లోరియా ఎన్గ్ చెప్పారు.

ఆనాడు అలా గాలిలో కలిసిపోయిన ప్రాణాలు

1985 జూన్ 23న 329 మంది ప్రయాణికులతో ఎయిరిండియా కనిష్క విమానం కెనడాలోని టొరంటో నుంచి బొంబాయి (ముంబయి)కి బయలుదేరింది. ప్రయాణికుల్లో 24 మంది భారత పౌరులు కాగా, 289 మంది కెనడా పౌరులు. విమానం మాంట్రియల్‌లో ఆగి, అక్కడి నుంచి అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా లండన్ బయల్దేరింది. సముద్రంపై 31,000 అడుగుల ఎత్తున పయనిస్తుండగా విమానంలో సూట్‌కేసు బాంబు పేలి ప్రయాణికులందరూ చనిపోయారు. మరో సూట్‌కేసు బాంబును జపాన్ నుంచి బయల్దేరిన ఎయిరిండియా విమానంలో పెట్టాలని చూశారు. కానీ టోక్యో విమానాశ్రయంలోనే అది పేలిపోయి ఇద్దరు సిబ్బంది మరణించారు. ఈ రెండు పేలుళ్లకు మాలిక్, అజైబ్ సింగ్ బాగ్రిలు కారకులని కేసు పెట్టినా, వారిద్దరినీ 2005లో దోషవిముక్తులుగా ప్రకటించి విడిచిపెట్టారు.

వీడ్కోలు కౌగిలింత మూడు నిమిషాలు మించొద్దు

న్యూజిలాండ్ విమానాశ్రయంలో ఆంక్షలు

వెల్లింగ్టన్: ఉద్యోగం లేదా పర్యాటకానికి సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు ఆశ్రయించేది విమానాలనే. విమానాశ్రయాల్లో వారికి వీడ్కోలు పలికేందుకు కుటుంబ సభ్యులూ, స్నేహితులూ వస్తుంటారు. తమను వదిలి వెళ్లేవారికి జాగ్రత్తలు చెప్పడం, ఆలింగనం చేసుకుని ప్రేమను వ్యక్తపరచడం సర్వసాధారణం. ఈ కౌగిలింతల కార్యక్రమం సుదీర్ఘంగా సాగుతుండటంతో ఇతరులకు ఇబ్బంది కలుగుతోందని న్యూజిలాండ్‌లోని డ్యూన్‌డిన్ నగర విమానాశ్రయ అధికారులు భావించారు. వీడ్కోలు కౌగిలింతలను మూడు నిమిషాల్లోనే ముగించాలని విమానాశ్రయం బయట హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు! 'మనల్ని ఉత్తేజపరిచే ఆక్సిటోసిన్, సెరొటోనిన్ హార్మోన్ల విడుదలకు 20 సెకన్ల గాఢ పరిష్వంగం చాలు. అంతకుమించిన కౌగిలింత ఇబ్బందికరమైనదే' అని ఎయిర్‌పోర్టు సీఈవో డానియెల్ డె బోనో పేర్కొన్నారు. ఎవరైనా ఈ నిబంధనను అతిక్రమిస్తే పోలీసులను పిలవబోమని, పార్కింగ్ లాట్‌లోకి వెళ్లాలని వారికి సూచిస్తామన్నారు.

యూపీలో ఆక్సిజన్ సిలిండర్ పేలి కుటుంబంలోని ఆరుగురి మృతి



బులంద్‌శహర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌శహర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు అందిస్తున్న ఆక్సిజన్ సిలిండర్ పేలడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. బులంద్‌శహర్ జిల్లాలోని సికంద్రాబాద్ ప్రాంతంలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. 19 మంది నివసిస్తున్న రెండంతస్తుల భవనంలో సిలిండర్ పేలి ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. దీంతో మూడేళ్ల చిన్నారి సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

ఈనాడు సినిమా



సల్మాన్ ఖాన్

సింగమ్ అగైన్‌లో చుల్‌బుల్‌పాండే

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ డ్రామా చిత్రం 'సింగమ్ అగైన్'. కాప్ యూనివర్స్ నేపథ్యంలో దర్శకుడు రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్నారు. 'సింగమ్' ఫ్రాంచైజీలో భాగంగా రూపొందుతున్న చిత్రమిది. ఇందులో రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్, కరీనా కపూర్, దీపికా పదుకొణె తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ కథానాయకుడు సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో మెరవనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. పోలీసు అధికారి చుల్‌బుల్ పాండేగా సినీ ప్రియుల్ని సల్మాన్ విశేషంగా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. 'సింగమ్ అగైన్'లో సల్మాన్ మళ్లీ చుల్‌బుల్‌పాండే పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. మంగళవారం ముంబయిలో అజయ్ దేవగణ్‌తో కలిసి సల్మాన్ షూటింగ్‌లో పాల్గొన్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా చిత్ర వర్గాలు తెలిపాయి. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌తో సినీ ప్రియులను ఆకట్టుకున్న ఈ చిత్రం వచ్చే నెల 1న విడుదల కానుంది.



ప్రభాస్

అల్లు అర్జున్



పవన్ కల్యాణ్

వాణిజ్య సినిమాలో కనిపించే ఓ ప్రధానమైన హంగు... ప్రత్యేక గీతం. తారలతో కళకళలాడే సినిమాకి అదొక అదనపు ఆకర్షణ. ఐటెమ్ సాంగ్ అనీ, డ్యాన్స్ నంబర్ అనీ రకరకాల పేర్లతో చలామణీ అవుతున్న ఈ పాట మొదలైందంటే చాలు సినిమాకి ఓ ఊపొస్తుంది. థియేటర్లో కూర్చున్న ప్రేక్షకుడికి పూనకాలొస్తాయి. మాస్ పాటంటేనే అభిమానులు ఊగిపోతారు. ఇక ప్రత్యేక గీతం అంటే ప్రత్యేకంగా చెప్పాలా? క్లాస్ అయినా, మాస్ అయినా ఊ అంటారే తప్ప, ఉఊ అనలేరు. అందుకే ఏ కాస్త అవకాశం ఉన్నా, ప్రత్యేక గీతాన్ని జోడించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతుంటాయి. అగ్ర తారల సినిమాల్లో ఇదొక తప్పనిసరి వాణిజ్య హంగు. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న చాలా సినిమాల్లోని ప్రత్యేక గీతాలు ప్రేక్షకుడిని ఊరిస్తున్నాయి.

ఆకర్షణ 'ప్రత్యేకం'

తారల చిత్రాల్లో ఊరిస్తున్న ఐటెమ్ పాట

ప్రత్యేక గీతాలు కొత్త కాదు. బ్లాక్ అండ్ వైట్ కాలం నుంచీ ఉన్నవే. హెలెన్, జ్యోతిలక్ష్మి, జయమాలిని, సిల్క్‌స్మిత మొదలుకొని ముమైత్‌ఖాన్ వరకూ ఇలా ఎంతోమంది తారలు ఆ పాటలతో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించారు. ఆ పాటల్లో ఆడిపాడేందుకు ఒకప్పుడు ప్రత్యేకంగా కథానాయికలు ఉండేవాళ్లు. క్లబ్ పాటలన్నా, గాఢతతో కూడిన పాటలన్నా వాళ్లే గుర్తొచ్చేవాళ్లు. క్రమంగా ఆ పాటలు అదనపు గ్లామర్‌ని అద్దుకోవడం మొదలైంది. ప్రధాన కథానాయికలు సైతం ప్రత్యేక గీతంలో ఆడిపాడుతూ ప్రేక్షకుల్ని ఆకర్షించడం నేటి ట్రెండ్. ప్రత్యేక గీతాల కోసమే రూ.కోట్లు పారితోషికం ఇస్తూ, ప్రత్యేకమైన సెట్స్ తీర్చిదిద్దుతూ తెరకెక్కిస్తున్నారు. సినిమాలో కథానాయిక ఎవరనే విషయం కంటే, ప్రత్యేక గీతంలో ఆడిపాడే కథానాయిక ఎవరన్నదే ఇప్పుడు ఎక్కువ ఆసక్తిని రేకెత్తించే అంశంగా మారిపోయింది. 'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా మావా...' అంటూ సమంత చేసిన సందడి అంతా ఇంతా కాదు. అందుకే ఇప్పుడు 'పుష్ప 2' సినిమాలో ప్రత్యేక భామ ఎవరనేది ఆసక్తికరంగా మారిపోయింది. చిరంజీవి 'విశ్వంభర', ప్రభాస్ 'రాజాసాబ్', పవన్‌కల్యాణ్ 'హరి హర వీర మల్లు' సినిమాల్లో ప్రత్యేక గీతాలు ఊరిస్తున్నాయి.

ప్రభాస్‌తో త్రిప్తి దిమ్రీ?

పాన్ ఇండియా సినిమాల కారణంగా కొంతకాలంగా ప్రభాస్ పీరియాడిక్ సినిమాలు, భారీ సినిమాలు చేస్తూ వస్తున్నారు. దాంతో మునుపటి ఆయన స్టైలిష్ అవతారాన్ని అభిమానులు బాగా మిస్ అయ్యారు. అది గమనించిన దర్శకుడు మారుతి 'రాజా సాబ్' సినిమాతో ప్రభాస్‌ని ఓ కొత్త జోనర్ కథలోనూ, మునుపటిలా స్టైలిష్ అవతారంలోనూ ఆవిష్కరించే ప్రయత్నానికి పూనుకున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు డార్లింగ్ అభిమానుల్ని సంతోషపెట్టాయి. ఇందులోనూ హుషారైన ఓ ప్రత్యేక గీతానికి చోటుంది. ఆ పాట కోసం బాలీవుడ్ తార, 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రీని సంప్రదించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. బుధవారం ప్రభాస్ పుట్టినరోజు. 'రాజాసాబ్'లోని స్టైలిష్ లుక్‌ని రెండు రోజులు ముందే విడుదల చేసి అభిమానుల్లో జోష్‌ని నింపింది చిత్రబృందం. బుధవారం గ్లింప్స్‌ని కూడా విడుదల చేయనుంది.

అస్సలు తగ్గకూడదని...

'పుష్ప2' సినిమాలోని ప్రత్యేక గీతం కోసం కసరత్తులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలి సినిమాలోని 'ఊ అంటావా...' పాటకి ఏమాత్రం తగ్గకుండా ఉండేలా చిత్రబృందం జాగ్రత్తలు తీసుకొంటోంది. ఈ పాటలో అల్లు అర్జున్‌తో కలిసి ఆడిపాడే భామ ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పలువురు తారల పేర్లు వినిపించినా, తాజాగా బాలీవుడ్ సంచలనం శ్రద్ధాకపూర్‌ని సంప్రదించినట్టు తెలుస్తోంది. 'పుష్ప' పాన్ ఇండియాస్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా తెరకెక్కుతున్న 'పుష్ప2'పై ప్రపంచ స్థాయిలో అంచనాలున్నాయి. అందుకు తగ్గట్టుగానే ప్రత్యేక గీతం సహా ఇతర హంగులన్నిటినీ జోడిస్తున్నారు.

మెగా హంగామా

చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. త్రిష, ఆషికా రంగనాథ్ సహా పలువురు కథానాయికలు ఇందులో సందడి చేస్తున్నారు. ఈ చిత్రంలో ఓ ప్రత్యేక గీతానికి చోటుందని చిత్రబృందం చెబుతోంది. అందులో ఆడిపాడనున్న కథానాయిక ఎవరనేది తేలాల్సి ఉంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న పీరియాడిక్ చిత్రం 'హరి హర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. ఇందులోనూ ఓ ప్రత్యేక గీతం ఉంటుంది. అందులో పవన్‌కల్యాణ్‌తో కలిసి అనసూయ ఆడిపాడనున్నారు. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'మట్కా' కూడా పీరియాడిక్ కథే. ఇందులో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి కథానాయికలు. నోరా ఫతేహి ఇందులో ఓ నృత్య తారగా కనిపిస్తూ సందడి చేయనున్నారు. ఆమె, వరుణ్‌పై తెరకెక్కించిన 'లే లే రాజా...' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని ఇటీవలే విడుదల చేశారు. ప్రత్యేక గీతాలు సినిమాల ఫలితాల్ని మార్చలేవు కానీ, ప్రభావం చూపిస్తాయని దర్శకనిర్మాతలు బలంగా నమ్ముతుంటారు. మంచి సినిమాలో, ఆకట్టుకునే ప్రత్యేక గీతం కూడా ఉందంటే ప్రేక్షకుడు మళ్లీ మళ్లీ థియేటర్‌కి వెళ్లే అవకాశాలు ఉంటాయి. అలా వసూళ్లపైనా గణనీయమైన ప్రభావం చూపిస్తాయి. ప్రచారానికీ ప్రత్యేక గీతాలు ఈ మధ్య బాగా ఉపయోగపడుతున్నాయి. ఫలానా సినిమాలో ఫలానా స్టార్ ప్రత్యేకగీతం చేసిందట అనే సంగతి ప్రేక్షకుల్లోకి వెళ్లిందంటే ఆ సినిమాపై ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడుతుంది. అందుకే దర్శకనిర్మాతలు ఐటమ్ గీతాలపై ప్రత్యేకమైన దృష్టి పెడుతున్నారు.

ఇందులోని భావోద్వేగాలు కదిలిస్తాయి



నిశాంక్, సాహిత్, సందీప్ రెడ్డి, అనన్య, యువ చంద్ర

"గ్రామీణ నేపథ్యంలో వచ్చిన సినిమాల్లో 'రంగస్థలం' తర్వాత నేను చూసిన మంచి సినిమా 'పొట్టేల్'. ఇటీవల కాలంలో యువ దర్శకులెవరూ ఇలాంటి సినిమా చేయలేదనుకుంటా" అన్నారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి తెరకెక్కించిన చిత్రమే 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్ కుమార్ సడిగే సంయుక్తంగా నిర్మించారు. అజయ్ ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "ఇది మంచి థియేట్రికల్ అనుభూతిని అందించే చిత్రం. ఇందులోని భావోద్వేగాలు ప్రేక్షకుల మనసుల్ని కదిలించేలా ఉంటాయి. తప్పకుండా ఇది అందరి మదిలో నిలిచిపోతుంది" అన్నారు హీరో యువ చంద్ర. ఈ కార్యక్రమంలో అజయ్, పెంచల్ దాస్, నోయెల్, శేఖర్ చంద్ర, శశి, సురేశ్, నిశాంక్ తదితరులు పాల్గొన్నారు.

కథల్నే నమ్ముకుని ప్రయాణం



సతీశ్

"తెలుగు ప్రేక్షకులకు కథే ముఖ్యం. బలమైన కథల్నే నమ్ముతూ సినీ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నా" అన్నారు సెవెన్‌హిల్స్ సతీశ్. ఓటీటీలో విడుదలైన 'బట్టల రామస్వామి బయోపిక్'తోపాటు, 'అందరి బంధువయా' చిత్రాల్ని నిర్మించారీయన. ప్రస్తుతం ఆర్.పి.పట్నాయక్ దర్శకత్వంలో 'కాఫీ విత్ ఎ కిల్లర్', పి.నవీన్ కుమార్ దర్శకత్వంలో 'సోలోబాయ్' చిత్రాల్ని నిర్మిస్తున్నారు. "జీరో నుంచి హీరోగా ఎదిగిన ఓ కుర్రాడి కథతో 'సోలో బాయ్', క్రైమ్ థ్రిల్లర్ కథతో 'కాఫీ విత్ ఎ కిల్లర్' రూపొందుతోంది. విభిన్నమైన కథలతో రూపొందుతున్న ఈ చిత్రాల విడుదల తేదీల్ని త్వరలోనే ప్రకటిస్తామ"ని సతీశ్ తెలిపారు.

నా మార్గమే సరైందని నిరూపించింది పురస్కారం

"చిత్రపరిశ్రమలో మంచి స్థాయిలో ఉండి విజయాన్ని అందుకోవడమే విమర్శకులకు నేనిచ్చే సమాధానం" అని అంటోంది కథానాయిక నిత్యామేనన్. సినిమాల్లో పక్కింటి అమ్మాయిలా ఉండే పాత్రల్ని పోషిస్తూ తన సహజమైన నటనతో అభిమానుల్ని అలరిస్తుంటుంది. కథల ఎంపికలో ప్రత్యేకతను చూపించే ఈ భామ.. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ అవార్డును అందుకొని అందరి దృష్టినీ ఆకర్షించింది. కానీ నిత్యకు జాతీయ పురస్కారం రావడంపై కొన్ని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్య ఈ విమర్శల గురించిన సంగతులతో పాటు కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.



నిత్యా మేనన్

ఇప్పటికీ ఈ సినిమాకు జాతీయ అవార్డును అందుకోవడంపై విమర్శలు వస్తూనే ఉన్నాయని తెలుసు. నాకు ఈ అవార్డు వచ్చినప్పుడు నేను జ్యూరీలోని కొంత మంది సభ్యులను కలిశాను. కేవలం ఇది సినిమాకు మాత్రమే ఇచ్చిన అవార్డు కాదు. నాలో ఉన్న కళాకారిణికి ఇచ్చిందని అప్పుడర్థమైంది. అయినా నేను కెరీర్‌లో ఎప్పుడూ కష్టమైన మార్గాన్నే ఎంచుకుంటాను. అందుకే ఇలాంటి అవార్డును గొప్పగా భావిస్తాను. కొన్ని సార్లు పరిశ్రమలో నేను నంబర్ వన్ కాలేనప్పటికీ.. ఆ పాత్రలతో పేరు ప్రఖ్యాతులను పొందలేనని తెలిసినా కొన్ని సినిమాల్లో నటించడానికి అంగీకరించాను. కానీ ఈ పురస్కారం నా మార్గం కష్టతరమైనా..సరైనదని నిరూపించింది".

స్టార్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు

"నటీనటులపై విమర్శలు రావడమనేది సహజం. మీ కంటే మెరుగ్గా పని చేసే వ్యక్తులు మాత్రమే మిమ్మల్ని అభినందిస్తుంటారు. ఏమీ సాధించలేని వ్యక్తులే మిమ్మల్ని విమర్శిస్తుంటారు. కానీ.. చిత్రపరిశ్రమలో ఏదైనా సాధించడం అంత సులభం కాదు. ఇక్కడ ఎదగడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఇలా కొన్ని రోజులు గడిచాక.. మిమ్మల్ని విమర్శించే వారి మాటలు పనికిరావని అర్థమవుతుంది. నేను ఎప్పుడూ స్టార్‌గా ఎదగాలని పరిశ్రమలో అడుగుపెట్టలేదు. నేను ఇక్కడ మంచి స్థాయిలో ఉండటమే విజయం అని భావిస్తున్నాను. అదే విమర్శకులకు సమాధానం చెప్తుంది".

మేకప్ మర్చిపోయి షూటింగ్‌కు

"సాధారణంగా సినిమాకు అందాన్నిచ్చేదే కథానాయికలు. కానీ నేను ఎప్పుడూ సినిమాల్లో నా లుక్స్‌కి, మేకప్‌కు ప్రాముఖ్యత ఇవ్వను. కొన్ని సార్లు ఏదో పరధ్యానంలో ఉండి మేకప్ వేసుకోవడం మర్చిపోయి షూటింగ్‌కు వెళ్లిన రోజులూ ఉన్నాయి. నా దృష్టిలో అందమనేది మనం వేసుకునే మేకప్‌తో వచ్చేది కాదు. నేను కొంత మందిలో వారి కళ్లలోనే అందాన్ని చూశాను. ఇన్నేళ్ల నా సినీప్రయాణంలో సినిమాకు నా వంతు ప్రయత్నంగా నేను ఏం చేయగలననేదే ముఖ్యం. అంతే కానీ.. ఎలాంటి దుస్తులు ధరించాను, మేకప్ వేసుకున్నానా..? లేదా అనేది పట్టించుకోను. చాలా సందర్భాల్లో సినిమాలో మీరు ఇలానే కనిపించాలని ఒత్తిడి చేసినా వాటికి ఎప్పుడూ లొంగలేదు. 'మీరు బరువు పెరిగారు' అనే మాటలు కూడా వినిపిస్తూనే ఉంటాయి. ఇక్కడ ఎవరైనా ఏదైనా చేసినప్పుడు 'మీరు చాలా బాగా చేస్తున్నార'ని చేతులతో చప్పట్లు కొట్టి చెప్పగలిగేవారు చాలా తక్కువ".

కథ అర్థం కాకపోతే నటించను

'నేను పాత్రల్ని ఎంచుకునే ముందు.. అందులో నేను నటించగలనా? అది వ్యక్తిత్వానికి సరిపోతుందా? అనేదే చూస్తాను. కానీ సినిమా వర్కవుట్ అవుతుందా లేదా అనేది నాకు అవసరం లేని విషయం. సామాజిక బాధ్యత ఉన్న వ్యక్తిగా ప్రజలపై ప్రభావం చూపే పాత్రల్నే ఎంచుకోవడానికి ప్రయత్నిస్తాను. కథ ఏదైనా విన్నప్పుడు అది నాకు అర్థం కాకపోతే.. నేను చేయలేనని చెప్పేస్తాను. మనం ఎంచుకునే ప్రతి పాత్రతో 100శాతం సంబంధం కలిగి ఉండాలని ఏం లేదు. కొన్ని సార్లు కెరీర్‌లో ఇప్పటి వరకూ నటించని పాత్రలు కూడా పోషించాల్సి వస్తుంది. ప్రేక్షకులపై సానుకూల ప్రభావం చూపే సినిమాలు చేయడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను. అది నాకు చాలా ముఖ్యం".

గోల్డెన్ వీసా'ని ఇంకా ప్రకటించ లేదు

"ప్రస్తుతం ధనుష్‌తో కలిసి 'ఇడ్లీ కడై' అనే చిత్రంలో నటిస్తున్నాను. దీంతో పాటు విజయ్ సేతుపతి సరసన ఓ కామెడీ చిత్రంతో రాబోతున్నాను. నేను ఇంతకు ముందు చేసిన దానికి భిన్నమైన జానర్ ఇది. దర్శకుడు పాండియరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నటించడానికి చాలా ఉత్సాహంగా ఉన్నాను. దీంతో పాటు ఈ ఏడాది చివర్లో 'గోల్డెన్ వీసా' అనే మరో చిత్రాన్ని కూడా ప్రారంభిస్తున్నాను. దీన్ని ఇంకా మేము ప్రకటించలేదు. చిత్రీకరణ పూర్తయిన 'కాదల్కి నేరమిల్లై' బహుశా ఈ ఏడాది చివర్లో విడుదల కావొచ్చు".

'ధూం ధాం'..వినోదం



చేతన్, హెబ్బా పటేల్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా సాయి కిశోర్ మచ్చా తెరకెక్కించిన చిత్రం 'ధూం ధాం'. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మిస్తున్నారు. సాయి కుమార్, వెన్నెల కిశోర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు మారుతి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "టీజర్ చాలా బాగుంది. అన్ని రకాల వాణిజ్య హంగులతో అందర్నీ అలరించేలా ఉంది" అన్నారు. "లవ్, ఫ్యామిలీ, యాక్షన్, కామెడీ.. ఇలా అన్ని రకాల వాణిజ్య హంగులతో రూపొందిన చిత్రమిది. దీంట్లోని తండ్రీకొడుకుల ఎమోషన్ ఆకర్షణగా నిలుస్తుంది" అని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాకి సంగీతం: గోపీ సుందర్, ఛాయాగ్రహణం: సిద్ధార్థ్ రామస్వామి.

తెలుగు ప్రేక్షకుల ప్రేమ దొరికితే చాలు!



శ్రీమురళి

దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన 'ఉగ్రం' చిత్రంతో కన్నడలో స్టార్ హీరోగా పేరు తెచ్చుకున్నారు శ్రీమురళి. ఇప్పుడాయన 'బఘీర'తో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ప్రశాంత్ నీల్ కథతో రూపొందిన ఈ చిత్రాన్ని డాక్టర్ సూరి తెరకెక్కించారు. ఇది ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు శ్రీమురళి.

- "ప్రశాంత్ నీల్ నాకు 'ఉగ్రం'లాంటి గొప్ప చిత్రమిచ్చారు. దాని తర్వాత నాకు మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ప్రశాంత్ నాకు ఈ 'బఘీర' కథ ఇచ్చారు". ఈ కథ 'ఉగ్రం'కు పూర్తి భిన్నంగా ఉంటుంది. దీంట్లో నాది లార్జర్ దెన్ లైఫ్ పాత్రలా ఉంటుంది. ప్రతి ఒక్కరిలో ఓ హీరో ఉంటాడు. కానీ, ఆ హీరో ఎప్పుడు బయటకొస్తాడో తెలియదు. ఈ చిత్రం చూసి బయటకొస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా బఘీరాలా ఫీలవుతారని నమ్ముతున్నా. కాకపోతే ఈ చిత్ర విషయంలో నాదొకటే విన్నపం. ఈ సినిమాకి ఎలాంటి అంచనాలు లేకుండా రండి. నన్నొక కొత్త నటుడిగానే చూసి ఆశీర్వదించండి. నాకు తెలుగు ప్రేక్షకుల ప్రేమ దొరికితే చాలు".
- "మా అత్తగారిది నెల్లూరు. ఇంట్లో నా భార్య, అత్తగారు తెలుగే మాట్లాడతారు. అలా నాకూ తెలుగు వచ్చేసింది. ఇన్నేళ్ల నా సినీ ప్రయాణం పట్ల పూర్తి సంతృప్తిగా ఉన్నాను. ఈ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశా. తప్పుల నుంచి నేర్చుకున్నా. 'ఉగ్రం' తర్వాత నుంచి ఇప్పటి వరకు నా సినిమాలన్నీ విజయవంతమవ్వడం అదృష్టంగా భావిస్తున్నా. త్వరలోనే కొత్త చిత్రాన్ని ప్రకటిస్తా".

ఈ ఇద్దరిలో సూర్య జోడీ ఎవరో?

కథానాయకుడు సూర్య 45వ చిత్రం ఇప్పటికే ఖరారైంది. నటుడు, దర్శకుడు ఆర్.జె.బాలాజీ దీన్ని తెరకెక్కించనున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ సినిమా డిసెంబరు నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన ప్రధాన తారాగణం ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది చిత్ర బృందం. దీనిలో భాగంగా కథానాయిక పాత్ర కోసం మృణాల్ ఠాకూర్, రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఓ కీలక పాత్ర కోసం యువ నాయిక కశ్మీరా పరదేశిని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మరి ప్రధాన నాయికగా మృణాల్, రుక్మిణీల్లో ఎవరిని ఖరారు చేస్తారో తేలాల్సి ఉంది. వీళ్లిద్దరిలో రుక్మిణి ఇప్పటికే తమిళంలో రెండు సినిమాలు చేస్తుండగా.. మృణాల్ ఇంత వరకు అక్కడ ఒక్క చిత్రమూ చేయలేదు. మరి ఇదే ఆమెకి తొలి తమిళ చిత్రమవుతుందో లేదో చూడాలి. ఆధ్యాత్మిక అంశాలతో నిండిన ఫాంటసీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ముస్తాబు కానున్నట్లు ప్రచారం సాగుతోంది.



మృణాల్ ఠాకూర్



రుక్మిణీ వసంత్

అదానీ చేతికి ఓరియంట్ సిమెంట్

- రూ.8,100 కోట్ల విలువ వద్ద
- 100 మి.టన్నుల సామర్థ్యం చేరువకు అంబుజా



దిల్లీ: సీకే బిర్లా గ్రూప్ సంస్థ ఓరియంట్ సిమెంట్‌ను రూ.8,100 కోట్ల విలువ వద్ద కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు అదానీ గ్రూప్ మంగళవారం వెల్లడించింది. భారత్‌లో అగ్రగామిగా ఉన్న, ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్‌కు గట్టి పోటీనిచ్చేందుకు అందుబాటులో ఉన్న సిమెంట్ కంపెనీలను అదానీ గ్రూప్ కొనుగోలు చేసుకుంటూ వెళ్తోంది. ఇందులో భాగంగానే ఓరియంట్ సిమెంట్‌లో ఛైర్మన్ సీకే బిర్లా, ఇతర వాటాదార్ల నుంచి 46.8% వాటాను అంబుజా సిమెంట్ రూ.3,791 కోట్లతో కొనుగోలు చేస్తుంది. ఆ తర్వాత అదనంగా 26% వాటాను ఓపెన్ ఆఫర్ రూపంలో సొంతం చేసుకుంటామని కంపెనీ తెలిపింది.

ఈ ఏడాదిలో రెండో కొనుగోలు

అదానీ గ్రూప్ తొలుత అంబుజా కొనుగోలుతో సిమెంటు రంగంలో అడుగుపెట్టింది. అప్పటి నుంచి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని, కంపెనీల కొనుగోళ్ల ద్వారా పెంచుకుంటూ వస్తోంది. 2024 జూన్‌లో హైదరాబాద్‌కు చెందిన పెన్నా సిమెంట్‌ను రూ.10,422 కోట్లతో, గుజరాత్‌లోని సంఘి ఇండస్ట్రీస్‌ను 2023 డిసెంబరులో రూ.5185 కోట్లకు అదానీ గ్రూప్ సొంతం చేసుకుంది. అంటే ఈ ఏడాదిలో ఇది రెండో కొనుగోలు అవుతుంది. అల్ట్రాటెక్ సిమెంట్ కూడా జులైలో ఇండియా సిమెంట్స్‌ను రూ.3945 కోట్లకు, గతేడాది నవంబరులో కేశోరామ్ ఇండస్ట్రీస్‌ను రూ.7600 కోట్లతో సొంతం చేసుకోవడం గమనార్హం.

ఒక్కో షేరుకు రూ.395.40

ఓరియంట్ సిమెంట్ కొనుగోలు కోసం ఒక్కో షేరుకు రూ.395.40 చొప్పున అంబుజా వెచ్చించనుంది. ఈ పరిణామంతో అంబుజాకు అదనంగా 8.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం జతకానుంది. దీంతో అదానీ గ్రూప్ మొత్తం సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 97.4 మి.టన్నులకు చేరనుంది. ఓరియంట్‌కు మరో 8.1 మి.టన్నుల సామర్థ్యాన్ని అందించే ప్రాజెక్టులు నడుస్తున్నాయి. రాజస్థాన్‌లో అదనంగా 6 మి.టన్నుల సిమెంటు సామర్థ్యానికి మద్దతునిచ్చే ప్లాంట్ ఉంది.

"ఓరియంట్ కొనుగోలుతో అంబుజా సిమెంట్ సామర్థ్యం 100 మి.టన్నుల దరిదాపుల్లోకి వస్తుంది. భారత్‌లో మా మార్కెట్ వాటా 2% పెరుగుతుంది. సమీప భవిష్యత్‌లో ఓరియంట్ సామర్థ్యం 16.6 మి.టన్నులకు చేరగలదు".

- అంబుజా డైరెక్టర్ కరన్ అదానీ

కంపెనీ	ప్రస్తుత సామర్థ్యం (మి.టన్నులు)
అల్ట్రాటెక్	149.5
అంబుజా	88.9
ఓరియంట్	8.5

140 మి.టన్నులు: 2028 నాటికి అదానీ గ్రూప్ లక్ష్యం

541 మి.టన్నులు: దేశంలో ప్రస్తుతం సిమెంటు ఉత్పత్తి సామర్థ్యం

సిమెంటు రంగంలో అదానీ గ్రూప్ కొనుగోళ్లు

కంపెనీ	విలువ(రూ.కోట్లలో)	ఎప్పుడు
పెన్నా సిమెంట్	10,422	జూన్ 2024
సంఘి ఇండస్ట్రీస్	5,185	డిసెంబరు 2023
అంబుజా-ఏసీసీ	82,000	సెప్టెంబరు 2022



ఈ ఏడాది భారత వృద్ధి 7%

- వచ్చే సంవత్సరంలో 6.5% ● ఐఎమ్‌ఎఫ్ అంచనాలు

వాషింగ్టన్: భారత వృద్ధిరేటు గత ఆర్థిక సంవత్సరంలో 8.2% అయినా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 శాతానికి పరిమితం కావొచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్‌ఎఫ్) అంచనా వేస్తోంది. వచ్చే సంవత్సరం (2025)లో 6.5% వృద్ధి రేటు నమోదు చేయొచ్చని పేర్కొంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ కొన్ని దేశాల్లో ధరల ఒత్తిళ్లు కొనసాగినా.. మొత్తం మీద ద్రవ్యోల్బణ యుద్ధంలో గెలిచినట్లు భావించాలని పేర్కొంది. వార్షిక 'వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్' నివేదికలో ఐఎమ్‌ఎఫ్ ఇంకా ఏమందంటే..

✦ 2022 మూడో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 9.4% వద్ద గరిష్ఠ స్థాయికి చేరింది. 2025 చివరకు ఇది 3.5 శాతానికి పరిమితం కావొచ్చు. 2000-2019 సగటు అయిన 3.6 శాతంతో పోలిస్తే ఇది తక్కువ.

✦ అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి ఈ ఏడాది, వచ్చే ఏడాది కూడా 3.2% వద్ద స్థిరంగా ఉండొచ్చు.

✦ అమెరికా ఈ ఏడాది 2.8% వృద్ధితో బలంగా కనిపించనుంది. ఐరోపా ఆర్థిక వ్యవస్థలు మోస్తరు వృద్ధితో వచ్చే ఏడాది పుంజుకోవచ్చు.

హ్యుందాయ్ షేరుకు 7% నష్టాలు



షేరు లిస్టింగ్ కార్యక్రమంలో హ్యుందాయ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్ యూసన్ ఛుంగ్, ఎన్‌ఎస్‌ఈ ఎండీ ఆశీష్ కుమార్

దిల్లీ: రూ.27,870 కోట్ల నిధుల సమీకరణతో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచినా, హ్యుందాయ్ మోటార్ ఇండియా షేరు, స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదైన తొలి రోజు నిరాశపరచింది. ఇష్యూ ధర రూ.1,960తో పోలిస్తే షేరు బీఎస్‌ఈలో 1.47% నష్టంతో రూ.1,931 వద్ద నమోదైంది. ప్రారంభంలో రికవరీ లభించడంతో రూ.1,968.80 (0.44% లాభం) వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 7.80% నష్టపోయి రూ.1,807.05 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు ఈ షేరు 7.12% నష్టంతో రూ.1,820.40 వద్ద ముగిసింది. 15.87 లక్షల షేర్లు చేతులు మారాయి.

✦ ఎన్‌ఎస్‌ఈలో హ్యుందాయ్ షేరు 1.32%నష్టంతో రూ.1,934 వద్ద నమోదైంది. ఇంట్రాడేలో 7.80 శాతం నష్టపోయినా, చివరకు 7.16% తగ్గి రూ.1,819.60 వద్ద స్థిరపడింది. 2.86 కోట్ల షేర్లు చేతులు మారాయి.

✦ కంపెనీ మార్కెట్ విలువ రూ.1,47,914.98 కోట్లుగా నమోదైంది. వాహన సంస్థల మార్కెట్ విలువలో ఇది 5వ స్థానంలో నిలిచింది. మారుతీ సుజుకీ రూ.3.75 లక్షల కోట్లు, ఎం అండ్ ఎం రూ.3.59 లక్షల కోట్లు, టాటా మోటార్స్ రూ.3.24 లక్షల కోట్లు, బజాజ్ ఆటో రూ.2.89 లక్షల కోట్ల మార్కెట్ విలువతో తొలి 4 స్థానాల్లో ఉన్నాయి.

పుణె ప్లాంట్ విస్తరణకు రూ.6,000 కోట్లు: పుణె ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 8.24 లక్షల వాహనాల నుంచి మరో 2.5 లక్షల మేర పెంచేందుకు రూ.6,000 కోట్లు వెచ్చిస్తున్నామని హ్యుందాయ్ వెల్లడించింది.

దేశీయంగా భారీ ఐపీఓల షేర్ల నమోదురోజు ప్రతిఫలం

కంపెనీ	సమీకరించిన మొత్తం	లాభం/నష్టం	ఏడాది
హ్యుందాయ్	రూ.27,856 కోట్లు	-7.12%	2024
ఎల్ఐసీ	రూ.20,557 కోట్లు	-8.62%	2022
పేటీఎం	రూ.18,300 కోట్లు	-27.25%	2021
కోల్ ఇండియా	రూ.15,199 కోట్లు	+39.70%	2010
రిలయన్స్ పవర్	రూ.11,563 కోట్లు	-17.20%	2008
జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్	రూ.11,257 కోట్లు	-4.50%	2017
ఎస్‌బీఐ కార్డ్స్	రూ.10,341 కోట్లు	-9.50%	2020
న్యూఇండియా అస్యూరెన్స్	రూ.9585కోట్లు	-9.30%	2017
జొమాటో	రూ.9375 కోట్లు	+65.50%	2021
డీఎల్‌ఎఫ్	రూ.9187 కోట్లు	+8.50%	2007

24 గంటల్లో 1.35 కోట్ల స్పూఫ్డ్ కాల్స్ నిలిపివేత

దిల్లీ: విదేశాల నుంచి వచ్చే మోసపూరిత కాల్స్‌కు అడ్డుకట్ట వేయడం కోసం సరికొత్త 'ఇంటర్నేషనల్ ఇన్‌కమింగ్ స్పూఫ్డ్ కాల్స్ ప్రివెన్షన్ సిస్టమ్' అమల్లోకి వచ్చింది. తొలి 24 గంటల వ్యవధిలోనే 1.35 కోట్ల స్పూఫ్డ్ కాల్స్‌ను ఇది సమర్థంగా అడ్డుకోగలిగిందని టెలికాం విభాగం తెలిపింది. కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ వ్యవస్థను ఆవిష్కరించగా, కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. 'అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లు భారతీయ మొబైల్ నంబర్ల (+91-xxxxxxxxxx)ను డిస్‌ప్లేలో వచ్చేలా చేసి కాల్స్ చేస్తుంటారు. ఫేక్ డిజిటల్ అరెస్టులకు, కొరియర్‌లో డ్రగ్స్ వచ్చాయని బెదిరించేందుకు, పోలీసు అధికారులుగా చెప్పుకునేందుకు ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు.

కోడి గుడ్లు

23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	540
గోదావరి	530
విశాఖపట్నం	540
చిత్తూరు	568

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభాల పరుగు



ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు బస్సుల తయారీ సంస్థ, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలు నమోదు చేసింది. ఏకీకృత ఖాతాల ప్రకారం త్రైమాసిక ఆదాయం 70%, నికర లాభం 156% పెరగడం ప్రత్యేకత. సెప్టెంబరు త్రైమాసికానికి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ రూ.523.67 కోట్ల ఆదాయాన్ని, రూ.47.65 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.8.72 ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికరలాభం రూ.18.58 కోట్లు, ఈపీఎస్ రూ.4.40 మాత్రమే ఉన్నాయి. ఈ త్రైమాసికంలో 315 విద్యుత్తు బస్సులను వినియోగదార్లకు అందజేసినట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో 154 బస్సులనే అందించింది. ఇప్పటి వరకు సంస్థ మొత్తం 2,217 విద్యుత్తు బస్సులను సరఫరా చేసినట్లు అవుతోంది.


ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆదాయం రూ.837.61 కోట్లు, నికరలాభం రూ.71.91 కోట్లు ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంతో పోల్చి చూస్తే, ఆదాయం 60%, నికరలాభం 96% పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఆకర్షణీయంగా ఆదాయాలు, లాభాలు నమోదు చేశామని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కేవీ ప్రదీప్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్లాంటు వల్ల ఏడాది క్రితంతో పోలిస్తే బస్సుల తయారీ 105% పెరిగిందన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. తమ ఆర్డర్ బుక్ భారీగా ఉందని ఆయన వివరించారు.

జీవీకే పవర్‌పై దివాలా ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: విద్యుదుత్పత్తి, మౌలిక సదుపాయాల రంగంలో నిమగ్నమైన సంస్థ జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దివాలా ప్రక్రియ ప్రారంభం అయింది. ఈ ప్రక్రియ చేపట్టడానికి ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్) ఇప్పటికే ఆర్‌పీ (రిజల్యూషన్ ప్రొఫెషనల్)గా సతీష్ కుమార్ గుప్తాను నియమించింది. జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను తీసుకోవడానికి ఆసక్తి ఉన్న సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానిస్తూ ఆయన ఫామ్-జీ జారీ చేశారు. ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు దాఖలు చేయడానికి నవంబరు 2ను చివరి తేదీగా నిర్ణయించారు. అభ్యంతరాల స్వీకరణకు నవంబరు 17వ తేదీ తుది గడువు కాగా, అదే నెల 25న పోటీలో ఉన్న సంస్థల వివరాలను వెల్లడిస్తారు. ఆ సంస్థలు వచ్చే నెల 30లోగా తుది బిడ్లు దాఖలు చేయాలి.

త్వరలోనే బీమా సుగమ్

- బీమా వాహక్, విస్తార్ కూడా
- ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ పాండా వెల్లడి



ముంబయి: అందరికీ బీమా అందించేందుకు తలపెట్టిన బీమా సుగమ్, బీమా వాహక్, బీమా విస్తార్ త్వరలోనే అందుబాటులోకి వస్తాయని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఛైర్మన్ దేబాశిష్ పాండా తెలిపారు.

✦ బీమా సంస్థలు అందించే పాలసీలన్నీ ఒకే చోట లభించేలా బీమా సుగమ్ చూస్తుంది.

✦ గ్రామీణ ప్రాంతాల్లో బీమా పంపిణీని మెరుగుపర్చేందుకు బీమా వాహక్ తోడ్పడుతుంది.

✦ బీమా విస్తార్ పేరుతో ఒక ప్రామాణిక బీమా పాలసీని నియంత్రణ సంస్థ తీసుకురానుంది.

సీఈఓ నియామకం: బీమా సుగమ్‌కు సంబంధించి ఇప్పటికే ఒక కంపెనీని ఏర్పాటు చేసినట్లు, దీనికి ఇటీవలే ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)ని నియమించినట్లు పాండా పేర్కొన్నారు. ఇతర కీలక సిబ్బంది నియామకాలు తుది దశలో ఉన్నాయని పేర్కొన్నారు. బీమా సుగమ్ కోసం సాంకేతిక భాగస్వామిని నియమించే ప్రక్రియలో ఐఆర్‌డీఏఐ ఉందని తెలిపారు. బీమా వాహక్ సాంకేతిక పరీక్ష త్వరలోనే ప్రారంభం అవుతుంది. రెండు నెలల్లో బీమా విస్తార్‌ను విడుదల చేసే అవకాశాలున్నాయన్నారు. ఇవన్నీ బీమా సుగమ్‌తో ఏకీకృతం అవుతాయన్నారు. 140 కోట్ల మందికి పైగా జనాభా ఉన్న దేశంలో బీమా సంస్థల సంఖ్య 70 దాటినా ఎన్నో అవకాశాలుంటాయని పేర్కొన్నారు.

ఇ-కామర్స్ సంస్థలతో భాగస్వామ్యం

ఎల్ఐసీ ఛైర్మన్ సిద్ధార్థ మొహంతీ

ముంబయి: దేశంలో బీమా పాలసీలను మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు టెలికాం, ఇ-కామర్స్ సంస్థల సహకారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఛైర్మన్ సిద్ధార్థ మొహంతీ అన్నారు. ప్రస్తుతం ఉన్న ఏజెంట్లు, బ్రోకర్లు, బ్యాంకస్యూరెన్స్ ప్రభావశీలంగానే పనిచేస్తున్నా.. కొన్ని పరిమితులున్నాయని పేర్కొన్నారు. అందుకే సంప్రదాయేతర విధానంలో బీమా పాలసీలను అందించేందుకు టెలికాం కంపెనీలు, ఫిన్‌టెక్ సంస్థలు, ఇ-కామర్స్ వేదికలతో భాగస్వామ్యం కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇవన్నీ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ సేవలు అందిస్తుండటం కలిసొస్తుందని తెలిపారు. అందరికీ బీమా కల్పించాలనే సంకల్పం నెరవేరాలంటే డిజిటల్ సాంకేతికతలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.

దేశమంతా ఒకటే పసిడి ధర!

దిల్లీ: దేశంలోని వివిధ ప్రాంతాల్లో పసిడి ధరల్లో వ్యత్యాసం ఉంటోంది. ఈ పరిస్థితి మార్చి 'ఒకటే దేశం.. ఒకటే పసిడి ధర' అమలుకు కసరత్తు చేస్తున్నట్లు ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ దేశీయ మండలి (జీజేసీ) ప్రకటించింది. 'మేం పసిడిని ఒకటే ధరకు దిగుమతి చేసుకుంటున్నాం. కానీ రిటైల్ ధరలు ఒక్కో నగరంలో ఒకలా ప్రచారమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఒకటే ధరను 6 నెలల్లో అమలు చేయాలని కోరుకుంటున్నామ'ని జీజేసీ కార్యదర్శి మితేష్ దోర్డా తెలిపారు. ఒకటే ధర అమలుకు 8,000 సంస్థలను ఒప్పించగలిగింది.

✦ హైదరాబాద్ బులియన్ విపణిలో మంగళవారం రాత్రి 11:30 గంటలకు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.80,900; కిలో వెండి ధర రూ.1,02,100 వద్ద స్థిరపడ్డాయి.

టెలికాం ఛార్జీలను పెంచేది లేదు

- బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ రవి స్పష్టీకరణ
- కొత్త లోగో, సేవల ఆవిష్కరణ

దిల్లీ: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఛార్జీ (టారిఫ్)లను సమీప భవిష్యత్తులో పెంచబోమని స్పష్టం చేసింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఈ ఏడాదిలో టారిఫ్‌లను పెంచిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ రవి ఈ స్పష్టత ఇచ్చారు. ఈ ఏడాదిలోనే 4జీ సేవలను వాణిజ్యపరంగా ప్రారంభిస్తామని వివరించారు. మంగళవారం కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బీఎస్ఎన్ఎల్ కొత్త లోగోను, '7 ఇన్ ఆల్' పేరిట సేవలను ఆవిష్కరించారు. వినియోగదార్లకు వచ్చే మోసపూరితకాల్స్, ఎస్ఎమ్ఎస్‌లను బ్లాక్ చేసే సొల్యూషన్లను బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చింది. రోజులో ఎప్పుడైనా సిమ్ కొనుగోలుకు వీలైన ఆటోమేటెడ్ సిమ్ కియోస్క్‌లు ప్రారంభిస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని వారికి శాటిలైట్, మొబైల్ నెట్‌వర్క్ కలయికతో డైరెక్ట్ టు డివైజ్ అనుసంధానాన్ని అందించనుంది.

చిన్న మదుపర్ల డబ్బులు పెద్దల జేబుల్లోకి

ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌పై సెబీ సభ్యుడు భాటియా



ముంబయి: ఫ్యూచర్స్, ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) ట్రేడింగ్ వల్ల చిన్న మదుపర్ల పొదుపు డబ్బు.. సంస్థాగత మదుపర్ల జేబుల్లోకి వెళతోందని సెబీ పూర్తి కాల సభ్యుడు అశ్వని భాటియా తెలిపారు. అందువల్ల ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌ను ప్రోత్సహించకూడదన్నారు. మదుపర్లు కూడా పెట్టుబడుల నిర్ణయాల విషయంలో మరింత అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. ఎఫ్అండ్ఓ విభాగంలో సెబీ తాజాగా చేపట్టిన చర్యలు, మదుపర్లు నష్టపోకుండా కాపాడేందుకేనని మార్నింగ్ స్టార్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాటియా చెప్పారు. సెబీ అధ్యయనంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ ద్వారా 93% మంది చిన్న మదుపర్లు నష్టాలను చవిచూసినట్లు తేలిందని, ఈ ప్రక్రియలో సంస్థాగత మదుపర్లు లాభాలను తమ జేబులో వేసుకుంటున్నారని ఆయన తెలిపారు. అంతర్జాతీయంగా మొత్తం డెరివేటివ్ లావాదేవీల్లో సగానికి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయని భాటియా వెల్లడించారు. తద్వారా ఆ తరహా ట్రేడింగ్‌కు ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్ ఉందని చెప్పారు. ఆ కిరీటాన్ని ధరించాలని భారత్ కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. కొవిడ్-19 పరిణామాల తర్వాత ఈక్విటీ మార్కెట్లలో చిన్న మదుపర్ల సంఖ్య బాగా పెరిగిందని, అయితే ఎఫ్అండ్ఓ విభాగంలో వాళ్ల ప్రాతినిధ్యం పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

అనధికారిక ఫారెక్స్ ప్లాట్‌ఫామ్‌ల జాబితాలో మరిన్ని సంస్థలు

ముంబయి: అనధికారిక ఫారెక్స్ (విదేశీ మారక) ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల కోసం రూపొందించిన 'హెచ్చరిక జాబితాలో' మరో 13 సంస్థలను ఆర్‌బీఐ చేర్చింది. దీంతో ఈ జాబితాలోని సంస్థల సంఖ్య 88కు చేరింది. విదేశీ మారకపు నిర్వహణ చట్టం- 1999 (ఫెమా) కింద విదేశీ మారకపు ట్రేడింగ్ లావాదేవీల నిర్వహణకు అనుమతి లేని సంస్థలు, ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ (రిజర్వ్ బ్యాంక్) డైరెక్షన్స్- 2018 కింద విదేశీ మారకపు లావాదేవీల కోసం ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ నిర్వహణకు అనుమతి లేని సంస్థలను ఈ జాబితాలో ఆర్‌బీఐ చేర్చింది. రేంజర్ కేపిటల్, టీడీఎఫ్ఎక్స్, ఇనెఫెక్స్, యార్కర్ఎఫ్ఎక్స్, గ్రోలైన్, థింక్ మార్కెట్స్, స్మార్ట్ ప్రోప్ ట్రేడర్, ఫండెడ్ నెక్స్ట్, వెల్‌ట్రేడ్, ఫ్రెష్‌ఫారెక్స్, ఎఫ్ఎక్స్ రోడ్, డీబీజీ మార్కెట్స్, ఫ్లష్ ఆన్‌ట్రేడ్ లాంటి సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ జాబితాలో పేరు లేనంత మాత్రాన, ఆర్‌బీఐ అనుమతిచ్చిన సంస్థగానే అన్నింటినీ అనుకోవద్దని ఆర్‌బీఐ తెలిపింది.

అంకుర సంస్థలు-పెట్టుబడిదారులకు సంధానకర్తగా

25న హైదరాబాద్‌లో 'ద పిచ్' సదస్సు



ఈనాడు, హైదరాబాద్: అంకుర సంస్థల నిర్వాహకులు, పెట్టుబడిదారులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి, ఇరుపక్షాలకు మేలు చేసే విధంగా 'ద పిచ్' పేరుతో కార్యక్రమాన్ని వీసీ సర్కిల్ నిర్వహిస్తోంది. ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో ఈ నెల 25న దీన్ని నిర్వహించనున్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో పురుడు పోసుకుని, విద్యుత్తు వాహనాల విభాగంలో విస్తరిస్తున్న అంకుర సంస్థ 'ప్యూర్ ఈవీ' ఛైర్మన్ డాక్టర్ నిశాంత్ దొంగరి ప్రారంభోపన్యాసం చేస్తారు. అంకుర సంస్థల ముందున్న అవకాశాలు, సవాళ్లు, ముఖ్యంగా మన దేశంలో విద్యుత్తు వాహనాల విభాగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, భవిష్యత్తు స్థితిగతులు, సంబంధిత ఇతర అంశాలు ఈ సదస్సులో ప్రముఖంగా ప్రస్తావనకు వస్తాయి. ఈ సదస్సులో 25 అంకుర సంస్థలు, 60 మందికి పైగా ఇన్వెస్టర్లు పాల్గొంటారని పేర్కొన్నారు.

మ్యూచువల్ ఫండ్లకూ ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు

నవంబరు 1 నుంచి అమలు

దిల్లీ: అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు నిర్వహించే మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో ఉన్న వ్యక్తులు, ట్రస్టీలు, వారి సమీప బంధువులు రూ.15 లక్షలకు మించిన అన్ని లావాదేవీల వివరాలను, వాటిని నిర్వహించిన రెండు పనిదినాల్లోగా కాంప్లయెన్స్ అధికారికి తెలియజేయాల్సిందిగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. రూ.15 లక్షల పరిమితి ఒక శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)కు సంబంధించి త్రైమాసికంలో నిర్వహించిన ఒకటి లేదా బహుళ లావాదేవీలు కావొచ్చని సెబీ పేర్కొంది. నవంబరు 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. త్రైమాసిక ప్రాతిపదికన వచ్చే నెల 1 నుంచి ఫండ్ సంస్థలతో సంబంధం ఉన్న వ్యక్తులు, ట్రస్టీలు, వారి సమీప బంధువుల దగ్గరున్న పెట్టుబడుల వివరాలను తెలియజేయాలని అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ(ఏఎంసీ)లను సెబీ కోరింది. అక్టోబరు 31 నాటికి ఉన్న పెట్టుబడుల వివరాలను వచ్చే నెల 15 నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తెలుసుకునేందుకు వీలవుతుందని తెలిపింది.

జొమాటో రూ.8,500 కోట్ల నిధుల సమీకరణ!

దిల్లీ: జొమాటో, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.176 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.36 కోట్లు మాత్రమే. కార్యకలాపాల ఆదాయం రూ.2,848 కోట్ల నుంచి నుంచి రూ.4,799 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు కూడా రూ.3,039 కోట్ల నుంచి రూ.4,783 కోట్లకు చేరాయి.

✦ డైనింగ్, సినిమాలు, క్రీడాపోటీల టికెట్లు, లైవ్ కార్యక్రమాలు, షాపింగ్, స్టేకేషన్స్ లాంటి 'గోయింగ్ అవుట్' సేవలన్నింటినీ 'డిస్ట్రిక్ట్' యాప్ కిందకు నెల రోజుల్లో తెస్తామని జొమాటో వ్యవస్థాపకుడు, సీఈఓ దీపిందర్ గోయల్ తెలిపారు. అర్హులైన సంస్థాగత మదుపర్లకు (క్యూఐపీ) షేర్ల జారీ ద్వారా రూ.8,500 కోట్లు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2024-25	2023-24	2024-25	2023-24
బజాజ్ ఫైనాన్స్	4,104	3,551	17,095	13,382
సీజీ పవర్	219.63	242.29	2,441.79	2,018.96
పేటీఎం	928.30	290.50	1,659.50	2,518.60
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	773.39	284.09	6,359.80	3,766.46
అదానీ గ్రీన్ ఎనర్జీ	515	371	3,376	2,589
ఐసీఐసీఐ సెక్యూరిటీస్	529	423	1,707	1,249

రూ.9.19 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ ▼ 931 80221

నిఫ్టీ ▼ 309 24472

2 నెలల కనిష్ఠానికి సెన్సెక్స్

ఎఫ్ఐఐల విక్రయాలు: రూ.3,978.61 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు: రూ.5,869.06 కోట్లు

సమీక్ష

అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల నడుమ సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాల్లో ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగడంతో, అన్ని రంగాల షేర్లకూ విక్రయాల ఒత్తిడి ఎదురైంది. సెన్సెక్స్ 2 నెలల కనిష్ఠానికి చేరింది. నిఫ్టీ 24,500 పాయింట్ల దిగువన ముగిసింది. సెన్సెక్స్ 931 పాయింట్లు, నిఫ్టీ 309 పాయింట్ల మేర నష్టపోయాయి. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.61% పెరిగి 74.74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 1 పైసా తగ్గి 84.08 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో నష్టపోయాయి. షాంఘై, హాంకాంగ్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.

✦ మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ మంగళవారం ఒక్క రోజే మరో రూ.9.19 లక్షల కోట్ల మేర ఆవిరై, రూ.444.45 లక్షల కోట్ల (5.29 లక్షల డాలర్ల)కు పరిమితమైంది.

సెన్సెక్స్ ఉదయం 81,155.08 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,151.27 పాయింట్లు) స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. 81,504.24 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, తర్వాత విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 80,149.53 పాయింట్ల కనిష్ఠానికి చేరింది. చివరకు 930.55 పాయింట్ల నష్టంతో 80,220.72 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 309 పాయింట్లు కోల్పోయి 24,472.10 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,445.80-24,882.00 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 29 నష్టపోయాయి. ఎం అండ్ ఎం 3.79%, టాటా స్టీల్ 2.94%, ఎస్‌బీఐ 2.91%, టాటా మోటార్స్ 2.64%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.58%, పవర్‌గ్రిడ్ 2.48%, ఎన్‌టీపీసీ 2.26%, మారుతీ సుజుకీ 2.14%, ఎల్ అండ్ టీ 2.13%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.02%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.86%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.73%, బజాజ్ ఫైనాన్స్ 1.58%, టీసీఎస్ 1.53%, ఏషియన్ పెయింట్స్ 1.49%, కోటక్ బ్యాంక్ 1.46%, యాక్సిస్ బ్యాంక్ 1.24%, హెచ్‌సీఎల్ టెక్ 1.09% చొప్పున పడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఒక్కటే 0.67% లాభపడింది.

✦ జీవిత, సాధారణ బీమా సంయుక్త సంస్థల నుంచి జర్మనీకి చెందిన అలియంజ్ ఎస్ఈ బయటకు వెళ్లేందుకు పరిశీలిస్తున్నట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ మంగళవారం వెల్లడించింది. బజాజ్ అలియంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్‌ల్లో అలియంజ్‌కు 26% చొప్పున వాటా ఉంది.

✦ ఎడ్యుటెక్ విభాగమైన ఆకాశ్ డిజిటల్‌ను వచ్చే రెండేళ్లలో పునర్నిర్మించడంతో పాటు విస్తరించేందుకు సుమారు రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ వెల్లడించింది.

✦ ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రీమియం, సూపర్ ప్రీమియం విస్కీ బ్రాండ్లను ప్రవేశపెట్టడం ద్వారా ఇండియన్-మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు త్రివేణి ఇంజినీరింగ్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం సమాచారమిచ్చింది.

✦ మణిపాల్ గ్రూప్‌నకు చెందిన డయాగ్నోస్టిక్స్ అనుబంధ సంస్థ మణిపాల్ హెల్త్‌మ్యాప్ ముంబయికి చెందిన ఐజెనెటిక్ డయాగ్నోస్టిక్స్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపింది. లావాదేవీ విలువ వెల్లడించలేదు.

✦ కేంద్ర వినియోగదారు భద్రతా ప్రాధికార సంస్థ (సీసీపీఏ) నుంచి అందుకున్న 10,644 ఫిర్యాదుల్లో 99.1% ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఓలా ఎలక్ట్రిక్ నియంత్రణ సంస్థలకు సమాచారమిచ్చింది. సీసీపీఏ షోకాజ్ నోటీసుపై సమాచారం, స్పందన తెలియజేసినట్లు పేర్కొంది.

✦ దీపక్ బిల్డర్స్ ఐపీఓ రెండో రోజు ముగిసేసరికి 12 రెట్ల స్పందన లభించింది. 89,67,061 షేర్లను కంపెనీ ఆఫర్ చేయగా, 10,75,78,932 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగం నుంచి 15.93 రెట్ల స్పందన లభించింది.

✦ వారీ ఎనర్జీస్ ఐపీఓ రెండో రోజుకు 8.78 రెట్ల స్పందన లభించింది. 2,10,79,384 షేర్లను కంపెనీ ఆఫర్ చేయగా, 18,51,56,208 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగం నుంచి 6.36 రెట్ల స్పందన లభించింది.



✦ రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీల మీడియా ఆస్తుల మెగా విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతి ఇచ్చింది.

✦ షేర్ల బైబ్యాక్ తర్వాత టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఇండస్ టవర్స్‌లో వాటాను 50 శాతానికి పైగా పెంచుకునేందుకు భారతీ ఎయిర్‌టెల్ చేసిన ప్రతిపాదనకు సీసీఐ ఆమోదం తెలిపింది.

✦ అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వచ్చే పదేళ్లలో మహారాష్ట్రలోని రత్నగిరిలో రక్షణ ప్రాజెక్టులపై రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు మంగళవారం వెల్లడించింది.

రేమండ్ 9,000 ఉద్యోగాలు

రేమండ్ లైఫ్‌స్టైల్ వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా 900 కొత్త విక్రయ కేంద్రాలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. వీటిలో సగటున 10 మంది చొప్పున సుమారు 9,000 మంది ఉద్యోగులను చేర్చుకోనుంది. ప్రస్తుతం కంపెనీకి దేశవ్యాప్తంగా 1500 విక్రయశాలలున్నాయి. తమ ప్లాంటులోనూ సిబ్బంది సంఖ్యను పెంచుకుంటామని సంస్థ తెలిపింది. అంతర్జాతీయ ఖాతాదార్ల నుంచి ఆర్డర్లు వచ్చే అవకాశం ఉండటమే ఇందుకు కారణం.

నేటి బోర్డు సమావేశాలు

హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెరిటేజ్ ఫుడ్స్, ఆంధ్రా సిమెంట్, దొడ్ల డెయిరీ, సాగర్ సిమెంట్స్, ఎస్‌బీఐ లైఫ్, పిడిలైట్ ఇండస్ట్రీస్, టీవీఎస్ మోటార్, బజాజ్ హోల్డింగ్స్, యునైటెడ్ స్పిరిట్స్, గోద్రేజ్ ప్రోపర్టీస్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, కేపీఐటీ టెక్నాలజీస్, పిరమాల్ ఫార్మా, డా.లాల్‌పాథ్ ల్యాబ్స్, పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్, ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, కర్ణాటక బ్యాంక్, వీఐపీ ఇండస్ట్రీస్, థైరోకేర్ టెక్నాలజీస్, కేర్ రేటింగ్స్, ఫినో పేమెంట్స్ బ్యాంక్, ఓరియెంట్ గ్రీన్ పవర్, ఎన్‌డీటీవీ

its@eenadu.in
ఈనాడు
18 ఈనాడు బుధవారం అక్టోబరు 23, 2024

హెచ్‌పీ తొలి ఏఐ ల్యాప్‌టాప్

హెచ్‌పీ ఇండియా తమ తొలి ఏఐ ఆధారిత 2 ఇన్ 1 ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. పేరు **ఓమ్నిబుక్ అల్ట్రా ఫ్లిప్‌**. ఇంటెల్‌కు చెందిన లూనార్ లేక్ ప్రాసెసర్, ప్రత్యేక న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్ (ఎన్‌పీయూ)తో కూడిన



ఇది సెకనుకు 48 ట్రిలియన్ల ఆపరేషన్స్ చేయగలదు. ఫ్రీలాన్సర్లు, కంటెంట్ క్రియేటర్లను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. 2.8కె ఓఎల్‌ఈడీ డిస్‌ప్లే గల దీని బ్యాటరీ 21 గంటల వరకూ పనిచేస్తుంది. ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, టెంట్ మోడ్‌ల్లోకి మార్చుకోవచ్చు. ఏఐ జనరేటెడ్ ముప్పులు, సైబర్ దాడులను అడ్డుకోవటానికి రూపొందించిన హెచ్‌పీ వోల్ఫ్ సెక్యూరిటీ అనే ఏఐ భద్రతా వ్యవస్థ రక్షణగా ఉంటుంది. మెరుగైన వర్చువల్ సమావేశాల కోసం 9ఎంపీ ఏఐ కెమెరా, పాలీ ఆడియో జోడించారు. ఈ కొత్త ల్యాప్‌టాప్ రెండు రకాల్లో లభిస్తుంది. ఎక్లిప్స్ గ్రే, అట్మాస్ఫెరిక్ బ్లూ రంగుల్లో ఉండే అల్ట్రా 7 రకం ప్రారంభ ధర రూ.1,81,999. అల్ట్రా 9 రకం ఒక్క అట్మాస్ఫెరిక్ బ్లూ రంగులోనే వస్తోంది. దీని ధర రూ.1,91,999. వీటిని హెచ్‌పీ ఆన్‌లైన్ స్టోర్, ఇతర ఆన్‌లైన్ అంగళ్లలో కొనుక్కోవచ్చు. అక్టోబరు 31లోపు కొంటే అడోబ్ ఫొటోషాప్ ఎలిమెంట్స్, ప్రీమియర్ ఎలిమెంట్స్ ఉచితంగానూ లభిస్తాయి.

కొత్తగా ఐప్యాడ్ మినీ


ఐప్యాడ్ మినీ ప్రియులకు శుభవార్త. మూడేళ్ల తర్వాత ఇది కొత్త రూపు సంతరించుకుంది. ఐప్యాడ్ మినీ 2024గా అందుబాటులోకి వచ్చింది. దీన్ని **ఐప్యాడ్ మినీ 7** అనీ పిలుచుకుంటున్నారు. 8.4 అంగుళాల లిక్విడ్ రెటీనా డిస్‌ప్లేతో కూడిన ఇది యాపిల్ ఏ17 ప్రొ చిప్‌సెట్‌తో పనిచేస్తుంది. ఈ చిప్‌సెట్ మూలంగా కొత్త



ఐప్యాడ్ మినీకి యాపిల్ ఇంటెలిజెన్స్ తోడైనట్టయ్యింది. దీంతో రైటింగ్ టూల్స్, కస్టమ్ ఎమోజీల వంటివన్నీ వాడుకోవటం సాధ్యమవుతుంది. ఇది యాపిల్ పెన్సిల్ ప్రొ టూల్‌నూ సపోర్టు చేస్తుంది. దీంతో ట్యాబ్లెట్ మీద బొమ్మలు గీసుకోవచ్చు, రాసుకోవచ్చు. దీనికి వెనకాల యాపిల్ స్మార్ట్ హెచ్‌డీఆర్ 4 కంప్యుటేషన్లను సపోర్టు చేసే 12ఎంపీ వైడ్ కెమెరా సెన్సర్.. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందు వైపున 12ఎంపీ కెమెరా ఉన్నాయి. గత ఐప్యాడ్ మినీ కన్నా స్టోరేజీ రెట్టింపయ్యింది. 128జీబీ స్టోరేజీ మొదలుకొని 256జీబీ, 512జీబీ రకాలూ అందుబాటులో ఉన్నాయి. మరింత వేగంగా వై-ఫై ప్రసారానికి వీలుకల్పించే వై-ఫై 6జీని కూడా ఇది సపోర్టు చేస్తుంది. కేవలం వై-ఫై మోడల్ ధర రూ.49,900. వై-ఫైతో పాటు సెల్యులర్ మోడల్‌కైతే రూ.64,900 చెల్లించాల్సి ఉంటుంది. బ్లూ, పర్పుల్, స్టార్‌లైట్, స్పేస్ గ్రే రంగుల్లో లభిస్తుంది.

వయసా మరలవే!

వృద్ధాప్యాన్ని ఆపితే? ఆ మాటకొస్తే వెనక్కి తిప్పితే? మనకు అసాధ్యమేమోగానీ శాస్త్రవేత్తలు తలచుకుంటే కానిదేముంది? యాంటీబయాటిక్ మందుల ఆవిష్కరణతో ఇన్‌ఫెక్షన్ మరణాలను గణనీయంగా తగ్గించి, ఫలితంగా జీవనకాలాన్నీ పెంచిన శాస్త్రరంగం ఇప్పుడు ఆయుష్షును పెంచటం మీదా దృష్టి సారించింది. వయసు మీరే ప్రక్రియను అర్థం చేసుకునే దిశగా పురోగతి సాధించింది. వ్యాధి కారక కణాలను నిర్మూలించగల మాత్రలను కనుగొనటం దగ్గరి నుంచి జెల్లీఫిష్ పునరుజ్జీవనం వెనక రహస్యాలను ఛేదించటం వరకూ శాస్త్రవేత్తలు ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. వాన పాములు, కోతుల వంటి జంతువులను ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించేలా చేయగలుగుతున్నారు. ప్రస్తుతానికి చాలా పరిశోధనలు ఎలుకల వరకే పరిమితమైనప్పటికీ వీటిల్లో కొన్నయినా త్వరలోనే మనుషుల మీద ప్రయోగ పరీక్షల దశకు చేరుకోవచ్చని ఆశిస్తున్నారు. అన్నీ సవ్యంగా సాగితే మరో పదేళ్లలోనే వీటి ఫలితాలను చవి చూసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మరణాన్ని జయించలేకపోయినా ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించొచ్చన్నది నిస్సందేహం. అలాంటి కొన్ని ప్రయత్నాలు ఇవిగో..



వృద్ధ కణాల ఊడ్చివేత

శరీరం వెలుపల కణ విభజన నిరంతరం కొనసాగుతుందని ఒకప్పుడు భావించేవారు. అయితే 50 సార్లు విభజన చెందిన తర్వాత, ఈ ప్రక్రియ ఆగిపోతున్నట్టు లియొనార్డ్ హేఫ్లిక్ 1961లో గుర్తించారు. ఇవి వృద్ధాప్యానికి చేరుకుంటున్నట్టు బయటపడింది. మనుషులు, జంతువుల్లోనూ ఇవి వృద్ధాప్యానికి కారణమవుతున్నాయా? దీనికి అవుననే సమాధానం వస్తోంది. వయసు మీద పడుతున్నకొద్దీ శరీరంలో ఇలాంటి కణాలు పోగుపడుతూ వస్తుంటాయి. మంచి విషయం ఏంటంటే- వీటిని ఊడ్చివేసే, నిర్మూలించే మందులను ఆవిష్కరించటం. డాసాటినిబ్ అనే కీమోథెరపీ మందు.. పండ్లు, కూరగాయల్లోని క్వెర్‌సెటిన్ అనే రుచి కారకం ఎలుకల్లో 'వృద్ధ' కణాలను నిర్మూలించి, మంచి ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించేలా చేస్తున్నట్టు బయటపడింది. క్యాన్సర్, గుండెజబ్బుల వంటి వ్యాధుల నివారణకే కాకుండా శరీరానికి ఇంకాస్త బలాన్నీ ఇస్తున్నట్టు వెల్లడైంది. కంపెనీలు ఇలాంటి మరికొన్ని మందులను రూపొందించటం మీదా దృష్టి సారించాయి. వీటిల్లో ఏది సఫలమైనా వయో ప్రక్రియను ఆపే దిశగా కొత్త ముందడుగు పడినట్టే.

ఐస్‌లాండ్‌లో అద్భుత మందు

భారీ రాతి బొమ్మలకు నిలయమైన ఐస్‌లాండ్ అద్భుతమైన మందునూ ప్రసాదించింది. అదే రాపామైసిన్. దీన్ని 60ల్లో అక్కడి నేలలో గుర్తించారు. బ్యాక్టీరియా జాతులతో పుట్టుకొచ్చే ఇది క్యాన్సర్ చికిత్సలకు, రోగనిరోధకశక్తిని అణచి పెట్టటానికి తోడ్పడుతుంది. అంతేకాదు.. గతి తప్పిన ప్రొటీన్లనూ అడ్డుకుంటుంది. మన శరీరం సజావుగా పని చేయటానికి తోడ్పడే ప్రొటీన్లు గతి తప్పితే విషతుల్యాలుగా మారతాయి. అదృష్టం కొద్దీ మన శరీరంలో స్వీయ భక్షణ (ఆటోఫేజీ) ప్రక్రియ కొనసాగుతూ ఉంటుంది. దీని మూలంగానే కణాలు గతి తప్పిన అణువులను దారిలోకి తేవటం, సరికొత్తగా తయారుచేయటం సాధ్యమవుతోంది. ఇక్కడే రాపామైసిన్ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇది గతి తప్పిన ప్రొటీన్లను ఊడ్చి వేయటానికి కణాలకు అవసరమైన శక్తిని ప్రసాదిస్తుంది. ఇలా వయో ప్రక్రియను అడ్డుకుంటుంది. ఇది ఎలుకల్లో 20% వరకూ ఆయుష్షును పెంచినట్టు ప్రయోగ పరీక్షల్లో బయటపడింది. గుండె, చిగుళ్ల జబ్బుల వంటి వాటినీ తగ్గిస్తున్నట్టు వెల్లడైంది. ఈస్ట్, నేలపాములు, ఈగల జీవనకాలాన్నీ పెంచుతున్నట్టు తేలింది. వృద్ధుల్లోనూ రాపామైసిన్ ఇలాంటి ప్రభావమే చూపుతుండటం విశేషం.

శిశువుల్లో దాగిన రహస్యం

శిశు జననం అద్భుతమైన ప్రక్రియ. జీవ నిర్మాణం ఏదో ఒక స్థాయిలో వృద్ధాప్య ప్రక్రియను వెనక్కి మళ్లించిందనటానికిదో నిదర్శనమనీ చెప్పుకోవచ్చు. ఎందుకంటే తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన కణాలతోనే పిండం అభివృద్ధి చెందుతుంది. అంటే వారిలోని పాత కణాలు తిరిగి తొలి వయసు నుంచి పురుడు పోసుకుంటున్నాయన్న మాట. ఇది వివిధ రకాల ప్రాణుల్లో అంతగా క్షీణించకుండా తరతరాలుగా, లక్షలాది ఏళ్లుగా కొనసాగుతూ వస్తుండటం విశేషం. పిల్లల్లో ఇదెలా సంభవమో తెలుసుకుంటే పెద్దవారిలోనూ వయో ప్రక్రియను నిలువరించొచ్చా? టురిటోప్సిస్ డోర్నీ అనే 'అమర' జెల్లీఫిష్‌లు దీన్ని సాధించినట్టే కనిపిస్తోంది. ఇవి ఒత్తిడికి గురైనప్పుడు తమ వయో ప్రక్రియను శిశు దశకు మళ్లిస్తాయి. తిరిగి మొదటి నుంచీ పునరుజ్జీవం చెందుతాయి. ఇలా ఎన్నిసార్లయినా చేస్తాయి కూడా. వయసును వెనక్కి మళ్లించటమనేది జీవనశాస్త్ర నియమాలకు విరుద్ధం కాదనే సంగతిని ఇవి రుజువు చేస్తున్నాయి. మనుషుల్లోనూ ఇది సాధ్యమైతే? పరిపక్వ కణాల్లో గడియారాన్ని వెనక్కి తిప్పొచ్చని 2012 నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ షిన్యా ఎమనక, ప్రొఫెసర్ జాన్ గుర్డాన్ నిరూపించారు కూడా. కేవలం నాలుగు జన్యువులతోనే ఇది సాధ్యమవుతున్నట్టు, ఇవి పాత కణాలను తిరిగి మూల కణాలుగా మారుస్తున్నట్టు తేలింది. ఈ పక్రియను మనుషులకు ఎలా వర్తింపజేయొచ్చనేది ఇంకా తెలియనప్పటికీ అమెజాన్ సంస్థకు చెందిన ఆల్టోస్ ల్యాబ్ దీని మీద గట్టిగానే కృషి చేస్తోంది. ఎలుకల్లో జీవనకాలం 25% పెరిగినట్టు ప్రాథమిక ఫలితాలు చెబుతున్నాయి. పూర్తిస్థాయి ఫలితాలు వెలువడితే అది గొప్ప విషయమే కాగలదు.

ఇప్పటికే ఉన్న ఔషధాలతోనూ..

ఇతర జబ్బులకు వాడుతున్న కొన్ని ఔషధాలూ వయో ప్రక్రియను అడ్డుకోవటం గమనార్హం. ఉదాహరణకు- మధుమేహానికి వాడే ఎస్‌జీఎల్‌టీ-2 ఇన్‌హిబిటార్స్ రకానికి చెందిన కానాగ్లిఫ్లోజిన్, డాపాగ్లిఫ్లోజిన్, ఎంపాగ్లిఫ్లోజిన్‌లనే చూడండి. ఇవి గ్లూకోజును తగ్గించటంతో పాటు మొత్తంగా ఆరోగ్యాన్ని మెరుగు పరచే పనినీ చేపడుతున్నాయి. ఇలా ఆయుష్షు పెరిగేలా చేస్తున్నాయి. కానాగ్లిఫ్లోజిన్ ఎలుకల్లో 14% వరకు జీవనకాలాన్ని పొడిగిస్తున్నట్టు వెల్లడైంది. గ్లూకోజును తగ్గించే మెట్‌ఫార్మిన్, అకార్బోస్.. ఎముకల పటుత్వాన్ని కాపాడే బిస్‌ఫాస్ఫేట్ రకం మందులు సైతం మంచి ఫలితం చూపుతున్నాయి. బరువు తగ్గటానికి కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెమాగ్లుటైడ్ కూడా ఆశలు రేపుతోంది. ఇది తక్కువ ఆహారం తినేలా చేయటం ద్వారా జంతువుల్లో జీవనకాలాన్ని పెంచుతున్నట్టు బయటపడింది. ఈ మందులు ఇప్పటికే అందుబాటులో ఉండటం మరింత ఆసక్తికరమైన విషయం.

ఔషధాలను మిళితం చేసి..

ఒక్కో మందుతోనే సమర్థ ఫలితాలు కనిపిస్తున్నప్పుడు అన్నింటికీ కలిపితే? శాస్త్రవేత్తలు ఈ దిశగానూ ప్రయత్నించారు. రాపామైసిన్, అకార్బోస్ మందుల కలయిక మంచి ప్రభావం చూపిస్తున్నట్టు తేలింది. వీటి సాయంతోనే ఒక ఎలుక ప్రస్తుతం ఎక్కువకాలం జీవిస్తున్న మూషిక రికార్డును కొట్టేసింది. రాపామైసిన్ రక్తంలో గ్లూకోజు మోతాదులను అస్తవ్యస్తం చేస్తుంది. దీన్ని అడ్డుకోవటానికే అకార్బోస్‌ను జోడించారు. వీటి కలయికతో మగ ఎలుకల్లో 40%, ఆడ ఎలుకల్లో 30% జీవనకాలం పెరగటం విశేషం. రాపామైసిన్, వృద్ధ కణాలను నిర్మూలించే మందు, డీఎన్ఏ మీది రక్షణ టోపీలను బలోపేతం చేసే చికిత్స, ఎముక మజ్జ మార్పిడి.. ఇలా నాలుగు పద్ధతులను మేళవించీ శాస్త్రవేత్తలు ప్రయోగాలు నిర్వహించారు. ఇదీ ఆయుష్షును పెంచుతున్నట్టు తేలింది.

పాట రాసి.. బాణీ కట్టీ...

సంగీతాన్ని సృష్టించటంలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఇది మరింత పుంజుకుంది. అతి సులభంగా నిమిషాల్లోనే సంగీతాన్ని సృష్టించటానికి వీలు కల్పిస్తోంది. కేవలం వాయిద్యాలతోనే కాదు, కావాలంటే పాటలనూ రాసిపెట్టే స్థాయికి చేరుకుంది. ఇందుకు ఓ మంచి ఉదాహరణ **ట్యాడ్ ఏఐ** (https://tad.ai) ఇదో ఆన్‌లైన్ ఏఐ సాంగ్ జనరేటర్. సులభంగా ఒరిజినల్ సంగీతాన్ని సృష్టించటం దీని ప్రత్యేకత. యూజర్ ఇచ్చిన ఇన్‌పుట్స్ (ప్రాంప్ట్స్)ను విశ్లేషించి పాట శీర్షిక, అంశాలను సూచిస్తుంది. తనే ప్రత్యేకమైన బాణీలు సమకూర్చుతుంది. ఇది మెషిన్ లెర్నింగ్ అల్గోరిథమ్‌ల సాయంతో అప్పటికే పెద్దమొత్తంలో ఉన్న సంగీతాన్ని విశ్లేషించుకొని వివిధ రీతులను, శైలులను నేర్చుకుంటుంది. అందువల్ల యూజర్ ఇన్‌పుట్స్ సాయంతో ఒరిజినల్ బాణీలను సృష్టిస్తుంది. సంగీతం మాస్టార్లు తమ కొత్త పాటలకు ఆధారాలు, ఐడియాల కోసం ట్యాడ్ ఏఐని వాడుకోవచ్చు. సంగీత పరిజ్ఞానం అంతగా లేనివారికీ ఉపయోగపడుతుంది. పెద్దగా శిక్షణ తీసుకోకున్నా, వాయిద్యాల వంటి వనరులు లేకున్నా కేవలం పదాల సూచనలతోనే కోరుకున్న మ్యూజిక్ ట్రాక్స్‌ను సృష్టించుకోవచ్చు. అదీ కొద్ది నిమిషాల్లోనే. మధ్యలో ఏదైనా అవాంతరం వచ్చినా, ఎలాంటి బాణీ కావాలో తేల్చుకోకపోయినా ఇది సాయం చేస్తుంది. కొత్త సంగీత ఐడియాలను, జానర్లను ముందుంచుతుంది.

ఎలా వాడుకోవాలి?

- ముందుగా https://tad.ai లోకి వెళ్లాలి. ఖాతాను సృష్టించుకోవాలి. గూగుల్ ఖాతాతోనైనా సైన్ఇన్ కావొచ్చు.
- హోం పేజీలో జనరేట్ ఏఐ సాంగ్స్ ఫర్ ఫ్రీ అనే బొక్సు మీద క్లిక్ చేయాలి.
- ఎడమ వైపున సాంగ్ టైటిల్ బొక్సులో పాటకు శీర్షిక పెట్టుకోవాలి.



- లిరిక్స్ బొక్సులోకి వెళ్లి పాటను రాయాలి. రాయటం రాకపోతే ఏఐ జనరేట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఎలాంటి జానర్, మూడ్ అవసరమో నిర్ణయించుకోవాలి.
- అనంతరం క్రియేట్ బటన్ మీద క్లిక్ చేయాలి. అంతే. ఇచ్చిన సమాచారాన్ని ఏఐ విశ్లేషించి నిమిషాల్లో ప్రత్యేకమైన పాటను బాణీతో సహా క్రియేట్ చేసి పెడుతుంది.
- తర్వాత ఆ పాటను వినొచ్చు. నచ్చినట్టుగా వస్తే ట్రాక్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకవేళ నచ్చకపోతే ఇన్‌పుట్స్‌ను సవరించుకొని, తిరిగి కొత్తది సృష్టించుకోవచ్చు. ఈ ప్రక్రియ కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతుంది కాబట్టి తక్కువ సమయంలోనే బోలెడన్ని పాటలను క్రియేట్ చేసుకోవచ్చు.

గెలాక్సీ ఫోల్డ్6 ప్రత్యేక ఫోన్

సామ్‌సంగ్ తమ మడత ఫోన్ల శ్రేణిలో **గెలాక్సీ జడ్ ఫోల్డ్6 స్పెషల్ ఎడిషన్** ఫోన్‌ను తీసుకొచ్చింది. ఇది గెలాక్సీ ఫోల్డ్6 కన్నా పలుచగా, తేలికగా ఉండటం గమనార్హం. మడత పెట్టినప్పుడు 10.6 మి.మీ. మందం గల దీని బరువు కేవలం 236 గ్రాములే. ఫోల్డ్ 6 కన్నా ఇది మూడు గ్రాములు తక్కువ. తెర తెరచినప్పుడు 4.9 మి.మీ. మందం ఉంటుంది. అల్యూమినియం ఫ్రేమ్‌తో కూడిన దీనికి ముందూ వెనకా కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 రక్షణ ఉంది. వెలుపలి తెర 6.5 అంగుళాలు, లోపలి తెర 8 అంగుళాల సైజు ఉంటాయి. స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 3 చిప్‌తో పనిచేసే ఇది 16జీబీ ర్యామ్, 512జీబీ అంతర్గత స్టోరేజీతో వస్తోంది. 25డబ్ల్యూ వైర్డ్, 15డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్ సపోర్టు గల ఇది 4,400ఎంఏహెచ్ బ్యాటరీ కలిగుంది. ప్రస్తుతానికి దక్షిణ కొరియాలోనే అందుబాటులో ఉంది. మనదేశానికి ఎప్పుడు వస్తుందో ఇంకా తెలియరాలేదు.


ఇన్‌స్టాలో కొత్త ప్రొఫైల్ కార్డ్



తమ వ్యక్తిత్వాన్ని, ప్రస్తుత మూడ్‌ను సంగీతం రూపంలో వెల్లడించటం కోసం ఇటీవలే సాంగ్ ఆన్ ప్రొఫైల్ ఫీచర్‌ను తీసుకొచ్చిన ఇన్‌స్టాగ్రామ్ కొత్త **ప్రొఫైల్ కార్డ్** ఫీచర్‌నూ ఆరంభించింది. ప్రొఫైల్స్‌ను మరింత సులభంగా షేర్ చేసుకోవటానికి, డిజిటల్ కార్డులను ఆకర్షణీయంగా మలచుకోవటానికిది వీలు కల్పిస్తుంది. ఇప్పుడు యూజర్లు రెండు వైపులా డిజిటల్ కార్డును డిజైన్ చేసుకోవచ్చు. ఇందులో బయోడేటాను పొందుపరచుకోవచ్చు. ఇతర పేజీలకు లింక్స్‌ను, సంగీతం వంటి వాటినీ జోడించుకోవచ్చు. ప్రొఫైల్‌లోకి వెళ్లేలా చేసే క్యూఆర్ కోడ్ మరో ఆకర్షణ. కార్డుకు ఒకవైపున క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఇతరులు దీన్ని స్కాన్ చేసి ప్రొఫైల్‌లోకి వెళ్లొచ్చు. కార్డు రెండో వైపు షేర్ చేయటం కుదరదు. ఇన్‌స్టాగ్రామ్ చాలాకాలంగా ప్రొఫైల్ కార్డులను షేర్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తోంది. కానీ ఇది క్యూఆర్ కోడ్స్‌కే పరిమితమయ్యేది. ఇప్పుడు యూజర్లు తమకు ఇష్టమైన పాటలు లేదా హాబీలనూ చర్చించుకోవటానికీ వీలుంటుంది. కార్డు నేపథ్య రంగును మార్చుకోవటం, సెల్ఫీ అప్‌లోడ్ చేయటం, ఇష్టమైన ఎమోజీని జోడించటం వంటి ఆప్షన్లు కూడా ఉంటాయి. ప్రొఫైల్ కార్డులను షేర్ చేసుకోవటానికి ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ విభాగంలోకి వెళ్లి, షేర్ ప్రొఫైల్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఎడిట్ గుర్తు మీద తాకి తగిన సమాచారాన్ని జత చేసుకోవచ్చు, సవరించుకోవచ్చు. ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ కార్డులను స్టోరీల్లోనే కాకుండా ఇతర నెట్‌వర్క్స్ మీదా షేర్ చేసుకునే వీలుండటం గమనార్హం.

యాపిల్ ఖాతా ప్రైమరీ ఈమెయిల్ మార్పు సులభం

యాపిల్ ఖాతాతో ముడిపడిన ప్రధాన ఈమెయిల్ అడ్రస్‌ను మార్చుకోవటం పెద్ద తతంగమే. ముందు ప్రధాన ఈమెయిల్‌ను డిలీట్ చేయాలి. తర్వాత కొత్తది యాడ్ చేసుకొని, తిరిగి ధ్రువీకరించుకోవాలి.




వచ్చే ఐఓఎస్ 18.1 అప్‌డేట్ పుణ్యమాని ఇది సులభం కానుంది. యాపిల్ ఖాతాను క్రియేట్ చేసుకోవటానికి వాడిన ఈమెయిల్‌ను మార్చకుండానే కొత్త ప్రధాన ఈమెయిల్‌ను జత చేసుకోవచ్చు. అంటే ఒరిజినల్ అకౌంట్‌ను ఇంకా లాగిన్ కావటానికి వాడుకోవచ్చన్నమాట. అది షేర్డ్ డాక్యుమెంట్స్, క్యాలెండర్ ఆహ్వానాల వంటి వాటిల్లో కనిపించదు. దీంతో చాలా సమయం ఆదా అవుతుంది. కొన్ని ఇబ్బందికర పరిస్థితులూ తొలగిపోతాయి.

వాట్సప్‌లో ఛాట్ రికార్డింగ్

వాట్సప్‌లోని మెటా ఏఐ పర్సనల్ అసిస్టెంట్‌గా బాగా ఉపయోగపడుతోంది. సందేహాలకు సమాధానాలిస్తూ చాలా విషయాల్లో చేదోడుగా నిలుస్తోంది. దీనికి కొత్తగా ఛాట్ మెమరీ ఫీచర్ జత కానుంది. మనం మెటాకు అందించిన అవసరమైన మొత్తం సమాచారాన్ని రికార్డు చేయటం దీని ప్రత్యేకత. ఇలా ఇది మరింత మెరుగైన పర్సనల్ అసిస్టెంట్‌గా తోడుంటుంది. ఉదాహరణకు- యూజర్ శాకాహారి అని అది గుర్తించిందనుకోండి. ఆ వంటకాలనే సూచిస్తుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ అభివృద్ధి దశలోనే ఉంది. ఇష్టాయిష్టాలను బట్టి పనిచేసే దీన్ని త్వరలోనే కొందరు యూజర్లు పరీక్షించటానికి అందుబాటులోకి తేవొచ్చని భావిస్తున్నారు.

లైక్స్ హైడ్ ఇలా..



ఇన్‌స్టాగ్రామ్‌లో పాపులారిటీ కన్నా కంటెంట్ మీద ఎక్కువగా దృష్టి సారిస్తున్నారా? అయితే లైక్ అండ్ వ్యూ కౌంట్స్ కనిపించకుండా చేసే ఫీచర్‌ను వాడుకోవచ్చు. ఖాతా పబ్లిక్ అయినా, ప్రైవేట్ అయినా దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఫాలోయర్లకు లైక్స్ సంఖ్య కనిపించకుండా చేయొచ్చు. ఎన్నిసార్లు పోస్ట్ షేర్ అయ్యిందో తెలిపే సంఖ్యనూ హైడ్ చేయొచ్చు. ఇందుకోసం వెబ్ బ్రౌజర్ లేదా స్మార్ట్‌ఫోన్ ద్వారా సెటింగ్స్‌లో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. పోస్ట్ పబ్లిష్ అయిన తర్వాతే కాకుండా కొత్తగా పోస్ట్ చేస్తున్నప్పుడైనా వీటిని మార్చుకోవచ్చు. లైక్స్ సంఖ్య కనిపించకుండా చూడాలనుకునే పోస్ట్‌ను గుర్తించి, పైన కుడిమూలన మూడు గీతల మీద తాకాలి. దీని ద్వారా సెటింగ్స్‌లోకి వెళ్తే లైక్ అండ్ షేర్ కౌంట్స్ ఆప్షన్ కనిపిస్తుంది. దీన్ని క్లిక్ చేసి హైడ్ లైక్ అండ్ షేర్ కౌంట్స్ బటన్‌ను ఆన్ చేసుకోవాలి. ఒకవేళ కొత్తగా ఏదైనా పోస్ట్ చేస్తున్నప్పుడు దానికి సంబంధించిన లైక్స్ సంఖ్య కనిపించొద్దనుకుంటే క్యాప్షన్స్ రాసే, అకౌంట్స్‌ను ట్యాగ్ చేసే పేజీలోకి వెళ్లాలి. ఇందులో కిందికి వెళ్లి, అడ్వాన్స్‌డ్ సెటింగ్స్ ఎంచుకోవాలి. అప్పుడు హైడ్ లైక్ అండ్ వ్యూ కౌంట్స్ ఆన్ దిస్ పోస్ట్‌ను ఎంచుకోవాలి. దీంతో లైక్స్, షేర్స్ సంఖ్య ఫాలోయర్లకు కనిపించవు.

అత్యవసర వేళ ఉపగ్రహం తోడు

ఇటీవల శాటిలైట్ కనెక్టివిటీ గురించి తరచూ వింటున్నాం. అప్పట్లో విడుదలైన ఐఫోన్ 14 ముఖ్య అంశాల్లో ఇదొకటి. అత్యవసర సమయాల్లో సెల్ సిగ్నల్ లేకపోయినా ఐఫోన్ 14, అనంతర శ్రేణి ఫోన్లు భూ దిగువ కక్ష్యలో సంచరించే ఉపగ్రహాలతో అనుసంధానమై మెసేజ్‌ను పంపిస్తాయి. గూగుల్ కూడా పిక్సెల్ 9 ఫోన్లకు ఈ పరిజ్ఞానాన్ని జత చేసింది. ఇంతకీ శాటిలైట్ కనెక్టివిటీ అంటే? ఇదెలా పనిచేస్తుంది?

మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీ అనేది శాట్‌ఫోన్ కాదని అర్థం చేసుకోవటం ముఖ్యం. శాట్‌ఫోన్లు కూడా ఉపగ్రహాల ద్వారా టెలిఫోన్ నెట్‌వర్క్‌ను అనుసంధానం చేసినప్పటికీ అదో పాత పరిజ్ఞానం. సంక్లిష్టమైందీ, ఖరీదైంది కూడా. ఇవి కేవలం ఉపగ్రహాల పరిజ్ఞానంతోనే అనుసంధానమవుతాయి. మరోవిధంగా చెప్పాలంటే- ఇలాంటి ఫోన్లు మారుమూల ప్రాంతాలకు ప్రయాణించే వారి కోసమే తయారుచేస్తారన్నమాట. ఆధునిక స్మార్ట్‌ఫోన్లు అలా కాదు. నేల మీది సెల్ టవర్ల ఆధారంగా కనెక్ట్ అవుతాయి. మనం ఒక సెల్ టవర్ నుంచి మరొక సెల్ టవర్‌కు చేరుకున్నప్పుడు ఫోన్ సమీపంలోని టవర్‌తో అనుసంధానమవుతుంది. ఒకవేళ దగ్గరలో సెల్ టవర్ లేకపోతే సిగ్నల్ పోతుంది. ఫోన్‌లో ఎలాంటి నెట్‌వర్క్ కనెక్షనూ ఉండదు. కాల్స్ చేయటం, మెసేజ్ పంపటం కుదరదు. ఇంటర్నెట్ సదుపాయమూ ఉండదు. ఇక్కడే మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీ ఉపయోగపడుతుంది. ఇది అత్యవసర సమయాల్లో ప్రామాణిక మొబైల్‌ను ఉపగ్రహ నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యేలా చేస్తుంది. ప్రస్తుతానికి స్మార్ట్‌ఫోన్లలోని శాటిలైట్ కనెక్టివిటీ సదుపాయాలు అత్యవసర మెసేజ్‌లకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ముున్ముందు అటు నుంచి ఇటు నుంచి అటు మెసేజ్‌లు పంపేలా రూపుదిద్దుకోవచ్చని, ఇంటర్నెట్ డేటానూ ప్రసారం చేసే అవకాశం ఉండొచ్చని భావిస్తున్నారు.



ఐఫోన్లతో ఇలా

- 911కు డయల్ చేయాలి. కాల్ కనెక్ట్ కాకపోతే ఎమర్జెన్సీ ఎస్ఓఎస్ వయా శాటిలైట్ మీద తాకి, అత్యవసర మెసేజ్ పంపొచ్చు. మెసేజెస్ యాప్‌లోని ఎమర్జెన్సీ సర్వీసెస్‌తోనూ దీన్ని వాడుకోవచ్చు.
- రిపోర్ట్ ఎమర్జెన్సీ ఫీచర్‌నూ ఉపయోగించుకోవచ్చు. దీని మీద తాకి, తెర మీద కనిపించే సూచనలను పాటిస్తూ సాగాలి. పంపించిన టెక్స్ట్ మెసేజ్‌లో మెడికల్ ఐడీ, ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలు, లొకేషన్, బ్యాటరీ లైఫ్ సమాచారమూ ఉంటుంది. ఒకవేళ మన కాంటాక్ట్ జాబితాలో ఉన్నవారు ఐమెసేజ్‌ను వాడుతున్నట్టయితే వారికి ఎమర్జెన్సీ సేవలతో కూడిన కమ్యూనికేషన్ టెక్స్ట్ అందుతుంది.

పిక్సెల్ 9 ఫోన్లలో ఇలా..

- డిఫాల్ట్ మెసేజింగ్ యాప్‌గా గూగుల్ మెసేజ్‌ను సెట్ చేసుకొని ఉండాలి.
- 911కు డయల్ చేయాలి. ఒకవేళ సెల్ సర్వీస్ లేదా వై-ఫై లేనట్టయితే శాటిలైట్ ఎస్ఓఎస్ ఆప్షన్ కనిపిస్తుంది. దీని మీద తాకాలి.
- అవసరమైన సమాచారాన్ని నింపి, నోటిఫై ఎమర్జెన్సీ కాంటాక్ట్స్‌ను ఎంచుకోవాలి.
- తెర మీద కనిపించే సూచనలు పాటించాలి. ఉపగ్రహం ఉన్న వైపునకు ఫోన్ చూపెట్టాలి.

ల్యాప్‌టాప్ బ్యాటరీ మన్నికగా



ముందూ వెనకా చూడకుండా రోజూ ల్యాప్‌టాప్‌ను ఛార్జ్ చేస్తూనే ఉంటాం. ప్లగ్ తగిలించేసి ఏవేవో పనులు చేసుకుంటాం. బ్యాటరీ ఫుల్ అయ్యాక ప్లగ్ తీసేస్తాం. అయితే ఛార్జింగ్ అలవాట్లు బ్యాటరీ మన్నిక, పనితీరు మీద ప్రభావం చూపుతాయనే సంగతి తెలుసా? ల్యాప్‌టాప్‌ను సరైన విధంగా ఛార్జ్ చేయకపోతే బోలెడన్ని చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరమ్మతు చేయాల్సి వస్తే ఖర్చూ అవుతుంది. అందువల్ల ల్యాప్‌టాప్ ఛార్జింగ్ విషయంలో చేయాల్సినవి, చేయకూడనివి ఏంటో చూద్దాం.

చేయాల్సినవి

- ఎప్పుడైనా సరే ల్యాప్‌టాప్‌తో వచ్చిన లేదా కంపెనీ సిఫారసు చేసిన ఛార్జర్‌నే వాడాలి. థర్డ్ పార్టీ లేదా అనధీకృత ఛార్జర్ ఉపయోగిస్తే ల్యాప్‌టాప్ బ్యాటరీ, ఇతర భాగాలు దెబ్బతినే ప్రమాదముంది. ఇతర, నకిలీ ఛార్జర్లు తగినంత వోల్టేజీ ఇవ్వవు. ఫలితంగా ఓవర్ హీట్ కావొచ్చు. క్రమంగా ల్యాప్‌టాప్ చెడిపోవచ్చు.
- దిండు, తువ్వాలు, దుప్పట్ల వంటి మెత్తటి వస్తువులపై కాకుండా ఉపరితలం గట్టిగా, చదునుగా ఉండే బల్లల వంటి వాటి మీద ల్యాప్‌టాప్‌ను పెట్టి ఛార్జ్ చేయాలి. మెత్తటి వస్తువులు వేడిని పట్టి ఉంచుతాయి. గాలి సరిగా ఆడకుండా, చల్లబడకుండా చేస్తాయి. దీంతో బ్యాటరీ అతిగా వేడెక్కుతుంది. ఇది అసౌకర్యం కలిగించటమే కాదు, ల్యాప్‌టాప్ లోపలి భాగాలు కూడా దెబ్బతినొచ్చు.
- ల్యాప్‌టాప్‌కు అతిగా చల్లదనం, వేడి తగలకుండా చూడాలి. అతి వేడితో బ్యాటరీ బాగా దెబ్బతినొచ్చు. అతి చల్లదనంతో సామర్థ్యం తగ్గొచ్చు. ఉదాహరణకు- బాగా వేడిగా ఉన్న కారులో లేదా గడ్డకట్టించే చలిలో ల్యాప్‌టాప్‌తో పనిచేస్తుంటే బ్యాటరీ సామర్థ్యం, మన్నిక తగ్గుతాయి.
- కొద్దిసేపు ల్యాప్‌టాప్‌ను వాడి, ఆ వెంటనే ఛార్జ్ చేయటం మంచిది కాదు. వీలైనంతవరకూ బ్యాటరీ ఛార్జింగ్ 20% నుంచి 80% మధ్యలో ఉండేలా చూసుకోవాలి. దీంతో మన్నిక, సామర్థ్యం మెరుగవుతాయి.
- ల్యాప్‌టాప్ బ్యాటరీని అప్పుడప్పుడూ గమనిస్తూ ఉండాలి. ఉబ్బినట్టు అనిపిస్తే వెంటనే ఆపెయ్యాలి. నిపుణులకు చూపించి తనిఖీ చేసుకోవాలి. రోజూ వాడే క్రమంలో క్షీణించటంతోనే కాదు, బ్యాటరీ దెబ్బతినటం మూలంగానూ ఉబ్బొచ్చు. ఇది ప్రమాదానికి దారితీయొచ్చు.

చేయకూడనివి

- గేమింగ్, వీడియో ఎడిటింగ్ వంటి పనులకు ఎక్కువ విద్యుత్తు అవసరమవుతుంది. ఇలాంటివి చేసేటప్పుడు ఛార్జింగ్ పెడితే ఎక్కువ వేడి పుట్టుకొస్తుంది. బ్యాటరీ మీద ఎక్కువ భారం పడుతుంది. అతిగా వేడెక్కొచ్చు. ఒకవేళ పని చేస్తున్నప్పుడు ఛార్జింగ్ పెట్టాలని అనుకుంటే మామూలు పనులు చేయాలి. ల్యాప్‌టాప్ చల్లబడేలా మధ్యమధ్యలో విరామం ఇవ్వాలి.
- ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకుంటే సౌకర్యంగానే ఉంటుంది. కానీ ఇది వేడి బయటకు వెళ్లకుండా, చల్లబడకుండా చేయొచ్చు. పరికరం అతిగా వేడెక్కితే క్రమంగా దెబ్బతింటూ వస్తుంది. అందువల్ల ఎప్పుడైనా చదునైన ఉపరితలాల మీద పెట్టే ఛార్జ్ చేయాలి. దీంతో ఛార్జ్ అవుతున్నప్పుడు సరిగ్గా చల్లబడుతుంది.
- నిజానికి అలాగే ప్లగ్ పెట్టి ఉంచినా చాలా ల్యాప్‌టాప్‌లు తట్టుకుంటాయి. అయినా కూడా నిరంతరం ఛార్జ్ చేస్తూ ఉండటం మంచిది కాదు. దీర్ఘకాలంలో ఇది బ్యాటరీ నైపుణ్యాన్ని తగ్గిస్తుంది. పూర్తిగా ఛార్జ్ అయ్యాక ప్లగ్ తీసేయటం ఉత్తమం.
- ఛార్జర్ చెడిపోయినా, కేబుల్ తెగినా వెంటనే మార్చుకోవాలి. దెబ్బతిన్న యాక్సెసరీస్ వాడటం ప్రమాదకరమే కాదు, ల్యాప్‌టాప్ సైతం దెబ్బతినొచ్చు. తెగిన తీగలతో విద్యుత్తు సరిగా సరఫరా కాదు. ఇది తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.
- బ్యాటరీని పూర్తిగా ఛార్జ్ చేసి, స్టోర్ చేస్తే త్వరగా సామర్థ్యం క్షీణిస్తుంది. కాబట్టి ఎక్కువకాలం ల్యాప్‌టాప్‌ను స్టోర్ చేయాలనుకుంటే 50% కన్నా తక్కువగా ఛార్జింగ్ ఉండేలా చూసుకోవాలి. అలాగని ఛార్జింగ్ పూర్తిగా నిండుకునేలా చూడొద్దు.

రైల్వే ఉద్యోగం చేస్తూ బీఈడీ?

బీఎస్సీ చదివి.. రైల్వేలో ఉద్యోగం చేస్తున్నా. వారంలో రెండు నైట్ డ్యూటీలు. మిగతా రోజుల్లో కాలేజీకి వెళుతూ రెగ్యులర్‌గా బీఈడీ చేయాలనుకుంటున్నా. సరైన నిర్ణయమేనా? - అమోస్ కొర్రా



■ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ రెగ్యులర్‌గా బీఈడీ చదవడం కుదరదు. మీకు రోజూ నైట్ డ్యూటీలు ఉన్నా కానీ రెగ్యులర్ పద్ధతిలో ఏ డిగ్రీ ప్రోగ్రామూ చదవడం వీలవదు. ఎందుకంటే ప్రభుత్వ ఉద్యోగులు నిర్ణీత ఆఫీసు సమయంలోనే కాకుండా రోజుకు 24 గంటలూ ఉద్యోగంలో ఉన్నట్లే! ఉద్యోగం చేసే సంస్థ ముందస్తు అనుమతితో మాత్రమే డిగ్రీ/ డిప్లొమాను దూరవిద్య/ ఆన్‌లైన్/ ఈవినింగ్ కళాశాలలో చదవొచ్చు. ఇటీవల కొన్ని ప్రభుత్వ నియామకాల సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో.. ఉద్యోగాలకు సెలవు పెట్టకుండా కళాశాలల్లో/ యూనివర్సిటీల్లో రెగ్యులర్‌గా డిగ్రీలు పొందినవారి నియామకాలను పెండింగులో పెట్టారు. మీకు ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే ఉద్యోగానికి రెండేళ్లు సెలవు పెట్టి బీఈడీ ప్రోగ్రామ్‌ను రెగ్యులర్‌గా చేయండి.

బీఈడీ శిక్షణ మీ భవిష్యత్తుకు ఏ విధంగా ఉపయోగం? అందుకు ఎంత సమయం కేటాయించాలి? ఈ ప్రోగ్రాం చదివే క్రమంలో మీ ప్రస్తుత రైల్వే ఉద్యోగ విధులు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతాయా?.. ఈ అంశాల గురించి లోతుగా ఆలోచించండి. బీఎస్సీ డిగ్రీ మాత్రమే చదివి, బీఈడీని దూరవిద్య ద్వారా చేయడం కుదరదు. డీఈడీ విద్యార్హతతో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు మాత్రమే ఓపెన్ యూనివర్సిటీల ద్వారా/ఎంపిక చేసిన యూనివర్సిటీల్లో దూరవిద్య ద్వారా బీఈడీ చేసే అవకాశం ఉంది. మీకు ఆసక్తి ఉంటే డిగ్రీ విద్యార్హతతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ చదవొచ్చు. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ కోసం డీఈడీ విద్యార్హత, ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం లాంటి నిబంధనలు ఏమీ లేవు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌తో కూడా ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులకు ప్రయత్నించవచ్చు. ఉపాధ్యాయ వృత్తి కోసం కాకుండా ఎడ్యుకేషన్ సబ్జెక్టుపై ఆసక్తి ఉంటే ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఎంఏ ఎడ్యుకేషన్ చేయొచ్చు. బీఈడ్ లాంటి ప్రొఫెషనల్ ప్రోగ్రామ్స్‌ను రెగ్యులర్‌గా చదివితేనే వృత్తికి అవసరమైన నైపుణ్యాలు, మెలకువలు, విషయ పరిజ్ఞానం పొందే అవకాశం ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్‌బోర్డు

ఉద్యోగాలు

జిప్‌మర్‌లో ఫ్యాకల్టీ

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్).. రెగ్యులర్ ప్రాతిపదికన 80 ఫ్యాకల్టీ పోస్టుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

◆ ప్రొఫెసర్: 28 ◆ అసిస్టెంట్ ప్రొఫెసర్: 52

విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, పాథాలజీ, రేడియోడయాగ్నోసిస్, ఫిజియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఎన్విరాన్‌మెంట్ హెల్త్, ఎండోక్రినాలజీ, నెఫ్రాలజీ, సైకియాట్రీ, సర్జరీ, యూరాలజీ తదితరాలు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలోఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.

వయసు: ప్రొఫెసర్ పోస్టుకు 58 ఏళ్లు; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ ఎక్స్ - సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ పరిమితి ఉంటుంది. **వేతన శ్రేణి:** ప్రొఫెసర్ పోస్టుకు నెలకు రూ.1,68,900-రూ.2,20,400; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500-రూ.1,67,400. **పని ప్రదేశాలు:** పుదుచ్చేరి, కరైకల్.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.1,500, ఎస్సీ/ ఎస్టీలకు రూ. 1,200, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21-11-2024.

వెబ్‌సైట్: https://jipmer.edu.in/

డీఆర్‌డీవోలో జూనియర్ రిసెర్చ్ ఫెలోలు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)కు చెందిన రిసెర్చ్ సెంటర్ ఇమారత్ .. తాత్కాలిక ప్రాతిపదికన 22 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◆ రిసెర్చ్ అసోసియేట్: 03 ◆ జూనియర్ రిసెర్చ్ ఫెలో: 19

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, కెమికల్, ఫిజిక్స్, మెటలర్జీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంటెక్/ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.

వయసు: 35 ఏళ్లు మించి ఉండకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'హెడ్ హెచ్ఆర్‌డీ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మిసైల్ కాంప్లెక్స్, రిసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ), విజ్ఞాన కంచ, హైదరాబాద్, తెలంగాణ' చిరునామాకు పంపించాలి.

ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా. **దరఖాస్తుకు చివరి తేదీ:** ప్రకటన వెలువడిన తేదీ (27-09-2024) నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/

సీఈఆర్ఐలో టెక్నీషియన్లు

తమిళనాడు చెన్నైలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్‌కు చెందిన సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈఆర్ఐ) కరైకుడి, డైరెక్ట్ ప్రాతిపదికన 37 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

◆ టెక్నికల్ అసిస్టెంట్: 09 ◆ టెక్నీషియన్: 28

అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో ఐటీఐ, డిప్లొమా (మెకానికల్/ హార్టికల్చర్), బీఎస్సీ డిగ్రీ (అగ్రికల్చరల్/ హార్టికల్చర్)తో పాటు పని అనుభవం. **వేతనం:** టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.56,640 (రూ.35,400- రూ.1,12,400); టెక్నీషియన్ పోస్టులకు రూ.31,840 (రూ.19,900- రూ.63,200).

వయసు: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్ /ఆఫ్‌లైన్ ద్వారా.

ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సీఎస్ఐఆర్-సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈఆర్ఐ), కరైకుడి, తమిళనాడు' చిరునామాకు పంపించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 06-12-2024.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 18-12-2024.

వెబ్‌సైట్: https://www.cecri.res.in/

టీఐఎఫ్ఆర్, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ పోస్టులు



హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్) తాత్కాలిక ప్రాతిపదికన 5 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◆ మెడికల్ ఆఫీసర్: 01
◆ పార్ట్ టైమ్ సైకాలజిస్ట్: 01
◆ ప్రాజెక్ట్ నర్స్: 01
◆ ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్: 01
◆ ప్రాజెక్ట్ క్లర్క్: 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, డిగ్రీతో పాటు పని అనుభవం.

ఎంపిక: రాత పరీక్షలు, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08-11-2024.

వెబ్‌సైట్: https://recruitment.tifrh.res.in/

వాక్-ఇన్స్

టీఐఎఫ్ఆర్, ముంబయిలో క్లర్క్ ట్రెయినీలు

ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్) ముంబయి- 15 క్లర్క్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

◆ క్లర్క్ ట్రెయినీ (అకౌంట్స్): 10 ◆ క్లర్క్ ట్రెయినీ (అడ్మినిస్ట్రేషన్): 05

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూట్ నుంచి డిగ్రీతో పాటు టైపింగ్ పరిజ్ఞానం, పర్సనల్ కంప్యూటర్/ అప్లికేషన్ వినియోగంపై అవగాహన. **వయసు:** 28 సంవత్సరాలు మించకూడదు.

నెలవారీ స్టైపెండ్: రూ.22,000. **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా. **వాక్-ఇన్ సెలక్షన్ తేదీ:** 18-11-2024.

వేదిక: టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్, 1 హోమీ భాభా రోడ్, నేవీ నగర్, కొలాబా, ముంబయి. **వెబ్‌సైట్:** https://tifrrecruitment.tifrh.res.in/applicants/notice.php

ఎస్‌డీఎల్.. అభ్యాసం ఆరంభిద్దామా!



మనం ఎన్ని డిగ్రీలు చదివినా, ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా, సొంతంగా కంపెనీలు ప్రారంభించినా.. కొత్త విషయాలు తెలుసుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. రోజూ ఏదో ఒక అంశాన్ని తెలుసుకుంటూనే ఉంటాం. అయితే అందులో కొన్ని నేర్చుకుని సాధన చేయడం ద్వారా.. ప్రస్తుతం ఉన్న స్థితి కంటే మెరుగైన జీవనశైలిని సొంతం చేసుకునే వీలుంటుంది. ఇదే అప్‌గ్రెడేషన్. దీనికి ఓ ప్రధానమైన సాధనం.. సెల్ఫ్ డైరెక్టెడ్ లెర్నింగ్ (ఎస్‌డీఎల్). అదేంటో ఓసారి చూద్దామా!

నేర్చుకోవడం విద్యార్థి దశలోనూ, కెరియర్ ఆరంభంలోనూ అత్యంత ఆవశ్యకం. అది కాలేజీలో అయినా, యూనివర్సిటీ అయినా, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ అయినా, ఆన్‌లైన్ అయినా.. స్థిరమైన నైపుణ్యాలను విద్యార్థులు సాధన చేస్తారు. ఇలాంటి అభ్యాసానికి సొంతంగా చేసే సాధన తోడైతే ఫలితాలు మరింత ఉన్నతంగా ఉంటాయి. సెల్ఫ్ డైరెక్టెడ్ లెర్నింగ్ ప్రధాన లక్ష్యం ఇదే. తెలియని విషయం ఆన్‌లైన్‌లో వెతికినా, యూట్యూబ్‌లో ఏదైనా పని చేయడం ఎలాగో చూసినా.. ఇదంతా ఎస్‌డీఎల్ కిందికే వస్తుంది!

● ఇది విద్యార్థులకు అనేక విధాలుగా మేలు చేస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. ఈ పద్ధతి ఒక వ్యక్తిలో ఉత్సాహం, సృజనాత్మకత, సొంతంగా ఆలోచించే ధోరణి, ప్రేరణ, సంతృప్తి.. వంటివాటిని పెంపొందిస్తున్నట్లు గుర్తించారు. దీన్నే 'యాక్టివ్ లెర్నింగ్ లేదా డీప్ లెర్నింగ్' అని కూడా అంటున్నారు. ఈ పద్ధతిలో అభ్యాసకులు నేర్చుకునే ప్రక్రియ తాలూకా పూర్తి బాధ్యతను స్వయంగా నిర్వర్తిస్తారు. ఏం చదవాలి, ఎలా చదవాలి అనే ప్రణాళిక, దాన్ని పాటించడం, పరీక్షించడం, తప్పులు సరి చేసుకోవడం.. వంటివన్నీ వారే చూసుకుంటారు. వారి లెర్నింగ్ యాక్టివిటీ పెరగడానికి ఇదో చక్కని పద్ధతి.

● నిజానికి మన విద్యావ్యవస్థలో స్టూడెంట్స్ అధికశాతం క్లాస్‌రూమ్ పాఠాలపైనే ఆధారపడతారు. లెక్చర్లు ఎక్కువ.. ప్రాక్టీసు తరగతులు తక్కువగా దీన్ని చూడవచ్చు. దీని ద్వారా విద్యార్థులకు సొంతంగా నేర్చుకోవాలనే ఆసక్తి క్రమేపీ తగ్గిపోతూ స్పూన్ ఫీడింగ్ అలవాటు అవుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. అందువల్ల అన్నీ కాకపోయినా, కొన్ని విషయాల్లో అయినా ఎస్‌డీఎల్ వినియోగించడం ద్వారా.. విద్యార్థులకు సొంతంగా, స్థిరంగా చదవడం అలవాటు అవుతుంది. చదువు పూర్తయ్యి పోటీ పరీక్షలు రాయాల్సి వచ్చినప్పుడు.. ఎంత తరగతులు విన్నా, పరీక్షలు రాసినా, విద్యార్థి తను సొంతంగానే అధికశాతం కష్టపడాలి. ఇది ముందు నుంచీ అలవాటు కావాలి. దీనికి ఎస్‌డీఎల్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎస్‌డీఎల్.. లెర్నింగ్ మెథడ్స్‌లో ముఖ్యమైన అంశం. ఇది విద్యార్థులకు తమకు నచ్చిన విధంగా లెర్నింగ్ సరళిని ఎంచుకునే అవకాశం ఇస్తుంది. ఉన్నత స్థాయి విద్యాభ్యాసంలో ఉన్న విద్యార్థులెవరైనా దీన్ని పాటించవచ్చు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారూ దీని ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చు.

● ఇందులో అభ్యాసం అవసరాలను అంచనా వేయడం, వాటిని చేరుకునేందుకు లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవడం, కావాల్సిన రిసోర్సును గుర్తించడం.. ఇవన్నీ విద్యార్థులే చేస్తారు.

● ఏం చదవాలి, ఎలా చదవాలి అనే అంశంపై తమకు తాముగా నిర్ణయం తీసుకునే వీలుంటుంది. ప్రయారిటీ ఆర్డర్‌ను నిర్దేశించుకోవచ్చు.

● అభ్యాసకులు తల్లిదండ్రులు లేదా టీచర్ల సాయం తీసుకుంటారు. అయితే అది పరిమితంగానే ఉంటుంది. సందేహాల నివృత్తి, సాధనకు సమకూర్చాల్సిన వనరుల వంటి అంశాల్లో ముఖ్యంగా కనిపిస్తుంది.

● ఆసక్తి, ఉత్సాహం అనేవి దీనిలో ప్రధానమైన అంశాలు. నచ్చిన అంశాన్ని అంతే ఇష్టంగా నేర్చుకోగలగడం ప్రధానం.

● ఇదే సమయంలో విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేలా.. నిరంతరం పరీక్షించుకుంటూ ఉండటం ముఖ్యం.

ప్రారంభించే ముందు..

1 ఏదైనా ఒక అంశాన్ని నేర్చుకోవాలి అనుకున్న తర్వాత.. దాని పట్ల ఉన్న ఆసక్తి, పట్టుదల, సమయం, దాని అవసరం, ఇంటి పరిస్థితులు అన్నీ ఆలోచించాలి.

2 అభ్యాస లక్ష్యాలను వెంటనే నిర్దేశించుకోవాలి. వీటిని ఎవరితోనైనా చర్చించి ప్రణాళికలో తప్పొప్పులు సరిచూసుకోవాలి.

3 నేర్చుకునే ప్రక్రియను అర్థం చేసుకుని, దాన్ని ఆసాంతం ఆసక్తికరంగా మలుచుకోవడం ముఖ్యం.

4 'సెల్ఫ్ రిఫ్లెక్షన్, సెల్ఫ్ ఎవాల్యుయేషన్' పాటించాలి. సంతృప్తికరమైన ప్రదర్శన ఇచ్చేలా మనల్ని మనం ప్రేరేపించుకోవాలి.

ప్రయోజనాలు..

- ఎస్‌డీఎల్ ప్రభావవంతమైనదే కాదు.. ఫ్లెక్సిబిలిటీ అందించేది కూడా. ఉన్న సమయాన్ని నచ్చినట్టుగా సద్వినియోగం చేసుకోవచ్చు.
- ప్రతి ఒక్కరికీ ఒక లెర్నింగ్ స్టైల్ అనేది ఉంటుంది. అదేంటో తెలుసుకోవడం ద్వారా వారు మరింతగా రాణించగలరు. ఎస్‌డీఎల్ ఇందుకు ప్రోత్సాహం అందిస్తుంది.
- క్లాస్ రూమ్ నుంచి బయటకు వచ్చినా.. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ అనే ఆలోచన విద్యార్థులకు ఇస్తుంది. ఇది కెరియర్‌లో ఎదిగేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.
- ఇది విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్ నైపుణ్యాలను పెంపొందిస్తుంది. నేర్చుకోవాలి అంటున్న అంశం ఎక్కడ, ఎలా చదవాలి, మెటీరియల్ ఎలా దొరుకుతుంది.. వంటివన్నీ వారే చూసుకోవడం వల్ల ఆర్గనైజేషన్ స్కిల్స్ అలవడతాయి.
- అభ్యాసం పట్ల వారికి పూర్తి స్వేచ్ఛ ఉండటం వల్ల ఈ పద్ధతిలో ఎటువంటి ఒత్తిడీ ఉండదు.
- పరిశోధన, నిర్ణయం తీసుకోవడం, సమస్యా పరిష్కార నైపుణ్యాలు, ప్రేరణ, సమయపాలన.. వంటి లక్షణాలన్నీ అలవడేలా చేస్తుంది.
- ఇది విద్యార్థులను జీవితాంతం కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండేలా ప్రోత్సహిస్తుంది. నాలెడ్జ్ గ్యాప్స్ లేకుండా, వెనుకపడిపోకుండా.. అప్‌డేటెడ్‌గా ఉంచుతుంది.

ఉదాహరణలు..

➤ చిన్న చిన్న, తక్కువ వ్యవధిలో పూర్తయిపోయే ఆన్‌లైన్ కోర్సులను ఎస్‌డీఎల్‌కు చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు. ఇవి యూనివర్సిటీలు, కార్పొరేట్ కల్చర్‌లో సాధారణంగా కనిపిస్తూ ఉంటాయి.

➤ ఆన్‌లైన్‌లో యాక్సెస్ చేసుకునే అవకాశం కల్పించే లెర్నింగ్ లైబ్రరీలు.. ఇదే కోవకు చెందుతాయి.

➤ మైక్రోలెర్నింగ్ కూడా ఇదే పద్ధతిలో కొనసాగుతుంది. నిమిషాల వ్యవధిలో నేర్చుకోగల చిన్న చిన్న పాఠాలు ఇందులో ఉంటాయి. ఇది గేమిఫికేషన్‌తో సైతం ముడిపడి ఉంటుంది.

➤ ఇండిపెండెంట్ రిసెర్చ్ ప్రాజెక్టులూ ఇదే పద్ధతిలో ఉంటాయి. విద్యార్థులు ఏదైనా అంశం మీద పూర్తిస్థాయిలో రిసెర్చ్ చేసి తాము కొత్త విషయాలను తెలుసుకుంటూనే.. ప్రాజెక్టులు పూర్తిచేస్తారు.

ఎన్ఎండీసీలో జూనియర్ ఆఫీసర్లు



హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) 153 జూనియర్ ఆఫీసర్ (ట్రెయినీ) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కమర్షియల్, ఎన్విరాన్‌మెంటల్, జియో అండ్ క్వాలిటీ కంట్రోల్, మైనింగ్, సర్వే, కెమికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, మెకానికల్ విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల విద్యార్హతలు, అనుభవం వివరాలను తెలుసుకుందాం...

1. కమర్షియల్–4: ఇంజినీరింగ్ డిగ్రీ/ ఎంబీఏ/ పీజీ/ మార్కెటింగ్/ ఫారిన్ ట్రేడ్/ సేల్స్ మార్కెటింగ్‌లో డిప్లొమా లేదా సీఏ/ ఐసీఎంఏ.

2. మైనింగ్–56: మూడేళ్ల మైనింగ్ ఇంజినీరింగ్ డిప్లొమాతోపాటు ఫోర్‌మెన్స్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ ఉండాలి. లేదా మైనింగ్ ఇంజినీరింగ్ డిగ్రీతోపాటు సెకండ్ క్లాస్ మైన్స్ మేనేజర్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపెటెన్సీ ఉండాలి. డిప్లొమా పూర్తిచేసిన వారికి సంబంధిత రంగంలో ఐదేళ్ల పని అనుభవం ఉండాలి.

3. సివిల్–9: సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా లేదా డిగ్రీ పూర్తి చేయాలి. నిర్మాణ రంగంలో ఐదేళ్ల అనుభవం ఉండాలి.

4. ఎలక్ట్రికల్–44: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా లేదా ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిగ్రీ. సంబంధిత రంగంలో ఐదేళ్ల అనుభవం ఉండాలి.

5. మెకానికల్–20: మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా లేదా మెకానికల్ ఇంజినీరింగ్ డిగ్రీ. ఐదేళ్ల అనుభవం ఉండాలి.

వయసు 32 సంవత్సరాలకు మించకూడదు. గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు రూ.250. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, ఎన్ఎండీసీ ఉద్యోగులకు ఫీజు లేదు.

ఎంపిక ఇలా..

● ఆన్‌లైన్ టెస్ట్ (కంప్యూటర్ ఆధారిత పరీక్ష), సూపర్‌వైజరీ స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

● సీబీటీ 100 మార్కులకు నిర్వహిస్తారు. సూపర్‌వైజరీ స్కిల్ టెస్ట్ అర్హత పరీక్ష మాత్రమే.

● ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో హిందీ, ఇంగ్లిష్‌లో ఉంటుంది.

● సీబీటీలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను సూపర్‌వైజరీ స్కిల్ టెస్టుకు ఎంపిక చేస్తారు.

● సీబీటీలో అన్‌రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఓబీసీ (ఎన్‌సీఎల్) 45 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

● సూపర్‌వైజరీ స్కిల్ టెస్టును 100 మార్కులకు నిర్వహిస్తారు. దీంట్లో అన్‌రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్‌లు 40 శాతం, ఓబీసీ (ఎన్‌సీఎల్) 37 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 30 శాతం మార్కులు సాధించాలి.

● సీబీటీలో సాధించిన మార్కుల ఆధారంగా 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను సూపర్‌వైజరీ స్కిల్ టెస్టుకు ఎంపిక చేస్తారు.

● స్కిల్ టెస్టు సమయంలో విద్యార్హతలు, అనుభవాలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.

● సీబీటీలో సాధించిన మార్కుల ఆధారంగానే తుది ఎంపిక చేస్తారు.

గమనించాల్సినవి: సీబీటీ, స్కిల్ టెస్టులకు హాజరయ్యే ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు రెండో తరగతి ఏసీ రైలు/ బస్ ప్రయాణ ఛార్జీలను చెల్లిస్తారు.

● అడ్మిట్‌కార్డ్/ కాల్ లెటర్లను సంస్థ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఈ సమాచారాన్ని అభ్యర్థి ఈమెయిల్‌కు తెలియజేస్తారు.

● ఆన్‌లైన్ టెస్టుకు అర్హులైన అభ్యర్థుల వివరాలు, సీబీటీ, స్కిల్ టెస్టుల మార్కులు, ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 10.11.2024

వెబ్‌సైట్: www.nmdc.co.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

ఐఓఎస్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: సివిల్స్ వెబ్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఐఓఎస్, రెస్ట్ ఏపీఐ, స్విఫ్ట్, ఎక్స్‌కోడ్ స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/76263b

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

సంస్థ: సినాప్టో టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: కంప్యూటర్ విజన్, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, పైతాన్
స్టైపెండ్: రూ.5,000-10,000
☛ internshala.com/i/9873ba

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: రెజిలియంట్ గ్రో
నైపుణ్యాలు: కంటెంట్ మార్కెటింగ్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, సేల్స్ పిచ్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/928c15

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: రిటెన్‌లీహబ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, వీడియో ఎడిటింగ్ స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/305e6a

యూట్యూబ్ షార్ట్స్ ఎడిటర్

సంస్థ: బడ్డింగ్ మారినర్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, ఆడియో ఎడిటింగ్, కేన్వా, వీడియో ఎడిటింగ్ స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/5b3d3e

ఈ–కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్

సంస్థ: మెట్ కనెక్ట్
నైపుణ్యం: ఈ-కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.6,000
☛ internshala.com/i/fe7d1f

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్)

సంస్థ: వన్స్ ఓన్ ఫైనాన్సర్
నైపుణ్యం: హ్యూమన్ రిసోర్సెస్
స్టైపెండ్: రూ.5,000-10,000
☛ internshala.com/i/556ead

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 16

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్

సంస్థ: ది హమ్మింగ్ మైండ్స్
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.1,000
దరఖాస్తు గడువు: నవంబరు 6
☛ internshala.com/i/cd9627

హైదరాబాద్‌లో డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: టెక్‌వర్క్స్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఫేస్‌బుక్ యాడ్స్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: నవంబరు 15
☛ internshala.com/i/935018

డేటా ఎంట్రీ

సంస్థ: జీగ్లర్ ఎయిరో స్పేస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: నవంబరు 16
☛ internshala.com/i/72e11f

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: **చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

కరెంట్ అఫైర్స్



■ ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసీజీ) దేశీయంగా అభివృద్ధి చేసిన భారత దేశపు మొట్టమొదటి కాలుష్య నియంత్రణ నౌక ఏది? (2024 ఆగస్టు 29న ఈ నౌకను గోవాలో ప్రారంభించారు. గోవా షిప్‌యార్డు లిమిటెడ్ (జీఎస్ఎల్) నిర్మించిన ఈ నౌక పొడవు 114.5 మీటర్లు, వెడల్పు 16.5 మీటర్లు, బరువు 4170 టన్నులు.)

జ: సముద్ర ప్రతాప్

మాదిరి ప్రశ్నలు

■ 2023–24 ఆర్థిక సంవత్సరంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) భారత ప్రభుత్వానికి ఎంత మొత్తంలో డివిడెండ్‌ను చెల్లించింది? (ఎల్ఐసీలో 96.5 శాతం మెజారిటీ వాటాను కలిగి ఉన్న భారత ప్రభుత్వం, ఎల్ఐసీ వార్షిక రాబడిలో భాగంగా ఈ డివిడెండ్ చెల్లింపును పొందింది.)

జ: రూ.6,103.62 కోట్లు

■ ఎస్ఏఎఫ్ఎఫ్ (సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్) అండర్ – 20 ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ 2024 టైటిల్ విజేతగా ఏ జట్టు నిలిచింది? (ఈ టైటిల్‌ను గెలవడం ఈ జట్టుకు ఇదే తొలిసారి. ఆతిథ్య నేపాల్ జట్టు పై ఈ జట్టు ఫైనల్లో 4–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలో పాల్గొన్న 6 జట్లు: భారత్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు, భూటాన్.)

జ: బంగ్లాదేశ్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

చదివిన పాఠాన్ని, నేర్చుకున్న అంశాలను స్నేహితులకు బోధించాలి. ఆ విధంగా ఇతరులకు వివరించడం ద్వారా విషయంపై అవగాహన పెరుగుతుంది. మౌలికాంశాలపై పట్టు మరింత బలోపేతం అవుతుంది.

డీఎస్సీ-2024
బయాలజీ మెథడాలజీ

స్థిరం.. సులభం.. సరళం!



జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

ఎవరికైనా అప్పు ఇస్తే కొంత కాలానికి అసలుతోపాటు అదనంగా కొంత సొమ్ము అందుతుంది. బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేస్తే, అకౌంట్‌లో మొత్తం కొద్దికొద్దిగా పెరుగుతూ ఉంటుంది. ఆ అదనాన్ని, ఈ పెరుగుదలను వడ్డీ అంటారు. ఇందులో అనేక రకాలు ఉన్నప్పటికీ ముందుగా గుర్తుకు వచ్చేది బారువడ్డీ. దీనినే సాధారణ వడ్డీ లేదా సరళ వడ్డీ అని కూడా అంటారు. వడ్డీ రేటు స్థిరంగా ఉండే దీనిని లెక్కించడం సులభం. అభ్యర్థుల్లో ఆర్థికపరమైన లెక్కల ప్రాథమిక పరిజ్ఞానాన్ని అంచనా వేయడానికి పోటీ పరీక్షల్లో వీటిపై ప్రశ్నలు అడుగుతుంటారు. శాతాలు, గుణకార, భాగహారాలపై పట్టు పెంచుకుంటే ఈ లెక్కలను వేగంగా చేయవచ్చు.



బారు వడ్డీ

అసలు: కొంత కాలానికి అప్పు తెచ్చుకున్న సొమ్మును అసలు (P) అని అంటారు.

వడ్డీ (Interest): అప్పు తెచ్చుకున్న వ్యక్తి తాను తీసుకున్న సొమ్మును వాడుకున్నందుకు, అప్పు ఇచ్చిన వ్యక్తికి కొంత సొమ్మును (అసలు కాకుండా) అదనంగా చెల్లిస్తాడు. దాన్నే వడ్డీ అని అంటారు.

వడ్డీ రెండు రకాలు

1) బారు వడ్డీ

2) చక్ర వడ్డీ

బారు వడ్డీ (Simple Interest)

ఎంత కాలానికైనా వడ్డీని అసలు పైనే లెక్కగడితే అలాంటి వడ్డీని 'బారు వడ్డీ' అని అంటారు.

సంవత్సరానికి వడ్డీ రేటు (%): దీన్ని ముందుగానే ఒక షరతు మీద ఆధారపడి నిర్ణయించి వడ్డీని లెక్కగడతారు.

కాల వ్యవధి: అప్పును ఎంత కాలానికైతే తీసుకుంటామో దాన్ని 'కాల వ్యవధి' అని అంటారు.

మొత్తం సొమ్ము = అసలు + బారు వడ్డీ

అసలు = P, వడ్డీరేటు = R% సంవత్సరానికి

కాలం = T, మొత్తం = A అనుకుంటే

బారువడ్డీ (S.I.) $= \frac{PTR}{100}$

$A = P + S.I.$

$A = P + \frac{PTR}{100} = P\left(1 + \frac{TR}{100}\right)$

ముఖ్యమైన అంశాలు:

$SI = \frac{PTR}{100}$; $T = \frac{SI.100}{PR}$

$R = \frac{SI.100}{PT}$; $P = \frac{SI.100}{TR}$

మాదిరి ప్రశ్నలు

1. సంవత్సరానికి 12% చొప్పున నిర్దిష్ట మొత్తంపై సంపాదించిన సాధారణ వడ్డీ ఆరు సంవత్సరాల్లో రూ. 10,800 అయితే మొత్తం ఎంత?

1) రూ.21,000 2) రూ.18,000
3) రూ.15,000 4) రూ.12,000

వివరణ: అసలు = P

సంవత్సరానికి అయ్యే వడ్డీ శాతం = 12%

∴ 6 సంవత్సరాలకు అయ్యే వడ్డీ శాతం = 72%

6 సంవత్సరాల్లో అయ్యే వడ్డీ రూపాయల్లో 10,800

∴ 72% ... 10,800, 100% ... ?

$\frac{100}{72} \times 10,800$ = రూ.15,000

జ: 3

2. అరవింద్ తన కుమారుడికి ఆరేళ్ల వయసులో సంవత్సరానికి 15% సాధారణ వడ్డీ మీద కొంత సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేశాడు. తన కుమారుడికి 12 ఏళ్లు వచ్చేటప్పటికి ఆ బ్యాంకులో సొమ్ము రూ.37,240 అయ్యింది. అయితే అరవింద్ బ్యాంకులో డిపాజిట్ చేసిన సొమ్ము ఎంత?

1) రూ.11,500 2) రూ.16,900
3) రూ.19,600 4) ఏదీకాదు

వివరణ: అసలు (P) = 100% అనుకుంటే బ్యాంకులో ఆ సొమ్మును 6 సంవత్సరాలు ఉంచాడు.

∴ సంవత్సరానికి అయ్యే వడ్డీ = 15%

6 ఏళ్లకు అయ్యే వడ్డీ = 6 × 15% = 90%

మొత్తం = అసలు + వడ్డీ

= 100% + 90% = 190%

లెక్క ప్రకారం

∴ 190% ... 37,240, 100% ... ?

$\frac{100}{190} \times 37,240$ = రూ.19,600

జ: 3

3. ఒక వ్యక్తి మూడేళ్లపాటు నిర్దిష్ట మొత్తాన్ని, నిర్దిష్ట సాధారణ వడ్డీరేటు చొప్పున పెట్టుబడి పెట్టాడు. అయితే ఇప్పుడున్న సాధారణ వడ్డీరేటు కంటే 4% పాయింట్లు ఎక్కువ సాధారణ వడ్డీకి పెట్టుబడి పెట్టినట్లయితే రూ.96 ఎక్కువ లాభం వస్తే, అతడి పెట్టుబడి ఎంత?

1) రూ.2,400 2) రూ.1,600
3) రూ.400 4) రూ.800

వివరణ: పెట్టుబడి (లేదా) అసలు = రూ.x

వడ్డీరేటు = r% అనుకుంటే

లెక్కప్రకారం వడ్డీరేటును 4% పాయింట్లు పెంచితే రూ.96 అదనంగా లాభం వస్తుంది.

$\therefore \frac{x \times 3 \times (r+4)}{100} - \frac{x \times 3 \times r}{100} = 96$

$= \frac{3xr + 12x - 3xr}{100} = 96$

$\therefore 12x = 96 \times 100 \Rightarrow x$ = రూ.800

పెట్టుబడి (x) = రూ.800

జ: 4

4. ఒక నిర్దిష్ట మొత్తంలో 25% సొమ్మును సంవత్సరానికి 12% సాధారణ వడ్డీకి, 50% సొమ్మును 8% వడ్డీకి, మిగిలిన సొమ్మును 6% చొప్పున రుణంగా ఇచ్చారు. అయితే ఆ మొత్తానికి సంవత్సరానికి సాధారణ వడ్డీ సుమారు ప్రభావవంతమైన రేటు ఎంత?

1) 8% 2) 9% 3) 7.5% 4) 8.5%

వివరణ: అసలు (P) = x అనుకుంటే

లెక్కప్రకారం ఆ అసలులో 25% సొమ్ముకు 12%; 50% సొమ్ముకు 8%; మిగిలిన 25% సొమ్ముకు 6% వడ్డీరేటు చొప్పున రుణంగా ఇచ్చారు.

$\therefore \left(\frac{25x}{100} \times \frac{12}{100}\right) + \left(\frac{50x}{100} \times \frac{8}{100}\right) + \left(\frac{25x}{100} \times \frac{6}{100}\right) = \frac{x \times 1 \times R}{100}$

$= \frac{3x}{100} + \frac{x}{25} + \frac{3x}{200} = \frac{Rx}{100}$

$= \frac{6x + 8x + 3x}{200} = \frac{Rx}{100}$

$\Rightarrow \frac{17x}{200} = \frac{Rx}{100} \Rightarrow R = \frac{17}{2} \Rightarrow 8.5\%$

జ: 4

5. హేమంత్ ఒక వ్యక్తి నుంచి సంవత్సరానికి 12% వడ్డీరేటుపై (సాధారణ వడ్డీ మీద) రూ.15,000 అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత దానిలో రూ.8,000 లను నగేశ్‌కు సంవత్సరానికి 15% సాధారణ వడ్డీకి అప్పుగా ఇచ్చాడు. మిగిలిన మొత్తాన్ని ....% వడ్డీరేటు చొప్పున రాజుకు అప్పుగా ఇచ్చాడు. హేమంత్ ఆ ఇద్దరి వద్ద నుంచి రూ.1,980 సాధారణ వడ్డీని మూడు సంవత్సరాలకు పొందితే, మూడేళ్ల తరువాత హేమంత్ చెల్లించాల్సిన మొత్తం వరుసగా....

1) 15% రూ.2,500 2) 16% రూ.4,800
3) 18% రూ.5,400 4) 20% రూ.6,600

వివరణ: హేమంత్ అప్పుగా తీసుకున్న అసలు రూ.15,000

నగేష్ రూ.8,000 15%; రాజు రూ.7,000 r% అనుకుంటే

లెక్క ప్రకారం $8,000\left(1 + \frac{3 \times 15}{100}\right) + 7000\left(1 + \frac{3r}{100}\right) - 15,000\left(1 + \frac{3 \times 12}{100}\right) = 1,980$

$= 11,600 + 7,000\left(1 + \frac{3r}{100}\right) - 20,400 = 1,980$

$7,000\left(1 + \frac{3r}{100}\right) = 1,980 + 8,800$

$1 + \frac{3r}{100} = \frac{10,780}{7,000}$

$\frac{3r}{100} = \frac{10,780}{7,000} - 1$

$\frac{3r}{100} = \frac{10,780 - 7,000}{7,000}$

$\frac{3r}{100} = \frac{3,780}{7,000} \Rightarrow 3r = 54$

r = 18%

∴ 3 సంవత్సరాల తరువాత హేమంత్ చెల్లించిన వడ్డీ

$= \frac{3 \times 12 \times 15,000}{100}$

$= 3 \times 12 \times 150$

= రూ.5,400

జ: 3



రచయిత: డాక్టర్ కంచుమర్తి దొర

పదోతరగతి గణితం



వర్గబహుపది కనుక్కుంటారా..!

ప్రశ్నలు జవాబులు

2 మార్కులు **బహుపదులు**

1) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా –3, 2 అయితే ఆ వర్గబహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకోండి.

$\alpha + \beta = -3, \alpha.\beta = 2$ అని ఇచ్చారు.

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k[x^2 - (-3)x + 2] \Rightarrow k = 1$ విలువకు బహుపది $x^2 + 3x + 2$.

2) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా $\frac{1}{4}$, –1 అయితే ఆ వర్గబహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకుంటే.

$\alpha + \beta = \frac{1}{4}, \alpha.\beta = -1$

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k\left[x^2 - \left(\frac{1}{4}\right)x + (-1)\right] \Rightarrow k\left(\frac{4x^2 - x - 4}{4}\right)$

k = 4, విలువకు బహుపది $4x^2 - x - 4$.

3) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా $\sqrt{2}$, $\frac{1}{3}$ అయితే ఆ వర్గ బహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకుంటే.

$\alpha + \beta = \sqrt{2}, \alpha.\beta = \frac{1}{3}$

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k\left[x^2 - (\sqrt{2})x + \left(\frac{1}{3}\right)\right] \Rightarrow k\left(\frac{3x^2 - 3\sqrt{2}x + 1}{3}\right)$

k = 3, విలువకు బహుపది $3x^2 - 3\sqrt{2}x + 1$.

ముఖ్యమైనవి మరికొన్ని.. (4 మార్కులు)

1) బహుపది $6x^2 - 3 - 7x$ యొక్క శూన్యాలను కనుక్కుని, బహుపది శూన్యాలకు, గుణకాలకు మధ్య ఉన్న సంబంధాన్ని సరిచూడండి.

2) బహుపది $t^2 - 15$ యొక్క శూన్యాలను కనుక్కుని, బహుపది శూన్యాలకు, గుణకాలకు మధ్య ఉన్న సంబంధాన్ని సరిచూడండి.

జవాబుల కోసం

\- డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తి

SUBSCRIBE CHANNEL

గుడ్లతో వెండి.. ఎరువులతో బూడిద విప్లవాలు!

ఆహార, వాణిజ్య పంటల ఉత్పత్తి, వినియోగంలో ప్రపంచంలో భారత్ తొలి వరుసలో ఉంటుంది. దేశ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు ప్రజలకు ఉపాధిని, ఆహారభద్రతను అందిస్తున్నాయి. భిన్న నైసర్గిక స్వరూపాలు, రకరకాల నేలలు, వాతావరణ పరిస్థితులు ఉన్న దేశంలో ప్రాంతాల వారీగా పంటల వైవిధ్యం, పశువుల పెంపకం కనిపిస్తాయి. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా అంతటా విస్తరించాయి. ఈ నేపథ్యంలో దేశ వ్యవసాయ రంగ సమగ్ర స్వరూపం, అభివృద్ధి క్రమంపై పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. హరితవిప్లవంతో సాగు వ్యవస్థలో వచ్చిన మౌలిక, విప్లవాత్మక మార్పులు, అనంతర ప్రభావం, దేశవ్యాప్తంగా పంటల పరిశోధనా కేంద్రాలు, పలు పరిశ్రమలు కేంద్రీకృతమైన ప్రదేశాలు, పాడి పరిశ్రమ ప్రగతి తీరుతెన్నులు, విభిన్న సాగు పద్ధతుల గురించి తెలుసుకోవాలి.

డీఎస్సీ 2024 - జాగ్రఫీ

వ్యవసాయం

1. కిందివాటిని సరిచూడండి.
ఎ) చెరకు పిప్పిని బగాసే అంటారు.
బి) చెరకు ద్వారా వచ్చే ద్రవ వ్యర్థాన్ని మొలాసిస్ అంటారు.
సి) కేంద్ర చెరకు అభివృద్ధి సంస్థ కాన్పూర్‌లో ఉంది.
డి) భారతదేశంలో చెరకు ఉత్పత్తిలో ఉత్తర్‌ప్రదేశ్ అగ్రగామి.
1) ఎ, బి, సి, డి సరైనవి
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, సి, డి సరైనవి
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు

2. కిందివాటిని జతపరచండి.
ఎ) మాంచెస్టర్ ఆఫ్ సౌత్ ఇండియా 1) అహ్మదాబాద్
బి) మాంచెస్టర్ ఆఫ్ నార్త్ ఇండియా 2) కోయంబత్తూర్
సి) మాంచెస్టర్ ఆఫ్ ఇండియా 3) విశాఖపట్నం
డి) మాంచెస్టర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 4) కాన్పూర్
1) ఎ-4, బి-1, సి-2, డి-3 2) ఎ-2, బి-4, సి-1, డి-3
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

3. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

పంట	ప్రధానంగా పండించే రాష్ట్రం
ఎ) పొగాకు	1) గుజరాత్
బి) పత్తి	2) ఆంధ్రప్రదేశ్
సి) జనుము	3) కేరళ
డి) రబ్బరు	4) పశ్చిమ బెంగాల్

1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-4, బి-1, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-2, డి-4

4. కింది వాక్యాలు సరిచూడండి.
ఎ) మన దేశంలో మొదటి జనపనార పరిశ్రమను పశ్చిమ బెంగాల్‌లోని రిష్రాలో ఏర్పాటు చేశారు.
బి) పొగాకు బోర్డు రాజమండ్రిలో ఉంది.
సి) భారతదేశంలో ఆధునిక ఉన్ని పరిశ్రమను ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఏర్పాటు చేశారు.
డి) దేశంలో తొలి అధునాతన నూలు పరిశ్రమను బొంబాయిలో ఏర్పాటు చేశారు.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు
3) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు
4) ఎ, బి సరైనవి; సి, డి సరికాదు

5. కిందివాటిని జతపరచండి.

పరిశోధన కేంద్రం	ప్రాంతం
ఎ) కేంద్ర గేదెల పరిశోధన సంస్థ	1) రాంచి
బి) కేంద్ర గొర్రెల, ఉన్ని పరిశోధన సంస్థ	2) ఆనంద్‌సిటీ
సి) జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు	3) అవికార్ నగర్
డి) కేంద్ర పశు పరిశోధన సంస్థ	4) హిస్సార్

1) ఎ-3, బి-2, సి-1, డి-4 2) ఎ-1, బి-4, సి-2, డి-3
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-4, బి-3, సి-1, డి-2

6. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

దేశం	విస్తాపన వ్యవసాయం పేరు
ఎ) వెనుజులా	1) రోకో
బి) ఇండొనేసియా	2) కానుకో
సి) బ్రెజిల్	3) చినా
డి) శ్రీలంక	4) లడాంగ్

1) ఎ-2, బి-4, సి-1, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-2, డి-3

7. కిందివాటిని జతపరచండి.

పరిశోధన సంస్థ	ప్రాంతం
ఎ) కేంద్ర సోయాబీన్ పరిశోధన సంస్థ	1) కాన్పూర్
బి) టీ పరిశోధనా కేంద్రం	2) ఇండోర్
సి) పప్పుదినుసుల పరిశోధన కేంద్రం	3) కర్నాల్
డి) గోధుమ పరిశోధన కేంద్రం	4) జోర్హాట్

1) ఎ-3, బి-2, సి-4, డి-1 2) ఎ-2, బి-4, సి-1, డి-3
3) ఎ-3, బి-1, సి-4, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1



8. కిందివాటిని జతపరచండి.

వ్యవసాయ విప్లవం	పితామహుడు
ఎ) ఎరువు విప్లవం	1) అరుణ్ కృష్ణన్
బి) నీలి విప్లవం	2) విశాల్ తివారి
సి) గులాబీ విప్లవం	3) వర్గీస్ కురియన్
డి) శ్వేత విప్లవం	4) దుర్గేష్ పాటి

1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-4, బి-1, సి-2, డి-3

9. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) భారతదేశంలో హరిత విప్లవాన్ని 1966లో ప్రకటించారు.
బి) భారతదేశ హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్.
సి) హరిత విప్లవం వల్ల తీవ్రంగా నష్టపోయిన పంటలు పప్పుధాన్యాలు.
డి) సతతహరిత విప్లవాన్ని 2005లో ఎం.ఎస్.స్వామినాథన్ ప్రకటించారు.
1) ఎ, బి, సి, డి సరికావు
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
3) ఎ, సి సరైనవి; బి, డి సరికావు
4) ఎ, బి, సి, డి సరైనవి

10. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

వ్యవసాయ విప్లవం	సంబంధిత ఉత్పత్తులు
ఎ) శాఫ్రాన్ రివల్యూషన్	1) పెట్రోలియం
బి) రౌండ్ రివల్యూషన్	2) పత్తి
సి) సిల్వర్ ఫైబర్ రివల్యూషన్	3) సోలార్ ఎనర్జీ
డి) నలుపు విప్లవం	4) బంగాళాదుంపలు

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-1, డి-2
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-4, బి-1, సి-2, డి-3

11. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

రాష్ట్రం	విస్తాపన వ్యవసాయం పేరు
ఎ) పశ్చిమ కనుమలు	1) వాల్రా
బి) రాజస్థాన్	2) కుమారి
సి) ఒడిశా	3) కిరువా
డి) ఝార్ఖండ్	4) బ్రింగా

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-2, బి-1, సి-4, డి-3 4) ఎ-1, బి-3, సి-2, డి-4

12. కింది పరిశ్రమలను అవి మొదట ఏర్పాటైన ప్రాంతాలతో జతపరచండి.

పరిశ్రమ	ప్రాంతం
ఎ) మొదటి అగ్గిపుల్లల పరిశ్రమ	1) కాన్పూర్
బి) మొదటి రబ్బరు పరిశ్రమ	2) షేరాంపూర్
సి) మొదటి కాగితపు పరిశ్రమ	3) కోల్‌కతా
డి) మొదటి తోళ్ల పరిశ్రమ	4) అహ్మదాబాద్

1) ఎ-4, బి-2, సి-3, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-1, బి-3, సి-2, డి-4

13. కింది వాక్యాలు సరిచూడండి.
ఎ) కేంద్ర పత్తి పరిశోధనా సంస్థ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉంది.
బి) అరటి పరిశోధనా కేంద్రం తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఉంది.
సి) జాతీయ వేరుశనగ పరిశోధనా కేంద్రం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉంది.
డి) కొబ్బరి అభివృద్ధి బోర్డు కేరళలోని కొచ్చిలో ఉంది.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు
4) ఎ, బి, సి, డి సరైనవి

14. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

వ్యవసాయ విప్లవం	సంబంధిత ఉత్పత్తులు
ఎ) వెండి విప్లవం	1) ఎరువులు
బి) బూడిద విప్లవం	2) గుడ్లు
సి) పసుపు విప్లవం	3) ముడిచమురు
డి) నలుపు విప్లవం	4) నూనెగింజలు



1) ఎ-2, బి-1, సి-4, డి-3
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2
4) ఎ-4, బి-1, సి-3, డి-2

15. కిందివాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.
ఎ) మనదేశంలోని మొత్తం పందుల సంఖ్య 20వ పశుగణన ప్రకారం 9.06 మిలియన్లు
బి) పందులు అధికంగా ఉన్న రాష్ట్రం అస్సాం.
సి) గొర్రెలు అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
డి) గేదెలు అధికంగా ఉన్న రాష్ట్రం తెలంగాణ.
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) డి, ఎ

16. సరైన సమాధానం ఎంచుకుని జతపరచండి.

పశుపోషణ ఆధారిత సమాజాలు	రాష్ట్రాలు
ఎ) బోటియా	1) అరుణాచల్‌ప్రదేశ్
బి) మోన్‌పెస్	2) ఉత్తరాఖండ్
సి) రైకా	3) కర్ణాటక
డి) కురుబ	4) రాజస్థాన్

1) ఎ-2, బి-1, సి-4, డి-3
2) ఎ-4, బి-2, సి-3, డి-1
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-1, బి-2, సి-4, డి-3

17. కిందివాటిని జతపరిచి సమాధానాలు గుర్తించండి.

కల్చర్	ఉత్పత్తులు
ఎ) మారికల్చర్	1) కలప
బి) విటికల్చర్	2) చేపలు
సి) పిసికల్చర్	3) సముద్ర జీవులు
డి) సెల్వికల్చర్	4) ద్రాక్ష

1) ఎ-1, బి-4, సి-3, డి-2
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-3, సి-4, డి-2
4) ఎ-3, బి-4, సి-2, డి-1

18. కిందివాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) జాతీయ మాంసం పరిశోధనా కేంద్రం తెలంగాణలోని ఉప్పల్‌లో ఉంది.
బి) జాతీయ ఒంటెల పరిశోధనా కేంద్రం రాజస్థాన్‌లోని బికనీర్‌లో ఉంది.
సి) జాతీయ పాడి పరిశోధనా సంస్థ హరియాణాలోని కర్నాల్‌లో ఉంది.
డి) జాతీయ పందుల పరిశోధనా కేంద్రం ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఉంది.
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) డి, సి, బి 4) ఎ, డి, సి

19. కింది ముఖ్యమైన పశుజాతులను సంబంధిత రాష్ట్రాలతో జతపరచండి.

పశుజాతి	రాష్ట్రం
ఎ) డియోని	1) గుజరాత్
బి) జెఫ్రాబాది	2) తమిళనాడు
సి) తోడ	3) మహారాష్ట్ర
డి) నాగ్‌పురి	4) కర్ణాటక

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-1, సి-4, డి-2
3) ఎ-4, బి-1, సి-2, డి-3 4) ఎ-4, బి-3, సి-1, డి-2

20. కిందివాటిలో సరికాని వాక్యాలు గుర్తించండి.
ఎ) మనదేశంలో ఆవులు అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్
బి) మేకలు అధికంగా ఉన్న రాష్ట్రం పశ్చిమ బెంగాల్
సి) గేదెలు అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్
డి) గుర్రాలు అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) డి, ఎ



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-4; 2-2; 3-1; 4-3; 5-3; 6-1; 7-2; 8-1; 9-4; 10-1; 11-3; 12-2; 13-3; 14-1; 15-3; 16-1; 17-4; 18-1; 19-3; 20-1.

ర్యాంకింగ్ టెస్ట్

పోటీపరీక్షల్లో ర్యాంకింగ్ టెస్ట్ విభాగం నుంచి తరచుగా ప్రశ్నలు వస్తూ ఉంటాయి. ఇందులో సాధారణంగా వ్యక్తులు, వస్తువుల స్థానాలపై ప్రశ్నలు అడుగుతుంటారు. వ్యక్తి ర్యాంకు పై నుంచి లేదా కింది నుంచి కనుక్కోవాలి. సమూహంలోని మొత్తం వ్యక్తుల సంఖ్య, స్థానాలను పరస్పరం తారుమారు చేయడం ద్వారా కొత్తగా ఏర్పడే స్థానాలు గుర్తించాలి. ప్రాథమికంగా ఇచ్చే సమాచారాన్ని క్షుణ్నంగా పరిశీలించి, ఈ విధమైన ప్రశ్నలకు సమాధానాలు కనిపెట్టవచ్చు.



సరైన స్థానాలను కనుక్కుంటే పరీక్షలో ర్యాంకు పదిలం!

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం — రీజనింగ్

సూచన (ప్ర. 1 – 3): కింది ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

1. ఒక వరుసలో నరేంద్ర ఎడమ నుంచి 19వ స్థానంలో, కుడి నుంచి 23వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ వరుసలో మొత్తం ఎంత మంది ఉన్నారు?

1) 40 2) 42 3) 41 4) 39

సాధన: మొత్తం = ఎడమ నుంచి ర్యాంకు + కుడి నుంచి ర్యాంకు – 1
= 19 + 23 – 1
= 41

సమాధానం: 3

2. ఒక వరుసలో మొత్తం 70 మంది ఉన్నారు. ఒకవేళ కార్తీక్ పై నుంచి 20వ స్థానంలో ఉంటే, అతడు కింది నుంచి ఏ స్థానంలో ఉంటాడు?

1) 41 2) 52 3) 53 4) 51

సాధన: వరుసలోని మొత్తం వ్యక్తులు = 70
పై నుంచి కార్తీక్ స్థానం = 20
మొత్తం = పై నుంచి ర్యాంకు + కింది నుంచి ర్యాంకు – 1
70 = 20 + కింది నుంచి ర్యాంకు – 1
కింది నుంచి ర్యాంకు = 70 – 20 + 1
కింది నుంచి చూసినప్పుడు కార్తీక్ స్థానం = 51

సమాధానం: 4

3. ఒక వరుసలో మొత్తం 64 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకవేళ దినేష్ కుడి నుంచి 15వ స్థానంలో ఉంటే, అతడు ఎడమ నుంచి ఏ స్థానంలో ఉంటాడు?

1) 49 2) 50 3) 51 4) 52

సాధన: మొత్తం విద్యార్థులు = 64; కుడివైపు నుంచి దినేష్ ర్యాంకు = 15
మొత్తం = ఎడమ నుంచి ర్యాంకు + కుడి నుంచి ర్యాంకు – 1
64 = ఎడమ నుంచి + 15 – 1
ఎడమ నుంచి = 64 – 15 + 1
= 50

సమాధానం: 2

సూచన (ప్ర. 4 – 7): ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.

ఒక వరుసలో ప్రవీణ్ ఎడమ నుంచి 14వ స్థానంలో, కిరణ్ కుడి నుంచి 18వ స్థానంలో ఉన్నారు. కుమార్, ప్రవీణ్‌కి కుడివైపు 5వ స్థానంలో ఉన్నాడు. కుమార్, కిరణ్‌కి ఎడమవైపు 6వ స్థానంలో ఉన్నాడు.

4. కుడివైపు నుంచి ప్రవీణ్ ర్యాంకు ఎంత?

1) 27 2) 29 3) 26 4) 28

సాధన: కుడివైపు నుంచి ప్రవీణ్ ర్యాంకు 18 + 6 + 5 = 29

సమాధానం: 2

5. ఎడమవైపు నుంచి కిరణ్ ర్యాంక్ ఎంత?

1) 23 2) 22 3) 25 4) 24

సాధన: ఎడమవైపు నుంచి కిరణ్ ర్యాంకు 14 + 5 + 6 = 25

సమాధానం: 3

6. కిరణ్, ప్రవీణ్‌ల మధ్య ఎంత మంది ఉన్నారు?

1) 9 2) 8 3) 10 4) 4

సాధన: కిరణ్, ప్రవీణ్‌ల మధ్యలో ఉన్నవారు 5 + 6 – 1 = 10

సమాధానం: 3

7. వరుసలో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

1) 44 2) 42 3) 43 4) 45

సాధన: వరుసలో మొత్తం విద్యార్థులు 19 + 24 – 1 = 42

సమాధానం: 2

Common Explanation

ప్రవీణ్ 14 కుమార్ కిరణ్ 18

8. ఒక వరుసలో కొంత మంది విద్యార్థులు కూర్చున్నారు. నవీన్ ఎడమవైపు నుంచి 9వ స్థానంలో, పవన్ కుడివైపు నుంచి 12వ స్థానంలో కూర్చున్నారు. వీరిద్దరి స్థానాలను పరస్పరం మార్చిన తర్వాత నవీన్ ఎడమవైపు నుంచి 19వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ వరుసలోని మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?

1) 30 2) 31 3) 32 4) 33

సాధన: ఎడమవైపు నుంచి నవీన్ ర్యాంకు = 9
కుడివైపు నుంచి పవన్ ర్యాంకు = 12
నవీన్ 9 పవన్ 12

ఇరువురు పరస్పరం తమ స్థానాలను మార్చుకోగా నవీన్ ర్యాంకు 19గా మారింది.

పవన్ 9 నవీన్ 19

అయితే ఆ వరుసలోని మొత్తం విద్యార్థుల సంఖ్య = ఎడమవైపు ర్యాంకు + కుడివైపు ర్యాంకు – 1
= 19 + 12 – 1
= 31 – 1 = 30

సమాధానం: 1

9. ఒక పాఠశాలలో ప్రార్థనా సమయంలో బాలురు వరుసలో నిల్చున్నారు. సుమన్ అనే విద్యార్థి ఏ చివర నుంచి చూసినా 24వ స్థానంలోనే ఉన్నాడు. అయితే తరగతిలోని మొత్తం బాలుర సంఖ్య ఎంత?

1) 45 2) 46 3) 47 4) 48

సాధన: ఎడమ ← 24 → కుడి; సుమన్

మొత్తం = 23 + సుమన్ + 23 = 47

సమాధానం: 3

10. ఒక వరుసలో మురళి అనే వ్యక్తి కుడి నుంచి 14వ స్థానంలో, ఎడమ నుంచి 7వ స్థానంలో ఉన్నాడని అనుకుందాం. ఆ వరుసలో మొత్తం 28 మంది బాలురు ఉన్నట్లయితే, ఇంకా ఎంత మంది బాలురను ఆ వరుసలో చేర్చాలి?

1) 8 2) 9 3) 10 4) 11

సాధన: కుడినుంచి మురళి ర్యాంకు 14
ఎడమ నుంచి ర్యాంకు 7
ఎడమ 6 మురళి 13 కుడి

మొత్తం = 6 + మురళి + 13
= 20
కలపాల్సిన బాలుర సంఖ్య = 28 – 20 = 8

సమాధానం: 1

సూచన (ప్ర. 11 – 13): కింద ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

ప్రియ, మహిత, రాము, కీర్తి, సుమ బంధువులు. మహిత కంటే ప్రియ వయసు రెండింతలు, రాము వయసు మహిత వయసులో సగం. ప్రియ వయసు సుమ వయసులో సగం, రాము వయసు కీర్తి వయసుకు 2 రెట్లు .

11. కింది వారిలో అత్యంత చిన్నవారు ఎవరు?

1) ప్రియ 2) కీర్తి 3) సుమ 4) మహిత

12. కింది జతల్లో ఎవరెవరు సమాన వయసుల్లో ఉన్నారు?

1) ప్రియ, కీర్తి 2) మహిత, సుమ 3) ఎవరూ కాదు 4) రాము, సుమ

13. ప్రియ ఎవరి కంటే చిన్నది?

1) సుమ 2) కీర్తి 3) రాము 4) ఏదీకాదు

సాధన: మహిత వయసు = x సంవత్సరాలు అనుకుంటే
ప్రియ వయసు = 2x సం.
రాము వయసు = $\frac{x}{2}$ సం.
సుమ వయసు = 4x సం.
కీర్తి వయసు = $\frac{x}{4}$ సం.

సుమ > ప్రియ > మహిత > రాము > కీర్తి

సమాధానాలు: 11–2, 12–3, 13–1

14. ఒక తరగతిలోని బాలికలందరూ ఒకే వరుసలో నిల్చున్నారు. వారిలో ఒక బాలిక ఎటువైపు నుంచి చూసినా 12వ స్థానంలో ఉంది. అయితే ఆ తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?

1) 22 2) 21 3) 24 4) 23

సాధన: ఎటునుంచి చూసినా 12వ స్థానంలోనే ఉంది. కాబట్టి
మొత్తం = పై నుంచి ర్యాంకు + కింది నుంచి ర్యాంకు – 1
= 12 + 12 – 1
= 24 – 1
= 23

సమాధానం: 4

15. చందు ఒక తరగతిలో పై నుంచి 8వ ర్యాంక్, కింది నుంచి 27వ ర్యాంక్‌లో ఉన్నాడు. అయితే తరగతిలోని విద్యార్థుల సంఖ్య ఎంత?

1) 36 2) 35 3) 34 4) 32

సాధన: తరగతిలో చందు ర్యాంకు పై నుంచి = 8
కింది నుంచి ర్యాంకు = 27
తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య
= 8 + 27 – 1 = 34

సమాధానం: 3



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

448

Word of the Day

Altruistic

Telugu meaning: నిస్వార్థ గుణం, ఉపకార గుణం

English meaning: The word altruistic is an adjective that describes someone who is selflessly concerned for the well-being of others.

Synonyms: Selfless, Charitable

Antonyms: Selfish, Greedy

Usage: 1. Mr. Ratan Tata's altruistic nature led him to donate a significant portion of his wealth to charity.

2. The altruistic volunteer worked tirelessly to support the underprivileged in her community.

Latest Updates

MPHW(F)/ ANM Training Course

Office of the Commissioner of Health and Family Welfare, Telangana State, Hyderabad invites applications for admission into MPHW(F)/ ANM Training course for the academic year 2024-25. The last date for the registration fee and online application submission is 25 October 2024.

Apprentice Posts

Punjab and Sind Bank invites applications for engagement of Apprentice Vacancies at Delhi Punjab Branches. The total no. of posts is 100. The application fee is Rs.200. Eligible candidates can apply online before 31 October 2024.

B.Ed. (ODL) Programme

Maulana Azad National Urdu University (MANUU), Hyderabad invites applications for admission to B.Ed. (ODL) Programme for the academic year 2024-25. The registration fee is Rs.1,000. The last date for online application is 30 October 2024.

Graduate, Technician Apprentice Posts

Western Coalfields Limited, Nagpur invites applications for Graduate & Technician Apprenticeship Training. The total no. of posts is 316. The last date for online application is 28 October 2024.

Did You Apply..?

Today (October 23) is the last date for the following Jobs/ Apprentice posts


☛ 307 Apprentice posts in Cochin Shipyard Limited (CSL), Kerala.
Qualification: 10th, ITI, Vocational Higher Secondary Education (VHSE) in relevant stream.

☛ 3,115 Act Apprentice posts in RRC Eastern Railway, Kolkata.
Qualification: 10th class, ITI in relevant trade.

☛ Tech Support Engineer posts in Wipro.
Qualification: Any Graduate.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (ఇండియన్ జాగ్రఫీ)



ఊహించలేని అనేక అంశాలు ఉన్న విస్తారమైన అంతరిక్షాన్ని విశ్వం అంటారు. ఇది అనంతం. ఇందులో గెలాక్సీలు, సూర్యుడు, గ్రహాలు, ఉపగ్రహాలు, అనేక నక్షత్రాలు, ఆస్టరాయిడ్స్ మొదలైనవి అంతర్భాగంగా ఉంటాయి. విశ్వం ఆవిర్భావం గురించి చాలామంది శాస్త్రవేత్తలు వివిధ రకాల సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

✧ విశ్వం పుట్టుక - సిద్ధాంతాలు, సౌర కుటుంబ వ్యవస్థ, గెలాక్సీ మొదలైన అంశాలను ఈ-బుక్‌లో వివరించారు.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

కరెంట్ అఫైర్స్



ఇండోనేసియా ఎనిమిదో అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో (73) 2024, అక్టోబరు 20న ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షుడిగా సురాకార్తా మాజీ మేయర్ గిబ్రాన్ రాకాబుమింగ్ రాకా ప్రమాణం చేశారు. ఈయన తాజా మాజీ అధ్యక్షుడు జోకో విడోడో కుమారుడు.

కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ 2024, అక్టోబరు 21న 'ఇ-శ్రమ్...వన్ స్టాప్ సొల్యూషన్' పోర్టల్‌ను ప్రారంభించారు. అసంఘటిత రంగ కార్మికులకు వివిధ సామాజిక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రభుత్వం దీన్ని రూపొందించింది.

బెలారస్ క్రీడాకారిణి అర్యానా సబలెంకా 2024, అక్టోబరు 21న ప్రకటించిన డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇటీవలే వూహాన్ ఓపెన్ కైవసం చేసుకున్న ఈమె 9706 పాయింట్లతో ఈ స్థానంలో ఉంది. ఇగా స్వైటెక్ (పోలెండ్, 9665) రెండో స్థానంలో ఉంది.



రతన్ టాటా గౌరవార్థం టాటా గ్రూప్, ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన సోమర్‌విలే కాలేజ్ సంయుక్తంగా ఒక ప్రతిష్ఠాత్మక భవనాన్ని నిర్మించనున్నాయి. 'రతన్ టాటా బిల్డింగ్'గా దీనికి పేరు పెట్టనున్నారు.

వాల్ట్ డిస్నీ కొత్త ఛైర్మన్‌గా జేమ్స్ గోర్మన్ 2025 జనవరి 2న బాధ్యతలు చేపట్టనున్నారు. డిస్నీ బోర్డులో తొమ్మిదేళ్ల పాటు సేవలు అందించిన మార్క్ పార్కర్ ఛైర్మన్ బాధ్యతల నుంచి వైదొలగుతుండటంతో, ఆయన స్థానంలో గోర్మన్ నియమితులయ్యారు.

☛ మోర్గాన్ స్టాన్లీకి 2010 నుంచి 2023 వరకు సీఈఓగా, 2012 నుంచి 2023 వరకు ఛైర్మన్‌గా గోర్మన్ బాధ్యతలు నిర్వహించారు.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Bank Exams
English

Word Swapping

Directions (Qs. 1 - 7): *In the questions given below, a paragraph is given with four words labelled (A), (B), (C) and (D), arranged not necessarily in the correct order. You have to find the correct order of arrangement from the options given below. In case, the sentence is correct in its original form, please select (E) as your answer. Ignore the errors in punctuation, if any.*

1. Artificial intelligence (AI) is **revolutionizing (A)** healthcare by improving diagnostics, treatment planning, and patient outcomes. AI-powered tools are being used to **accessible (B)** medical data, predict patient needs, and assist in **analyze (C)** treatment strategies. As AI continues to evolve, it holds the potential to make healthcare more **personalized (D)** and cost-effective.

A) BDCA B) ACDB
C) CADB D) BACD
E) No swapping required

2. Climate change is one of the most **increasingly (A)** challenges facing the world today, with rising global temperatures leading to **pressing (B)** weather events. Melting ice caps, rising sea levels, and **progression (C)** severe natural disasters are directly linked to global warming. International efforts such as the Paris Agreement aim to reduce carbon emissions and slow the **extreme (D)** of climate change.

A) BDAC B) CABD
C) BCDA D) DBAC
E) No swapping required

3. Social media platforms have **shown (A)** how people connect and share information, but they also pose risks to mental health. Studies have **transformed (B)** that excessive use of social media can lead to **increased (C)** anxiety, depression, and feelings of **isolation (D).**

A) CBDA B) DCAB
C) CBAD D) BACD
E) No swapping required

4. The shift toward renewable energy sources, such as solar, wind, and hydropower, is crucial for reducing global **infrastructure (A)** on fossil fuels. Countries around the world are investing heavily in renewable energy **combat (B)** to meet sustainability goals and **reliance (C)** climate change. Advances in technology are making renewable energy more cost-effective, driving its **adoption (D)** in both developed and developing nations.

A) DACB B) ABDC
C) CABD D) BADC
E) No swapping required

5. The global rise of e-commerce has **dramatically (A)** transformed retail, with platforms like Amazon, Alibaba, and Shopify **leading (B)** the way. Online shopping offers **convenience (C)** and a wider range of products, attracting millions of consumers worldwide. The COVID-19 pandemic **accelerated (D)** the growth of ecommerce, forcing many businesses to shift their focus to digital sales.

A) DCAB B) BDAC
C) ACBD D) CBDA
E) No swapping required

6. Space exploration is entering a new era, with private companies like SpaceX and Blue Origin making **driving (A)** advancements. Nations like the U.S., China, and India are also **presence (B)** in the space race, aiming for missions to the Moon and Mars. These efforts are **competing (C)** innovations in space technology, with the goal of expanding human **significant (D)** beyond Earth.

A) DBCA B) ACBD
C) DCAB D) BACD
E) No swapping required

7. The global refugee crisis continues to affect millions of **challenges (A)** people fleeing war, persecution, and natural disasters. Countries like Syria, Afghanistan, and Venezuela have seen a significant **exodus (B)** of refugees seeking asylum in safer nations. International organizations like the UNHCR are working to **displaced (C)** support, but political and logistical **provide (D)** remain.

A) CBDA B) BACD
C) ABDC D) BDAC
E) No swapping required

Scan the QR code for the Key

Writer:
P. Manoj Kumar, Subject Expert

బిజినెస్ చేద్దాం బ్రో..!

- చదువు తర్వాత వ్యాపారం వైపే మొగ్గు
- 14 % మంది దేశీయ విద్యార్థుల ఆలోచన ఇదే
- ప్రపంచ సగటుకు దగ్గరగా మన యువత
- వచ్చే ఐదేళ్లలో అగ్రస్థానంలో మనవారే
- ఐఐటీ మండీ 2023 సర్వే నివేదిక వెల్లడి

టాటా, రిలయన్స్, ఇన్ఫోసిస్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు స్ఫూర్తినిచ్చాయి.. జొమాటో, స్విగ్గీ, ఓలా, ఉబర్, జెప్టో వంటి ఆధునిక స్టార్టప్‌లు ఆశలు రేపుతున్నాయి. వెరసి.. నేటి యువత ఉద్యోగాలకు బదులు వ్యాపారాల వైపు దృష్టి సారిస్తున్నారు.



ఈనాడు - హైదరాబాద్

గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే ఏ ఉద్యోగం చేద్దాం?.. గతంలో సగటు భారతీయ విద్యార్థుల ఆలోచన ఇదే. ఇప్పుడు వారి ఆలోచన ధోరణి శరవేగంగా మారిపోతోంది. ఉద్యోగాలు చేయడం కాదు.. వాటిని సృష్టించేందుకు పోటీ పడుతున్నారు. ఏదో ఒక వ్యాపారం చేయాలని.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలని ప్రణాళికలు వేసుకుంటున్నారు. డిగ్రీ లేదా అందుకు సమాన కోర్సుల్లో చేరిన వారిలో 14 శాతం మంది చదువు పూర్తికాగానే వ్యాపారాలు చేయాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. గ్లోబల్ యూనివర్సిటీ ఆంత్రప్రెన్యూరియల్ స్పిరిట్ స్టూడెంట్స్ (గెస్) పేరిట భారతీయ విద్యార్థులపై ఐఐటీ మండీ చేసిన సర్వే నివేదిక ఇలాంటి పలు ఆసక్తికర అంశాలను వెల్లడించింది. ఈ అంశంలో అంతర్జాతీయ సగటు 15.7 శాతం ఉండగా, దానికి చేరువలోనే భారత్ ఉండడం విశేషం. ఆన్‌లైన్ సర్వేలో భాగంగా 2023 నవంబరు నుంచి 2024 ఫిబ్రవరి మధ్య దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులపై ఈ సర్వే నిర్వహించారు. వారిలో 61.8% మంది అబ్బాయిలు, 38.20% అమ్మాయిలున్నారు. ఈ నివేదికను తాజాగా ఐఐటీ మండీ విడుదల చేసింది. భారతీయ విద్యార్థుల్లో అత్యధిక వ్యాపారవే... త్తల లక్ష... ణాలు, ఆ స్ఫూర్తి కనిపిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో భారత్‌లో ఆంత్రప్రెన్యూర్లుగా మారే వారి శాతం 31.40కి చేరుకుంటుందని సర్వే అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచ సగటు 30 శాతమే ఉంటుందని తెలిపింది. ఇప్పటికే దేశంలోని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో 32.50 శాతం మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలయ్యే ఆలోచనతో ఉండగా.. అందుకు భిన్నంగా ప్రపంచ సగటు 25.70 శాతమే ఉంది.

సర్వే ముఖ్యాంశాలు..

- **13,896 మంది** పాల్గొన్న విద్యార్థులు
- **1298** విద్యాసంస్థలు
- **14 శాతం** వ్యాపార ఆలోచనతో ఉన్న డిగ్రీ విద్యార్థులు
- **31.4 శాతం** వచ్చే ఐదేళ్లలో భారత్‌లో ఆంత్రప్రెన్యూర్లుగా మారే వారు
- **30 శాతమే** అదే సమయంలో ప్రపంచ సగటు
- సర్వేలో పాల్గొన్న వారిలో 5,105 మంది కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్ 100 విద్యాసంస్థలకు చెందిన వారే. అత్యధికంగా 35 శాతం మంది కంప్యూటర్ సైన్స్/ఐటీ విద్యార్థులు, 33.2 శాతం మంది ఇతర ఇంజినీరింగ్ బ్రాంచీల వారు.

విద్యార్థుల ఆలోచనల్లో మార్పునకు కారణాలివీ..

- స్టార్టప్‌ల విషయంలో భారత్ ఇప్పటికే ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది. 2023లో దేశవ్యాప్తంగా కొత్తగా 34,842 స్టార్టప్‌లు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 96 వస్తున్నాయి. 2022 ఏప్రిల్‌లో అది రోజుకు 80 మాత్రమే.
- విద్యాసంస్థల్లో స్టార్టప్, ఇంక్యుబేటర్ల సంస్కృతి పెరుగుతోంది. ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలతోపాటు హెచ్‌సీయూ లాంటి కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో గత కొన్నేళ్లుగా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్లు విజయవంతంగా పనిచేస్తున్నాయి. ఇలా ప్రస్తుతం 2,951 ఇంక్యుబేషన్ సెంటర్లు ఉన్నాయి. వ్యాపారాలు, పరిశ్రమలు స్థాపించి విజయవంతమైన వారిని ఆహ్వానిస్తూ.. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్నాయి.
- ఔత్సాహికులు తమ పరిశ్రమలకు కావాల్సిన నిధులిచ్చే పెట్టుబడిదారులను, ఉత్పత్తులు విక్రయించే క్రమంలో వినియోగదారులను చేరుకోవడం టెక్నాలజీ కారణంగా సులువవుతోంది. టాటా వంటి ప్రముఖ కంపెనీలు కూడా ఔత్సాహికుల స్టార్టప్‌లలో పెట్టుబడులు పెడుతూ ప్రోత్సహిస్తున్నాయి.
- సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల ఆయా ఉత్పత్తులు, సేవల ప్రచారం, ప్రమోషన్ సులువయ్యాయి.
- ప్రత్యక్షంగా పనిచేసేవారితోపాటు.. వస్తువులను వినియోగదారులకు చేరవేసే గిగ్ వర్కర్ల వంటి మానవ వనరుల లభ్యత దేశంలో సమృద్ధిగా ఉంది.
- వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి డాటా విశ్లేషణతో కూడిన మార్కెటింగ్, ప్రమోషన్ వ్యూహాలు అందించడానికి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి.

సర్వేలో పాల్గొన్న వారు (శాతాల్లో)

విద్యార్హత స్థాయి	
అండర్‌గ్రాడ్యుయేట్	78.80
పీజీ	16.20
పీహెచ్‌డీ	5

కోర్సుల వారీగా..	
ఇంజినీరింగ్	68.3
బిజినెస్ మేనేజ్‌మెంట్	7.4
సైన్స్	7.5
ఇతరులు	16.7

వయసుల వారీగా..	
18 ఏళ్ల లోపు	3.4
18-20	53.7
21-23	24.7
24-26	5.2
27 ఆ పైన	13

పాల్గొన్న విద్యా సంస్థలు	
కేంద్రీయ వర్సిటీలు	11.3
రాష్ట్ర వర్సిటీలు	24.8
ప్రైవేటు వర్సిటీలు	24.9
ప్రభుత్వ కళాశాలలు	5.3
ప్రైవేటు కళాశాలలు	18
అనుబంధ వర్సిటీలు	11.3
డీమ్డ్ వర్సిటీలు	2.9



వ్యాపార రంగంలోకి అడుగుపెట్టే అమ్మాయిలు, అబ్బాయిలు (శాతం)

జెండర్	డిగ్రీ తర్వాత వెంటనే	5 ఏళ్ల తర్వాత
అబ్బాయిలు	15	36.0
అమ్మాయిలు	12	26.80
సగటు	14	31.40

కళ్ల ముందే విజేతలను చూసి..

చదువుకున్న వారు వ్యాపారం చేయాలన్నా.. ఏదైనా పరిశ్రమ పెట్టాలన్నా గతంలో తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పేవారు. వ్యాపారమనేది చదువు అబ్బని వారికే అన్న ఆలోచన సమాజంలో ఉండేది. ఇప్పుడు ఆ ధోరణి మారుతోంది. తమ కళ్ల ముందే ఎంతో మంది వినూత్న ఆలోచనలతో, టెక్నాలజీతో వ్యాపారాలు ప్రారంభించడాన్ని చూసి.. నేటి యువత ఆకర్షితులవుతున్నారు. తమ ముందున్న వారి విజయాలను ఆకళింపు చేసుకుని తామూ అదే బాటలో నడవాలనుకుంటున్నారు. నేటి తరంలో అనేక మంది స్టార్టప్‌లను ప్రారంభించి ఇతర పెద్ద సంస్థలకు విక్రయిస్తున్నారు. ఒక మంచి ఆలోచన ఉంటే చాలు.. పెట్టుబడి పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇప్పటి యువత కూడా రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉంది. మొత్తం మీద యువత మైండ్‌సెట్ శరవేగంగా మారుతోంది.

– ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, సీనియర్ ఆచార్యుడు, హెచ్‌సీయూ

అమిత్‌షాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతో ప్రజలకు సేవలందించాలని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

అమిత్‌షాకు పవన్‌కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశ అంతర్గత భద్రతా వ్యవస్థను పటిష్ఠపరచడంలో ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నారని మంగళవారం ఓ ప్రకటనలో కొనియాడారు. 'అమిత్‌షా దేశం కోసం అంకిత భావంతో, కర్తవ్య నిర్వహణలో నిమగ్నమయ్యారు. ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు, తీసుకుంటున్న నిర్ణయాలతో అంతర్గత భద్రత మెరుగవుతోంది. రాష్ట్రాల్లో తలెత్తే ప్రకృతి విపత్తుల సమయంలోనూ సత్వరమే స్పందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కూటమి తరఫున అందించిన సూచనలు, విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తున్నారు. దేశమే ముందు అనే విశాల భావన కలిగిన అమిత్‌షాకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని పేర్కొన్నారు.

రూ. 4,000 కోట్ల ప్రజాధనాన్ని అమూల్‌కు కట్టబెట్టారు

- తెదేపా నేత నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజం

ఈనాడు డిజిటల్, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్ రూ.4 వేల కోట్ల ప్రజాధనాన్ని అమూల్ సంస్థకు అప్పనంగా ఇచ్చేశారని తెదేపా జాతీయ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయకుమార్ ఆరోపించారు. నామమాత్రపు లీజులతో రూ.వేల కోట్ల విలువైన సహకార డెయిరీల ఆస్తులను ఆ సంస్థకు అప్పజెప్పారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'ఏడాదికి రూ.కోటి లీజుతో చిత్తూరు జిల్లాలోని 33 ఎకరాల డెయిరీ భూమిని అమూల్‌కు లీజుకిచ్చారు. గతంలో ఆ డెయిరీపై ఉన్న రూ. 182 కోట్ల అప్పును తీర్చి మరీ ఇచ్చారు. ఏలూరు, మదనపల్లెలోని బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లను కూడా 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చారు. కేవలం అమూల్ సంస్థకు పాలు పోసేందుకే మహిళా పాడి రైతులతో పాల ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీలకు సరఫరా చేసే కాంట్రాక్టును సైతం అమూల్‌కే అప్పజెప్పారు. అది కూడా ప్రభుత్వమే రవాణా ఖర్చులు భరిస్తూ.. లీటరుకు రూ. 1.25 అదనంగా చెల్లించారు. అమూల్ సంస్థ కోసం ఒంగోలు డెయిరీని సైతం మూసేశారు. గుంటూరు సంగం డెయిరీని స్వాధీనం చేసుకోవడానికి ఆ సంస్థ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించారు. ప్రజల ఆస్తులను అమూల్ సంస్థకు ధారాదత్తం చేసే హక్కు జగన్‌కు ఎక్కడిది' అని ఆయన నిలదీశారు.

వైకాపా వాళ్ల అరాచకాలెన్నో..

- 'ప్రజావేదిక'లో బాధితుల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి: టిడ్కో ఇళ్లలో జరిగిన అవినీతిపై ప్రశ్నించినందుకు నాటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తన ఇల్లు, కార్యాలయం పైకి దుండగులను పంపి లూటీ చేయించారని భీమవరానికి చెందిన షేక్ ఆలీ ఉసేన్ తెదేపా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో మంత్రి సవిత, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఫిర్యాదులు స్వీకరించారు. మంత్రి లోకేశ్‌తో ఫొటో దిగానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అనుచరులు తనపై దాడిచేశారని ధర్మవరానికి చెందిన రంగం ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. రూ.78 లక్షల చీరలు తీసుకున్న కందికుంట గాయత్రి అనే మహిళ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి మనుషులతో బెదిరింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కోస్తున్నామని మాజీ మంత్రి విడదల రజిని అక్రమంగా కేసు నమోదు చేయించారని గుంటూరుకు చెందిన 30 మంది విద్యార్థులు వాపోయారు. 2019 ఎన్నికల్లో వైకాపాకు వ్యతిరేకంగా పనిచేశానన్న కక్షతో తన నర్సరీలో కలుపు మందు చల్లి రూ.20లక్షల విలువైన మొక్కలను చంపేశారని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దామచర్లకు చెందిన వెల్లంకి సురేష్ ఫిర్యాదు చేశారు. తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడు గ్రామస్థులు అర్జీలు ఇచ్చారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి: అపెక్మా

ఈనాడు, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి, ఇంజినీరింగ్ కళాశాలలను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం(అపెక్మా) కోరింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బకాయిలు చెల్లించకపోతే కళాశాలలను నడపడం చాలా కష్టమని పేర్కొంది. మంగళవారం విజయవాడలో అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల యాజమాన్యాలు మాట్లాడుతూ.. ''ఇంజినీరింగ్ విద్యార్థులకు గత ఏడాదిగా చెల్లించాల్సిన ఫీజు బకాయిలు భరించలేనంతగా పేరుకుపోయాయి. నెలనెలా కళాశాలల నిర్వహణ, బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 80% కళాశాలలకు సొంతంగా ఫీజు చెల్లించే విద్యార్థులు లేరు. మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారానే ప్రవేశాలు పొందుతున్నారు. 2023-24 సంవత్సరంలో మూడు వాయిదాలు, 2018 నుంచి పీజీ కోర్సుల బకాయిలు అన్నీ కలిపి దాదాపు రూ.2,500 కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి' అని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి విద్యాసాగర్, పి.మధుసూదనరావు, కోశాధికారి గ్రంధి సత్యనారాయణ, ప్రతినిధులు మిద్దె శాంతిరాముడు, గంగిరెడ్డి, రాజలింగ్, కోయా సుబ్బారావు హాజరయ్యారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై త్వరలో శుభవార్త: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విద్యార్థులు త్వరలోనే శుభవార్త వింటారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ''వైకాపా ప్రభుత్వం రూ.3,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా మోసం చేసింది. మంత్రులు, విద్యాశాఖలోని సహచరులతో కలిసి సమస్య పరిష్కరిస్తాను. త్వరలోనే శుభవార్త వింటారని హామీ ఇస్తున్నా'' అని 'ఎక్స్'లో లోకేశ్ పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన.. ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్లను అరెస్ట్ చేయాలి: ఈయూ

ఈనాడు-అమరావతి: పొదిలి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ డ్రైవర్ నజీర్‌పై ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఛైర్మన్ దృష్టికి ఉద్యోగుల సమస్యలు

ఆర్టీసీలో అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను సంస్థ నూతన ఛైర్మన్ కె.నారాయణకు వివరించినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నేతలు తెలిపారు. కేంద్ర కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలన్నీ ఛైర్మన్‌కు వివరించినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఛైర్మన్ నారాయణ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా జేఎం నాయుడు

పీటీడీ వైఎస్ఆర్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా జేఎం నాయుడిని, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పీఎస్ మూర్తిని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఉండి, పదవీ విరమణ పొందిన డీఎస్పీ రావుని ముఖ్య సలహాదారుగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. తిరుమల లడ్డూపై వ్యాఖ్యల నేపథ్యంలో నవంబరు 22న వ్యక్తిగతంగా లేదా ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు హాజరుకావాలని స్పష్టం చేసింది. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా పవన్ వ్యాఖ్యలు చేశారంటూ న్యాయవాది ఇమ్మనేని రామారావు వేసిన పిటిషన్‌ను సోమవారం విచారించిన న్యాయస్థానం.. తాజాగా నోటీసులు జారీ చేసింది.

జగన్ పాపాలు.. రాష్ట్రానికి శాపాలు

- హోంమంత్రి వంగలపూడి అనిత

ఈనాడు డిజిటల్, అమరావతి: నేర చరిత్ర కలిగి, అధికార ముసుగులో వ్యవస్థల్ని దుర్వినియోగం చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎన్డీయే ప్రభుత్వం గురించి మాట్లాడటం సిగ్గుచేటని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. జగన్ చేసిన పాపాలు రాష్ట్రానికి శాపాలుగా మారి వెంటాడుతున్నాయని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆమె మాట్లాడారు. 'దేశంలో ఎక్కడ గంజాయి గుర్తించినా మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే దొరికేలా చేశారు. ఫింగర్‌ప్రింట్ వ్యవస్థ నిర్వహణ కోసం ఐదేళ్లలో రూ.10 కోట్లూ కేటాయించలేదు. కానీ తన ఇంటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు కోసం మాత్రం రూ.12 కోట్లు ఖర్చు పెట్టారు. పోలీసులకు రూ.700 కోట్లు బకాయి పెట్టారు. జగన్ ఇంటికి కూతవేటు దూరంలో అత్యాచారం జరిగినా కనీసం స్పందించలేదు. ఇప్పుడేమో శవరాజకీయాల కోసం పాకులాడుతున్నారు. దిశ యాప్ లేనందునే నేరాలు జరుగుతున్నాయంటున్నారు. మరి వైకాపా హయాంలో ఎందుకు జరిగాయి? నాలుగు నెలల కాలంలో ఎక్కడ నేరం జరిగినా నిందితుడిని 48 గంటల్లో అరెస్టు చేశాం. 2018లో తెదేపా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫోర్త్ లయన్ యాప్ పేరునే దిశగా మార్చారు. వినియోగదారుల సంఖ్య పెరగడానికి పురుషులతో కూడా డౌన్‌లోడ్ చేయించారు' అని మండిపడ్డారు.



పరిస్థితులకు తగ్గట్టు మిమ్మల్ని మీరు మలచుకోండి



జీవితంలో అనుభవం, జ్ఞానం, ముందస్తు ప్రణాళికలు చాలా ముఖ్యం. కానీ వాటికీ పరిమితులు ఉంటాయి. మీరెంత సంసిద్ధంగా ఉన్నా సరే.. కొన్ని క్లిష్ట సందర్భాలు మిమ్మల్ని అనిశ్చితిలోకి నెట్టేస్తాయి. అప్పుడు మీ ప్రణాళికలన్నీ దూదిపింజల్లా తేలిపోతాయి. అలాంటప్పుడు కుంగిపోకుండా మెదడుకు బాగా పనిపెట్టండి. వాస్తవిక దృక్పథంతో ఆలోచించండి. పాత ప్రణాళికలకే కట్టుబడి ఉండకుండా.. పరిస్థితులకు తగ్గట్టు మిమ్మల్ని మీరు మలచుకోండి. సృజనాత్మక ఆలోచనా ధోరణితో సమస్యలను పరిష్కరించుకోండి.

– రాబర్ట్ గ్రీన్, రచయిత

డ్రోన్ సదస్సు హ్యాకథాన్ విజేతలు వీరే

ఈనాడు, అమరావతి: అమరావతి డ్రోన్ సదస్సులో భాగంగా నిర్వహించిన హ్యాకథాన్‌లో విజేతలకు సీఎం చంద్రబాబు పురస్కారాలను అందించారు. తొలుత మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పురస్కారాలు అందించనున్నట్లు ప్రకటించినా.. ఎక్కువ మందిని ప్రోత్సహించే లక్ష్యంతో తృతీయ బహుమతి మొత్తాన్ని రెండుగా విభజించి.. మరో నలుగురు విజేతలకు నగదు పురస్కారాలను అందించారు.

- మొదటి కేటగిరీలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ మరియు ప్రకృతి వనరుల నిర్వహణ
- రెండో కేటగిరీలో విపత్తులు, అత్యవసర స్పందన సామర్థ్యాలు, మారుమూల ప్రాంతాలకు అత్యవసర మందుల చేరవేత, రవాణా
- మూడో కేటగిరీలో పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, నిఘా, మ్యాపింగ్ రంగాల్లో ప్రభుత్వ సేవల మెరుగుదల
- నాలుగో కేటగిరీలో పౌర భద్రత, న్యాయం అమలు, డ్రోన్ల ద్వారా సాధ్యమైనన్ని ఫొటోల సేకరణ, రంగాలకు సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను అధికారులు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు.

విజేత	సంస్థ	బహుమతి	సాధించిన పాయింట్లు	బహుమతి (రూ.ల్లో)
కేటగిరీ–1				
తుంగ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ప్రై.లిమిటెడ్	కంపెనీ	ప్రథమ	80.6	3,00,000
మిలట్రానిక్స్ ప్రై.లిమిటెడ్	స్టార్టప్	ద్వితీయ	75.2	2,00,000
నిత్య వట్టికూటి (ఎస్ఆర్ఎం)	ఎకడమిక్	తృతీయ	66.0	50,000
సిమ్మా అజయ్‌కుమార్	ఇన్‌స్టిట్యూషన్	తృతీయ	77.8	50,000
కేటగిరీ–2				
బోన్-5 టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్	స్టార్టప్	ప్రథమ	81.8	3,00,000
వాయుఖ డ్రోన్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్ ప్రై.లి.	స్టార్టప్	ద్వితీయ	79.0	2,00,000
ఈశ్వరమూర్తి కె.వి.	ఎకడమిక్	తృతీయ	80.8	50,000
సర్వేంద్రనాథ్, తిరుపతి ఐఐటీ	ఇన్‌స్టిట్యూట్	తృతీయ	67.2	50,000
కేటగిరీ–3				
జేబు ఇంటెలిజెంట్ సిస్టం ప్రై.లిమిటెడ్	స్టార్టప్	ప్రథమ	77.2	3,00,000
యాక్సెల్ యూఏవీ ప్రై.లిమిటెడ్	స్టార్టప్	ద్వితీయ	66.2	2,00,000
ప్రసాద్ పండా	ఇన్‌స్టిట్యూషన్	తృతీయ	58.8	50,000
గుల్లింకల మౌళిసాగర్	ఇన్‌స్టిట్యూషన్	తృతీయ	57.8	50,000
కేటగిరీ–4				
మారుట్ డ్రోన్‌టెక్ ప్రై.లిమిటెడ్	స్టార్టప్	ప్రథమ	69.4	3,00,000
హెచ్ రోబోటిక్స్ ప్రై.లిమిటెడ్	స్టార్టప్	ద్వితీయ	66.4	2,00,000
గీతం, విశాఖపట్నం (సెంటర్ ఫర్ అటానమస్ సిస్టం)	ఇన్‌స్టిట్యూట్	తృతీయ	66.0	50,000
పి. సాయికౌశిక్	ఇండివిడ్యువల్ ఇన్నోవేటివ్	తృతీయ	65.2	50,000

ఎంపీ మిథున్‌రెడ్డి బెయిలు పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈ నెల 29న నిర్ణయం వెల్లడిస్తామన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిలు కోసం రాజంపేట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, మరికొందరు దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈనెల 29 న నిర్ణయాన్ని వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే.కృపాసాగర్ ప్రకటించారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన నేతిగుట్లపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూముల పరిహారం విషయమై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన తమపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారని ఏఎస్ ఆర్‌కే.ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పుంగనూరు పట్టణ పోలీసులు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వాటిలో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఎంపీ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై తెదేపా కార్యకర్తలు దాడి చేసి తిరిగి ఆయనపైనే తప్పుడు ఫిర్యాదు ఇచ్చారన్నారు. రాజకీయ కారణాలతో పోలీసులు కేసులు నమోదు చేశారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు బెయిలు ఇవ్వాలని కోరారు.

- పోలీసుల తరఫున అదనపు పీపీ మర్రి వెంకటరమణ వాదనలు వినిపించారు. పుంగనూరు వెళితే శాంతిభద్రతలకు విఘాతం అని పోలీసులు హెచ్చరించినా ఎంపీ పట్టించుకోలేదన్నారు. దాడులు చేయాలన్న ఉద్దేశంతో ఆయన అనుచరులతో పుంగనూరు వెళ్లారన్నారు. అక్కడికి వెళ్లకుంటే నేర ఘటన జరిగేది కాదని వివరించారు. ఈ దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఎంపీపై ఇదే తరహా కేసులు ఏడు ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. బెయిలు పిటిషన్లను కొట్టేయాలని కోరారు.

పదిహేడేళ్లయినా ఒక్క పదోన్నతీ లేదు!

జలవనరుల శాఖ మంత్రి ఎదుట ఏఈఈల ఆవేదన

ఈనాడు, అమరావతి: రాష్ట్ర జలవనరుల శాఖలో 180 డీఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నా.. తమకు పదోన్నతులు ఇవ్వడం లేదని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ)లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు విజయవాడలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావులను మంగళవారం కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఏఈఈలుగా పోస్టింగులు పొంది పదిహేడేళ్లయినా తమకు ఒక్క పదోన్నతీ లేకుండా పోయిందని వాపోయారు. పలుకుబడి ఉన్న వారికే డీఈఈ పోస్టుల్లో పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తున్నారని, ఒక్కొక్కరికీ మూడు, నాలుగు పోస్టుల్లో అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే పదోన్నతుల అంశాన్ని పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

అరెస్టులో చట్ట నిబంధనలను పాటించాం

- కారణాలను విద్యాసాగర్‌కు తెలియజేశాం
- హైకోర్టులో వాదనలు వినిపించిన ఏజీ
- విచారణ నేటికి వాయిదా

ఈనాడు, అమరావతి: సినీనటి కాదంబరి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో చట్ట నిబంధనల మేరకు నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను అరెస్టు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. ఎవరు ఫిర్యాదు చేశారు? అరెస్టుకు కారణాలేమిటి? తదితర వివరాలన్ని విద్యాసాగర్‌కు పోలీసులు తెలియజేశారన్నారు. విద్యాసాగర్ అరెస్టు గురించి ఆయన సన్నిహితుడికి సమాచారం ఇచ్చారని తెలిపారు. దేహ్రాదూన్‌లో అరెస్టు చేసి అక్కడి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి ట్రాన్సిట్ ఉత్తర్వులు పొందారని వివరించారు. కోర్టు ఉత్తర్వులపై పిటిషనర్ సంతకం చేశారని అన్నారు. తన రిమాండ్ చెల్లుబాటు కాదని విద్యాసాగర్ చేస్తున్న వాదన సరికాదని పేర్కొన్నారు. పూర్తిస్థాయి వాదనలు వినిపించేందుకు వ్యాజ్యంపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. జత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు తనను రిమాండ్‌కు పంపడాన్ని సవాలు చేస్తూ విద్యాసాగర్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

మరో వ్యాజ్యంపై విచారణ నవంబరు 6కు వాయిదా కౌంటర్ వేయాలని పోలీసులకు ఆదేశం


సినీ నటి జత్వానీ సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వెనక్కి ఇవ్వకుండా పోలీసులను ఆదేశించాలంటూ విద్యాసాగర్ హైకోర్టులో దాఖలు చేసిన మరో వ్యాజ్యంపై విచారణ నవంబరు 6కు వాయిదా పడింది. నవంబరు 5లోపు కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలను జత్వానీకి ఇవ్వొద్దంటూ పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించారు.

నిశీధికి డ్రోన్ వెలుగులు!

విజయవాడలోని పున్నమి ఘాట్ మంగళవారం రాత్రి డ్రోన్ల ప్రదర్శనతో పులకించిపోయింది. వర్ణాలు విరజిమ్మిన బుల్లి లోహ విహంగాలతో మెరిసిపోయింది. ఆకాశంలో డ్రోన్లు చేసిన సందడితో నగర వాసులు చూపుతిప్పుకోలేకపోయారు.



ఆకాశంలో తథాగతుడు.. తన్మయత్వంలో ప్రజలు



గగనంలో డ్రోన్ల విశ్వరూపం..



కృష్ణమ్మ ఒడ్డున సందడి



పున్నమి ఘాట్‌లో డ్రోన్ గీత..!



ప్రదర్శనకు ఎగురుతున్న డ్రోన్లను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న వీక్షకులు

ఎల్-1ను తొక్కేసి.. కావాల్సిన సంస్థకు కాంట్రాక్టు

- అసెంబ్లీ వేదికగా గత వైకాపా సర్కారు అరాచకం
- ప్రజాధనం వృథాపై కాగ్ అభ్యంతరం

ఈనాడు, అమరావతి: మా అరాచకాలు మావే..అడిగేదెవరు అన్నరీతిలో చెలరేగిపోయిన గత వైకాపా సర్కారు..అసెంబ్లీలోనూ తన మార్కు అక్రమాన్ని ప్రదర్శించింది. అసెంబ్లీలో ఆడియో సిస్టమ్‌ను వార్షిక నిర్వహణ కాంట్రాక్టుకు ఇచ్చే విషయంలో అర్హత పొందిన ఎల్-1ను కాదని..ఎల్-2గా ఉన్న తమకు కావాల్సిన సంస్థకు అప్పగించింది. ఈ ఎల్-2 సంస్థ అప్పటి ముఖ్యమంత్రి జగన్ కుటుంబానికి చెందిన మీడియా సంస్థలో సీసీ కెమెరాలను నిర్వహించే సంస్థ కావడం గమనార్హం. దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోనూ ఆడియో సిస్టమ్‌ను నిర్వహిస్తూ వస్తున్న సంస్థ 2020లో నిర్వహించిన టెండర్‌లో తక్కువ మొత్తానికి కోట్ చేసి ఎల్-1గా నిలిచింది. కానీ, అంత కంటే ఎక్కువ కోట్ చేసి ఎల్-2గా నిలిచిన సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. అప్పటి సీఎం కార్యాలయంలో పనిచేసిన ఒక కీలక ఐఏఎస్ అధికారి, అప్పటి స్పీకర్‌ల ఒత్తిడి మేరకే ఎల్-1ను పక్కన పెట్టినట్లు తెలిసింది. 2020 నుంచి 2024 మార్చి వరకు ఆ ఎల్-2గా నిలిచిన సంస్థనే గుత్తేదారుగా కొనసాగించారు ఇలా ఎక్కువ మొత్తం కోట్ చేసిన సంస్థకు కాంట్రాక్టును కట్టబెట్టడం వల్ల ఆ సమయంలో దాదాపు రూ.50 లక్షలకు పైగా ప్రజాధనం వృథా అయిందని కాగ్ అభ్యంతరం తెలిపింది.

పొరుగు సేవల సిబ్బంది పెండింగ్ జీతాల చెల్లింపునకు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలోని పొరుగు సేవల సిబ్బందికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పరిపాలన నిధుల నుంచి జీతాల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉపాధిహామీ పథకం మెటీరియల్ నిధులతో చేపట్టే పనుల కోసం ఇంజినీరింగ్ విభాగంలో వినియోగిస్తున్న సిబ్బందికి 2023 జూన్ నుంచి 2024 సెప్టెంబరు వరకూ గత ప్రభుత్వం జీతాలు బకాయి పెట్టింది. దీంతో వీరంతా ఇటీవల విజయవాడలోని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. దీనిపై ఆయన సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. జీతాల బకాయిలు చెల్లించాలని హైకోర్టు కూడా అధికారులకు సూచించింది. ఈ నేపథ్యంలో పెండింగ్ బకాయిల చెల్లింపులకు రూ.24.99 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. దశలవారీగా సిబ్బందికి జీతాల బకాయిల చెల్లింపులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులిచ్చింది.

ఆధార్ నవీకరణకు పాఠశాల ధ్రువపత్రాలను అనుమతించాలి: ఎన్‌టీఏ

ఈనాడు, అమరావతి: విద్యార్థి ఆధార్ నవీకరణకు పాఠశాల ధ్రువీకరణ పత్రాలను అనుమతించేలా చూడాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు కోరారు. "రాష్ట్ర విద్యాశాఖ తొమ్మిది, పదో తరగతులు చదువుతున్న విద్యార్థులకు 'అపార్' సంఖ్య కేటాయించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. దీనికి విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలు పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్ పోర్టల్, ఆధార్ కార్డులో ఒకేలా ఉండేలా చూడాలని పేర్కొంది. ఆధార్‌లో తప్పులు ఉంటే సరిచేయించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఆధార్ నవీకరణ చేయాలంటే పంచాయతీ, మున్సిపాలిటీల్లో జారీ చేసిన జనన ధ్రువపత్రం తీసుకురావాలని ఆధార్ కేంద్రాల వారు కోరుతున్నారు. చాలా మందికి జనన ధ్రువపత్రాలు లేనందున సమస్య ఏర్పడుతోంది" అని పేర్కొన్నారు.

'జనవాణి'లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బలరామకృష్ణ

ఈనాడు డిజిటల్, అమరావతి: మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. వారి నుంచి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మంగళవారం అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని కోరారు.



సంకోచిస్తూ ఉండిపోతే.. ఆత్మవిశ్వాసం క్షీణిస్తుంది

సంకోచం అనేది ఎదుగుదలకు పెద్ద అవరోధం. ప్రతి విషయంలో అతి జాగ్రత్తకు పోతూ.. నిర్ణయం తీసుకోకుండా, ముందడుగు వేయకుండా ఉండిపోతే ఆత్మవిశ్వాసం క్షీణిస్తుంది. సంశయంతో మీరు చేపట్టకుండా ఆగిపోయిన పనిని ఇతరులు విజయవంతంగా పూర్తిచేయడాన్ని చూసి తర్వాత మానసికంగా కుంగిపోవాల్సి వస్తుంది. కష్టంగా అనిపించినా భయపడకుండా కార్యాచరణకు దిగండి. అందుకు మీకు మీరే కృతజ్ఞతలు చెప్పుకొనే రోజు కచ్చితంగా వస్తుంది!

– జూలీ గుర్నర్, పర్ఫార్మెన్స్ కోచ్

టాలీవుడ్ నిర్మాత కబ్జాల చిత్రం!

- రూ.10 వేల కోట్ల విలువైన భూముల కాజేతకు బూరుగుపల్లి కుట్ర
- నకిలీ పేర్లతో పహాణీల సృష్టి
- ముగ్గురు నిందితుల అరెస్ట్.. మరుసటి రోజే బెయిల్‌పై విడుదల

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి కాజేసేందుకు ప్రయత్నించిన టాలీవుడ్ నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణ, స్టేట్ ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రికార్డ్ అసిస్టెంట్ కె.చంద్రశేఖర్(53), రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎం.లింగయ్య(88)లను ఈ నెల 17న ఓయూ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే మరుసటి రోజే నిందితులు బెయిల్‌పై బయటికి వచ్చారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్‌కు చెందిన సినీ నిర్మాత బి.శివరామకృష్ణ శ్రీవెంకటేశ్వర ఎస్టేట్స్ పేరిట స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం గ్రామ పరిధిలోని సర్వే నంబరు 46లో 83 ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలం యాచారంలోని 10 ఎకరాల భూములను సొంతం చేసుకునేందుకు పథకం రచించాడు. పాత రికార్డులను పొందుపరిచే తార్నాకలోని స్టేట్ ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో బహమనీ, ఖుతుబ్‌షాహీ, ఆదిల్‌షాహీ, మొగల్, షాజహాన్ కాలం నాటి నుంచి సుమారు 43 మిలియన్ల చారిత్రక పత్రాలు ఉంటాయి. అక్కడ తనకు అవసరమైన భూములకు సంబంధించిన రికార్డులు, పత్రాలను తీసుకునేందుకు వ్యూహం రచించాడు. ఇందుకు 2019లో అక్కడ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.చంద్రశేఖర్‌ను కలిశాడు. రాయదుర్గం, యాచారం భూముల పహాణీలు ఎవరి పేరున ఉన్నాయో తెలపాలంటూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశాడు. దరఖాస్తులో పేర్కొన్న సర్వే నంబర్లలోని భూముల అసలు యజమానుల వివరాలను దాచిపెట్టి.. నకిలీ పేర్లు, ఫోర్జరీ సంతకాలతో పత్రాలు పొందేలా శివరామకృష్ణకు చంద్రశేఖర్ సహకరించాడు. ఈ భూములు రియల్ వ్యాపారి ఎం.లింగయ్యకు చెందినవిగా పేర్కొంటూ నకిలీ పహాణీ సృష్టించారు. అతడి నుంచి తాను కొన్నట్టు శివరామకృష్ణ పత్రాలు రూపొందించాడు. అలా భూములను కాజేసేందుకు వ్యూహం పన్నాడు. దీనిపై అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. నిందితులకు అనుకూలంగా తీర్పు రావటంతో ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. నిందితుల వద్ద ఉన్న పత్రాలు నకిలీవంటూ సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.

సీసీఎస్ నుంచి ఓయూ ఠాణాకు బదిలీ

స్టేట్ ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి రాయదుర్గం, యాచారం భూముల నకిలీ పత్రాలు చేరినట్టు తెలియడంతో ఆ విభాగం అధికారులు అంతర్గత విచారణ నిర్వహించారు. రికార్డ్ అసిస్టెంట్ కె.చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేశారు. నకిలీ పత్రాలు అందజేసిన చంద్రశేఖర్, మరికొందరిపై ఆగస్టులో నగర సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీసీఎస్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసును ఓయూ ఠాణాకు బదిలీ చేశారు. దర్యాప్తు చేపట్టిన ఓయూ పోలీసులు నిందితులు శివరామకృష్ణ, చంద్రశేఖర్, లింగయ్యలను ఈ నెల 17న అరెస్ట్ చేసి నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపరిచారు. 18న న్యాయస్థానం బెయిల్ ఇవ్వటంతో విడుదలయ్యారు.

దళిత యువకుడిని చంపింది శ్రీకాంతే..

- రాత్రి 11.10కు అమలాపురంలో న్యాయమూర్తి ఎదుట హాజరు
- వ్యక్తిగత కారణాల వల్లే దుర్గాప్రసాద్ హత్య
- విలేకరుల సమావేశంలో కొత్తపేట డీఎస్పీ గోవిందరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపేట డీఎస్పీ గోవిందరావు



కారు ఎక్కి నినాదాలు చేస్తున్న పినిపె శ్రీకాంత్

ఈనాడు, రాజమహేంద్రవరం – న్యూస్‌టుడే, కొత్తపేట, రావులపాలెం, అమలాపురం పట్టణం: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వాలంటీరు, వైకాపా నాయకుడు జనుపల్లి దుర్గాప్రసాద్‌ను మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపె శ్రీకాంత్ పథకం ప్రకారమే హత్య చేయించారని కొత్తపేట డీఎస్పీ గోవిందరావు వెల్లడించారు. సోమవారం రాత్రి తమిళనాడులోని మధురైలో అరెస్టు చేసిన శ్రీకాంత్‌ను మంగళవారం రాత్రి 9.40 గంటల సమయంలో కొత్తపేట డీఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం రాత్రి 10.30 గంటలకు అమలాపురానికి తీసుకెళ్లారు. 11.10 గంటలకు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గౌరీశంకర్‌రావు ఎదుట హాజరుపరిచారు. అంతకుముందు హత్య కేసు వివరాలను కేసు దర్యాప్తు అధికారి, కొత్తపేట డీఎస్పీ గోవిందరావు మీడియాకు వివరించారు. 2022 జూన్ 6న జరిగిన హత్యకు సంబంధించి అయినవిల్లిలో నమోదైన కేసులో అప్పటి దర్యాప్తు అధికారులు సేకరించిన ఆధారాలతో పాటు, మరిన్ని సాంకేతిక ఆధారాలతో ఈ నెల 18న అనుమానితుడు వడ్డే ధర్మేశ్‌ను విచారించి వివరాలు సేకరించామన్నారు. ఆర్వో సమక్షంలో హత్యకు సంబంధించిన వివరాలన్నీ ఆయన వెల్లడించారన్నారు. అతని స్టేట్‌మెంట్‌తో పాటు ఇతర ఆధారాల మేరకు సమగ్ర దర్యాప్తు చేసి కేసులో ప్రధాన నిందితుడు పినిపే శ్రీకాంత్ అని నిర్ధారించామన్నారు. ధర్మేశ్‌ను 18న అరెస్టు చేసిన తరువాత శ్రీకాంత్ పరారయ్యారని చెప్పారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి హైదరాబాద్, తమిళనాడులోని మధురై ప్రాంతాలకు వెళ్లిపోగా ప్రత్యేక బృందం సోమవారం రాత్రి అరెస్టు చేసిందన్నారు. అక్కడ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకొచ్చామని వివరించారు.

వ్యక్తిగత కారణాల వల్లే హత్య..

జనుపల్లి దుర్గాప్రసాద్‌ను వ్యక్తిగత కారణాల వల్ల శ్రీకాంత్ హత్య చేయించారని డీఎస్పీ వెల్లడించారు. దుర్గాప్రసాద్‌తో పాటు కొందరు మాజీ మంత్రి తనయుడితో సన్నిహితంగా ఉంటూ వైకాపా కార్యక్రమాల్లో, ఆ పార్టీ, సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. నిందితుడు ధర్మేశ్ వైకాపా సోషల్ మీడియా కన్వీనర్‌గా వ్యవహరించేవారన్నారు. దుర్గాప్రసాద్‌తో ఏర్పడిన వ్యక్తిగత కారణాలు, మనస్పర్థల వల్ల అతణ్ని హత్య చేసేందుకు శ్రీకాంత్ 2022 జూన్ 5న ప్రణాళిక చేశారన్నారు. అందులో భాగంగా ధర్మేశ్.. దుర్గాప్రసాద్‌ను కోటిపల్లి రేవు వద్దకు తీసుకెళ్లగా మరో నలుగురు కలిసి అతని మెడకు తాడు బిగించి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అప్పటికి నాలుగు రోజుల తరువాత గుర్తు తెలియని మృతదేహం లభ్యమవగా, విచారణలో మృతుడు దుర్గాప్రసాద్‌గా గుర్తించామన్నారు. పోస్టుమార్టంలో మృతుని మెడ ఎముకలు రెండువైపులా విరిగి ఉండటంతో అప్పటికే మిస్సింగ్ కేసుగా ఉన్న దాన్ని హత్య కేసుగా మార్చామన్నారు. ఈ కేసులో మరికొందరు నిందితుల్ని విచారించాల్సి ఉందని, దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

రూ.లక్ష ఇచ్చా.. గేటు వద్ద నినాదాలు

అతని కొడుక్కి నేను పేరు పెట్టా.. దుర్గాప్రసాద్ చనిపోతే నేను వాళ్ల ఇంట్లో రూ.లక్ష ఇచ్చాను. కేసు దర్యాప్తు చేయమని అప్పటి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డిని మూడుసార్లు కోరానని హత్య కేసు ప్రధాన నిందితుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. కొత్తపేట డీఎస్పీ కార్యాలయం నుంచి అమలాపురం తరలిస్తున్న క్రమంలో వాహనం ఎక్కుతూ బిగ్గరగా అరిచి ఈ వివరాలు వెల్లడించారు. అమలాపురం న్యాయస్థానానికి శ్రీకాంత్‌ను తీసుకెళ్లగా.. కోర్టు ప్రధాన ద్వారం వద్ద వైకాపా శ్రేణులు శ్రీకాంత్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని అందర్నీ అక్కడి నుంచి పంపేశారు.

14 రోజుల రిమాండ్

దళిత యువకుడు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్యకేసులో ప్రధాన నిందితుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడైన శ్రీకాంత్‌కు 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ మేరకు అమలాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), జేఎంఎఫ్‌సీ వి.గౌరీశంకరరావు మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు తీర్పునిచ్చారు. 2022 జూన్ 6న జరిగిన ఈ హత్య కేసుకు సంబంధించి శ్రీకాంత్‌ను ఆదివారం రాత్రి తమిళనాడులోని మధురైలో పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి కొత్తపేటలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత 11.10 గంటల సమయంలో అమలాపురంలోని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. దాదాపు గంటన్నరపాటు వాదనలు జరిగిన తరువాత నవంబరు 4 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారని కొత్తపేట డీఎస్పీ గోవిందరావు తెలిపారు. దీంతో శ్రీకాంత్‌ను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

పిడుగుపాటుకు ముగ్గురి మృతి



లింగస్వామి



కావేరి



వెంకట్

కామేపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం, కామారెడ్డి జిల్లాల్లో జరిగిన రెండు వేరువేరు పిడుగుపాటు ఘటనల్లో తండ్రి, కుమార్తె, ఓ యువకుడు మృతి చెందారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన దంపతులు చింతల లింగస్వామి-శైలజలు మంగళవారం పెద్ద కుమార్తె కావేరితో కలిసి చేనులో పత్తి తీస్తున్నారు. వర్షం పడటంతో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. పిడుగుపాటుకు గురై తండ్రి లింగస్వామి(37), కుమార్తె కావేరి(19) అక్కడికక్కడే మృతి చెందారు. శైలజ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కావేరి ప్రస్తుతం డిగ్రీ చదువుతోంది.

కామారెడ్డిలో యువకుడు..

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన మంద నాగభూషణం(60) ఇతని కుమారుడు వెంకట్ (25)లు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి వెళ్లారు. మధ్యాహ్నం వర్షం కురవడంతో తండ్రీకుమారులు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. ఒక్కసారిగా పిడుగు పడటంతో వెంకట్ అక్కడికక్కడే మృతిచెందాడు. నాగభూషణానికి గాయాలు కాగా.. ఆసుపత్రికి తరలించారు.

సొంత వైద్యం వికటించి యువతి..

- భూపాలపల్లి జిల్లాలో ఘటన



అంజలి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జ్వరం వచ్చినా వైద్యులను సంప్రదించకుండా సొంత వైద్యం చేసుకున్న యువతి అది వికటించడంతో మృతి చెందిన ఘటన తెలంగాణ రాష్ట్రం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గడ్డిగానిపల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. యువతి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా గడ్డిగానిపల్లికి చెందిన దుర్గం తిరుపతి, రాజశ్రీ దంపతుల పెద్ద కుమార్తె అంజలి(17) మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు పూర్తి చేసి.. వంద పడకల ఆసుపత్రిలో పారా మెడికల్ శిక్షణ పొందుతోంది. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో అంజలికి తెలిసిన ఔషధాలు వేసుకుంది. నీరసంగా ఉండటంతో సోమవారం సాయంత్రం సొంతంగా ఇంట్లోనే సెలైన్ బాటిల్ పెట్టుకుంది. దాంట్లో ఎక్కించిన ఇంజక్షన్ వల్ల ఆమెకు మాట పడిపోయి.. స్పృహ కోల్పోవడంతో వంద పడకల ఆసుపత్రికి తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా.. రాత్రి 12.30 గంటలకు మృతి చెందింది.

ఏపీ పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ ఛైర్మన్‌గా బండ్ల శివశంకర్ ప్రసాద్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ, రాష్ట్రస్థాయి నిపుణుల పరిశీలన కమిటీలను కేంద్ర ప్రభుత్వం పునర్‌వ్యవస్థీకరించింది. పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ (స్టేట్‌లెవెల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా హైదరాబాద్‌కు చెందిన బండ్ల శివశంకర్ ప్రసాద్, సభ్యుడిగా తిరుపతికి చెందిన డాక్టర్ ముదురు శ్రీమురళిలను నియమించింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 కింద ఉన్న అధికారాలను అనుసరించి ప్రాధికార సంస్థను పునర్‌వ్యవస్థీకరించింది. ఈ సంస్థ మెంబర్ సెక్రటరీగా ఏపీ పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు.

నిపుణుల కమిటీ ఛైర్మన్‌గా బచ్చుశివప్రసాద్: రాష్ట్రస్థాయి నిపుణుల పరిశీలన కమిటీ (స్టేట్‌లెవెల్ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ) ఛైర్మన్‌గా విజయవాడకు చెందిన బచ్చు శివప్రసాద్ నియమితులయ్యారు. సభ్యులుగా చెంచుగార్ల కృష్ణమూర్తి (తిరుపతి), డాక్టర్ తుమ్మల చంద్రశేఖర్ (కడప), ప్రొఫెసర్ కొండ్ర సుధాకర్‌బాబు, ప్రొఫెసర్ గోనుగుంట్ల వెంకటనాయుడు (అనంతపురం), ప్రొఫెసర్ గుంటుకు గిరిజా శంకర్, గొడవతి వీరవెంకట సత్యనారాయణచౌదరి, ప్రొఫెసర్ పీలా సుజాత (విశాఖపట్నం), డాక్టర్ పొన్నెకంటి జోసెఫ్ రత్నాకర్ (తెనాలి), డాక్టర్ మువ్వా విజయలక్ష్మి (గుంటూరు), డాక్టర్ బిల్లా శరత్ బాబు (తిరుపతి), డాక్టర్ రామన్నగారి భవాని (అనంతపురం), ప్రొఫెసర్ చలంచెర్ల విజయ (నెల్లూరు), డాక్టర్ అర్జా వీరవెంకట సత్యనారాయణస్వామి (విజయవాడ) నియమితులయ్యారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎన్విరాన్‌మెంటల్

తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్‌గా మల్లికార్జునరెడ్డి

మరికొందరికి సీఈలుగా అదనపు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: జలవనరుల శాఖలో చీఫ్ ఇంజినీర్లుగా కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కడప గాలేరు నగరి సర్కిల్ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న ఎం.మల్లికార్జునరెడ్డికి తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌గా తిరుపతిలో అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్నూలు హంద్రీనీవా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరు డి.రాంగోపాల్‌ను ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీరుగా అదనపు బాధ్యతల్లో నియమించారు. కడప ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కమతం శ్రీనివాసులును కడప ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీరుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పోలవరం కుడి కాలువ ఎస్ఈ బి.శ్యాంప్రసాద్‌కు ఒంగోలు ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీరుగా అదనపు బాధ్యతలు కేటాయించారు.

అంతర్‌రాష్ట్ర విభాగానికి సుగుణాకరరావు

అంతర్‌రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీరుగా ఎస్.సుగుణాకరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ప్రస్తుతం విశాఖ జలవనరుల శాఖ సర్కిల్ సూపరింటెండెంటు ఇంజినీరుగా ఉన్నారు. ప్రస్తుతం వారు ఎస్ఈలుగా ఉన్న స్థానాలకు, చీఫ్ ఇంజినీరుగా అదనపు బాధ్యతలను అప్పగించిన ప్రాంతాలకు దూరం ఉందన్న విషయాన్ని మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వివరణ ఇచ్చారు. అదనపు బాధ్యతలు అప్పగించిన చీఫ్ ఇంజినీరు స్థానాల్లో వారుంటారని, ఆ పోస్టుకు దగ్గరగా ఉన్నచోటకు వారిని ఎస్ఈలుగా బదిలీ చేయనున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం బదిలీల గడువు ముగిసినందున ప్రత్యేకంగా సీఎం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం పూర్తి అదనపు బాధ్యతల అంశాల్లో కొందరు జూనియర్లు సీనియర్లకన్నా పై పోస్టుల్లో అదనపు బాధ్యతలు పొందారన్న ఆందోళన ఇంజినీర్లలో వ్యక్తమవుతోందని ప్రస్తావించగా అందరికీ పదోన్నతులు కల్పించడంపై దృష్టి సారించామని తెలిపారు.

ఆ జిల్లాల్లో రూ.50 వేల రుణంపై రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు

ఈనాడు, అమరావతి: భారీ వర్షాలు, వరదలకు ప్రభావితమైన పది జిల్లాల్లో రూ.50 వేల వరకు బ్యాంకుల్లో రుణాలు రీషెడ్యూల్ చేసుకునే వారికి, రూ.50 వేల వరకు కొత్తగా రుణాన్ని పొందే వారికి రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ, యూజర్ ఛార్జీల చెల్లింపుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కాకినాడ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల వారికి ఈ మినహాయింపు విధానాన్ని ఈ ఏడాది ఆగస్టు 30 తరువాత నుంచి అమల్లోకి తెచ్చినట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు 2025 మార్చి 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు.

వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శివశంకర్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, దిల్లీ: ప్రస్తుతం ఏపీ కేడర్‌లో పనిచేస్తున్న తనను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ డీఓపీటీ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్సార్ జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ మేరకు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు ఇంకా క్యాట్‌లో పెండింగ్‌లో ఉందని, అది జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన ఈ కేసులో తాము ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం పేర్కొంది. కేసును సాధ్యమైనంత త్వరగా విచారించి తుది తీర్పు వెలువరించమని కోరుతూ క్యాట్‌నే ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ఇందులో హైకోర్టు, సుప్రీంకోర్టులు వ్యక్తం చేసిన అభిప్రాయాల ప్రభావానికి లోనుకాకుండా మెరిట్స్ ఆధారంగా క్యాట్ ఈ కేసును విచారించి నిర్ణయం వెలువరించాలని నిర్దేశించింది.